ఈనాడు

విజయవాడ 14-2-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 185

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈతరం

youthpage@eenadu.in

నువ్వు లేని నేను

ఎప్పటికీ నీకు బానిసనే..
ఒకప్పుడు నీ ప్రేమకు..
ఇప్పుడు నీ జ్ఞాపకాలకు!
నా ప్రాణాన్ని రాసిస్తానన్నా..
వినకుండా నా గతంలో మిగిలిపోయావు..
చితి మంటలపై నువ్వు కాలుతూ..
నా ఆత్మనూ నీలో కలిపేసుకున్నావు..

పంచుకుందాం

నా తలరాతలో లేని ప్రేమ..
నా ప్రతిరాతలోనూ కనిపిస్తూనే ఉంది
ప్రపంచమంతా నేడు ప్రేమికుల రోజు
నాకు మాత్రం ప్రేమ కలగా మిగిలిన రోజు
– జె.బుచ్చి, గుంటూరు

ప్రాణమైనదే..

ఇద్దరినీ కలిపే చిరునామా
కడదాకా నిలిపే మహిమ
ప్రాణానికి ప్రాణమైనదే ప్రేమ
ఓ జాబిలమ్మ! – జి.పాండురంగ

డేట్‌కి.. ఇలా వెళ్తారా!



లవర్స్ డే అంటే చాలు.. ఎక్కడ కలవాలి, ఏం మాట్లాడాలి.. ఇదే టెన్షన్. సినిమా, పార్క్, రెస్టారెంట్.. ఇవన్నీ రొటీన్. కొత్తగా ఈ డేట్స్ ప్లాన్ చేయండి. కొన్ని ఐడియాలు చూద్దామా!

యాక్టివిటీ : ఏదైనా వినూత్న కార్యక్రమంలో కలిసి పాల్గొనచ్చు. ట్రెక్కింగ్, పారాగ్లైడింగ్, స్కూబా డైవింగ్ వంటి సాహస కృత్యాలైతే సరికొత్త అనుభూతిని ఇస్తాయి. మరేదైనా సేవా కార్యక్రమంలో వాలంటీరింగ్ చేయడం కూడా కొత్తగా అనిపిస్తుంది. అవతలి వ్యక్తి గురించి మరింత తెలుసుకునే వీలు కల్పిస్తుంది.

ట్రిప్ : ఒక్కరోజులో వెళ్లి రాగలిగేలా దగ్గర్లో ఏదైనా పర్యటనకు వెళ్లవచ్చు. నిజానికి మనకు అలవాటు లేని పరిసరాల్లో ఉన్నప్పుడు... మనలోని అసలు నిజాలేంటో బయటకు వస్తాయి అంటారు. కంఫర్ట్ అంతగా లేని చోట, అనుకోని పరిస్థితులు ఎదురయ్యే చోట.. అవతలి వారు ఎలా స్పందిస్తారు, ఆ సందర్భాల్లో ఎలా రియాక్ట్ అవుతున్నారు, సమస్యలను ఎలా ఎదుర్కొంటున్నారు అనేవి గమనించడానికి పర్యటనలు ఓ గొప్ప అవకాశం.

ఇంట్లోనే..: ఇవేవీ కాకుండా ఇంట్లోనే వంట చేసుకుని తినడం కూడా ఓ మంచి డేట్. కలిసి పని చేయడం, ఒకరికొకరు సాయం చేసుకోవడంతో ఇద్దరి మధ్యా కమ్యూనికేషన్ బలపడుతుంది. అర్థం చేసుకోవడానికి మెరుగైన అవకాశమిది. ఇష్టాయిష్టాలు కూడా తెలుస్తాయి. ఓ చక్కని ఎక్స్‌పీరియన్స్‌లా ఉంటుంది.

వ్యాయామం: ఆలోచన ఉండాలే కానీ.. వ్యాయామంతో కూడా ఓ మంచి డేట్‌ను ప్లాన్ చేసుకోవచ్చు. ముఖ్యంగా ఫిట్‌నెస్ అంటే ప్రాణంపెట్టేసే వారికి ఇది బాగా నచ్చుతుంది. కలిసి లాంగ్ వాక్‌కి వెళ్లడం, ఓ గంట జిమ్‌లో ఎక్సర్‌సైజ్ చేయడం, యోగా-మెడిటేషన్ వంటి క్లాస్‌కి హాజరుకావడం.. ఇలా ఏదైనా చేయొచ్చు. రొటీన్‌కు భిన్నంగా ఉంటుంది.

క్రాఫ్ట్స్‌తో..: కళ మనసుకు ఎంత హాయిగా అనిపిస్తుందో కొత్తగా చెప్పేదేం ఉంది? అదే క్రాఫ్ట్స్‌ను మనకు నచ్చిన వారితో కలిసి చేయడం ఇంకా సరదాగా ఉంటుంది. ఇంట్లో అయినా లేదా బయట డ్రాయింగ్, పెయింటింగ్, పాటరీ వంటి వర్క్‌షాప్స్‌కి వెళ్లడం ఓ పద్ధతి. కలిసి తయారు చేసిన ఆ కళారూపాలు ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకంగా ఉండిపోతాయి!

...చూశారుగా, మరి మీ వాలంటైన్‌ను ఏ డేట్‌కి తీసుకెళ్తారో చూడండి!

ఈరోజే ఎందుకు?

ఏడాదిలో ఎన్నో రోజులు ఉండగా, ఫిబ్రవరి పద్నాలుగే ఎందుకు ప్రేమికుల రోజు చేసుకుంటారు అనే సందేహం కొందరికి ఉంటుంది. దీనివెనక ఓ ఆసక్తికరమైన కథ ఉంది.

3వ శతాబ్దంలో రోమన్ సామ్రాజ్యపు చక్రవర్తి క్లాడియస్ 2.. సైనికులు పెళ్లి చేసుకోవడం మీద నిషేధం విధించాడు. ప్రేమలో పడితే విధులపై శ్రద్ధ ఉండదనే ఉద్దేశంతోనే ఇలా చేశాడంటారు. దీన్ని వ్యతిరేకించిన వాలంటైన్ అనే వ్యక్తి, ప్రేమికులకు రహస్యంగా వివాహాలు జరిపించేవాడు. ఇది తెలిసిన చక్రవర్తి.. ఫిబ్రవరి 14న అతడిని ఉరితీయించాడు. దీంతో నాటి నుంచి ఆరోజు ప్రేమకు చిహ్నంగా మారిందనేది ఓ కథనం.

8వ శతాబ్దం వరకు ఈ తేదీన విందులు మాత్రమే నిర్వహించేవారట. 14/15వ శతాబ్దాల సమయంలో.. దీన్ని రొమాంటిక్ లవ్‌కి గుర్తుగా సెలబ్రేట్ చేసుకోవడం మొదలుపెట్టారు. 18వ శతాబ్దం వచ్చేసరికి, గ్రీటింగ్ కార్డులు, రోజాలు, చాక్లెట్లు ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి మొదలైంది.

'రెండు అగ్నిపర్వతాలు ప్రేమించుకుంటున్నాయి. అందులో ఒకటి మరోదానితో ఏమంటుందో తెలుసా?' అడిగాడు సూరజ్.
'తెలియదు, నువ్వే చెప్పు' గోముగా అడిగింది మానస.
'ఐ లావా యూ' గొప్పగా చెప్పాడు సూరజ్.

నవ్వు బ్రో

'మీ ఫ్రెండ్ బ్యాంకర్ భాస్కర్ తన గర్ల్‌ఫ్రెండ్‌కి బ్రేకప్ చెప్పాడంట, ఎందుకురా' అడిగాడు సాత్విక్.
''ఇంట్రెస్ట్' రావట్లేదు అంటరా.. ఎంతైనా బ్యాంక్ జాబ్ చేసేవాడు కదా' వివరించాడు సమర్.

'నువ్వు లేకపోతే నేను లేను. నువ్వే నా ప్రాణం' అర్థించాడు అర్నవ్.
'బాటిల్ లేపేసి మాట్లాడుతున్నావా' కోపగించుకుంది కావ్య.
'బాటిల్‌తోనే మాట్లాడుతున్నా' క్లారిటీ ఇచ్చాడు అర్నవ్.

'పాపం, లవర్ లేని వాళ్లు వాలంటైన్స్ డే రోజు ఏం సెలబ్రేట్ చేసుకుంటారో' జాలిపడింది జాహ్నవి.
'ఇండిపెండెన్స్ డే' జవాబిచ్చాడు జతిన్.

'నాకు నచ్చిన లక్షణాలు కలిగిన అమ్మాయి ఎక్కడ దొరుకుతుందో ఏమిటోరా' బాధపడ్డాడు నలభైఐదేళ్ల వెయిటింగ్ వెంకట్.
'బుక్‌స్టోర్‌కి వెళ్లి.. 'ఫిక్షన్' సెక్షన్‌లో చూడు' చిరాకుపడ్డాడు సాగర్.

కొంటె కొటేషన్

1. బహుమతి..
బరువై, పోతోంది మతి.
– హరిత, ఏలూరు
2. పతి ఇచ్చెను బహుమతి..
మెచ్చింది శ్రీమతి. – విజయ్
3. అతిపెద్ద బహుమతి అందింది..
ఇంతకీ అందులో ఏముంది? – మమత
4. గిఫ్ట్ చూస్తే భారీ.. మోయలేకుంది నారీ.
– అభిరామ్
5. సుందరీ ఏమిటా గిప్పు.. కావాలా ఏమిటి లిప్పు. – వివేక్



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

ప్రేమ పానీపూరి

నేడు ప్రేమికుల రోజు

మనకు పానీపూరి అంటే చాలా ఇష్టం. ప్రేమంటే కూడా!
రెండూ చూడగానే ఆకర్షిస్తాయి. వెంటనే కావాలి అనిపిస్తాయి. కానీ రెంటినీ హ్యాండిల్ చేయడం కష్టం!
అయితే కొంచెం శ్రద్ధ పెడితే.. పానీపూరి నిండా నోటికందినట్టే.. గుండెలనిండా ప్రేమ నిండుతుంది!
అక్కడ రుచి అదిరిపోయినట్టే.. ఇక్కడ లైఫ్ సెటిలైపోతుంది..!

పానీపూరి తినడమే కాదు, ప్రేమించడం కూడా ఒక ఆర్ట్ అంటారు సైకాలజిస్ట్ క్రాంతికార్. రెండింటిలోనూ బ్యాలెన్స్ అనేది చాలా ముఖ్యం. ఏమాత్రం అదుపుతప్పినా అక్కడ పూరి, ఇక్కడ ప్రేమా రెండూ చేజారిపోతాయి. అందుకే వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌లా.. లవ్‌లైఫ్ బ్యాలెన్స్ కూడా మన యూత్‌కి తెలియాలి!


పాపం ఆ గుండ్రటి పూరి ఎంచక్కా తన ఫ్రెండ్స్‌తో కలిసి డబ్బాలో ఉంటుంది. ఒక్కసారిగా బయటకు తీసి రంధ్రం పెడతాం. ఆలూకుర్మా, ఆనియన్స్, పానీ, సాస్ అంటూ ఏంటేంటో కుక్కేస్తాం. మనసు కూడా ఇంతే. హాయిగా తన మానాన తను ఉంటుంది. అమ్మానాన్నలు, ఫ్రెండ్స్‌తో కలిసి సంతోషంగా బతకడానికి అలవాటుపడి ఉంటుంది. అనుకోకుండా ఒక రోజు.. మరో అందమైన మనసు ఎదురుపడుతుంది. గుండెకి చిన్నగా చిల్లు పడుతుంది. ఇక అక్కడి నుంచి ఎమోషన్స్‌ను కుక్కేయడం మొదలుపెడతాం. ఊపిరాడనంత ప్రేమ మైకంలో మునిగిపోతాం. ఏం చేస్తున్నామో, ఎందుకు చేస్తున్నామో తెలియని అలజడి. అక్కడే సమస్యలు మొదలయ్యేది!

ఎక్కువ పానీ వేస్తే పూరి నానిపోతుంది. ఎక్కువ ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్న ప్రేమలాగే! ఆలూ ఎక్కువ వేస్తే పానీకి చోటుండదు, ఎదుటివాళ్లే అంతా నిండిపోతే మనలో మనకు స్పేస్ ఉండదు! బరువెక్కువైన పూరి విరిగిపోతుంది. 'నువ్వే నా జీవితం, ప్రతిక్షణం నీ అటెన్షన్ నా మీదే ఉండాలి, నువ్వు నాకు కావాల్సినట్టు మారాలి..' అని ఆంక్షలతో కూడిన ప్రేమ వల్ల ఎదుటివారి మనసు పరిస్థితీ ఇంతే. ఓవర్ ఎమోషన్, ఓవర్ ఎక్స్‌పెక్టేషన్, ఓవర్ అటాచ్‌మెంట్.. అవాయిడ్ చేయాలి మిత్రమా!

కాంబినేషన్ ముఖ్యం

ఏం ఒట్టి పూరి తినొచ్చుగా? లేదా ఆ పానీనే గ్లాసులతో తాగేయొచ్చుగా! అదీ లేదంటే పచ్చిఉల్లిపాయ ముక్కలు కరకరా నమిలేయొచ్చుగా? ఊహూ.. అలా చేస్తే రుచి ఉండదు. అన్నీ కలిస్తేనే కాంబినేషన్ పర్‌ఫెక్ట్‌గా ఉండేది. కారం, ఉప్పు, పులుపు కలగలిసి.. క్రిస్పీనెస్‌కి వాటర్ తోడయితేనే జోడీ. మరి ప్రేమలో మాత్రం ఎప్పుడూ తీపే కావాలా? ఘాటైన గొడవలు, వాడివేడి వాదనలు ఉండొద్దంటే ఎలా? అది కూడా కాంబినేషన్‌లో ఓ పార్ట్ అని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే రిలేషన్‌షిప్‌లో 'పర్‌ఫెక్ట్' అనేది ఏదీ ఉండదు. మోస్ట్ అన్‌పర్‌ఫెక్ట్ మూమెంట్‌లో కూడా అవతలి వారిని ప్రేమించగలగడమే ప్రేమ!

ప్రేమ పూరి అందాలంటే..



1. **పరస్పర గౌరవం :** చాలా ఆధునిక బంధాలు పెళుసుబారడానికి కారణం.. ఒకరిపై ఒకరికి ప్రేమ లేకపోవడం కాదు, ఎదుటివారి అభిప్రాయాలను గౌరవించలేకపోవడం. తేలిగ్గా తీసిపారేసినట్టు మాట్లాడటం. వారికేం తెలియదు అన్నట్టు ప్రవర్తించడం.

2. **స్పేస్ ఇవ్వడం :** మనం ప్రేమిస్తున్నాం అంతే, వారిని కబ్జా చేయడం లేదు! ఎటుచూసినా కంచె వేసినట్టు.. కొంచెం కూడా ఫ్రీడమ్ ఇవ్వని ప్రవర్తన.. అవతలివారిని ఒత్తిడికి గురిచేస్తుంది. 'నేను తప్ప మరేదీ ఉండకూడదు' అనే ఆలోచన సరికాదు.

3. **కమ్యూనికేషన్ :** 'భయ్యా తోడా ప్యాజ్ దాలో' అని సిగ్గుపడకుండా ఎన్నిసార్లు అయినా అడిగి వేయించుకుంటాం కదా.. మరి మనసుకు నచ్చిన మనిషి దగ్గర మాత్రం మాట్లాడటంలో ఎందుకు సందేహం? లోపల ఏం ఫీలవుతున్నామో స్పష్టంగా చెప్పినప్పుడేగా ఒకరికొకరు మరింత చేరువయ్యేది!

4. **నమ్మకం :** ఫోన్ ఒక్కసారి ఎంగేజ్ వస్తే చాలు, 'ఎవరితో మాట్లాడుతున్నావ్?' అని రెట్టించి అడిగేస్తాం, పొరపాటున సోషల్ మీడియా ఖాతా ఓపెన్‌లో కనిపిస్తే యాక్టివిటీ ఏం ఉందో చూసేయాలని తెగ ఆరాటపడిపోతుంటాం. మరి నమ్మకం ఎక్కడ ఉన్నట్టు? ప్రేమించిన వారిని నమ్మాలి, వారు ఎదురుగా లేనప్పుడూ ఆ డీసెన్సీ మెయింటెయిన్ చేయాలి. ట్రస్ట్ లేని ప్రేమలు నిలబడటం కష్టం.

5. **సంతోషం నీ మీదే..:** 'నన్ను ఎలా సంతోషపెట్టాలో అస్సలు తెలియదు', 'నువ్విలా చేస్తుంటే నేనెలా హ్యాపీగా ఉంటాను'.. ఇలాంటి మాటలు మన సంతోషానికి అవతలి వారిని బాధ్యులను చేస్తాయి. కానీ నిపుణుల మాటేంటంటే.. మన ఆనందానికి మనదే బాధ్యత! సంతోషంగా బతకడం మనకి మనం నేర్చుకోవాలి, ఎదుటి వారి మీద ఆధారపడటం సరైన పని కాదు.

పూరిలో పెరుగు, సేవ్, మసాలా వంటివి ఎలా ఎక్స్‌ట్రా రుచి అందిస్తాయో.. ప్రేమలోనూ నిజాయతీ, గ్రోత్, ఎమోషనల్ సేఫ్టీ అనేవి మరింత ఫ్లేవర్ యాడ్ చేస్తాయి. మన బ్యూటిఫుల్ లవ్ జర్నీని ఇంకా అద్భుతంగా మారుస్తాయి.

ఏది వదిలేయాలి

ప్రేమించిన వారిని కంట్రోల్ చేయడానికి చూస్తే పూరిలో కారం ఎక్కువైనట్టే లెక్క. వేరే ఐటెమ్స్‌తో పోల్చిచూస్తే పూరి రుచిని ఆస్వాదించలేం, రుచిగా ఉంటుందో లేదోనని అనుమానిస్తే ఇక తిన్నట్టే! ఇలాగే ప్రేమించిన వారిని కూడా ఇతర వ్యక్తులతో పోల్చిచూడటం, అనుమానించడం వంటివి చేయకూడదు. పూరి నోటికి ఎంత స్మూత్‌గా అందిస్తాం?.. గట్టిగా పట్టుకుంటే విరిగిపోతుందని తెలుసు. ఇలాగే ప్రేమనూ జెంటిల్‌గా హ్యాండిల్ చేయాలి. పొసెసివ్‌నెస్‌తో గట్టిగా పట్టేసుకోవాలి అని ప్రయత్నిస్తే.. మొదటికే మోసమొస్తుంది.

యుక్తవయసులో ప్రేమ కావాలి, కానీ అంతకంటే ముందు మనం ప్రేమించడం నేర్చుకోవాలి. ఎందుకంటే ఇది కేవలం లవ్ లైఫ్ కాదు, చదువు - కెరియర్.. జీవితాన్నే నిర్దేశించే అంశం. అందుకే ఎవర్ని ఎంచుకోవాలి అన్న అంశం దగ్గర్నుంచి.. ఎలా ప్రేమించాలి అనేంత వరకు.. మరికాస్త కేర్ తీసుకుందాం.

ప్రేమికుల రోజు శుభాకాంక్షలు!

మా కథ: ఉద్యోగం వచ్చాకే పెళ్లి

'ప్రాణంగా ప్రేమించినా.. సరైన ఉద్యోగాలు వచ్చేవరకూ పెళ్లి గురించి ఆలోచించకూడదు అనుకున్నాం. అనేక ఇబ్బందులు ఎదురైనా తట్టుకుని నిలబడి చివరికి ఒక్కటయ్యాం. విజయవంతమైన మా ప్రేమకథను ఈరోజు ఇలా పంచుకోవడం చాలా సంతోషం.



చిన్నతనంలోనే అమ్మప్రేమకు దూరమయ్యాను నేను. అలాంటి ప్రేమ మళ్లీ దొరుకుతుందా అనుకునేవాడిని. ఎం.కామ్ పూర్తిచేశాక ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా గోదావరిఖనిలో ఓ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరా. అక్కడే తనను మొదటిసారి చూశాను. నేను వెతికే ప్రశ్నకు సమాధానంలా కనిపించింది. కొన్నిరోజులకు మాట కలిసింది, దోస్తీ కుదిరింది. ఫ్రెండ్‌గా ఉన్న సమయంలోనే రమ్యను పెళ్లి చేసుకుంటే బాగుంటుంది అనిపించింది నాకు. కానీ ఇంకా సంపాదన మొదలుపెట్టని నిరుద్యోగిని. ఆ మాట తనతో నేరుగా చెప్పడానికి ధైర్యం సరిపోలేదు. నా మనసు అర్థం చేసుకుందో ఏమో... తనే కాస్త చనువు తీసుకుంది. దాంతో మెల్లగా నా ప్రేమ విషయం చెప్పేశా. తనేమో.. 'నువ్వంటే నాక్కూడా చాలా ఇష్టం, కానీ అమ్మానాన్నలు ఒప్పుకొంటేనే పెళ్లి' అని షరతు పెట్టింది. సంతోషంగా ఆ కండిషన్‌కు అంగీకరించా. అప్పటినుంచి మాటలు మరింత పెరిగాయి, కానీ వాటిలో ఎక్కువగా సబ్జెక్టు విషయాలే ఉండేవి. భవిష్యత్తు గురించి చాలా కలలు కన్నాం. అలా సాగిపోతున్న మా ప్రేమ జర్నీకి ఓ భారీ బ్రేక్ పడింది.

అనుకోకుండా ఓరోజు రమ్య వాళ్లక్క మా చాటింగ్ చూసేసింది. నాకు ఫోన్ చేసి 'ఇంకోసారి మా చెల్లితో మాట్లాడితే ఇంట్లో వాళ్లు తనను చదువు మాన్పించేస్తారు' అని బెదిరించింది. ఆ మాటకు చాలా భయపడ్డా. నా వల్ల తన ప్రిపరేషన్ డిస్టర్బ్ అవ్వకూడదు అనుకున్నా. ఆ మాటే తనతో చెప్పి, జాగ్రత్తగా చదవమన్నా. వాళ్ల ఇంట్లో వారికి అనుమానం రాకుండా నేనే ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లడం మానేశా. ఇంట్లో ఉంటూనే శ్రద్ధగా ప్రిపేర్ అయ్యాను. ఎవరికీ తెలియకుండా అప్పుడప్పుడూ ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్లం. ఇదిలా ఉంటుండగా.. రమ్య వాళ్ల అక్క ద్వారా వారి అమ్మకు విషయం తెలిసింది. ఆవిడ మాకు కాస్త ఆశ కలిగే మాట చెప్పారు. 'ఇద్దరికీ ఉద్యోగాలు వస్తే పెళ్లి చేయడానికి మాకు అభ్యంతరం లేదు' అని హామీ ఇచ్చారు. ఇక ఆ మాటతో మా సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి! ఎంత కష్టపడి చదివామో మాకే తెలియదు.

కొన్ని నెలల్లోనే నాకు కేడీసీసీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగం వచ్చింది. తనకూ అదే బ్యాంక్‌లో అకౌంటెంట్ కొలువు దక్కింది. ఇక పెళ్లే తరువాయి అనుకున్న సందర్భంలో మరో కథ మొదలైంది. మా మతాలు వేరు కావడంతో ఇద్దరి కుటుంబాల్లోని ఇతర సభ్యులు పెళ్లికి ఒప్పుకోలేదు. భారీ భారీ గొడవలు! వాళ్లందరికీ మెల్లగా సర్దిచెప్పుకొంటూ వచ్చాం. మతం కంటే మా ప్రేమ, భవిష్యత్తు ఎంత గొప్పదో వివరించాం. కొన్నాళ్లకు పరిస్థితి మెరుగుపడింది. మరికొన్నాళ్లకు అందరి ఆశీర్వాదాలు, ఆనందోత్సాహాల మధ్య మా వివాహం జరిగింది. నా ప్రియసఖి జీవితంలోనే కాదు, ఇంట్లోనూ అడుగుపెట్టింది!

– రాజ్‌సంతోష్ (పేర్లు మార్చాం)

ఎన్ని రకాలో..

ప్రేమలో ఎప్పుడు ఎలా పడతామో తెలియదు. కానీ పెళ్లి వరకూ వెళ్లేలోపు చాలా విషయాలు ఆలోచించుకోవాలి.

అందుకే మన కుర్రాళ్లు కొత్త కొత్త డేటింగ్ ట్రెండ్స్‌ను ఫాలో అవుతున్నారు. అందులో కొన్ని మనమూ చూసేద్దాం.

1. **హాట్ - టేక్ :** టిండర్ ఇయర్ ఇన్ స్వైప్ 2025 నివేదిక ప్రకారం ఈ ట్రెండ్‌ను విపరీతంగా ఫాలో అవుతున్నారు యూత్ జనాలు. ఇందులో పొలైట్‌గా, పొడిపొడిగా మాట్లాడే మాటలకు చోటుండదు. ఒకరి సమయాన్ని మరొకరు వృథా చేయరు. అత్యంత ముఖ్యమైనవి, అస్సలు కాంప్రమైజ్ కాలేని అంశాలను.. అదే 'హాట్ టేక్స్'ను చర్చించుకుంటారు. కంపాటబిలిటీ, కనెక్షన్ ఎలా ఉంటుందో గమనించుకుంటారు. ఏ విషయాల్లో గొడవలు రావొచ్చో ముందే అంచనా వేసి, వాటి మీదే ముందుగా చర్చించుకోవడం.. ఒక అభిప్రాయానికి రావడం ఇందులో ముఖ్యమైన అంశం.

2. **హార్డ్‌బాలింగ్ :** సిచ్యువేషన్‌షిప్‌లు, వేచి చూడటాలు, అన్నీ బావుంటే ముందుకెళ్లడాలు.. ఇవన్నీ ఇందులో కుదరవు. తొలిరోజుల్లోనే 'పెళ్లి చేసుకుంటే ఎన్నాళ్లలో చేసుకునే ఉద్దేశం ఉంది?', 'పిల్లలు కావాలా వద్దా?', 'కెరియర్‌లో సెటిల్ అయినట్టేనా లేదా?' వంటి సీరియస్ ప్రశ్నలుంటాయి. కొన్నాళ్లు సరదాగా సావాసం చేసే ఉద్దేశం అస్సలు ఉండదు ఇందులో. హాట్ టేక్ డేటింగ్‌కు సీరియస్ వెర్షన్ అన్నమాట. స్పష్టమైన నిర్ణయాలు తీసుకుని ముందుకెళ్లడం దీని ప్రధాన ఉద్దేశం.

3. **కోర్‌రొమాన్సింగ్ :** 2026లో అతి ఎక్కువ ఫాలో అవుతున్న డేటింగ్ ట్రెండ్ ఇది. మిలీనియల్స్, జెన్‌జీలో దాదాపు 42శాతం మందికి ఇది నచ్చుతోందని తాజా అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. 'ఇద్దరికీ ఒకే బ్రాండ్ కాఫీ నచ్చడం కాదు.. ఇద్దరూ కలిసి ఓ మంచి కాఫీ తయారుచేసుకోవడం' అన్నది ఇందులో అంతర్లీనమైన ఉద్దేశం. రోజువారీ పనులు, చిన్న చిన్న అంశాల్లో ఒకరికొకరు సహాయం చేసుకోవడం ద్వారా ప్రేమను మరింత ఫీలవ్వడం. కాస్ట్లీ రెస్టారెంట్లు, ఫ్యాన్సీ డేట్ నైట్స్ మాత్రమే కాకుండా.. ప్రతి చిన్న మూమెంట్‌ను సంతోషంగా గడపడం. క్వాలిటీ టైమ్‌తో ప్రొడక్టివ్‌గా ఉంటూనే ప్రశాంతంగా ఉండే వీలుండటంతో.. దీన్ని ఫాలో అయిపోతున్నారు.

4. **డ్రై:** పేరుకు తగ్గట్టు ఎటువంటి ఆల్కహాల్, ఇతర అనారోగ్య కారకాలు లేని హెల్దీ డేటింగ్ ఇది. ఇద్దరూ ముందే తమ అలవాట్ల గురించి ఓపెన్‌గా మాట్లాడుకుంటారు. ఆరోగ్యానికి మంచి చేసే వాటినే స్వీకరిస్తారు. ఒకరి కోసం ఒకరు అన్‌హెల్దీ అలవాట్లను చేసుకోరు. కలిసి నడవడం, కాఫీ, టీ తాగడం, మంచి వాతావరణంలో సమయాన్ని గడపడానికే ప్రాధాన్యం ఇస్తారు.

5. **గార్డ్ రైలింగ్ :** బంధంలో ఉండే హద్దులను ముందుగానే నిర్ణయించుకుంటారు. ఫిజికల్, ఎమోషనల్, కమ్యూనికేషన్ బౌండరీస్ ముఖ్యమని భావిస్తారు. తాము ఎంత వరకూ ఓపెన్‌గా ఉండగలం అనే విషయాన్ని ముందే మాట్లాడుకోవడం ద్వారా ఒకరి ప్రైవసీని మరొకరు గౌరవిస్తారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు బౌండరీ సెట్ చేసుకోవడం అవసరమని భావిస్తున్న జంటలు పెరుగుతూ ఉండటంతో ఈ డేటింగ్ ట్రెండింగ్‌లో ఉంది.

రీరిలీజ్ లవ్



మంచి సినిమా చూడటం బావుంటుంది. అదే మంచి సినిమా మళ్లీ చూడటం ఇంకా బావుంటుంది. అదే మంచి సినిమా మనసుకు నచ్చిన వారితో మళ్లీ చూడటం ఇంకా ఇంకా బావుంటుంది. ఈ ప్రేమికుల రోజున యూత్‌కి అలాంటి థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి ప్రేమకథలతో వచ్చి ప్రేక్షకుల మనసు దోచుకున్న సినిమాలు రీరిలీజ్ అయ్యాయి. మనసంతా నువ్వే, ఆరెంజ్, లవ్‌స్టోరీ, 3 వంటి మూవీస్ ఇప్పటికే థియేటర్‌లో ఉన్నాయి. వీటిలో ప్రతి సినిమా.. ప్రేమను తనదైన రీతిలో ఆవిష్కరించి ఓ కొత్త కోణాన్ని చూపెట్టినదే! బలమైన ఎమోషన్‌తో కట్టిపడేసే ఈ ప్రేమ కథలు.. మన ప్రేమకథకు కనెక్ట్ అవుతాయనడంలో సందేహం లేదు. మరి 'నేనూ నువ్వంటూ..' అని పాడుకుంటారో, 'తూనీగా తూనీగా' అని ఊసులు కలబోసుకుంటారో, 'కన్నులదా..' అని కలవరిస్తారో, 'నీ చిత్రం చూసి..' అని పరవశిస్తారో.. మీ ఇష్టం!

నీకో చిన్న గిఫ్ట్



ప్రేమికుల రోజున బహుమతులు ఇచ్చిపుచ్చుకోని జంటలు ఉంటాయా? అందుకే ఈ సమయానికి షాపులు కిటకిటలాడిపోతుంటాయి. ఆన్‌లైన్ షాపింగ్ సైట్లు బోలెడన్ని ఆఫర్లు గుమ్మరిస్తుంటాయి. అయితే ఎప్పుడూ ఇచ్చే గిఫ్ట్స్‌కి బదులుగా ఈసారి కొత్తగా ఉన్న ఈ ఫొటో ప్రొజెక్షన్ మ్యాజిక్‌ను ట్రై చేయొచ్చేమో చూడండి.

పర్సనలైజ్డ్ గిఫ్ట్స్‌లో ఫొటోలతో ఉండేవి చాలానే ఉన్నాయి. కానీ వాటిలో ఫొటోలు బయటకు కనిపిస్తాయి. ఇలా కాకుండా మీకూ తనకూ మాత్రమే తెలిసేలా మైక్రో టెక్నాలజీని వాడి తయారు చేస్తున్నవే ఈ ఫొటో ప్రొజెక్షన్ నగలు, వస్తువులు. వీటిలో అతి చిన్న ప్రొజెక్షన్ స్టోన్‌లో మనకి ఇష్టమైన ఫొటో ఉంటుంది. మామూలుగా చూసేవారికి నగలా మాత్రమే కనిపిస్తుంది. కానీ ఆ లెన్స్‌ను కంటికి దగ్గరగా పెట్టుకుని చూస్తే.. మనకు నచ్చిన ఫొటో కనిపిస్తుంది. దీనిపై మొబైల్ లైట్ కానీ, మరే ఇతర లైట్‌ను అయినా ఒకవైపు నుంచి ఫోకస్ చేస్తే.. మరోవైపు నుంచి గోడపై ఆ చిత్రం ప్రత్యక్షమవుతుంది! అంతేకాదు.. మొబైల్ కెమెరాను ఆన్ చేసి ఈ ప్రొజెక్షన్ స్టోన్‌కు దగ్గరగా చేరిస్తే స్క్రీన్ మీద ఆ ఫొటో కనిపిస్తుంది. ఇలా లాకెట్స్, బ్రేస్‌లెట్స్, రింగ్స్, కీచెయిన్స్.. అన్నీ మంచి మంచి డిజైన్స్‌లో దొరుకుతున్నాయి. బంగారం, సిల్వర్, మెటల్ కోటెడ్, క్రోచెట్ ఆప్షన్స్ కూడా ఉన్నాయి. మరి ఈ సీక్రెట్ లవ్ గిఫ్ట్ మీకూ నచ్చిందా?

ఆ కౌగిలింతలో..

వీలు చిక్కినప్పుడల్లా ప్రేమించిన వారిని హగ్గుల్లో తడిపి ముద్దచెయ్యాలని ఎవరికి ఉండదు చెప్పండి? ప్రేమనిండిన ఆ కౌగిలిలో ఎంత హాయి ఉంటుందో కదా.. దీని వెనక చాలా సైన్స్ ఉండటమే కాదు, బంధాన్ని బలపరిచే మరెన్నో విషయాలు దాగున్నాయి.

మనుషుల హగ్‌కి సంబంధించి అత్యంత పురాతనమైన ఆధారం ఏమిటో తెలుసా.. 6 వేల సంవత్సరాల నాటివిగా భావిస్తున్న 'లవర్స్ ఆఫ్ వాల్డరో' అని పిలిచే అస్థిపంజరాలు. రెంటినీ గట్టిగా వాటేసుకుని ఉన్న భంగిమలో పూడ్చిపెట్టారు మరి!

- కౌగిలింత వల్ల ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలవుతుంది. దీన్నే లవ్ హార్మోన్, కడిల్ హార్మోన్ అని కూడా అంటారు. దీనివల్ల సేఫ్టీగా ఫీలవుతాం. ప్రేమించిన వారి పట్ల నమ్మకం పెరుగుతుంది. ఎక్కువ సంతోషంగా ఉండగలం.
- ఇది 'కార్టిసాల్' వంటి ఒత్తిడిని కలగజేసే రసాయనాల విడుదలను తగ్గిస్తుంది. ఇమ్యూనిటీని పెంచుతున్నట్టు ఆధారాలున్నాయి. గాఢమైన ప్రేమానుబంధాన్ని ఫీలవ్వడంలో హగ్ పాత్ర చాలా ముఖ్యమైనది!
- నొప్పిని నివారించే ఎండార్ఫిన్లు కౌగిలి ద్వారా విడుదల కాగలవు. శరీరంలో వివిధ కారణాలతో కలిగే చిన్నచిన్న నొప్పులను ఇవి నివారిస్తాయి.
- రోజుకు ఒక్కసారైనా కనీసం 20 సెకన్లపాటు ప్రేమించిన వారిని హత్తుకోవడం వల్ల 'నీకు నేనున్నా' అనే భరోసా ఏర్పడుతుంది. మానసిక స్థితిని, ఆరోగ్యాన్ని పెంపొందించడానికి కౌగిలింత చాలా అవసరం.
- ఎవరికైనా రోజుకు 4 హగ్స్ ఉండాలి. అదే 8 కౌగిలింతలు ఉంటే అది మరీ మంచిది. ఇక 12 ఉంటేనా.. ఎదుగుదల ఎక్కడికో వెళ్లిపోతుంది! మరి మీరు కూడా ప్రేమించే వ్యక్తిని రోజూ హగ్ చేసుకోవడం మర్చిపోకండేం.



పాత పద్ధతే..

మీకు తెలుసా!

ఆఖరి పదేళ్లలో ప్రేమికులు ఒకరిని ఒకరు కలుసుకునే విధానం చాలా మారిపోయింది. ఒకప్పుడైతే కపుల్స్ పెళ్లిచూపుల్లోనో, కాలేజ్‌లోనో, బంధువుల ద్వారానో ఒకరికొకరు పరిచయం అయ్యారు. కానీ డిజిటల్ లిటరసీ పుణ్యమాని.. ఆన్‌లైన్‌లో పరిచయాలు పెరిగాయి. సోషల్‌మీడియా, డేటింగ్‌యాప్స్ ఏదైతేనేం.. స్వైప్ చేస్తూనో, లైక్ కొడుతూనో ప్రేమలో పడిపోయేవారు. అయితే మళ్లీ ఈ పద్ధతి మారిపోతోంది. ఇప్పటి జెన్‌జీ వారికి.. ఇలా డిజిటల్‌గా మనుషులను కలవడం మీద ఇంట్రెస్ట్ పోతోందని అనేక సర్వేల్లో తేలింది. కారణం.. జనాలు ఆన్‌లైన్‌లో 'ఫేక్'గా కనిపించడమేనట. ఫొటోల్లో ఒకలా బయట మరోలా ఉండటం, సొంత ఐడెంటిటీని దాచిపెట్టడం, మాట్లాడే తీరు మరోలా ఉండటం.. ఇలాంటి కారణాలతో నెట్‌లో వ్యక్తులను నమ్మడం బాగా తగ్గించారట. పాతపద్ధతిలో నేరుగా మనుషులను కలిసి ఒక నిర్ణయానికి రావడమే సరైనదని భావిస్తున్నారట. మంచి విషయమే కదూ!

ఈనాడు

విజయవాడ 14-2-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 185
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం.. దేశ హితం కోసమే పనిచేస్తా



'సేవా తీర్థ్'ను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

ప్రధాని మోదీ

సౌత్‌బ్లాక్ నుంచి నూతన భవనంలోకి పీఎంవో

దిల్లీ: కొత్తగా నిర్మించిన ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో)- 'సేవా తీర్థ్'లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తానని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణంలో (మిగతా 2లో)



నూతన కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మోదీ

భళా జింబాబ్వే..



ముజరబాని

కొలంబో: టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో పెను సంచలనం నమోదైంది. టైటిల్ ఫేవరెట్ ఆస్ట్రేలియాకు జింబాబ్వే షాకిచ్చింది. శుక్రవారం గ్రూప్-బి పోరులో ఆ జట్టు 23 పరుగుల తేడాతో కంగారూ జట్టును ఓడించింది. మొదట జింబాబ్వే 2 వికెట్లకు 169 పరుగులు చేసింది. ఛేదనలో ముజరబాని (4/17), బ్రాడ్ ఎవాన్స్ (3/23) ధాటికి ఆసీస్ 19.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది.

సత్తాచాటిన సాయితేజ



సాయితేజ

చెన్నై: ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌తో గ్రూప్-ఎ మ్యాచ్‌లో సాయితేజ ముక్కమల్ల (79; 51 బంతుల్లో 5×4, 4×6) సత్తా చాటాడు. అమెరికాకు ఆడుతున్న ఈ తెలుగు కుర్రాడు అదరగొట్టడంతో ఆ జట్టు 93 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను చిత్తు చేసింది. మొదట అమెరికా 6 వికెట్లకు 196 పరుగులు చేసింది. ఛేదనలో నెదర్లాండ్స్ 15.5 ఓవర్లలో 103 పరుగులకే ఆలౌటైంది. హర్మీత్ సింగ్ (4/21) విజృంభించాడు.

వివరాలు ఛాంపియన్ లో..

మాటిచ్చాం.. నిలబెట్టుకుంటున్నాం



- సవాళ్లను అధిగమిస్తూ సంక్షేమం, అభివృద్ధితో ముందుకు
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడి
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో ప్రసంగం లోపలి పేజీలో

ఆ తీర్మానం సుబ్బారెడ్డిదే!

నిబంధనల సడలింపుపై ఏకపక్ష నిర్ణయం!

'నెయ్యి కొనుగోలుకు ఆమోదం తెలిపే అంశం'గా తీర్మానం రాసేశారు లోపలి పేజీలో

దానిపై నాటి ఛైర్మన్, డిప్యూటీ ఈవోల సంతకాలు

ఇదే కల్తీనెయ్యి సరఫరాకు మూలం

జగన్ కదిలితే.. జనాలకు నరకమే

రాజకీయ ముసుగులో నేరాలు చేస్తున్నారు



- ఫ్యాక్షన్ మనస్తత్వంతోనే హెరిటేజ్‌పై ఆరోపణలు
- నల్లమలసాగర్ ప్రాజెక్టుకు తెలంగాణ అభ్యంతరం సరికాదు
- జనాభా నిర్వహణపై ఈ సమావేశాల్లోనే పాలసీ
- శాసనసభలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'రాజకీయం ముసుగులో నేతలే నేరాలు చేస్తే ఎలా' అని వైకాపా అధినేత జగన్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. జగన్ రోడ్డుపైకి వస్తున్నారంటే ఏం జరుగుతుందోననే భయం ప్రజల్లో నెలకొంటోందని, ఎక్కడికి వెళ్లినా దౌర్జన్యం, రోడ్డంతా దిగ్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన విజయవాడ నుంచి గుంటూరుకు వెళ్లేందుకు ఆరు గంటలా? ఆ సమయంలో ప్రయాణికులంతా నరకం అనుభవించాలా అని నిలదీశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో శుక్రవారం సీఎం ప్రసంగించారు.

'కల్తీ నెయ్యి సరఫరా చేసిందే కాక ఆ వివాదంలోకి హెరిటేజ్ సంస్థను తీసుకొచ్చారు. తిరుమల లడ్డూ కల్తీకి హెరిటేజ్‌కు ఏం సంబంధం? ప్రభుత్వం నుంచి ఆ సంస్థ ఒక్క పైసా అడగలేదు. పత్రిక ఉంది కదా అని పెద్ద హెడ్‌లైన్లు పెడుతున్నారు. బ్రాండ్ దెబ్బతీస్తే హెరిటేజ్‌కు నష్టం వస్తుందనేది వాళ్ల భావన. వాళ్లు చేసిన నేరం నుంచి తప్పించుకోవడానికి ఇతరులపై నెట్టేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. గతంలో రాయలసీమ ఫ్యాక్షన్‌లో ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బ తీసేందుకు చీనీ చెట్లనే నరికేసేవారు. ఇప్పుడూ అలాంటి వ్యవహారాన్నే వైకాపా వారు నడిపిస్తున్నారు. రౌడీ అనేవాడు ఈ రాష్ట్రంలో ఉండడానికి వీల్లేదు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం' అని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగిస్తుండగా.. వైకాపా సభ్యులు కాగితాలు చించి ఆయనపై వేసి, అవమానించారని సీఎం ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో ఈ అసెంబ్లీ బూతులకు నమూనాగా ఉండేది. పాలకులు అసెంబ్లీలో అవమానించిన తీరుకు తనతోపాటు ఆ ఐదేళ్లలో ఎంతో మంది కన్నీళ్లు పెట్టుకున్నారని గుర్తు చేశారు.

గోదావరి జలాల్ని రెండు రాష్ట్రాలూ వినియోగించుకోవాలి

'ఏటా 3,500 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి వృథాగా (మిగతా 2లో)

> తిరుపతి లడ్డూ వ్యవహారం చాలా సున్నితమైన అంశం. కొందరు కావాలని దేవుడి పవిత్రత, భక్తుల మనోభావాలు దెబ్బతీయాలని ప్రయత్నించారు. జరిగిన తప్పులు చెప్పకపోతే ఆ అపవిత్రతను కొనసాగించేందుకు వైకాపా వారు వెనుకాడరు. శ్రీవేంకటేశ్వర స్వామి విషయంలో తెలిసిగానీ, తెలియకగానీ తప్పు చేయను. తితిదే సహా అన్ని దేవాలయాల పవిత్రతను కాపాడే బాధ్యత తీసుకున్నాం.
> – చంద్రబాబు

20 నెలల్లో 5.72 లక్షల మందికి ఉద్యోగాలిచ్చాం లోపలి పేజీలో

నేడే రాష్ట్ర బడ్జెట్

రూ.3.46 లక్షల కోట్ల అంచనాలతో సమర్పణ?

మూడు ఆర్థిక జోన్లు, ఉద్యాన హబ్.. సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

కేంద్ర సహకారంతో ప్రగతి దిశగా అడుగులు వేసే వ్యూహం

ఈనాడు, అమరావతి: శాసనసభలో ఎన్డీయే ప్రభుత్వం శనివారం తమ మూడో బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ఇది దాదాపు రూ.3.46 లక్షల కోట్ల అంచనాతో ఉండవచ్చు. ఎన్నికల మ్యానిఫెస్టోకు అనుగుణంగా ఫలితాలు రాబట్టేలా బడ్జెట్ కేటాయింపులు ఉండబోతున్నాయి. సూపర్ సిక్స్ పథకాలు.. పోలవరం ప్రాజెక్టు సహా అన్ని ప్రాంతాలకూ సాగు, తాగునీటి భరోసా ఇచ్చే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం, రహదారులు, మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయంగా బడ్జెట్ స్వరూపం ఉండనుంది. మూడు ఆర్థిక జోన్లు, రాయలసీమ ఉద్యానహబ్ లాంటి అంశాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఉంటుంది. ఆర్థికమంత్రి (మిగతా 2లో)

మద్యం రవాణాలోనూ మహా దోపిడీ

- ఒక్కో కేసు రవాణా ఛార్జీ రూ.13
- దాన్ని రూ.34కు పెంచి రూ.200-400 కోట్లు కొల్లగొట్టిన వైకాపా నేతలు
- రాజ్ కెసిరెడ్డి ముసుగు సంస్థ సిగ్మా లాజిస్టిక్స్‌ను ముందు పెట్టి దందా
- జగన్ జమానాలో మరో కుంభకోణం
- సీఐడీలో కేసు.. సిట్‌కు అప్పగింత

ఈనాడు – అమరావతి



జగన్ జమానాలో మద్యం సరఫరా ఆర్డర్ల జారీ ద్వారా వేల కోట్ల రూపాయల ముడుపులు కొల్లగొట్టిన వైకాపా ముఠా.. అప్పట్లో ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి ప్రభుత్వ దుకాణాలకు మద్యం రవాణా వ్యవహారంలోనూ మరో కుంభకోణానికి పాల్పడింది. అందులో రూ.200-400 కోట్లు దోచుకుంది. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లుగా వైకాపా ముఖ్య నేతల్లో పలువురు రెండు, మూడేసి జిల్లాలను వంతులేసుకుని మరీ దోచేశారు. కొందరు నేతలు వారి సంస్థల పేర్లతోనే ఈ దందా చేయగా మరికొందరు మాత్రం బినామీలను ముందు పెట్టి నడిపించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో ఈ కుంభకోణం గుట్టు వీడింది. ఆ నివేదిక ఆధారంగా ఏపీ సీఐడీ ఈ నెల 10న కేసు నమోదు చేసింది. 2020-24 మధ్య ఈ ముఠా మద్యం రవాణా టెండర్లలో రిగ్గింగ్, అడ్డగోలుగా రవాణా ఛార్జీలు పెంచేయటం, నిబంధనల ఉల్లంఘించటం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.200-400 కోట్ల మేర నష్టం కలిగించిందంటూ సీఐడీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఈ కేసు దర్యాప్తు బాధ్యతనూ విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు నేతృత్వంలోని సిట్‌కే అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

జేసీల నుంచి లాక్కుని.. కేంద్రీకృతం చేశారు

■ ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి ప్రభుత్వ దుకాణాలకు మద్యం సరఫరా చేసే రవాణా కాంట్రాక్టును వైకాపా హయాంలో తొలుత జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ నిర్ణయించేది. ఎంపిక చేసిన కాంట్రాక్టు సంస్థలకు ఒక్కో మద్యం కేసు రవాణాకు రూ.13 చొప్పున చెల్లించేవారు. వైకాపా ముఠా ఈ రవాణా (మిగతా 2లో)

ఎక్కడెక్కడ.. ఏ వైకాపా నేతకు?

■ రాయలసీమ ప్రాంతంలో చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి, ఎర్రచందనం స్మగ్లర్ ఎంసీ విజయానందరెడ్డి సంస్థ అయిన నిఖిలానంద లాజిస్టిక్స్, ధర్మవరం నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి బినామీల పేరిట ఉన్న సంస్థలకు

■ గుంటూరు ప్రాంతంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు బినామీ సంస్థకు

■ ఉభయగోదావరి జిల్లాల పరిధిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు కారుమూరి సునీల్ పేరిట ఉన్న సంస్థకు

■ ఉత్తరాంధ్రలో అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అనుచరులు, బినామీల పేరిట ఉన్న సంస్థలకు మద్యం రవాణా సబ్ కాంట్రాక్టులిచ్చి దోచుకునేలా చేశారనే ఫిర్యాదులున్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ చేయించింది.



కవర్లు కట్టడంతో నాణ్యంగా పెరిగిన మామిడి కాయలు

టన్ను బంగినపల్లి రూ.1.75 లక్షలు

కవర్లు కట్టిన వాటికి అధిక ధర

ఈనాడు, అమరావతి: కాయకు కవర్లు కట్టి సాగుచేసిన బంగినపల్లి మామిడి రేటెంతో తెలుసా? టన్ను రూ.1.75 లక్షలు! గత కొన్నేళ్లతో పోలిస్తే టన్నుకు రూ.50 వేలకు పైగా అధికంగా దక్కుతోంది. అదే కవర్లు కట్టనివాటి ధర టన్ను రూ.80-90 వేలే. అంటే సగానికి సగం తేడా. కవర్లు కట్టిన మామిడిని ఎన్టీఆర్ జిల్లాకు వచ్చి కొంటున్నారు. తోతాపురి మామిడి రకానికీ టన్నుకు రూ.1.05 లక్షలు దక్కుతోంది. గతేడాదితో పోలిస్తే ఇది రూ.25వేలు అధికం. పచ్చళ్లు పెట్టేందుకు కోల్‌కతా, పుణె ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి తీసుకెళ్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం (మిగతా 3లో)

బంగ్లా ప్రధానిగా తారిఖ్

- 209 స్థానాల్లో బీఎన్‌పీ విజయఢంకా
- 2 దశాబ్దాల తర్వాత అధికారంలోకి
- రెండో స్థానంలో మతతత్వ పార్టీ జమాత్-ఏ-ఇస్లామీ



తారిఖ్ రెహమాన్

ఢాకా: బంగ్లాదేశ్‌లో దాదాపు ఏడాదిన్నరగా కొనసాగుతున్న రాజకీయ అస్థిరతకు తెరపడింది. దేశ 13వ సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ఘన విజయం సాధించింది. మూడింట రెండు వంతుల స్థానాల్లో నెగ్గి.. రెండు దశాబ్దాల తర్వాత బంగ్లా అధికార పీఠాన్ని కైవసం చేసుకుంది. ఎన్నికలు జరిగిన 299 పార్లమెంటు స్థానాల్లో 209 సీట్లలో బీఎన్‌పీ విజయ ఢంకా మోగించింది. పాకిస్థాన్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలున్న మతతత్వ పార్టీ జమాత్-ఏ-ఇస్లామీ 68 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడు, బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్(60) దేశ నూతన ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. చివరిసారిగా బీఎన్‌పీ 2001లో అధికారంలోకి వచ్చింది. 2006 వరకు కొనసాగింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీయే నెగ్గుతూ వచ్చింది. 2024 ఆగస్టులో జరిగిన విద్యార్థుల ఉద్యమంలో హసీనా ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక సలహా మండలి బంగ్లా పాలనను పర్యవేక్షిస్తూ వచ్చింది. గురువారం జరిగిన ఎన్నికల్లో 59.44 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికలతో పాటు.. జులై నేషనల్ ఛార్టర్‌గా పరిగణించే 84 పాయింట్ల సంస్కరణల ప్యాకేజీపైనా రిఫరెండం జరిగింది. సంస్కరణలకు అనుకూలంగా 60.26% ప్రజలు ఓటేశారని ఎన్నికల సంఘం సీనియర్ కార్యదర్శి అఖ్తర్ అహ్మద్ తెలిపారు.

35 ఏళ్ల తర్వాత పురుష ప్రధాని!


బంగ్లాదేశ్‌లో గత 35 ఏళ్లుగా మహిళలే ప్రధానులుగా కొనసాగారు. ఈ కాలంలో అవామీ లీగ్ అధినేత నేత షేక్ హసీనా, (మిగతా 2లో)

'డార్క్ ప్రిన్స్'కు బంగ్లా పగ్గాలు

భారత్‌కు లాభమా.. నష్టమా! లోపలి పేజీలో

కొండవీటి కోటను స్వదేశీదర్శన్ స్కీం కింద చేర్చండి: ఎంపీ లావు 3లో

ఇదీ సంగతి!





రాజధానికి రాచబాట



- వేగం పుంజుకున్న సీడ్‌యాక్సెస్ రోడ్డు పనులు
- బకింగ్‌హాం కెనాల్‌పై శరవేగంగా స్టీల్‌బ్రిడ్జి
- ఫేజ్-3లో భాగంగా 3 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్
- కొండవీటివాగు, గుంటూరు ఛానళ్లపై బ్రిడ్జి నిర్మాణం ప్రారంభం

మణిపాల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారితో అనుసంధానం

ఈనాడు – అమరావతి

రాజధానికి రాచబాటలో మరో ముందడుగు. అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డులో అత్యంత కీలకమైన ఫేజ్-3 పనులు మొదలయ్యాయి. మూడో దశలో మొత్తం 3.51 కి.మీ. పొడవైన రహదారి నిర్మిస్తుండగా, దీనిలో దాదాపు 3 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ కావడం విశేషం. సీడ్‌యాక్సెస్ రోడ్డు మూడో దశ.. ప్రకాశం బ్యారేజీ దగ్గరున్న పంపింగ్ స్టేషన్ వెనుక భాగంలో మొదలై గుంటూరు ఛానల్, కొండవీటివాగు, కృష్ణా పశ్చిమ డెల్టా (బకింగ్‌హాం) కాలువల్ని దాటుకుని, పాత జీటీ రోడ్డు పైనున్న ఆర్చ్ బ్రిడ్జి మీదుగా, సీతానగరం కొండ పక్క నుంచి వెళ్లి మణిపాల్ ఆసుపత్రి వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిలో కలుస్తుంది. మణిపాల్ ఆసుపత్రి వద్ద ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ నిర్మిస్తారు. సీడ్‌యాక్సెస్ రోడ్డు ఫేజ్-1, 2 పనులు చేస్తున్న గుత్తేదారు సంస్థ ఎన్‌సీసీనే ఫేజ్-3 పనుల్ని కూడా దక్కించుకుంది. ప్రస్తుతం కొండవీటివాగు, గుంటూరు ఛానళ్లపై బ్రిడ్జి నిర్మాణానికి పైల్స్ పనులు మొదలయ్యాయి.

రూ.512 కోట్ల వ్యయంతో ఫేజ్-3 నిర్మాణం

■ సీడ్‌యాక్సెస్ రోడ్డు ఫేజ్-3 రహదారి అంచనా వ్యయం రూ.512 కోట్లు. పన్నులు, ఇతర (మిగతా 3లో)

సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం.. దేశ హితం కోసమే పనిచేస్తా


'సేవా తీర్థ్'లో దస్త్రంపై సంతకం చేస్తున్న ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

సేవా తీర్థ్‌తో పాటు కేంద్ర సచివాలయ భవనాలైన కర్తవ్య భవన్-1, కర్తవ్య భవన్-2ల ప్రారంభం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రగతికి, పౌరులే కేంద్రంగా పరిపాలన సాగించాలన్న తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇవి నిదర్శనాలని వ్యాఖ్యానించారు. దిల్లీలో సేవా తీర్థ్ సముదాయాన్ని ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సముదాయంలో కొత్త పీఎంవో (సేవా తీర్థ్)తో పాటు కర్తవ్య భవన్-1, కర్తవ్య భవన్-2, జాతీయ భద్రతామండలి సచివాలయం ఉంటాయి. 'దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకే సేవాతీర్థ్, కర్తవ్య భవన్‌లను నిర్మించాం. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు 140 కోట్ల మంది భారతీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి పునాదుల్లా పనిచేస్తాయి. బ్రిటిష్ హయాం నాటి భవనాలను చూస్తుంటే బానిసత్వపు ఆనవాళ్లు గుర్తుకొస్తాయి. సేవా తీర్థ్, కర్తవ్య భవన్‌లు మన స్వేచ్ఛ, స్వయంపాలనకు సంకేతాలు. వీటిని జాతికి అంకితమిస్తున్నాం. 1921 నుంచీ దేశంలో అధికార కేంద్రాలుగా ఉన్న చారిత్రక సౌత్‌బ్లాక్, నార్త్‌బ్లాక్ భవనాలను మ్యూజియంగా మారుస్తాం" అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.100 ప్రత్యేక నాణాన్ని విడుదల చేశారు.

✦ బ్రిటిష్ హయాం నాటి సచివాలయ భవనంలోని తన కార్యాలయమైన సౌత్ బ్లాక్‌లో ప్రధాని మోదీ చివరి కేబినెట్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కేబినెట్ మంత్రులందరూ ఈ భేటీకి హాజరయ్యారు. అనంతరం పీఎంవోను సేవా తీర్థ్‌కు మార్చారు.

✦ సేవాతీర్థ్ ప్రారంభం అనంతరం- పలు కీలక నిర్ణయాలకు సంబంధించిన దస్త్రాలపై మోదీ సంతకాలు చేశారు. రోడ్డుప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించే లక్ష్యంతో తీసుకువచ్చిన 'పీఎం-రాహత్' వాటిలో ఒకటి. ఈ పథకం కింద.. రోడ్డుప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల మేర నగదు రహిత చికిత్స అందనుంది. లఖ్‌పతి దీదీల సంఖ్యను 2029 మార్చి నాటికి రెట్టింపు చేసేలా (6 కోట్లకు పెంచేలా) కేంద్రం లక్ష్యం విధించుకున్న దస్త్రంపైనా ప్రధాని సంతకం చేశారు.

రాష్ట్రాలవారీగా గోదావరి జలాల కేటాయింపులు లేవు

కేంద్ర 'జల వివాదాల కమిటీ' సమావేశం మినిట్స్ విడుదల

ఈనాడు, హైదరాబాద్: 'బచావత్ ట్రైబ్యునల్ 1980లో ఇచ్చిన నివేదికలో బేసిన్‌లోని రాష్ట్రాలకు గోదావరి జలాలు కేటాయింపులు చేయలేదు. మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఏపీల మధ్య ఒప్పందాలు మాత్రమే జరిగాయి' అని గోదావరి బోర్డు పేర్కొంది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు కృష్ణా బోర్డుకు ఒక్క ప్రాజెక్టునూ అప్పగించలేదని స్పష్టంచేసింది. ఈ మేరకు గత నెల 30న దిల్లీలో జరిగిన 'కేంద్ర జల వివాదాల కమిటీ' సమావేశం మినిట్స్‌ను తాజాగా కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) రాష్ట్రాలకు చెందిన సభ్యులకు పంపించింది. అందులోని వివరాలివీ...

✦ బచావత్ ట్రైబ్యునల్ ఏ రాష్ట్రానికీ కేటాయింపులు చేయలేదని, గోదావరి జలాల లెక్కలు కూడా తేల్చలేదని గోదావరి బోర్డు ప్రజెంటేషన్ ద్వారా తెలిపింది. ✦ రెండు రాష్ట్రాల్లోని సాంకేతిక సలహా కమిటీ ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలను కృష్ణా బోర్డు అడిగింది. 'శ్రీశైలం తదితర ప్రాజెక్టుల స్కోప్ మారింది. ఈ నేపథ్యంలో మార్పులకు అనుగుణంగా ఆ ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ నుంచి మరోమారు అనుమతి తీసుకోవాలి. దీనికోసం 2021 జులైలో జలశక్తి శాఖ ప్రకటన జారీచేసింది. కృష్ణా బోర్డు పరిధిపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టులను బోర్డు నియంత్రించలేదు. రెండు రాష్ట్రాలు ఇంతవరకు ఒక్క ప్రాజెక్టునూ అప్పగించలేదు. ప్రాజెక్టుల నీటి నిర్వహణ తదితరాలను రాష్ట్రాలే చూసుకోవాలి. ఏడేళ్ల క్రితం 18 చోట్ల టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటుచేశాం. తదుపరి పరికరాల ఏర్పాటుకు కేడబ్ల్యూడీటీ-2 తీర్పు వచ్చేవరకు వేచి చూడాల్సి ఉంది. ఈ పరికరాలతో ఆశించిన ఫలితాలు రావడం లేదు' అని తెలిపింది.

జగన్ కదిలితే.. జనాలకు నరకమే

(మొదటి పేజీ తరువాయి)

పోతున్నాయి. అందులో 200 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలిస్తాం. దీనిపై తెలంగాణ అభ్యంతరం చెప్పటం సరికాదు. రెండు తెలుగు రాష్ట్రాలూ నీటిని సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైతే ఈ అంశంపై సంప్రదింపుల ద్వారా ఓ నిర్ణయానికి రావచ్చు. ఒకటి రెండు అంశాల పరిష్కారం కోసమైతే కూర్చుని మాట్లాడుకుందామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రతిపాదించారు. వచ్చే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులనూ పూర్తి చేస్తాం. పోలవరం-వంశధారను అనుసంధానిస్తాం. హంద్రీనీవా కాల్వలను పూర్తి చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకువెళ్లాం. రాయచోటికి నీరు తీసుకువెళ్తాం. గాలేరు-నగరి ద్వారా వచ్చే ఏడాది కడపకూ నీళ్లిస్తాం. ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఎమ్మెల్యేలు ప్రత్యక్షంగా చూడాలి. గత పాలకులు రాజకీయ కక్షతో పోలవరాన్ని గోదాట్లోనే ముంచేశారు. డయాఫ్రం వాల్ ధ్వంసం చేస్తే ఇప్పుడు రూ.వెయ్యి కోట్లతో మళ్లీ దాన్ని నిర్మిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ లోగా జాతికి అంకితం చేస్తాం' అని పేర్కొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా..

'జనాభా నిర్వహణపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే పాలసీ తెస్తాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఆదుకున్న కేంద్రానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా సుపరిపాలన అందిస్తున్నాం. ఎన్టీఆర్ భరోసా కింద నెలకు రూ.2,750 కోట్లు పింఛన్లుగా అందిస్తున్నాం. తల్లికి వందనం ద్వారా కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం కింద ఇప్పటి వరకు 43.5 కోట్ల ప్రయాణాలు చేశారు. దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లను అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి ఏపీ, మహారాష్ట్ర ఆదర్శంగా నిలవనున్నాయి' అని పేర్కొన్నారు.

సంపద ఉంటేనే పంచగలం

'ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో సంపద సృష్టి జరుగుతోంది. రోడ్లు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలను ఈ విధానంలోనే నిర్మిస్తున్నారు. పీపీపీలో ప్రాజెక్టు నిర్మించి, నిర్వహిస్తారు. నిర్దిష్ట కాలపరిమితి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. సంపద ఉంటేనే దాన్ని పంచగలం. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయగలం. పీ4తో భవిష్యత్తులో మంచి ఫలితాలొస్తాయి. పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని రాష్ట్రంలో చేపట్టాం. రూ.30 వేల కోట్లు ప్రభుత్వ నిధులు, రూ.70 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమలో ఉద్యాన హబ్ అభివృద్ధి చేస్తాం. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో డబ్బులు చెల్లించాం. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు నివారించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి ఘటననూ ఆడిట్ చేయిస్తాం' అని తెలిపారు.

భూ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు

'వైకాపా ప్రభుత్వంలో భూముల రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. వారికి భూములు ఇవ్వకపోతే నిషిద్ధ జాబితా (22ఎ)లో పెట్టేశారు. చట్టాలు చేసే స్థానంలో ఉండే అప్పటి ముఖ్యమంత్రే చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేస్తే ఎవరికి చెప్పుకోవాలి? తాడేపల్లి ప్యాలెస్ సమీపంలో హెలిప్యాడ్ కోసం పక్కనే ఉన్న భూమిని అడిగారు. ఆ భూమి ఇవ్వకపోవడంతో బలవంతంగా 22ఏలో పెట్టేశారు. మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు తగలబెట్టారు' అని ధ్వజమెత్తారు. రెవెన్యూ రికార్డులన్నీ ప్రక్షాళన చేసి రాజముద్రతో పాస్ పుస్తకాలు ఇస్తున్నామన్నారు. 'మద్యం వ్యవహారంలోనూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టారు. రూ.3,200 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారు. దానిపై కోర్టులూ ఆగ్రహం వ్యక్తం చేశాయి' అని సీఎం చెప్పారు.

భూమి, ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే ఉద్యోగాలు ఎలా వస్తాయి?

'భూమి, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు, ఉద్యోగాలు ఎలా వస్తాయి? ప్రముఖ పరిశ్రమలకు భూములిస్తుంటే కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేలా ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25.6% మనకే దక్కాయంటే ఏపీ బ్రాండ్ విలువేంటో అందరూ అర్థం చేసుకోవాలి. విశాఖలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ పరిశ్రమలు వస్తున్నాయి. అనకాపల్లిలో ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నారు. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ రూ.70 వేల కోట్లతో రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. భాగస్వామ్య సదస్సులో రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులకు 610 ఒప్పందాలు చేసుకున్నాం. మొత్తంగా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను రూ.4 వేల కోట్లతో అనుసంధానిస్తున్నాం' అని వెల్లడించారు.

విద్యుత్తు ఛార్జీలు పెంచం

'మేం విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని చెప్పాం. దానికి కట్టుబడి ఉన్నాం. రూ.4,860 కోట్ల ట్రూఅప్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. వచ్చే మూడేళ్లల్లోనూ విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నాం. విద్యుత్తు రంగాన్ని గత పాలకులు విధ్వంసం చేశారు. రూ.32,166 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల విద్యుత్తు వాడకుండానే సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల్లో రూ.9వేల కోట్లు కట్టాల్సి వచ్చింది. గత ప్రభుత్వం రూ.1,22,422 కోట్ల బకాయిలు పెట్టిపోయింది. ఈ రెండేళ్లలో సాధించిన విజయాలతో వచ్చిన సంతృప్తి ఎప్పుడూ లభించలేదు. ప్రభుత్వ విధానాన్ని వివరించిన గవర్నర్‌కు ధన్యవాదాలు. యువత రాజకీయాల్లోకి రావాలి. వారిలో ఆ స్ఫూర్తిని కలిగించేందుకు విద్యార్థులు అసెంబ్లీని సందర్శించే మంచి కార్యక్రమానికి సభాపతి శ్రీకారం చుట్టారు. అందుకు ఆయన్ను అభినందిస్తున్నా' అని తెలిపారు.

నేడే రాష్ట్ర బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

పయ్యావుల కేశవ్ శాసనసభలో బడ్జెట్ సమర్పిస్తారు. అనంతరం వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను వివరిస్తారు. మండలిలో హోం మంత్రి అనిత సాధారణ బడ్జెట్‌ను, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

ఇటు సవాళ్లు.. అటు ఆశలు

ప్రస్తుతం రాష్ట్రం సవాళ్లకు, ఆశలకు మధ్య సాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,17,076 కోట్ల రెవెన్యూ రాబడిని ఆశించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రాబడులతో పోలిస్తే ప్రస్తుతం జనవరి నెలాఖరు వరకు 4% అదనంగా రాబట్టగలిగారు. జనవరి నెలాఖరు వరకు స్పెషల్ మార్జిన్ సహా రాష్ట్రానికి వచ్చిన రెవెన్యూ రాబడి రూ.1,40,540 కోట్లు. మరో రెండు నెలలకు రాబడి ఇంకా సాధించాల్సి ఉంది. కేంద్ర పన్నుల్లో వాటా రూ.57,556 కోట్లని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంచనా. ఇప్పటికే దాదాపు రూ.57,039 కోట్లు వచ్చాయి. 16వ ఆర్థిక సంఘం గత ఆర్థిక సంఘంతో పోలిస్తే కొంత పెంచి ఆంధ్రప్రదేశ్‌కు నిధులివ్వాలని సిఫార్సు చేసింది. ఆ ప్రభావంతో కేంద్ర పన్నుల్లో వాటా మొత్తం మరింత పెరిగే ఆస్కారం ఉంది. కేంద్ర బడ్జెట్‌కు అనుగుణంగా రాష్ట్రానికి వివిధ పథకాల నుంచి నిధులు రాబట్టాలనేది రాష్ట్రప్రభుత్వ వ్యూహం. ఇప్పటికే కేంద్ర ప్రాయోజిత పథకాలను గాడిలో పెట్టి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.20వేల కోట్ల వరకు ఖర్చుపెట్టేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు. మరోవైపు కిందటి ఆర్థిక సంవత్సరం కన్నా రెవెన్యూ రాబడులు, సొంత రాబడులు పెరిగినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంచనాలకు దూరంగానే ఉన్నాం. ఈ పరిస్థితుల్లో పెరుగుతున్న రాష్ట్ర స్థూల ఉత్పత్తి మన రాబడులు పెంచుకునేందుకు ఆశలు కల్పిస్తోంది. జీఎస్‌డీపీ పెరుగుదలకు అనుగుణంగా రాష్ట్ర సొంత రాబడులు ఉండాలి. ఒడిశా రాష్ట్రం జీఎస్‌డీపీలో 13.3% సొంత రాబడులు సాధిస్తుంటే, ఛత్తీస్‌గఢ్ 12% సాధిస్తోంది. ఆంధ్రప్రదేశ్ 7.7% నుంచి 7.6% మాత్రమే రాబడులు తెచ్చుకుంటోంది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టనుంది. జిల్లా స్థాయిలోనూ జీఎస్‌డీపీ రాబడిని ప్రతినెలా సమన్వయం చేసుకుంటూ ఫలితాలు సాధించాలనే యోచనతో ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. అన్ని కోణాల్లో రాబడులు రాబట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పూర్తిగా గాడిన పడవేయాలనేది ప్రభుత్వ వ్యూహం.

పోలవరం... అమరావతి

ఈ బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు, అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్సుగా నిధులు ఇస్తోంది. సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తిచేయాలని నిర్ణయించుకున్న ప్రభుత్వం వచ్చే రెండేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉంది. దాదాపు పునరావాసం నిధులూ కలిపి రూ.3,500 కోట్ల వరకు ఖర్చు చేస్తే ఉత్తరాంధ్రలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తవుతాయి. వెలిగొండ ప్రాజెక్టు, చింతలపూడి, గాలేరు-నగరి, తిరుమలకు నీళ్లు అందించే కల్యాణి డ్యాం, తుంగభద్ర, శ్రీశైలం, ధవళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల నిర్వహణ పనులకూ ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కనుంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకే ఏడాదికి దాదాపు రూ.28 వేల కోట్లు అవసరం. తల్లికి వందనం కోసం రూ.10 వేల కోట్ల వరకు ఇవ్వాలి. అన్నదాత సుఖీభవలో రూ.7,000 కోట్ల వరకు అవసరమవుతాయి. ఇతర సంక్షేమ కార్యక్రమాలకూ పెద్ద స్థాయిలో కేటాయింపులు ఉండబోతున్నాయి.

ఒకే జాతి.. ఒకే ఫ్రేమ్.. రంగులే వేరు!



కర్ణాటకలోని భద్ర పులుల అభయారణ్యంలో నల్ల చిరుత కనువిందు చేసింది. ప్రముఖ ఫొటోగ్రాఫర్ సోహన్‌సింగ్ కెమెరాకు సాధారణ చిరుత, నల్ల చిరుత ఒకేసారి చిక్కాయి. ఆ ఫొటోలు, వీడియోలు ఆయన శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన నిమిషాల్లోనే లక్షల వీక్షణలు వచ్చాయి. రెండు వేర్వేరు రంగుల చిరుతలను ఒకే ఫ్రేమ్‌లో ఎప్పుడూ చూడలేదని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. పరిసరాలను తీక్షణమైన చూపులతో వడపోస్తూ.. నీళ్లు తాగుతున్న చిరుతల చిత్రం వారిని విపరీతంగా ఆకట్టుకుంది. దీంతో ఫొటోగ్రాఫర్‌ను అభినందనలతో ముంచెత్తారు. - ఈనాడు, బెంగళూరు

మద్యం రవాణాలోనూ మహా దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టును కేంద్రీకృతం చేసింది. ఏపీఎస్‌బీసీఎల్ స్థాయిలోనే కాంట్రాక్టు ఎంపిక జరిగేలా నిబంధనలు మార్పించింది.

✦ మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి (ఏ1), అతని ప్రధాన అనుచరుడు తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ8) వారి ముసుగు సంస్థ అయిన సిగ్మా లాజిస్టిక్స్‌కు కాంట్రాక్టు దక్కేలా చేసుకున్నారు. ఒక్కో మద్యం కేసుకు రూ.34 చొప్పున చెల్లించేలా ఒప్పందం చేయించుకున్నారు. ఒక్కో కేసు రవాణాపై రూ.21 చొప్పున లబ్ధి పొందారు. ఏపీఎస్‌బీసీఎల్ సిగ్మా లాజిస్టిక్స్‌కు రూ.450 కోట్లు చెల్లించింది. తద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది.

ఒక్కో ప్రాంతంలో ఒక్కో వైకాపా నేత పాగా

✦ మద్యం రవాణా మొత్తాన్ని తమ గుత్తాధిపత్యంలోకి తెచ్చుకున్న రాజ్ కెసిరెడ్డి, తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిలు.. సిగ్మా లాజిస్టిక్స్‌కు 5 శాతం మేర కమీషన్ చెల్లించేవారు. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు వివిధ జిల్లాల్లోని వైకాపా ముఖ్య నేతలకు ఆయా ప్రాంతాల్లో మద్యం రవాణాను సబ్ కాంట్రాక్టులకు ఇచ్చేశారు. ✦ తాజాగా నమోదు చేసిన కేసులో సీఐడీ ఎవరెవర్ని నిందితులుగా చేర్చిందో ఎఫ్ఐఆర్ ఇంకా వెలుగులోకి రాలేదు. సిట్ దర్యాప్తులో వీరందరి పాత్ర బయటకొచ్చే అవకాశముంది.

మద్యం డెన్లలో దొంగిలించిన సొత్తుతో కొన్న ఆస్తుల జప్తునకు చర్యలు

మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్ము భద్రపరిచిన డెన్‌లో నుంచి రూ.5.80 కోట్లు చోరీ చేసి, ఆ సొమ్ముతో నిందితులు కొన్న స్థిరాస్తుల జప్తుకు సిట్ చర్యలు చేపట్టింది. ఈ చోరీకి పాల్పడ్డ రష్మితా బెహరా, ఇర్షాద్ అహ్మద్, ముబారక్ అలీలకు సంబంధించి హైదరాబాద్, ఒడిశాల్లో ఉన్న ఆస్తుల జప్తు కోసం విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసేందుకు సిట్‌కు హోం శాఖ శుక్రవారం అనుమతిచ్చింది.

తెలంగాణలో 'పురం' హస్త వశం

- 4 కార్పొరేషన్లు, 65 మున్సిపాలిటీల్లో స్పష్టమైన ఆధిక్యం
- భారాసకు 13 పురపాలికల్లో మెజారిటీ

ఈనాడు, హైదరాబాద్ : తెలంగాణలో హోరాహోరీగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. అత్యధిక నగరపాలక, పురపాలక సంఘాలను కైవసం చేసుకుంది. కొన్ని చోట్ల స్వీప్ చేసింది. విపక్ష భారాస ఏ నగరపాలక సంస్థనూ గెలుచుకోలేకపోగా.. పురపాలక సంఘాల్లో కూడా ఓ మేరకు మాత్రమే ఫలితాలు సాధించింది. భాజపా ఏ కార్పొరేషన్‌లోనూ పూర్తి ఆధిక్యం సాధించలేకపోయినా.. కరీంనగర్‌లో మాత్రం స్వతంత్రుల మద్దతుతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోనుంది. మిగిలిన ఆరు కార్పొరేషన్లలో నాలుగు చోట్ల కాంగ్రెస్ పూర్తి ఆధిక్యం సాధించగా, రెండింటిలో ఇతరుల మద్దతుతో అధికారాన్ని దక్కించుకోనుంది. మొత్తం 116 పురపాలక సంఘాలకు ఎన్నికలు జరగ్గా.. 66 చోట్ల హస్తం పార్టీ పూర్తి ఆధిక్యాన్ని సాధించింది. భారాస 13 స్థానాలను గెలుచుకోగా, భాజపాకు ఒక్క మున్సిపాలిటీ కూడా దక్కలేదు. 83 మున్సిపాలిటీల్లో తమకే ఆధిక్యం లభించిందని అధికార పార్టీ ప్రకటించింది. మొత్తం 26 జిల్లాల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది.

16నే అసలు లెక్క తేలేది..: మొత్తం 7 కార్పొరేషన్లలోని మొత్తం 414 డివిజన్లలో కాంగ్రెస్‌కు 190, భాజపాకు 75, భారాసకు 60 దక్కాయి. మున్సిపాలిటీల్లోని 2,582 వార్డులకు గాను.. 1347 చోట్ల కాంగ్రెస్ గెలిచి సత్తా చాటింది. భారాసకు 716, భాజపాకు 261 వార్డులు దక్కాయి. మజ్లిస్, సీపీఐ, సీపీఎం, స్వతంత్రులు, ఇతరులకు 257 వార్డులు వచ్చాయి. నగరపాలక సంస్థల్లో డీలా పడిన భారాసకు.. పురపాలక సంఘాల్లో గెలిచిన వార్డులు ఊరటనిచ్చాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ.. గద్వాల జిల్లా వడ్డేపల్లి పురపాలికలో 10 స్థానాలకు గాను ఎనిమిది చోట్ల గెలిచి సంచలనం సృష్టించింది. మొత్తం 116 మున్సిపాలిటీలను గాను 80 స్థానాల్లో పార్టీలకు స్పష్టమైన మెజారిటీ రాగా.. మిగిలిన 36 స్థానాల్లో హంగ్ ఏర్పడింది. ఈ నెల 16న మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఛైర్‌పర్సన్లు, వైస్‌ఛైర్‌పర్సన్ల పరోక్ష ఎన్నికలు జరగనున్నాయి. అంతిమంగా ఏ పార్టీకి ఎన్ని పీఠాలు దక్కుతాయనేది ఆ రోజే తేలనుంది.

✦ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పురపాలిక 14వ వార్డులో జనసేన అభ్యర్థిని అర్రూరి విజయలక్ష్మి విజయం సాధించారు. భారాస మద్దతుతో తొలిసారి బరిలోకి దిగిన ఆమె కాంగ్రెస్ అభ్యర్థినిపై 29 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

ఎస్‌బీఐ ఫౌండేషన్ 'యూత్ ఫర్ ఇండియా' ఫెలోషిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం


ఈనాడు, అమరావతి: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'యూత్ ఫర్ ఇండియా' ఫెలోషిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌బీఐ ఫౌండేషన్ ఎండీ, సీఈవో స్వపన్‌ధార్ ఒక ప్రకటనలో తెలిపారు. 13 నెలలపాటు సాగే ఈ కార్యక్రమంలో యువత నేరుగా గ్రామాల్లో ఉంటూ అక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. 21-32 ఏళ్ల మధ్య వయసున్న పట్టభద్రులు, ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) హోల్డర్లు, భూటాన్, నేపాల్ పౌరులు, ఎస్‌బీఐ ఉద్యోగులు apply.youthforindia.org ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ-పట్టణ వ్యత్యాసాలు తొలగించి, మార్పు తీసుకొచ్చే యువనాయకులను ఈ ఫెలోషిప్ ద్వారా తీర్చిదిద్దుతామన్నారు. వివరాలకు 9968807709, 8860621599 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

నర్సరీ రైమ్స్ పాడండి



మీ చిన్నారులు బాధతో ఉన్నప్పుడు వారిని ఊరడించేందుకు నర్సరీ రైమ్స్ లేదా మంచి పాటలు పాడండి. వారు తిరిగి సంతోషంగా మారడానికి ఇదొక బెస్టైన చక్కని చిట్కా. అంతేకాదు పిల్లలతో మరింత అనుబంధం పెనవేసుకునేందుకూ, పని భారంతో మీరు విసుగు చెందినప్పుడు, మీరు విశ్రాంతిగా ఉన్న సమయాల్లోనూ ఈ తరహా పాటలు పాడుకోవడం బాగా ఉపకరిస్తుంది.
- మేఘా, రచయిత

బంగ్లా ప్రధానిగా తారిఖ్


బంగ్లాదేశ్ పార్లమెంట్ భవనం

(మొదటి పేజీ తరువాయి)

బీఎన్‌పీ ఛైర్మన్ ఖాలిదా జియాలే దేశానికి నాయకత్వం వహించారు. ఇప్పుడు తారిఖ్ రెహమాన్ ప్రధానిగా బాధ్యతలు చేపడితే, 35 ఏళ్ల తర్వాత ఆ పదవిని అధిష్ఠించిన తొలి బంగ్లా పురుష ప్రధానిగా నిలుస్తారు. ఖాలిదా జియా కుమారుడైన రెహమాన్ 2008లో బంగ్లా విడిచి వెళ్లారు. 17 ఏళ్ల పాటు బ్రిటన్‌లో ప్రవాస జీవితం గడిపారు. గతేడాది డిసెంబరులోనే స్వదేశానికి వచ్చారు. తల్లి మరణించడంతో పార్టీ బాధ్యతలు స్వీకరించి బీఎన్‌పీని విజయపథంలో నడిపారు. ఎన్నికల్లో తాను పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఆయన విజయం సాధించారు.

రెహమాన్‌కు మోదీ ఫోన్

బంగ్లా ఎన్నికల్లో విజయం సాధించిన బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్‌కు శుక్రవారం భారత ప్రధాని మోదీ ఫోన్ చేసి అభినందించారు. రెహమాన్ నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి ఈ ఎన్నికలు నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. మోదీకి కూడా బీఎన్‌పీ ధన్యవాదాలు తెలిపింది. "మా నేతను అభినందించినందుకు మోదీకి ధన్యవాదాలు తెలుపుతున్నాం. ప్రజా తీర్పును ప్రజాస్వామ్య ప్రభుత్వం గుర్తించాలి. ఆ పని మోదీ చేశారు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు" అని బీఎన్‌పీ సీనియర్ నేత నజ్రుల్ ఇస్లామ్ ఖాన్ తెలిపారు. పాక్, చైనా, అమెరికా కూడా తారిఖ్‌కు అభినందనలు తెలిపాయి.

ఢాకాలో హిందూ అభ్యర్థి గెలుపు

ఢాకా-3 నియోజకవర్గం నుంచి బీఎన్‌పీ నేత, హిందూ నాయకుడు గాయేశ్వర్ చంద్రరాయ్ విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, జమాత్-ఏ-ఇస్లామీ అభ్యర్థి షాహినూర్ ఇస్లామ్‌ను 99,163 ఓట్లతో ఓడించారు. జమాత్ తరపున పోటీ చేసిన ఏకైక హిందూ అభ్యర్థి కృష్ణ నంది.. ఖుల్నా-1 నియోజకవర్గంలో ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో ఏడుగురు మహిళలు విజయం సాధించారు. ఇందులో బీఎన్‌పీ నుంచి ఆరుగురు ఉన్నారు. మరో మహిళ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి నెగ్గారు.

✦ హసీనా ప్రభుత్వాన్ని పడగొట్టిన.. విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ(ఎన్సీపీ) కేవలం 6 స్థానాలకే పరిమితమైంది. మతతత్వ పార్టీ జమాత్‌తో ఆ పార్టీ పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో పోటీచేసింది.

✦ భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని ఎన్నికల్లో విజయానంతరం బీఎన్‌పీ డిమాండ్ చేసింది. "చట్ట ప్రకారం హసీనా అప్పగింతను కోరతాం. ఇప్పటికే ఈ మేరకు భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాం" అని ఆ పార్టీ సీనియర్ నేత అహ్మద్ తెలిపారు.

✦ బంగ్లా పార్లమెంటులో మొత్తం 350 సీట్లు. ఇందులో 300 స్థానాలకు నేరుగా ఎన్నికలు జరుగుతాయి. మిగతా 50 సీట్లు మహిళలకు రిజర్వు చేశారు. ఎన్నికల్లో పార్టీలు గెలిచిన సీట్ల ఆధారంగా ఈ సీట్ల కేటాయింపులు ఉంటాయి. ఒక నియోజకవర్గంలో అభ్యర్థి మరణించడంతో ఈసారి 299 పార్లమెంట్ స్థానాలకే ఎన్నికలు జరిగాయి. రెండు స్థానాల్లో ఫలితాలను వివిధ కారణాలతో ఎన్నికల సంఘం నిలిపివేసింది. 297 సీట్లకే ఫలితాలను ప్రకటించింది.

✦ ఈ ఎన్నికల్లో పాల్గొనకుండా హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై యూనస్ ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో ఆ పార్టీ లేకుండానే ఈసారి ఎన్నికలు జరిగాయి.

గ్రహం అనుగ్రహం

14-2-2026 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
ద్వాదశి: మ. 3-24 తదుపరి త్రయోదశి
పూర్వాషాఢ: సా. 6-00 తదుపరి ఉత్తరాషాఢ
వర్జ్యం: రా. 2-34 నుంచి 4-17 వరకు
అమృత ఘడియలు: మ. 12-46 నుంచి 2-30 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-31 నుంచి 8-03 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.32; సూర్యాస్తమయం: సా.5.57
శని త్రయోదశి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
తిరుపతి	15.8	31.5
విజయనగరం	16.0	32.0
అనంతపురం	16.2	34.4
రాజమహేంద్రవరం	16.5	36.0
కడప	17.0	32.0
హైదరాబాద్	17.4	30.9
విశాఖపట్నం	17.4	31.6
కర్నూలు	17.9	35.0
నరసాపురం	18.0	32.4
తాడేపల్లిగూడెం	18.0	33.0
గుంటూరు	18.0	33.0
విజయవాడ	18.2	31.4
నిజామాబాద్	18.2	33.0
శ్రీకాకుళం	19.0	30.0
నెల్లూరు	20.1	32.1

నీట్ పరీక్ష ఆధారంగా నర్సింగ్ ప్రవేశాలు

ప్రతిపాదనకు సీఎం ఆమోదం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యూజీ పరీక్ష ఆధారంగా ప్రవేశాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ చేసిన ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరంలో నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలను ఆశించే విద్యార్థులు నీట్ యూజీ పరీక్ష రాయాల్సి ఉంటుంది. గతంలో ఇంటర్మీడియట్ మార్కులు, ఎంసెట్ పరీక్ష ఆధారంగా ప్రవేశాలు జరిగేవి. 2025-26 విద్యా సంవత్సరంలో నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలను తొలిసారిగా ఏపీ నర్సింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఎన్‌సెట్) పరీక్ష ద్వారా చేపట్టారు. రాష్ట్రంలో తొలిసారిగా ఈ ప్రయోగం చేయడం, కేవలం విజయవాడలోనే పరీక్ష నిర్వహించడంతో ఆశించిన స్పందన రాలేదు. రాష్ట్రంలో దాదాపు 4 వేల సీట్లు భర్తీ కాలేదు. దీంతో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఉన్నతాధికారులతో నర్సింగ్ ప్రవేశాలకు ఉత్తమ విధానంపై సమీక్షించారు. ప్రవేశాలకు నీట్ పరీక్ష సరైన మార్గమని అధికారులు సూచించారు. నర్సింగ్ కళాశాలలు సైతం నీట్ ఆధారిత ప్రవేశాలను సమర్థించడంతో ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వైద్యారోగ్య శాఖ మంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఈ నెల 16న అమరావతికి బిల్‌గేట్స్

ఈనాడు, అమరావతి: గేట్స్ ఫౌండేషన్ ఛైర్ బిల్‌గేట్స్ ఈ నెల 16న అమరావతిలో పర్యటించనున్నారు. రాజధానిలో జరిగే వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఉన్న ఆర్టీజీఎస్ కేంద్రాన్ని సందర్శిస్తారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 11.45 వరకూ బిల్‌గేట్స్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశమవుతారు.

కొండవీటి కోటను 'స్వదేశీదర్శన్' కింద చేర్చండి



కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం సమర్పించి వివరిస్తున్న ఎంపీ లావు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ పర్యాటక స్థలంగా పేరొందిన కొండవీటి కోటను స్వదేశీ దర్శన్ స్కీం 2.0 కింద చేర్చి వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పార్లమెంటు భవనంలోని కార్యాలయంలో కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. "కొండవీటి కోట 14వ శతాబ్దానికి చెందిన దిగ్గజ వారసత్వ స్మారకచిహ్నం. రెడ్డిరాజుల రాజధాని, ఆ ప్రాంత సంపన్నమైన చరిత్ర, సంస్కృతి, వాస్తు నైపుణ్యానికి చిహ్నం. పర్యాటక సామర్థ్యం ఉన్నప్పటికీ తగిన సంరక్షణ చర్యలు కొరవడటం లోపంగా మారింది. వీటిని సరిదిద్దేలా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) డీపీఆర్ చేసి కేంద్రానికి పంపింది. రూ.100 కోట్ల అంచనా వ్యయంతో దశలవారీగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసేలా ప్రతిపాదించింది. డీపీఆర్ ప్రకారం ఈ కోటను అభివృద్ధిచేస్తే పర్యాటకుల సంఖ్య పెరగడంతోపాటు, అమరావతి-గుంటూరు-పల్నాడు వారసత్వ పర్యాటక వలయం అభివృద్ధి చెందుతుంది. కోటను వెంటనే స్వదేశీదర్శన్ స్కీం-2.0లో చేర్చి తగిన నిధులు మంజూరు చేయాలి" అని ఎంపీ లావు కేంద్రమంత్రిని కోరారు.

గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

ఈగల్ విభాగం 'వార్షిక నివేదిక-2025'లో వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఈగల్ విభాగం' సాధించిన ఫలితాల వివరాలతో కూడిన 'వార్షిక నివేదిక-2025'ను అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం సచివాలయంలో అందజేశారు. గతేడాది కాలంలో సాధించిన ఫలితాల్ని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఎస్పీ కె.నగేష్ బాబు సీఎంకు వివరించారు. 2025 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు గంజాయి, మాదకద్రవ్యాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 1,836 కేసులు నమోదు చేశామని, 46,011 కిలోల గంజాయి సీజ్ చేసి, 4,760 మందిని అరెస్టు చేశామనిచెప్పారు. 770 వాహనాలు సీజ్‌చేశామన్నారు.



పోషకాల గని మునగ ఆకు

మునగ ఆకు ఇలలో పోషకాల గని అనడంలో సందేహం లేదు. ఎందుకంటే? ఇందులోని విటమిన్ సి నారింజలో కంటే ఏడు రెట్లు ఎక్కువ. విటమిన్ ఏ.. క్యారెట్లలో కంటే 10 రెట్లు అదనం. కాల్షియం.. పాలతో పోలిస్తే 17 రెట్లు అధికం. ప్రొటీన్.. పెరుగులో కంటే 9 రెట్లు ఎక్కువ. పొటాషియం.. అరటి పండ్లలో కంటే 15 రెట్లు అధికం. ఇనుము.. పాలకూరలో కంటే 25 రెట్లు ఎక్కువ.

– డెనిస్ వాకర్, వైద్యుడు

కోటి మంది చిన్నారులకు ఆరోగ్య భాగ్యం

- రోజూ పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందజేత
- పదేళ్ల సేవా ప్రస్థానంలో శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్





పోషకాహార పానీయాలు తాగుతున్న విద్యార్థులు ★ పాఠశాలలకు సాయిష్యూర్ ఉత్పత్తులను తీసుకెళ్తున్న ట్రస్ట్ వాహనం

ఈనాడు, బెంగళూరు: ఏ ఒక్క చిన్నారి ఖాళీ కడుపుతో బడికెళ్లకూడదు అనేది వారి ఆశయం. కానీ, దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల్లో 8 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. లక్ష్యం పెద్దదైనా ధైర్యంగా మొదటి అడుగు వేసి పిల్లలకు అల్పాహారం అందించడం మొదలుపెట్టారు. ఈ గొప్ప సంకల్పాన్ని చూసి ప్రభుత్వాలకు తోడు సమాజం కూడా కలిసివచ్చింది. కాలక్రమంలో అదొక వ్యవస్థగా మారి రోజూ కోటి మంది చిన్నారుల జీవితాల్లో పోషకాహార విప్లవం సృష్టించింది. అదే కర్ణాటకలోని శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ విజయగాథ. ట్రస్ట్ ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం చిక్కబళ్లాపుర జిల్లా ముద్దేనహళ్లిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.

50 మంది విద్యార్థులతో మొదలై..

'వన్ వరల్డ్.. వన్ ఫ్యామిలీ మిషన్' వ్యవస్థాపకుడు సద్గురు శ్రీమధుసూదన్ సాయి సూచనలతో ఆయన భక్త బృందంలో ఒకరైన బెంగళూరు టెకీ ఆనంద్ దంపతులు, స్నేహితులు ఈ కార్యక్రమాన్ని 2012లో ప్రారంభించారు. అప్పట్లో తాను పనిచేసే ఐటీ కంపెనీకి వెళ్తూ బెంగళూరు గ్రామీణ ప్రాంతం దొడ్డబెలె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆనంద్ సందర్శించారు. అక్కడి పిల్లలు జాతీయగీతం అయ్యేంత వరకు కూడా నిలబడలేక చతికిలపడిపోవటాన్ని చూశారు. ఉదయాన్నే ఏమీ తినకుండా బడికి వచ్చారని తెలుసుకుని వారానికి ఓరోజు అల్పాహారం అందించాలని నిర్ణయించుకున్నారు. తొలుత 50 మంది విద్యార్థులతో ఈ క్రతువుకు శ్రీకారం చుట్టారు. కొన్ని నెలల తర్వాత అన్ని రోజులూ ఇవ్వడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు ఈ సేవల్ని విస్తరించారు. మూడేళ్లపాటు 10 పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాయిష్యూర్ పేరుతో ఉత్పత్తులు

ఆనంద్, వారి మిత్రబృందం చేస్తున్న సేవలు అక్కడితో ఆగిపోకూడదని వాటిని దేశమంతా విస్తరించాలని సద్గురు సూచించారు. అలా 2015 నవంబరులో భగవాన్ సత్యసాయిబాబా 90వ జన్మదినోత్సవం నాడు శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టును ఏర్పాటు చేసి 90 పాఠశాలల్లో అల్పాహారాన్ని ఇవ్వడం ప్రారంభించారు. ఇతర ప్రాంతాలకు విస్తరిస్తున్న కొద్దీ అల్పాహారాన్ని వండి ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. అలా ఇచ్చేవాటిలో రోజూ అన్ని పోషకాలూ ఉండేలా చెయ్యడం కూడా అసాధ్యం. ఈ పరిస్థితుల్లో 'సాయిష్యూర్' పేరుతో రాగి, గోధుమ పిండికి వివిధ పోషకాలు, విటమిన్లను జతచేసి ఫోర్టిఫైడ్ న్యూట్రిషన్ పౌడర్‌ను రూపొందించారు. ముద్దేనహళ్లి కేంద్రంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రమాణాలకు అనుగుణంగా మిల్లెట్ ఆధారిత మల్టీ న్యూట్రియంట్ సప్లిమెంట్‌ను సిద్ధం చేసి సరఫరా చేయడం మొదలుపెట్టారు. దక్షిణాదిలో రాగిని ఉపయోగిస్తుండగా, ఉత్తరాది రాష్ట్రాల్లో గోధుమను వినియోగిస్తున్నారు. పాలతో కలిపి తీసుకునే ఈ పౌష్టికాహారం వల్ల పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరుగుతోంది.

ప్రభుత్వాలకు స్ఫూర్తి..

2018 వరకు ఆయా పాఠశాలల అనుమతితో పోషకాలను అందించిన ఈ ట్రస్ట్ సేవలు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిని ఆకట్టుకున్నాయి. ఈ ట్రస్ట్‌తో ఒప్పందం చేసుకున్న అక్కడి ప్రభుత్వం విద్యార్థులకు సాయిష్యూర్ ఉత్పత్తుల్ని అందించింది. 2023లో తెలంగాణ ప్రభుత్వం 50 శాతం ఖర్చును భరిస్తూ 21 లక్షల మంది పిల్లలకు, 2024లో కర్ణాటక సర్కారు 25 శాతం చెల్లిస్తూ పోషకాలు అందించేందుకు ముందుకొచ్చింది. అస్సాం ప్రభుత్వం కూడా 50 శాతం ఖర్చును భరించి పిల్లల ఆరోగ్యానికి బాసటగా నిలుస్తోంది. ఈ సంస్థ స్ఫూర్తితో తమిళనాడు, గుజరాత్ ప్రభుత్వాలు బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాలను ప్రారంభించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 1.50 లక్షల పాఠశాలల్లో చదువుతున్న 1.04 కోట్ల మంది విద్యార్థులకు సాయిష్యూర్ మల్టీ న్యూట్రిషన్ పానీయాన్ని అందిస్తుండటం విశేషం.

నిమ్మకూరు అభివృద్ధికి భువనేశ్వరి చొరవ

పాఠశాల, కళాశాల భవనాల మరమ్మతులకు రూ.4.89 కోట్లు మంజూరు



నిమ్మకూరులోని గురుకుల పాఠశాల, కళాశాల

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జన్మస్థలం కృష్ణా జిల్లా పామర్రు మండలం నిమ్మకూరు అభివృద్ధికి ఆయన కుమార్తె, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చొరవ తీసుకున్నారని స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శుక్రవారం తెలిపారు. పేద విద్యార్థుల కోసం ఎన్టీఆర్ నిమ్మకూరులో 1987లో నందమూరి లక్ష్మయ్య, వెంకట్రావమ్మ సంస్మారణార్థం గురుకుల వృత్తి విద్యా పాఠశాల, జూనియర్ కళాశాల నిర్మించారని తెలిపారు. కాలక్రమేణా ఆ భవనాలు శిథిలావస్థకు చేరాయని చెప్పారు. ఇటీవల భువనేశ్వరి గ్రామాన్ని సందర్శించగా, గ్రామస్థులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. స్పందించిన ఆమె విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. గురుకుల పాఠశాల, కళాశాల భవనాల మరమ్మతులకు రూ.4.89 కోట్లు మంజూరు చేయించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నెల 12న ప్రభుత్వం నుంచి మంజూరు ఉత్తర్వులు అందాయని, ఇటీవల బాలుర డార్మిటరీ నూతన భవనానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి దంపతులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాలలకు సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను నిషేధించాలి

- పిల్లలకు మంచి ఆహార అలవాట్లు నేర్పించాలి
- జీర్ణాశయ, కాలేయ సంబంధ వ్యాధులు పెరుగుతున్నాయ్
- గట్ హెల్త్‌పై కుప్పంలో 80 వేల మందికి పరీక్షలు
- ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి



సదస్సులో డాక్టర్ నాగేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్ బి.రాజేష్. చిత్రంలో డాక్టర్ జె.గోపీకృష్ణ, డాక్టర్ టి.రవిశంకర్, డాక్టర్ ఎం.జగన్మోహన్, డాక్టర్ కొడాలి జగన్మోహనరావు, డాక్టర్ కవిత, డాక్టర్ వి.జి.మోహనప్రసాద్

ఈనాడు, అమరావతి: పాఠశాలల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను నిషేధించాలని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పిల్లలకు మంచి ఆహార అలవాట్లు నేర్పిస్తే.. వారి గట్ హెల్త్ బాగుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జీర్ణాశయ, కాలేయ సంబంధిత అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని గుర్తుచేశారు. పేగుల్లో అనారోగ్య సమస్యలకు కారం, నూనె పదార్థాలు తినడం మాత్రమే కారణం కాదని.. వంశపారంపర్యం, గట్‌లో ఉండే మైక్రోబియమ్‌తో పాటు అనేక ఇతర అంశాలున్నాయని తెలిపారు. విజయవాడ గట్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఏపీ ఛాప్టర్ (ఏపీఐఎస్‌జీసీవోఎన్) 8వ వార్షికోత్సవ సదస్సును నగరంలోని నోవోటెల్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. జీర్ణ వ్యవస్థ, గట్ ఆరోగ్యంపై కుప్పం ప్రాంతంలోని 80 వేల మందిపై ప్రస్తుతం ఒక పరిశోధన ప్రారంభించామన్నారు. ఇందులో ప్రధానంగా ఎవరిలో మంచి, చెడు బ్యాక్టీరియాలున్నాయి? దానికి కారణాలు ఏంటి? గట్ హెల్త్ ఎలా ఉందనేది పరీక్షిస్తున్నామని వివరించారు. ఫాస్ట్‌ఫుడ్స్, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ ఎక్కువగా తినడం వల్ల కడుపులో చెడు బ్యాక్టీరియా చేరుతోందన్నారు. మన సంప్రదాయ ఇడ్లీ, దోశ వంటి ఆహార పదార్థాలను తినడమే ఆరోగ్యానికి మంచిదని సూచించారు. పిల్లల్లో ఆటిజం, మానసిక ఎదుగుదల లేకపోవడం, యువతలో గుండెపోట్లు, వృద్ధుల్లో మెదడు సంబంధిత సమస్యలకు కూడా చెడు బ్యాక్టీరియా కారణమవుతోందని పరిశోధనలు పేర్కొంటున్నాయన్నారు. ఈ సదస్సులో భాగంగా ప్రముఖ వైద్య నిపుణులు ఆధునిక సాంకేతిక వైద్య విధానాలపై ప్రసంగించారు.

టన్ను బంగినపల్లి రూ.1.75 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

కోతలు మొదలయ్యాయి. అక్కడ 22,896 హెక్టార్లలో మామిడి సాగవుతోంది. 2.29 లక్షల టన్నుల మామిడి దిగుబడి వస్తుందని అంచనా. బంగినపల్లి, తోతాపురి, చిన్నరసాలు, పెద్దరసాలు, సువర్ణరేఖ రకాల సాగు అధికం. కవర్ల రాయితీకి 2025-26లో 1,668 హెక్టార్లకు రూ.2.50 కోట్లు కేటాయించారు.

కవర్ ఖర్చు రూ.2.. ప్రభుత్వ రాయితీ 50%: బంగినపల్లి రకం టన్నుకు సగటున 3వేల కాయలు వస్తాయి. ఒక్కో కవర్ ధర రూ.2 ఉంది. ప్రభుత్వం 50% రాయితీ అందిస్తోంది. కట్టినందుకు రూ.1.50 చొప్పున కూలీలకు చెల్లించాలి. అంటే ఒక్కో కాయకు అయ్యే ఖర్చు రూ.2.50. టన్నుకు (3వేల కాయలకు) రూ.7,500 ఖర్చవుతుంది. హెక్టారుకు 5 టన్నుల దిగుబడి లెక్కన చూస్తే రూ.37,500.

అదనంగా దక్కేది హెక్టారుకు రూ.3 లక్షల పైనే: సాధారణ రకాలతో పోలిస్తే కవర్ కట్టిన మామిడికి టన్నుకు రూ.60-80వేలు అధికంగా దక్కుతోంది. 5 టన్నులకు సగటున రూ.3.50 లక్షలు అధికంగా లభిస్తుంది. ఇందులో కవర్ల ఖర్చు రూ.37,500 పోను రూ.3,12,500 అదనంగా వస్తోందని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం రైతు కృపారాజు వివరించారు.

మంచి రంగుతో నిగనిగ: మామిడిలో తెగుళ్ల నివారణకు రసాయన మందులు పిచికారీ చేస్తారు. దీంతో కాయలపై మచ్చలు ఏర్పడతాయి. అందుకే వీటికి తక్కువ ధర లభిస్తోంది.

★ కాయ చిన్నగా ఉన్నప్పుడే కవర్ తొడుగుతారు. 50రోజుల పాటు కవర్‌లోనే ఉంటుంది. అన్నాళ్లూ కాయపై చీడపీడల ప్రభావమేమీ ఉండదు. రసాయన మందులు పిచికారీ చేసినా కాయపై పడవు. దీంతో కాయ నాణ్యంగా ఉంటుంది. మంచి రంగుతో నిగారిస్తుంది. అందుకే వ్యాపారులు అధిక ధర ఇస్తున్నారు.

కవర్ల రాయితీకి రూ.36 కోట్లు: ఈ నెల 3వ తేదీ నుంచి ఎన్టీఆర్ జిల్లాలో 36.5 టన్నుల తోతాపురి, 54.5 టన్నుల బంగినపల్లి మామిడి విక్రయాలు జరిగాయని, రైతులకు అధికధరలు దక్కాయని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కవర్ల రాయితీకి ఇచ్చే బడ్జెట్‌ను రూ.10 కోట్ల నుంచి రూ.36 కోట్లకు పెంచుతున్నట్లు వివరించారు.

రాజధానికి రాచబాట

(మొదటి పేజీ తరువాయి)

వ్యయాలు కలిపితే ఇంకా పెరుగుతుంది.

★ ఫేజ్-3లో భాగంగా కొండవీటివాగు, గుంటూరు ఛానల్‌పై 262 మీటర్ల పొడవైన బ్రిడ్జి నిర్మిస్తారు. దాని తర్వాత మళ్లీ సుమారు 100 మీటర్ల పొడవైన రోడ్డు ఉంటుంది. అక్కడి నుంచి ఎలివేటెడ్ కారిడార్ మొదలవుతుంది.

★ ఎలివేటెడ్ కారిడార్... పాత జీటీ రోడ్డులో భాగంగా బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన ఆర్చ్ బ్రిడ్జి మీదుగా వెళుతుంది. మధ్యలో రైల్వే లైన్ కూడా దాటాల్సి ఉంటుంది. ఆర్చ్ బ్రిడ్జి నుంచి రైల్వే లైన్ దాటే వరకు బ్రిడ్జి చాలా ఎత్తులో ఉంటుంది. ఆ భాగాన్ని ఎక్స్‌ట్రాడోస్ బ్రిడ్జిగా పిలుస్తారు.

★ సీడ్‌యాక్సెస్ రోడ్డును పాత జీటీ రోడ్డుతోనూ అనుసంధానిస్తున్నారు. ఇందుకోసం బకింగ్‌హాం కాలువపై స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

★ ఇది ప్రీకాస్ట్ బ్రిడ్జి. బ్రిడ్జి భాగాల్ని హైదరాబాద్‌లో తయారు చేయించి, ఇక్కడికి తెచ్చి అమరుస్తున్నారు. స్టీల్ గడ్డర్లు అమర్చే పనులు జరుగుతున్నాయి. నాలుగు వరుసలుగా నిర్మిస్తున్న దీని పొడవు 110 మీటర్లు.

★ కొండవీటివాగు, గుంటూరు ఛానళ్లపై నిర్మిస్తున్న వంతెనలు దాటాక... సీడ్‌యాక్సెస్ రోడ్డును స్టీల్‌బ్రిడ్జితో అనుసంధానిస్తూ ఒక రోడ్డు నిర్మిస్తారు.

★ విజయవాడ నుంచి ప్రకాశం బ్యారేజీ మీదుగా.. అటు మంగళగిరి వైపు నుంచి రాజధానిలోకి వెళ్లేవారు ఈ స్టీల్‌బ్రిడ్జి మీదుగా సీడ్‌యాక్సెస్ రోడ్డులోకి ప్రవేశించవచ్చు.

★ స్టీల్ బ్రిడ్జి, కొండవీటి వాగు, గుంటూరు ఛానళ్లపై బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే.. మొదట సీడ్‌యాక్సెస్ రోడ్డును పాత జీటీ రోడ్డుతో అనుసంధానిస్తారు. ఫేజ్-3 నిర్మాణం పూర్తయ్యే వరకు స్టీల్ బ్రిడ్జి మీదుగా రాజధానిలోకి రాకపోకలు సాగించేందుకు వెసులుబాటు లభిస్తుంది. ప్రస్తుతం కృష్ణా కరకట్టే ప్రధాన రహదారిగా ఉంది. స్టీల్‌బ్రిడ్జి నిర్మాణానికి మార్చి నెలాఖరు వరకు సమయం పడుతుంది. కొండవీటి వాగు, గుంటూరు ఛానళ్లపై బ్రిడ్జి నిర్మాణం మే నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం ఉంది.



నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జి

వేగంగా సీడ్‌యాక్సెస్ రోడ్డు ఫేజ్-2 పనులు

★ రాజధానికి ప్రధాన అనుసంధాన రహదారి సీడ్‌యాక్సెస్ రోడ్డే. రాజధానిలోని బోరుపాలెం నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు నిర్మిస్తున్నారు. దీని మొత్తం పొడవు 21.78 కి.మీ. 2016లోనే నిర్మాణం మొదలైంది. తొలి దశలో బోరుపాలెం నుంచి మంతెన సత్యనారాయణరాజు ప్రకృతి ఆశ్రమం వరకు సుమారు 14.35 కి.మీ. పొడవైన రహదారి నిర్మాణం పూర్తి చేశారు. మంతెన ఆశ్రమం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు 3.92 కి.మీ. రెండో దశ రహదారి నిర్మాణం భూసేకరణ సమస్యలతో నిలిచిపోయింది. ఇప్పుడు సీడ్‌యాక్సెస్ రోడ్డు పనులూ వేగం పుంచుకున్నాయి. ఫేజ్-2 నిర్మాణానికి భూసమీకరణలో ఇంకా భూములు ఇవ్వని రైతుల్ని ఒప్పించేందుకు సీఆర్‌డీఏ అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. కొందరు రైతులు ముందుకొచ్చి భూములివ్వడంతో రెండోదశ నిర్మాణ పనులు వేగవంతం చేసింది. ఇప్పటికీ ముందుకురాని రైతుల నుంచి భూములు తీసుకునేందుకు భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది.

1.6 కి.మీ. పూర్తి చేసి, కరకట్టతో అనుసంధానం

సీడ్‌యాక్సెస్ రోడ్డు ఫేజ్-1ను తొమ్మిది వరుసలుగా నిర్మించారు. ఫేజ్-2 కూడా తొమ్మిది వరుసలుగానే నిర్మించనున్నారు. మొదట మధ్యలో మూడు వరుసల రహదారి నిర్మిస్తున్నారు. భూగర్భడ్రైనేజీ, నీటి పారుదల వ్యవస్థ, విద్యుత్, ఐటీసీ కేబుళ్లు వంటివన్నీ డక్ట్‌ల్లో ఏర్పాటు చేస్తారు. వాటి నిర్మాణం పూర్తయిన తర్వాత అటు, ఇటు చెరో 3 వరుసల చొప్పున మిగతా ఆరు వరుసలు పూర్తి చేస్తారు.

★ ఫేజ్-2 రహదారిని మంతెన ఆశ్రమం నుంచి ప్రారంభించి భూసేకరణ సమస్య లేనంత వరకు 1.6 కి.మీ. పొడవున మూడు వరుసలుగా నిర్మించి, కృష్ణా కరకట్ట రోడ్డుకు తాత్కాలికంగా కలిపారు. కరకట్ట రోడ్డుపై రద్దీని కొంత వరకు తగ్గించేందుకు ఈ ఏర్పాటు చేశారు.

★ కొండవీటివాగు, గుంటూరు ఛానల్‌పై బ్రిడ్జి, బకింగ్‌హాం కెనాల్‌పై స్టీల్‌బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేసి సీడ్‌యాక్సెస్ రోడ్డును పాత జీటీ రోడ్డుతో అనుసంధానిస్తే కరకట్ట రోడ్డుపై రద్దీ బాగా తగ్గుతుంది. సీడ్‌యాక్సెస్ రోడ్డు ఫేజ్-3 నిర్మాణం కూడా పూర్తయి జాతీయ రహదారితో అనుసంధానిస్తే రాజధానికి పూర్తి స్థాయిలో రాచబాట పడినట్లే.

ఈనాడు

బంగ్లాదేశ్ గాడినపడుతుందా?

పద్దెనిమిది నెలలుగా అనిశ్చితి, అరాచకత్వం రాజ్యమేలుతున్న బంగ్లాదేశ్‌లో ఎట్టకేలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం కొలువుదీరబోతోంది. మొన్నటి ఎలక్షన్లలో మూడింట రెండొంతుల స్థానాలను గెలుచుకోవడం ద్వారా బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) ఇరవై ఏళ్ల విరామం తరవాత మళ్ళీ అధికారాన్ని చేజిక్కించుకుంది. 'మీలో ఒకణ్ని' అంటూ ఎన్నికల ప్రచారంలో ప్రజలతో మమేకమైన బీఎన్‌పీ అధినేత తారిఖ్ రెహ్మాన్- సామాన్యులను వేదికపైకి పిలిచి ప్రశ్నలడుగుతూ ప్రజాసమస్యలు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి హామీలివ్వడం ఓటర్లను విశేషంగా ఆకర్షించింది. శాంతి, సంయమనాలతో కూడిన మార్గమే బంగ్లాదేశ్‌ను ప్రగతి దరికి చేర్చుతుందన్న తారిఖ్ సందేశం- బంగ్లాదేశీలకు భవిష్యత్తుపై భరోసా కల్పించి బీఎన్‌పీ భారీ విజయానికి కారణమైనట్లుగా స్థానిక కథనాలు విశ్లేషిస్తున్నాయి. ప్రతీకార రాజకీయాలకు పాల్పడకుండా భయం స్థానంలో న్యాయాన్ని, వివక్షకు బదులుగా నిష్పాక్షికతను ప్రతిష్ఠించి పౌరహక్కులను కాపాడతామన్నది తారిఖ్ వాగ్దానం! ప్రధానిగా దాన్ని ఆయన నిలబెట్టుకుంటేనే- మైనార్టీలపై హింసాత్మక దాడులూ దోపిడి పర్వాలకు అడ్డుకట్ట పడి బంగ్లాదేశ్ మళ్ళీ గాడినపడుతుంది!

ఆసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా బంగ్లాదేశ్‌కు ఒకప్పుడు గుర్తింపు తెచ్చిపెట్టిన షేక్ హసీనా- స్వదేశంలో ప్రజాస్వామ్యాన్ని హరించి వేశారనే అపప్రథను మూటగట్టుకున్నారు. సర్వంసహాధికారం చలాయించేందుకు గత ఎన్నికల్లో అక్రమాలకు తెరతీశారనే దుష్కీర్తినీ సొంతం చేసుకున్నారు. హసీనా పాలనను నిరసిస్తూ రాజుకున్న విద్యార్థుల ఉద్యమం చివరికి ఆమెను పదవీచ్యుతురాలిని చేసింది. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం దేశంలో శాంతి సుస్థిరతలను నెలకొల్పలేకపోయింది. కిందటి నెలలో 8.58శాతానికి చేరిన ద్రవ్యోల్బణం- సామాన్య బంగ్లాదేశీల బతుకులను కుంగదీస్తోంది. నిత్యావసరాల ధరలను వెంటనే అదుపులోకి తీసుకురావడంతో పాటు అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే కోటి నుంచి కోటిన్నర కొత్త కొలువులను సృష్టిస్తామంటూ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం బీఎన్‌పీ సర్కారుకు కత్తిమీదసాము కానుంది. రాబోయే రోజుల్లో మరే నాయకుడూ నిరంకుశుడిగా మారకుండా నిలువరించేందుకు ఉద్దేశించిన రిఫరెండానికీ బంగ్లాదేశ్ ప్రజానీకం మొన్న జైకొట్టింది. ఒక వ్యక్తి పదేళ్లకు మించి ప్రధానిగా కొనసాగకుండా చూడటం; ఎమర్జెన్సీ విధింపునకు మంత్రివర్గం, ప్రతిపక్షనేత నుంచి రాతపూర్వక సమ్మతిని తప్పనిసరి చేయడం వంటి ప్రతిపాదిత పాలనా సంస్కరణలు పూర్తిగా అమలైతే బంగ్లాదేశ్ సరికొత్త ప్రజాస్వామ్యంలోకి ప్రవేశిస్తుంది!

మతచాందసత్వానికి మరో రూపమైన జమాత్ పార్టీ హసీనా హయాము నాటి నిషేధాజ్ఞల్లోంచి బయటపడి గట్టి ప్రతిపక్షంగా ఎదగడం- బంగ్లాదేశ్‌లో మతసామరస్యానికే కాదు, భారత ప్రయోజనాలకూ ప్రమాదకర పరిణామమే. నిత్యం పాకిస్థాన్ పాట పాడటంలో ముందుండే ఆ పార్టీని కొన్నాళ్లుగా అమెరికా దగ్గరికి తీస్తోంది. చారిత్రకంగా చైనాతో సత్సంబంధాలు కలిగిన బీఎన్‌పీ- ఇటీవల తరచూ బీజింగ్‌తో మంతనాలు సాగిస్తోంది. పెట్టుబడుల ద్వారా బంగ్లాదేశ్‌లో ప్రాబల్యం పెంచుకోవాలని చైనా చిరకాలంగా ప్రయత్నిస్తోంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్, చైనా ఒకే కూటమి అయితే, దక్షిణాసియాపై ఇండియా పట్టు చెదిరే ముప్పుంది. దాంతోపాటు ఉగ్రవాదులను ఎగదోయడం వంటి భారత వ్యతిరేక కుట్రలకు బంగ్లాదేశ్ నెలవు కాకుండా చూసుకోవడం మన జాతీయ భద్రత దృష్ట్యా ప్రాణావసరం. ఆ మేరకు ఢాకాతో దౌత్య సంబంధాలను నేర్పుగా నిభాయించడంలో న్యూదిల్లీ నెగ్గుకురావాలి!



మాయమవుతున్న జలనిధులు!

వాతావరణ మార్పుల వల్ల భూ ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. మరోవైపు భూగర్భ జలాలను అతిగా తోడేయడం, భూసార క్షీణత, అడవుల నరికివేత, కాలుష్యం వంటివి భూగోళాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ పరిణామాల వల్ల ప్రపంచం నీటి కొరత నుంచి 'జల వనరుల అదృశ్యం' దిశగా పయనిస్తోందని ఐక్యరాజ్య సమితి తాజాగా హెచ్చరించింది. ప్రపంచ నాయకులు ఇకనైనా ఈ వాస్తవాన్ని గ్రహించి, జల సంరక్షణకు పూనుకోవడం అత్యావశ్యకం.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సహజ నీటి వనరులను తిరిగి భర్తీచేయలేనంత స్థాయిలో వినియోగిస్తున్నామనీ... పర్యవసానంగా నీటి వనరులు ఖాళీ అయిపోతూ జలపరమైన ఆస్తుల విషయంలో దివాలా తీస్తున్నామని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక ఉద్ఘాటించింది. దీన్ని ఐరాస విశ్వవిద్యాలయానికి చెందిన జల, పర్యావరణ, ఆరోగ్య సంస్థ (యూఎన్‌యూ- ఐఎన్‌డబ్ల్యూఈహెచ్) వెలువరించింది. అనేక ప్రాంతాలు తమకున్న జలవనరులకన్నా ఎక్కువగా నీటిని వాడేసుకుంటున్నాయనీ, దాంతో చాలా జలవనరులు ఇప్పటికే వట్టిపోవడమో, తరిగి పోవడమో జరుగుతోందనీ ఆ సంస్థ డైరెక్టర్ కావే మదానీ హెచ్చరించారు. నేడు 75శాతం ప్రపంచ జనాభా నీటి ఎద్దడిని ఎదుర్కొంటోందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

సహజ నీటి వనరులకు ముప్పు

భూగోళంపై 70శాతం భూగర్భ జలాలు నెమ్మదిగా క్షీణిస్తున్నాయని ఐరాస నివేదిక విశ్లేషించింది. 400 కోట్ల మంది ఏడాదిలో కనీసం నెల రోజులపాటు నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. ప్రకృతి ఏటా మళ్ళీ భర్తీ చేయగలిగినదానికన్నా ఎక్కువ మొత్తంలో నీటిని వాడేసుకుంటున్నాం. వర్షాల ద్వారా నదుల్లోకీ, భూగర్భంలోకీ, హిమపాతం వల్ల హిమానీనదాలలోకీ చేరే నీటికన్నా చాలా అధికంగా నీటిని వినియోగిస్తూ జలవనరులు ఖాళీ కావడానికి మనమే కారణమవుతున్నామని సమితి నివేదిక హెచ్చరించింది. జల నిధుల దివాలా వల్లనే చెరువులూ జలాశయాలూ అదృశ్యమవుతున్నాయి. హిమనదాలు కరిగి కుంచించుకుపోతున్నాయి. చిత్తడి నేలలు సైతం కనిపించకుండా పోతున్నాయి. భూగర్భ జలనిధులు తరిగిపోవడం వల్ల డెల్టా ప్రాంతాలు, నగరాలు నేలలోకి కుంగిపోతున్నాయి. ఏటా వర్షాల రూపంలో నదుల్లోకీ, భూగర్భంలోకీ చేరే నీటిని వార్షిక ఆదాయంగా; భూగర్భ జల నిధులను దీర్ఘకాలిక పొదుపుగా పరిగణిస్తే... రెంటినీ ఖాళీ చేసేస్తూ దివాలా తీసిపోతున్నామని ఐరాస నివేదిక విశ్లేషించింది.



ప్రపంచంలోని సగం భారీ జలాశయాలలో 1990 దశకం నుంచీ నీటి నిల్వలు తరిగిపోతున్నాయి. ఇది పాతిక శాతం ప్రపంచ జనాభాకు నష్టదాయకమవుతోంది. గడచిన 50 ఏళ్లలో 41 కోట్ల హెక్టార్ల చిత్తడి నేలలు అదృశ్యమయ్యాయి. ఇది ఏకంగా ఐరోపా ఖండ విస్తీర్ణానికి సమానం! భూగోళంపై 70శాతం భూగర్భ జలనిధులు క్రమంగా తరిగిపోతున్నాయి. దీర్ఘకాలంలో అవి వట్టిపోయే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. భూగర్భ జలం 40శాతం సాగునీటికీ, 50శాతం తాగునీటికీ మూలాధారం. పలు దేశాల్లో 1970ల నుంచి హిమానీనదాల్లోని మంచు 30శాతానికి పైగా కరిగిపోయింది. విరివిగా ఆనకట్టలు నిర్మించడం వల్ల అనేక నదులు సముద్రంలో కలవలేకపోతున్నాయి.

నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న దేశాల్లో మూడొంతుల ప్రపంచ జనాభా నివసిస్తుండగా, అందులో 220 కోట్ల మందికి సురక్షిత తాగునీరు లభించడం లేదు. 350 కోట్ల మందికి సరైన పారిశుద్ధ్య వసతులే లేవు. 42 కోట్ల ఎకరాల పంట భూములకు తీవ్ర సాగునీటి కొరత ఎదురవుతోంది. దాదాపు పాతిక కోట్ల ఎకరాల భూమి చవుడుదేరిపోయింది. భూగర్భ జలాలు క్షీణిస్తున్నందువల్ల చాలా దేశాల్లో నేల కుంగిపోతోంది. అటువంటి ప్రాంతాల్లో సుమారు రెండొందల కోట్ల మంది నివసిస్తున్నారు. కొన్ని నగరాలు ఏడాదికి 25 సెంటీమీటర్ల చొప్పున కుంగిపోతున్నాయి. 2022-23లో తీవ్ర అనావృష్టి వల్ల 180 కోట్లమంది 30,700 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొన్నారు. చిత్తడి నేలలు అదృశ్యమవడం వల్ల ప్రపంచానికి ఏటా 5.1 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లుతోంది. పశ్చిమాసియా, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో నీటి కొరత అంతకంతకూ పెరిగిపోతోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భూగర్భ జలవనరులను పూర్తిగా తోడేయడం వల్ల ఏర్పడిన తాగునీటి కొరత సామాజిక అలజడికి దారితీసింది. పొలాలకు సాగునీరు, నగరాలకు తాగునీరు లభించక జనం అల్లాడిపోతున్నారు.

మన పరిస్థితీ అంతే!

దేశ రాజధాని దిల్లీ తాగునీటి కొరతతో సతమతమవుతోంది. ప్రపంచ జనాభాలో 18శాతం భారత్‌లోనే నివసిస్తున్నా, ప్రపంచ జలవనరుల్లో కేవలం నాలుగు శాతమే భారత్ సొంతం. 2030కల్లా ఇండియా తీవ్ర స్థాయి నీటి కొరతను ఎదుర్కొంటుందని అంచనా. అప్పటికి 40శాతం భారతీయులకు సురక్షిత తాగునీటికి కరవు ఏర్పడుతుందని నీతి ఆయోగ్ హెచ్చరించింది. ప్రపంచంలో నీటి నిల్వలు తరిగిపోతున్న దేశాల్లో 300 కోట్ల మంది నివసిస్తున్నారు. ప్రపంచ ఆహారోత్పత్తిలో సగం ఈ ప్రాంతాల్లోనే జరుగుతోంది. వాతావరణ స్థిరత్వం, వర్షపాతం, నదీ మూలాలు, భూగర్భ జలనిధులు దెబ్బతింటే నీటి సరఫరాకు తీరని నష్టం తప్పదు. జల వనరుల రక్షణకు రాజకీయ, ఆర్థిక, సైద్ధాంతిక తేడాలను పక్కనపెట్టి అందరూ కలసికట్టుగా కృషిచేయాలి. జలవనరులను కాపాడుకుంటే- ఎడారుల విస్తరణనూ, వాతావరణ మార్పులనూ, జీవవైవిధ్య నష్టాన్నీ అరికట్టవచ్చు. నదుల ఎగువ ప్రాంతాలు, దిగువ ప్రాంతాలనే భేదం పాటించకుండా, అందరి జల భద్రతకూ నిధులు, సాంకేతికతలను వినియోగించాలి. అంతర్జాతీయ ఒప్పందాలతో సమైక్యంగా కృషి చేయాలి.



సీపీ రాజేంద్రన్
భూవిజ్ఞాన శాస్త్రవేత్త, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌లో అనుబంధ ఆచార్యులు

ఒంటరి పెంగ్విన్ మంచుకొండలవైపు నడిచి వెళ్ళిపోతున్న దృశ్యానికి రకరకాల అర్థాలు చెప్పుకొన్నాం. మన జీవితాలతో పోల్చుకుంటూ మీమ్స్ చేసి నవ్వుకున్నాం. అవన్నీ ఒంటరితనాన్నీ జీవితం పట్ల విరక్తినీ వెలిబుచ్చాయి. కానీ ఇది అసలే 'లవ్ ఈజ్ ఇన్ ద ఎయిర్' అనిపించే ఫిబ్రవరి నెల కదా... ట్రెండ్ మారొద్దూ మరి! అందుకే ఇప్పుడు జంట పెంగ్విన్ల కబుర్లు కొన్ని...

ఈ ప్రేమలూ, ప్రపోజ్ చేయడాలూ, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడాలూ, పెళ్లి చేసుకుని కాపురం చేయడాలు మనుషులకే కాదు పక్షులకీ ఉంటాయి. పావురాల్లాగానే ముద్దుగా బొద్దుగా ఉండే పెంగ్విన్లు కూడా ప్రేమకి ప్రతిరూపాల్లాగే జీవిస్తాయి. ఒకటి రెండు రకాలను మినహాయిస్తే చాలావరకూ పెంగ్విన్లు జీవితకాలం ఒకే భాగస్వామితో కలిసి ఉంటాయి. మనుషుల్లాగే సమూహాలుగా జీవించే పెంగ్విన్లు గుంపులో నుంచే తమ భాగస్వామిని ఎంపిక చేసుకుంటాయి. మగ పెంగ్విన్ తనకు నచ్చిన ఆడ పెంగ్విన్ మనసు దోచుకోవడా



పెంగ్విన్ల ప్రేమకథ!

నికి మంచి బహుమతి కోసం అన్వేషణ మొదలెడుతుంది. బీచ్‌లో, సముద్రం అడుగున వెతికి వెతికి నున్నటి గులకరాయిని సంపాదిస్తుంది. దాన్ని తెచ్చి ఆడ పెంగ్విన్ కాళ్ల దగ్గర పెడుతుంది. అదే ప్రపోజ్ చేయడమన్నమాట. ఆ ప్రతిపాదన నచ్చితే ఆడ పెంగ్విన్ గులకరాయిని స్వీకరిస్తుంది. అదే ఎంగేజ్‌మెంట్ రింగ్... అదే వారి ప్రేమగూటికి పునాది రాయి కూడా. అలా రెండూ కలిసి ఆడుతూ పాడుతూ గూటిని నిర్మించుకుని కలిసుంటాయి. ఆడ పెంగ్విన్ గుడ్డు పెట్టగానే అది మంచునేల మీద పడకుండా గబుక్కున పట్టుకుని తన పొట్టకింద పెట్టుకుని పొదుగుతుంది మగ పెంగ్విన్. రెండు నెలలపైనే పట్టే ఈ పొదిగే సమయమంతా అస్సలు కదలదు. ఈ లోపల ఆడ పెంగ్విన్ వేటకు వెళ్లి గుడ్డులోంచి పిల్ల బయటికి వచ్చేసరికి తిరిగొస్తుంది. బిడ్డ బాధ్యత తల్లికి అప్పగించి ఇప్పుడు మగ పెంగ్విన్ వేటకు వెళ్తుంది. ఆడ పెంగ్విన్ తాను తిన్న ఆహారం ద్వారా నోటిలో పాలను తయారుచేసి పిల్లకు పడుతుంది. పిల్ల పెంగ్విన్ పూర్తిగా పెద్దదై తనంతట తాను వేటకు వెళ్లగలిగే వరకు ఇలా దాని అమ్మానాన్నలు వంతుల వారీగా సముద్రానికి వెళ్లి ఆహారం తెస్తూ బాధ్యతగా పెంచుతాయి. అలా నెలల తరబడి భాగస్వామికి దూరంగా ఉన్నా పెంగ్విన్లు మరొకరివైపు కన్నెత్తి చూడవు. నేరుగా భాగస్వామిని వెతుక్కుంటూ గూటికి చేరతాయి. ముక్కుల్నీ, శరీరాల్నీ రాసుకుంటూ ప్రేమను వ్యక్తం చేస్తాయి. వేటకు వెళ్లిన భాగస్వామి తిరిగి రాని పక్షంలో మాత్రమే బిడ్డను పెంచడానికి మరొకరి తోడు అవసరం కాబట్టి మరో పెంగ్విన్‌ని తమ జీవితంలోకి ఆహ్వానిస్తాయి.

ఒంటరి పెంగ్విన్ చిత్రానికి భిన్నార్థాలు చెప్పుకోవాల్సి వచ్చింది కానీ జంట పెంగ్విన్ల జీవితం సూటిగానే పాఠాలు చెబుతుంది. ఇద్దరి మధ్య ప్రేమ, అవగాహన, నమ్మకం, ఒకరి పట్ల మరొకరికి శ్రద్ధ, పిల్లల బాధ్యత సమానంగా పంచుకోవడం... ఇది కదా జీవితం అంటే!

– విస్మయ




స్వేచ్ఛను సాధన చేయండి. స్వేచ్ఛ అంటే చేతినిండా డబ్బో, ఏదైనా చేయగల అధికారమూ కాదు. ఇతరుల అభిప్రాయాలకూ పరిస్థితులకూ బందీలు కాకుండా ఉండటం. అది అంత తేలిక కాదు కాబట్టే సాధన చేయాలి.

– పూనం అహ్లూవాలియా, సోషల్ ఆంత్రప్రెన్యూర్

తపస్సు

భగవంతుడి సాక్షాత్కారం కోసం తపస్సు ప్రధానమైన సాధనమన్నది దైవజ్ఞులు చెప్పే మాట. అది అంత సులభమైనది కాదు. ధ్రువుడు, ప్రహ్లాదుడు వంటి వారు నిష్ఠతో, తదేక దీక్షతో దాన్ని ఆచరించి చిరంజీవులుగా ఖ్యాతి పొందారు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల వంటివారు ఘోర తపస్సు చేసినా చివరికి తమ కోరికలను నెరవేర్చుకోలేకపోయారు. లోకకల్యాణం తపస్సు ప్రధాన లక్ష్యమని రమణ మహర్షి వ్యాఖ్యానించారు. వ్యాస వాల్మీకాదులు తమ తపశ్శక్తితోనే భారత, భాగవత, రామాయణాదులను అందించి చరితార్థులయ్యారు. వాటిని చదివిన వారిని తరింపజేస్తున్నారు.

రామాయణ ప్రథమ శ్లోకంలో 'తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ...' అని ఉంటుంది. తపస్వి అంటే వాల్మీకి. తపస్సు అనే పద సముచ్చయానికి రామాయణంలో విస్తృతమైన, లోతైన భావార్థాలున్నాయి. తపస్సు ద్వారా మాత్రమే జ్ఞానాన్ని సాధించగలమనేది ఉపనిషత్ వాక్యం. తపస్సంటే తనంతట తనే, తనను గురించి తెలుసుకోవడం. ఇది గ్రహించకుంటే ఆ తపస్సు విఫలం. హిరణ్యకశిపుడు, హిరణ్యాక్ష, భస్మాసురులు వంటి వారి కథలు ఈ కోవకే చెందుతాయి. తపస్సు ద్వారా దారి చూపగల గురువు లభ్యమవుతాడని వాల్మీకి చరిత్ర నిరూపించింది. నారదుడు అతణ్ని వెతుక్కుంటూ రావడం ఇందుకో ఉదాహరణ.



అంతర్యామి


'తపః' అనే శబ్దానికి అనేక అర్థాలున్నాయి. పరమాత్మ సంబంధమైన ఏకాగ్రతకి తపస్సు అని పేరు. మనోవాక్కాయ కర్మలతో, త్రికరణ శుద్ధిగా చేసే భగవత్సేవను 'తపస్సు' అని అంటారు. జ్ఞానం, దానివల్ల కలిగే నిర్వేదం వంటివి తపః ఫలితాలు. సమస్త కర్మలు చివరికి ఇందులోనే లయమవాలి. ఇటువంటి తపస్సు వల్ల భగవంతుడితో నేరుగా అనుసంధానమయ్యే అవకాశం కలుగుతుంది. ప్రహ్లాదుడు, నారదుడు తదితరులు ఇది సాధించారు. తపోజ్ఞానంతో లోకంలో సారం లేదని తెలుసుకున్న తరవాత దైన్యం కలుగుతుంది. ఇదే ఉపదేశం పొందడానికి తొలి అర్హత. తపస్సు తాలూకు మార్గమిదేనని బుద్ధుడు వంటివారు నిరూపించారు. 'తపోన్యాసః..' తపస్సంటే న్యాసం. శరణాగతి. దానివల్ల కల్మషాలన్నీ తొలగిపోతాయి. జ్ఞానోదయం అవుతుంది. అప్పుడు సమస్త జీవుల మీదా కరుణ కలుగుతుంది. అలాంటి తపోధనులు తమను ఎవరూ పిలవకపోయినా తమ అవసరం ఎక్కడ ఉందనిపిస్తుందో అక్కడ ప్రత్యక్షం అవుతారు. నారదుడు ఈ విషయంలో ప్రథమ తపస్వి. వ్యాస, వాల్మీకి, ప్రహ్లాదుల వంటి వారి దగ్గరికి ఆయనే వెళ్లాడు. భారత, రామాయణ ఆవిష్కరణలకు మార్గదర్శనం చేశాడు.

నిజ జీవితంలో ప్రతి వ్యక్తీ తపస్సంపన్నుడు కావాలనుకోవడమే విశ్వమానవ సౌభ్రాతృత్వ సాధన దిశగా తొలి ప్రయత్నమవుతుంది. నేటి వేగవంతమైన జీవన ప్రయాణంలో ఇది సాధ్యమా అనే సందేహం అనవసరం. నిష్కల్మష భక్తి, ధర్మనిరతిలతో ఇది సాధ్యమేనని కబీర్, తుకారాం వంటి మహాత్ములు నిరూపించారు. వారి బాటలో నడవడానికి తగిన కార్యాచరణను రూపొందించుకోవడమే మన తక్షణ కర్తవ్యమనుకోవాలి.

– భమిడిపాటి గౌరీశంకర్

జనరేటివ్ ఏఐలో దూకుడు

దేశంలోని ఐటీ, ఐటీ అనుబంధ పరిశ్రమలు అంతకంతకు అధిక సామర్థ్యంతో నాణ్యమైన ఉత్పత్తులను చేపడుతున్నాయి. టెక్నాలజీ స్టార్టప్‌లకు అత్యంత అనువైన వాతావరణం కలిగిన ఇండియా సుమారు 35వేల సంస్థలతో ప్రపంచంలోనే మూడో స్థానాన్ని ఆక్రమించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా మరో రెండు వేల స్టార్టప్‌లు జతకలిశాయి. అయితే, వీటిలో జనరేటివ్ ఏఐ సంస్థల విస్తరణ రేటు అధికంగా ఉండటం విశేషం. 2023లో దేశవ్యాప్తంగా 66 జనరేటివ్ ఏఐ స్టార్టప్‌లే ఉంటే, 2024 నాటికి 240కి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 890కి చేరాయి. ఏయే రాష్ట్రాల్లో అవి ఎన్ని ఉన్నాయంటే... (శాతాల్లో)



	రాష్ట్రం	సంస్థలు
■	కర్ణాటక	39
■	మహారాష్ట్ర	14
■	దిల్లీ	9
■	తెలంగాణ	7
■	హరియాణా	6
■	తమిళనాడు	5
■	ఉత్తర్‌ప్రదేశ్	5
■	ఇతరాలు	15

(ఆధారం: నాస్కామ్ నివేదిక)

చిన్న పరిశ్రమలకు చిక్కులు తప్పేదెప్పుడు?



కేంద్ర బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) రంగానికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించడం స్వాగతించదగ్గ అంశం. దేశ జీడీపీలో 30శాతం, పారిశ్రామికోత్పత్తిలో 35శాతం, ఎగుమతుల్లో 48శాతం వాటా కలిగిన ఈ రంగం 33 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది. కానీ, పెట్టుబడులు, మౌలిక వసతుల కొరత, అధిక ఉత్పత్తి వ్యయం వంటివి ఎంఎస్‌ఎంఈలను పట్టిపీడిస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరిస్తే దేశార్థికానికి చిన్న పరిశ్రమలు మరింత బలిమి చేకూర్చగలుగుతాయి.

దేశంలో వస్తూత్పత్తి, ఉపాధి కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్‌ఎంఈలు) కీలకంగా మారాయి. కానీ, దేశంలో 7కోట్లకు పైబడిన ఎంఎస్‌ఎంఈల్లో చాలామటుకు అరకొర లాభాలతోనే నెట్టుకొస్తున్నాయి. ఖాతాదారుల నుంచి బిల్లుల వసూలు ఆలస్యమవుతుండటంతో ఆర్థిక ఇక్కట్లు తప్పడం లేదు. ఎంఎస్‌ఎంఈలకు రూ.30 లక్షల కోట్ల రుణ కొరత ఉంది. పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు, కాలంచెల్లిన సాంకేతికత, పరిమిత మార్కెట్ ఈ సంస్థల వ్యాపారాన్ని బలహీనపరుస్తున్నాయి. విదేశాల్లోని ఎంఎస్‌ఎంఈలకు 3-5శాతం వడ్డీకే నిధులు లభిస్తుంటే, మన దగ్గర 11-14శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. దాంతో మన పరిశ్రమల ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉంటోంది. పైగా అవి ఆధునిక సాంకేతికతలను సమకూర్చుకోక, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోలేక అంతర్జాతీయ విపణిలో పోటీపడలేకపోతున్నాయి.

తడిసిమోపెడు... విద్యుత్, రవాణా ఛార్జీలు!

మన ఎంఎస్‌ఎంఈలను ఆదుకోవాలంటే వడ్డీపై సబ్సిడీ ఇవ్వడం, రుణ గ్యారంటీ విస్తరణ, ప్రాధాన్య రంగానికి రుణ సరఫరాలో సంస్కరణలు తీసుకురావడం అత్యావశ్యకం. వడ్డీరేట్లు తగ్గించడంతోపాటు సకాలంలో రుణాలు అందించాలి. రుణ బకాయిల చెల్లింపునకు 45 రోజుల గడువు ఇవ్వాలి. జీఎస్టీ, డిజిటల్ లావాదేవీల సమాచారాలను ఉపయోగించి వ్యాపారంలో ప్రస్తుత, భవిష్యత్తు నగదు ప్రవాహాన్ని అంచనా వేసి రుణాలివ్వాలి. తద్వారా ఎంఎస్‌ఎంఈల చేతిలో డబ్బు ఆడేట్లు చూడాలి. క్లస్టర్ ఆధారిత రుణ సరఫరా ద్వారా ఎంఎస్‌ఎంఈల ఉత్పత్తి సామర్థ్యాన్నీ, పోటీతత్వాన్నీ పెంచవచ్చు. ప్రస్తుతం ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లకు కేంద్రం, రాష్ట్రాలు 80:20 నిష్పత్తిలో రుణాలిస్తున్నాయి. కానీ చాలా రాష్ట్రాలు తమ వాటా నిధులను సమకూర్చడంలేదు. కాబట్టి, కేంద్రమే డిజిటల్ పద్ధతుల్లో, సకాలంలో వంద శాతం రుణాలిచ్చి వాటిని ఆదుకోవాలి.

మన దేశంలో ఎంఎస్‌ఎంఈలకు యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.8-9 వరకు ఉంటోంది. ఇతర దేశాలు ఇంతకన్నా చాలా తక్కువ ధరలకే కరెంటు అందిస్తున్నాయి. భారతీయ ఎంఎస్‌ఎంఈల ఉత్పత్తి వ్యయంలో 15-30 శాతం విద్యుత్ ఛార్జీలకే ఖర్చయిపోతోంది. కాబట్టి, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలి. మన ఎంఎస్‌ఎంఈలకు కొత్త టెక్నాలజీలను సబ్సిడీ ధరలకు అందించి, ఉమ్మడి వసతులను విస్తరిస్తే- ఉత్పత్తి పరిమాణం, నాణ్యతలో 15శాతం వరకు వృద్ధి సాధించవచ్చు. మరిన్ని సంస్థలు ఎగుమతి మార్కెట్‌లో ప్రవేశించేలా ప్రత్యేక రాయితీలూ సౌకర్యాలూ అవసరం. ప్రభుత్వ ఆర్డర్లలో 25శాతాన్ని ఎంఎస్‌ఎంఈలకు కేటాయిస్తున్నప్పటికీ... కఠినమైన టెండర్ నిబంధనలు, అధిక టర్నోవర్ ఉండాలనడం, చెల్లింపుల్లో జాప్యం వీటిని వెనక్కి లాగుతున్నాయి. స్వీయ ధ్రువీకరణ, డిజిటల్ తనిఖీల ద్వారా ఈ అడ్డంకులను తొలగించాలి. సంపన్న దేశాల్లో ఎంఎస్‌ఎంఈలకు రవాణా ఖర్చులు 8-10శాతమే అవుతుంటే, మన దగ్గర 13-14శాతం వరకు వెచ్చించాల్సి వస్తోంది. కాబట్టి వాటికి రవాణా సబ్సిడీలు, ఉమ్మడి గిడ్డంగులు, మెరుగైన అనుసంధానత కల్పించాలి. చిన్న పరిశ్రమలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రీఫండ్‌లను వీలైనంత త్వరగా అందించడంతో పాటు జీఎస్టీ రిటర్న్‌లను సరళీకృతం చేసి, చట్టపరమైన నిబంధనల విషయంలో వెసులుబాటు కల్పించడం చాలా అవసరం.

ధరల స్థిరీకరణ... బీమా రక్షణ


సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ముడిసరకుల కోసం కొద్ది మొత్తాల్లో ఆర్డరు పెట్టడం వల్ల బేరమాడే సత్తా ఉండదు. దాంతో ధరల్లో వచ్చే తేడాలు వాటి ఉత్పత్తి, మార్కెటింగ్ ప్రణాళికలను దెబ్బతీస్తాయి. ఉక్కు, రసాయనాలు, ప్లాస్టిక్‌ల తయారీలో నిమగ్నమైన ఎంఎస్‌ఎంఈలకు ఇది చాలా పెద్ద సమస్య. సరసమైన ధరలకే వాటిని అందించేలా ముడి పదార్థాల నిధులను ఏర్పాటు చేయాలి. ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాలు, వరదలు వంటి విపత్తులు, సైబర్ దాడులు, సరఫరా గొలుసుల విచ్ఛిన్నం నుంచి ఎంఎస్‌ఎంఈలను ఆదుకోవడానికి రుణ అనుసంధానిత బీమా సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, ప్రీమియం చెల్లింపులో సబ్సిడీ కూడా ఇవ్వాలి. తొలితరం ఎంఎస్‌ఎంఈ వ్యవస్థాపకులకూ, మహిళా వ్యవస్థాపకులకూ ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. కర్బన ఉద్గారాలను పరిహరించే హరిత సాంకేతికతలను అందించి, వ్యర్థాల శుద్ధికి తోడ్పడాలి. ఇంధనాన్నీ విద్యుత్తునూ పొదుపుగా వాడుకునే యంత్రాలను సమకూర్చాలి. తద్వారా మన ఎంఎస్‌ఎంఈలను నవీన యుగానికి సంసిద్ధం చేయాలి.



పీవీ రావు
ఆర్థిక, సామాజిక విశ్లేషకులు

మొత్తం ఎన్ని కుందేళ్లు?

నాలుగు కుందేళ్లు ఒకేసారి పొదలో నుంచి బయటికి వచ్చాయి. బద్ధకస్తురాలైన ఓ కోతి వాటిని చూసి.. 'ఆహారం కోసం వెళ్తున్నట్టున్నారు. నిన్న తెచ్చిన క్యారెట్లు లేవా?' అంది. 'ఉన్నాయి.. అయినా అది నీకెందుకు?' అందో కుందేలు. 'నేను వాటికి కాపలా ఉంటాను. వచ్చేటప్పుడు నాకూ కాస్త ఆహారం తీసుకురండి' అంది కోతి. దాని బద్ధకం తెలిసిన కుందేళ్లు.. 'మా పొదలకు కాపలా అవసరం లేదు' అన్నాయి. 'అవునా..! మీరు లేనప్పుడు పొదల్లోకి దూరి మొత్తం ఆహారం తీసుకుంటే అప్పుడు మీ తిక్క కుదిరేది' అంది కోతి. 'అది నీ వల్ల కాదులే' అంది మరో కుందేలు. 'ఎందుకు కాదు! పొదలో ఎంతమంది ఉన్నారేంటి?' వెటకారంగా అడిగింది కోతి. 'దాచుకున్న ఆహారానికి నాలుగు మూలల్లో నలుగురుంటారు. ప్రతిమూలలో ఉన్న కుందేలు ముందు మూడేసి కుందేళ్లు ఉంటాయి' వివరంగా చెప్పింది ఇంకో



కుందేలు. అయితే లోపల ఎక్కువ మందే ఉన్నారన్నమాట' అంటూ లెక్కించడం మొదలుపెట్టింది కోతి. అప్పుడు.. 'ఆ లెక్కేదో మాతో నడుస్తూ ఆలోచించు. సరైన సమాధానం చెబితే మేమే నీకు రోజూ ఆహారం తెచ్చిస్తాం. చెప్పకపోతే నువ్వు మా పొద జోలికి రాకూడదు' అన్నాయి కుందేళ్లు. సరేనంటూ బయలుదేరింది కోతి. దారిలో ఒక్కోసారి ఒక్కో సంఖ్య చెబుతోందది. కానీ కాదంటున్నాయి కుందేళ్లు. 'ఇక నీకు ఇదే చివరి అవకాశం' అన్నాయి. కాసేపు ఆలోచించి.. 'మొత్తం పదహారు కదా!' అంది కోతి. కాదన్నాయి కుందేళ్లు.. 'సరే అయితే మీరే చెప్పండి' నీరసంగా అడిగింది కోతి. 'నలుగురు!' చెప్పిందో కుందేలు. 'అలా ఎలా?' మళ్లీ అడిగింది కోతి. 'ఒక మూలనున్న కుందేలుకు మిగిలిన మూడు మూలల్లో ఉన్న కుందేళ్లు ముందు ఉన్నట్లే కదా!' వివరించింది ఒక కుందేలు. ఆ జవాబు విన్న కోతి.. 'నేను ఎలాగూ ఓడిపోయాను కదా! మాటిచ్చినట్లుగానే మీ పొద జోలికి రాను. ప్రతిరోజు నా ఆహారం నేనే సంపాదించుకుంటాను' అంది.

– బి.వి.పట్నాయక్

హాయ్! బుజ్జీ!!

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతోంది. ఓసారి ప్రయత్నించండి.

1. MANGOAT
2. SPOONION
3. WINDOWNER
4. RULERASER
5. SOAPPLE

జవాబు: 1.MANGO, GOAT 2.SPOON, ONION 3.WIN-DOW, OWNER 4.RULER, ERASER 5.SOAP, APPLE



TELEVISION Co.	TYPE	PRICE	OFFER PRICE
VISE	32 (80 CM) QLED Google TV	₹40,000	₹13,990
	32 (80 CM) QLED WEBOS TV	₹44,000	₹16,490
	43 (108 CM) 4K QLED TV	₹64,500	₹26,990
SANSUI	65 (164 CM) 4K QLED TV	₹71,990	₹51,990



మాటిచ్చాం.. నిలబెట్టుకుంటున్నాం

- పింఛను మొత్తం పెంచుతామన్న హామీ అమలు
- మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- రైతులకు గత ప్రభుత్వ బకాయిల చెల్లింపు
- ప్రభుత్వ విజయాలను వివరించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చలో వెల్లడి
- వైకాపా ఎమ్మెల్యేల తీరు.. హనుమంతుడి ముందు కుప్పిగంతులని విమర్శ



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ అరాచక, అసమర్థ, అవినీతి పాలన వల్ల ఎదురైన పెనుసవాళ్లు, ఇతర సమస్యలను సీఎం చంద్రబాబు పరిపాలన అనుభవంతో అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుని ముందు కెళుతున్నామని చెప్పారు. వికసిత్ భారత్‌లో భాగంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా గవర్నర్ ప్రసంగం సాగిందన్నారు. ఎంతో ఉన్నతమైన గవర్నర్ ప్రసంగానికి అడ్డంకులు సృష్టిస్తూ వైకాపా ఎమ్మెల్యేలు చేసిన రభస హనుమంతుడి ముందు కుప్పిగంతులు వేసినట్లుగా ఉందని విమర్శించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పవన్ కల్యాణ్ శాసనసభలో శుక్రవారం మాట్లాడారు. తన ప్రసంగంలో ప్రముఖ కవుల కవితలు, మాజీ ప్రధాని వాజ్‌పేయీ మాటల్ని ప్రస్తావించారు.

గవర్నర్ ప్రసంగం చాలా ప్రేరణ కలిగించింది. రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసింది. సీఎం చంద్రబాబు నాయకత్వం, ఆయన అనుభవంతో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దివ్యాంగుల పింఛనును రూ.3 వేల నుంచి రూ.6 వేలు చేశాం. మంచం మీద నుంచి లేవలేని దివ్యాంగులకు రూ.6 వేల నుంచి రూ.15 వేలకు పెంచాం. సామాజిక పింఛను రూ.3 వేల నుంచి రూ.4 వేలు చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా 63.25 లక్షల మందికి ప్రతి నెలా రూ.2,738 కోట్లు అందిస్తున్నాం. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్లు వారి తల్లుల ఖాతాల్లో జమ చేశాం. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం' అని చెప్పారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టినందుకు మంత్రి లోకేశ్‌కు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

> 'తొలకరి వర్షం తరువాత జలదానం చేసిన మేఘానికి భూమిలోని చిన్నారి గింజ మెడ బయటపెట్టి మొదటగా వచ్చిన రెండు ఆకుల్ని చేతులుగా జోడించి కృతజ్ఞతలు తెలియజేసింది' అని ఒక కవితలో చదివాను.
>
> ఆ చిన్నారి మొలకలా ఎన్డీయే ప్రభుత్వం అన్నం పెట్టే రైతాంగానికి కృతజ్ఞతతో అండగా నిలబడుతోంది.

అన్నం పెట్టే రైతుకు రూ.1,674 కోట్లు బకాయి పెట్టిన వైకాపా

'అందరికీ అన్నం పెట్టే రైతాంగాన్ని గత ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెట్టింది. రైతుల నుంచి కొన్న ధాన్యానికి రూ.1,674 కోట్లు చెల్లించకుండా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ బకాయిలన్నీ చెల్లించింది. గత ఏడాది 7.37 లక్షల మంది రైతుల నుంచి కొన్న ధాన్యానికి 24 గంటల్లోనే రూ.10,650 కోట్లు చెల్లించాం. మరో 53 వేల మందికి 48 గంటల్లో దాదాపు రూ.వెయ్యి కోట్లు చెల్లింపులు చేశాం' అని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. 'భూమిని ఫలాలుగా, పంటగా మార్చే ప్రావీణ్యం కలిగిన రైతులు ధైర్యం కోల్పోవాల్సిన అవసరం లేదు. మట్టిలో కస్తూరి తీసే మనిషికి జీవన పరిమళాల కొరత లేదు. మీ కోసం ఈ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది' అని హామీ ఇచ్చారు.


ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగించిన తర్వాత కరచాలనం చేసి అభినందిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్

ఉద్యోగుల ఆవేదన తెలిసే 10 వేల మందికి పదోన్నతులు

'ఉద్యోగుల ఆవేదన మాకు తెలుసు. అందుకే సీఎం చంద్రబాబు నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖలో 10 వేల మందికి ఏకకాలంలో పదోన్నతులు ఇచ్చాం. మరో 77 మందికి జిల్లా పరిషత్ సీఈవోలుగా ప్రమోషన్లు కల్పించాం. 77 డీడీవో కార్యాలయాలు ప్రారంభించాం. అంధ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక మొదలుకొని ఇటీవల పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువత, ఉదయగిరి నియోజకవర్గంలో పాఠశాల విద్యార్థుల వరకు గ్రామానికి, స్కూల్‌కి వెళ్లేందుకు రోడ్లు కావాలని అడిగారు. గర్భిణులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కొండలు, గుట్టలు దాటుకుని వెళుతున్న పరిస్థితుల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎం జన్‌మన్, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 'అడవితల్లి' బాట పేరుతో 625 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ రూ.1,005 కోట్లతో 1,069 కిలోమీటర్ల రహదారులు నిర్మిస్తున్నాం. 17 కుటుంబాలున్న మారుమూల గిరిజన గ్రామానికి రూ.కోటికి పైగా వెచ్చించి 9.6 కి.మీ. మేర విద్యుత్తు స్తంభాలు వేసి, కరెంటు ఇచ్చాం.

> 'ఎన్నాళ్లకు మా అతిథిగా వచ్చావు..
> ఈ శిథిల కుటీరానికి ఇంత వెలుతురు తెచ్చావు'

అనే గిరిజన ప్రజల భావన నాకు తెలిసింది అని పవన్ కవితాత్మకంగా చెప్పారు.

రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టినా గుక్కెడు నీళ్లివ్వలేకపోయారు

'జలజీవన్ మిషన్ కింద రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.27 వేల కోట్లు మంజూరు చేస్తే గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.4 వేల కోట్లే ఖర్చు చేసింది. అందులోనూ కేంద్రం వాటా రూ.2 వేల కోట్లు. ఈ నిధులతోనూ పైపులైన్లు వేయడం తప్ప గ్రామాలకు గుక్కెడు నీళ్లివ్వలేకపోయారు. ఈ ప్రభుత్వం వచ్చాక కేంద్ర సహకారంతో పథకం గడువు పెంచుకోగలిగాం. రూ.1,242 కోట్లతో ఉద్దానం, డోన్, పులివెందులలో తాగునీటి పథకాల పనులు మే నాటికి పూర్తి చేయనున్నాం. రూ.7,910 కోట్లతో చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాల్లో తాగునీటి పథకాలను వచ్చే రెండేళ్లలో పూర్తి చేయనున్నాం. వీటి ద్వారా వచ్చే 30 ఏళ్లలో 1.20 కోట్ల మంది ప్రజల రక్షిత మంచినీటి అవసరాలు తీరనున్నాయి. ఇంకో రూ.9,160 కోట్లతో మల్టీ విలేజ్ స్కీం అమలు చేయనున్నాం' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు.

రెవెన్యూ సమస్యలపై అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు

- పరిష్కారానికి స్పష్టమైన విధానం తీసుకురావాలి
- ప్రభుత్వానికి తెదేపా ఎమ్మెల్యేల వినతి

ఈనాడు, అమరావతి: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని తెదేపా ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై స్పష్టమైన విధానం తీసుకురాకపోతే.. ఏదో ఒక సమాధానమిచ్చి అధికారులు తప్పించుకోవచ్చని, ఫలితంగా రైతులు భూహక్కును కోల్పోయే ప్రమాదముందని చెప్పారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా పలువురు సభ్యులు దీనిపై మాట్లాడారు.

రైతుల భూముల్ని దేవాదాయశాఖ కింద చేర్చారు

– కందుల నారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే

మార్కాపురం నియోజకవర్గం తర్లుపాడు మండలంలో 860 అర్జీలు అందితే అన్నింటినీ పరిష్కరించామని అధికారులు సమాధానమిచ్చారు. గ్రామం పేరు 'పోతవరం' బదులుగా రెవెన్యూ రికార్డుల్లో 'పోతులపాడు'గా నమోదైనందున ఆ గ్రామంలోని భూములను దేవాదాయ శాఖ కింద చేర్చారు. ఆ ఊరిలో అప్పుల పాలైన ఓ రైతు.. తన పొలం అమ్ముకోలేక చివరకు ఆత్మహత్య చేసుకున్నారు. రెవెన్యూ శాఖ మాత్రం ఈ భూముల సమస్యను పరిష్కరించినట్లు చూపిస్తోంది.

వైకాపా నేతలతో అధికారుల కుమ్మక్కు

–ధూళిపాళ్ల నరేంద్ర, పొన్నూరు ఎమ్మెల్యే

కొంతమంది రెవెన్యూ అధికారులు అప్పట్లో వైకాపా నాయకులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారు. అనమర్లపూడి గ్రామంలో 1957 నుంచి ఎస్సీలకు చెందిన భూమిని పోలీసులతో బెదిరించి అప్పటి వైకాపా ఎమ్మెల్యే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. చేబ్రోలు మండలంలో 10 గ్రామాలు, పెదకాకాని మండలంలో 10, పొన్నూరు మండలంలో 120 కాలనీలు, పొన్నూరు పట్టణంలో 31 కాలనీలకు సంబంధించి 1978లో ఇచ్చిన ఇళ్ల పట్టాలను కూడా 22ఏ కింద పెట్టారు. 64 ఏళ్లుగా చేతులు మారుతున్న దేవాదాయశాఖకు చెందిన ఈనాం భూముల్ని నిషేధిత జాబితాలో పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలను పరిష్కరించాలి.

2.34 లక్షల అర్జీలొస్తే 99% పరిష్కరించారట!

-ఏలూరి సాంబశివరావు, పర్చూరు ఎమ్మెల్యే

రెవెన్యూ సదస్సుల్లో 2.34 లక్షల అర్జీలొస్తే, వాటిలో 99% పరిష్కరించినట్లు అధికారులు చూపడం దుర్మార్గం. వినతుల్ని పరిష్కరించడానికి స్పష్టమైన మార్గదర్శకాలు లేనందున అర్జీదారుతో మాట్లాడినా కూడా దాన్ని పరిష్కరించినట్లుగా చూపిస్తూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు.

కలెక్టర్లూ సరిగా స్పందించడం లేదు

–అయ్యన్నపాత్రుడు, స్పీకర్

అన్ని నియోజకవర్గాల్లోనూ రెవెన్యూ సమస్యలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయి. వీటిపై కలెక్టర్లు కూడా సరిగా స్పందించడం లేదు. వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి నేతృత్వంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో సమావేశం నిర్వహించాలి. ఈ దిశగా రెవెన్యూ మంత్రి చొరవ తీసుకోవాలి.

3 బిల్లులకు ఆమోదం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖలకు సంబంధించిన మూడు బిల్లులను శాసనసభ శుక్రవారం ఆమోదించింది.

- నగరాలు, పట్టణాల్లో ఇళ్లు, భవన నిర్మాణాలకు అనుమతి తీసుకుని నిర్మాణం పూర్తి చేసేలోపు ఖాళీ స్థలానికి పన్ను (వీఏఎల్‌టీ) మొత్తంలో 50% చెల్లించేలా సవరణ బిల్లును పురపాలక శాఖ ప్రవేశపెట్టింది. గత వైకాపా ప్రభుత్వంలోనే దీన్ని ప్రతిపాదించారు. నిర్మాణ సమయంలో ఖాళీ స్థలానికి ఇప్పటివరకు వీఏఎల్‌టీ లేదు.
- లెప్రసీ అనే పదం అభ్యంతరకరంగా ఉన్నందున చట్టంలో నుంచి దాన్ని తొలగించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన సవరణ బిల్లును పురపాలక శాఖ ప్రతిపాదించింది.
- పరిశ్రమలు, వాణిజ్య భవనాలకు విద్యుత్తు సుంకం యూనిట్‌కు ఆరు పైసల నుంచి రూపాయికి పెంపు ప్రతిపాదనను గత వైకాపా ప్రభుత్వంలో పెట్టారు. సభలో ప్రవేశపెట్టేందుకు సాంకేతికంగా కొన్ని అభ్యంతరాలు వ్యక్తం కావడంతో వాటిని ఇప్పుడు సవరించారు.

20 నెలల్లో 5.72 లక్షల మందికి ఉద్యోగాలిచ్చాం

శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా రెండు ప్రశ్నల్ని రాతపూర్వకంగా అడిగిన వైకాపా సభ్యులు.. శుక్రవారం సభకు మాత్రం డుమ్మా కొట్టారు. దీంతో సభ నిబంధనల ప్రకారం వీటికి సమాధానం ఇచ్చినట్లేనని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఈ ప్రశ్నలకు ప్రభుత్వమిచ్చిన సమాధానంలో 'గిరిజన ప్రాంతాల్లో కామెర్లు, వైరల్ జ్వరాల కారణంగా విద్యార్థుల మరణాలు సంభవించలేదు. హృదయ స్పందన ఆగిపోవడం, ప్రమాదవశాత్తు చెరువుల్లో మునిగిపోవడం తదితర కారణాలతో చనిపోయారు' అని సమాధానమిచ్చింది. మరో ప్రశ్నకు 'కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 20 నెలల్లో 5.72 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించాం. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం' అని తెలిపింది.

జగన్ ఫొటోకు దండం పెట్టుకుంటా

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అసెంబ్లీ లాబీలో శుక్రవారం పలువురు వైకాపా ఎమ్మెల్సీలతో సరదాగా మాట్లాడుతూ.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను ఉదయం నిద్రలేవగానే జగన్ ఫొటోకు దండం పెట్టుకుంటా. ఇదే మాట ఇంతకుముందు నా ఇంటర్వ్యూలో చెప్పా. ఎందుకంటే పిలిచి పిల్లనిచ్చినట్లు జగన్ నన్ను పిలిచి ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారు. దాంతో అప్పట్లో కూరుకుపోయిన నాకు, కోలుకునే అవకాశమిచ్చారు' అని నవ్వుతూ చెప్పారు. ప్రస్తుతం వెంకటరమణ జనసేనలో ఉన్నారు. రాజకీయాల్లో తాను శకునిలాంటివాడినని ఆయన అనగా.. అక్కడున్న ఎమ్మెల్సీలు స్పందిస్తూ.. 'వైకాపా నుంచి జనసేనలోకి వెళ్లిన మీరు అక్కడ శకునిలా పనిచేస్తున్నారా' అని సరదాగా వ్యాఖ్యానించారు. '2014లో తెదేపా టికెట్ నాకు ఇచ్చి ఉంటే అప్పుడే మంత్రిని అయ్యేవాడిని. ఎందుకంటే అప్పుడు మంత్రయిన కొల్లు రవీంద్ర కంటే నేను సీనియర్‌ని. కానీ, నేను గెలిచే కైకలూరు సీటును కామినేని శ్రీనివాస్‌కు ఇప్పించారు' అని వెంకటరమణ తెలిపారు.

అంబటికి కుటుంబసభ్యులే బుద్ధి చెప్పాల్సింది

"అరాచకాలు, అఘాయిత్యాలు, విధ్వంసాలతో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసే క్రిమినల్ అంబటి రాంబాబు. గతంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గురించి అంబటి అనుచితంగా మాట్లాడిన రోజే ఆయన కుటుంబ సభ్యులు చెప్పుతో కొట్టి....మహిళల్ని కించపరచొద్దని మందలిస్తే ఇప్పుడీ పరిస్థితి వచ్చేది కాదు. జైలుకు వెళ్లినా అంబటి బుద్ధి మారలేదు."

– పంచుమర్తి అనురాధ, శాసనమండలి చీఫ్‌విప్

కమిటీ నివేదిక వచ్చే వరకూ.. శ్రీధర్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వనన్న పవన్

"అరవ శ్రీధర్ వ్యవహారంలో నిజనిర్ధారణకు పార్టీ అంతర్గత కమిటీ వేసింది. ఆ కమిటీ నివేదిక వచ్చాక పవన్‌కల్యాణ్ ఓ నిర్ణయం తీసుకుంటారు. అందుకే శ్రీధర్ కలుస్తానన్నా పవన్‌కల్యాణ్ అంగీకరించలేదు. ఇది పూర్తిగా శ్రీధర్ వ్యక్తిగత విషయం. దీంతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదు. వైకాపా ప్రభుత్వంలో ఓ దళితుడిని చంపి డోర్ డెలివరీ చేస్తే ఆ నేత మీద చర్యలు తీసుకోలేదు."

– బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే

వైకాపా ఎమ్మెల్యేల్ని నిలదీయండి

"జగన్ సభకు రారు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలనూ రానివ్వరు. అసెంబ్లీకి వెళ్లి మా సమస్యల్ని ఎందుకు ప్రస్తావించడం లేదని వారిని గెలిపించిన ఆయా నియోజకవర్గ ప్రజలు నిలదీయాలి. సభకు రాకుండా వాళ్లు జీతభత్యాలు తీసుకుంటున్నారు"

– వంశీకృష్ణయాదవ్, విశాఖ(దక్షిణ) ఎమ్మెల్యే

సాక్షి పత్రిక మీద ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశా

"గవర్నర్ ప్రసంగం రోజు వైకాపా ఎమ్మెల్యేల తీరును ప్రశ్నించాననే అక్కసుతో సాక్షి పత్రికలో నా మీద అసత్య కథనాలు రాయిస్తున్నారు. చట్టాలు ఉల్లంఘించిన కారణంగా ప్రభుత్వం డీ పట్టా భూముల్ని స్వాధీనం చేసుకుంది. దాంతో ఎమ్మెల్యేకి ఏంటి సంబంధం? వైకాపా వాళ్ల అరాచకాల్ని ప్రశ్నిస్తే తప్పుడు వార్తలతో బెదిరింపులకు దిగుతారా?"

– సుందరపు విజయ్‌కుమార్, యలమంచిలి ఎమ్మెల్యే

వైకాపా పెట్టిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4,064 కోట్లు!

శాసన మండలిలో మంత్రి నారా లోకేశ్ వెల్లడి



ఈనాడు, అమరావతి: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు..ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై శాసనమండలిలో వాడివేడి చర్చ జరిగింది. ఒకదశలో అధికార, విపక్ష సభ్యులు సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకున్నారు. శుక్రవారం ఉదయం సభ ప్రారంభమైన వెంటనే మండలి ఛైర్మన్ మోషేను రాజు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ శాసనమండలిలో పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వానికి నాడు-నేడుపై చిత్తశుద్ధి లేదని..వారు అప్పట్లో పెట్టిన రూ.500 కోట్ల పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లించాల్సి వచ్చిందని విమర్శించారు. వైకాపా ప్రభుత్వం బాగా పని చేస్తే అభ్యసన సామర్థ్యాలు ఎందుకు పడిపోయాయో చెప్పాలని నిలదీశారు. 'మనబడి-మన భవిష్యత్తు' పథకం కింద ఖర్చు చేసిన నిధుల వివరాలపై వైకాపా ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. 'ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.7,500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రతి పాఠశాలకు 18 అంశాల ఆధారంగా స్టార్ రేటింగ్ ఇచ్చాం. సుమారు 40 శాతం పాఠశాలలకు 2 స్టార్ కంటే రేటింగ్ తక్కువగా వచ్చాయి. వాటి రేటింగ్ ఎలా మెరుగు పరచాలనే లక్ష్యంతో ఉన్నాం' అని చెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై.. వైకాపా చర్చకు రావాలి: మంత్రి లోకేశ్

వైకాపా హయాంలో రూ.4,064 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని.. దీనిపై చర్చించేందుకు సిద్ధమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఆరోపణలు చేసి పారిపోవడం.. వాకౌట్ చేయడం వైకాపాకు ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు. 'బకాయిల వివరాలు సభ ముందు ఉంచేందుకు నేను సిద్ధం. చర్చకు వైకాపా సభ్యులు రావాలి. మూడు నెలలకు ఒకసారి చెల్లించినట్లు ఎలా అబద్ధాలు చెబుతారు? ఇంటర్ విద్యపై మేం దృష్టి పెట్టడంతోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 70 వేల మంది విద్యార్థులు పెరిగారు. వైకాపా ఐదేళ్ల వ్యవధిలో విద్యార్థులకు కనీసం పుస్తకాలు ఇవ్వలేదు. మధ్యాహ్న భోజన పథకాన్నీ రద్దు చేసింది. మేం వచ్చాక దాన్ని పునరుద్ధరించాం' అని లోకేశ్ స్పష్టం చేశారు.

మా హయాంలో రెండు త్రైమాసికాల బకాయిలే: బొత్స, మండలిలో విపక్ష నేత



'వైకాపా ప్రభుత్వంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు రెండు త్రైమాసికాలకు మాత్రమే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను భారీగా పెండింగ్ పెట్టింది. వాటిని ఎప్పటిలోగా చెల్లిస్తారనేది వెల్లడించాలి. వైకాపా ప్రభుత్వం రూ.4 వేల కోట్లు బకాయిలు పెట్టిందనేది వాస్తవం కాదు. గత రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ని జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారు? రాష్ట్రంలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టింది. ఇందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నాం. వాకౌట్ చేయడం మాకు ఫ్యాషన్ కాదు' అని వైకాపా పక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

తల్లిని అవమానిస్తే.. చిన్న విషయమా?

- మాజీ సీఎం అలా సమర్థించడమేంటి?
- అంబటి దూషణలపై మండలిలో చర్చ

ముఖ్యమంత్రి చంద్రబాబు తల్లినుద్దేశించి మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు దూషించిన వ్యవహారం శాసనమండలిలో ప్రకంపనలు సృష్టించింది. మహిళలను అవమానించేలా మాట్లాడడాన్ని బాధ్యత గల విపక్షంగా ఎలా సమర్థిస్తారంటూ కూటమి ఎమ్మెల్సీలు నిలదీశారు. మహిళలను ఎవరు కించపరచినా ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. 'రాంబాబు ఆవేశంలో మాట్లాడారు, తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పారంటూ విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడటం భావ్యం కాదని హితవు పలికారు. ఈ అంశంపై బొత్స, మంత్రి లోకేశ్ మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం శాసనమండలిలో జరిగిన చర్చలో వైకాపా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. దీన్ని కూటమి ఎమ్మెల్సీలు ఖండించారు.

సీఎం తల్లిని అవమానిస్తే.. వదిలేస్తామా?: లోకేశ్

'సీఎం తల్లిని అవమానించేలా అంబటి రాంబాబు మాట్లాడారు. అలాంటి వారిని వదలిపెడ్తామా' అని మంత్రి లోకేశ్ ప్రశ్నించారు. 'తల్లిని, చెల్లిని గౌరవించడం మీకెలాగూ చేతకాదు. తల్లుల జోలికి వెళ్తే మేం ఎవరినీ వదలిపెట్టం. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇదే చెప్పారు. రాంబాబు వాడిన పదాలను గమనించాలి. వైఎస్ భారతీరెడ్డిని ఇబ్బంది పెట్టేలా మా పార్టీ కార్యకర్త మాట్లాడితే.. వైకాపా వాళ్ల కంటే ముందే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకుంది. అతన్ని జైలుకి పంపాం. రాంబాబుపై మేం కక్ష సాధింపులకు పాల్పడుతున్నామన్నది వాస్తవం కాదు' అని లోకేశ్ స్పష్టంచేశారు. అంబటి లాంటి వ్యక్తి గురించి పెద్దల సభలో ఇంతగా చర్చించాలా? అతన్ని వెనకేసుకొచ్చేలా మాట్లాడటంపై వైకాపా సభ్యులు ఆలోచించాలి' అని హోంమంత్రి అనిత హితవు పలికారు.

ముత్యాలమ్మపాలెంలో హార్బర్ నిర్మాణానికి సీఐసీఈఎఫ్ గ్రీన్ సిగ్నల్: మంత్రి అచ్చెన్నాయుడు



ఈనాడు, అమరావతి: హార్బర్ నిర్మాణానికి పెందుర్తి నియోజకవర్గం ముత్యాలమ్మపాలెం అనువైనదిగా పేర్కొంటూ బెంగళూరుకు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజినీరింగ్ ఫర్ ఫిషరీస్(సీఐసీఈఎఫ్) నివేదిక అందించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సాగర్‌మాల కింద దీన్ని చేపట్టి వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, పల్లా శ్రీనివాసరావు, సుందరపు విజయ్‌కుమార్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 'వైకాపా ప్రభుత్వంలో బుడగట్లపాలెం, పూడిమడక, వాడరేవు, కొత్తపట్నంలో కొత్తగా ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటుకుగాను.. కమీషన్ల కోసం నిర్మాణానికి అవసరమైన వ్యయం కంటే మూడింతలు ఎక్కువకు గుత్తేదారులకు కట్టబెట్టారు. ఇప్పుడు వీటన్నింటినీ కూటమి ప్రభుత్వం చక్కదిద్దింది. రెండు, మూడు రోజుల్లో కొత్తగా టెండర్లు పిలిచి శంకుస్థాపన చేసి పనులు చేపడతాం. విశాఖ పోర్టు అథారిటీ సహకారంతో అక్కడి హార్బర్‌ను రూ.170 కోట్లతో అధునాతన హార్బర్‌గా మారుస్తున్నాం. కాకినాడ ఫిషింగ్ హార్బర్‌ను కూడా ఇదే తరహాలో ఆధునికీకరిస్తాం. గుజరాత్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రతి 10-15 కి.మీలకు ఫిషింగ్ హార్బర్ లేదా జెట్టీ లేదా ఫిషింగ్ ల్యాండ్ సెంటర్ లేదా పోర్టు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తీరం వెంట సుదీర్ఘంగా ప్రయాణించినా ఇలాంటివి లేకపోవడంతో కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిసారించింది' అని వెల్లడించారు.

మద్యం కుంభకోణంలో కింగ్ ఎవరో తేల్చాలి

తెదేపా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణంలో కింగ్‌పిన్ రాజ్ కెసిరెడ్డి వెనకున్న కింగ్ ఎవరో తేల్చాలని తెదేపా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. అప్పట్లో మద్యం తయారీ కంపెనీల నుంచి లిక్కర్ కేస్‌పై రూ.250, బీరు, తదితర వాటిపై రూ.150 చొప్పున కమీషన్ వసూలు చేశారని ఆరోపించారు. ఈ కుంభకోణంలో కీలక నిందితుడు రాజ్ కెసిరెడ్డికి 300 రోజులైనా బెయిల్ ఇవ్వబోమని సాక్షాత్తూ సుప్రీంకోర్టే వ్యాఖ్యానించిందంటే ఇది ఎంతటి తీవ్రమైన నేరమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా కల్తీ మద్యానికి సంబంధించిన ప్రశ్నపై ఆయన మాట్లాడారు.

26,486 వాహనాల్ని సీజ్ చేశాం: మంత్రి కొల్లు రవీంద్ర

వైకాపా హయాంలో జగన్.. మద్యాన్ని ఆదాయవనరుగా మార్చుకున్నారని, నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతీశారని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'సిట్ విచారణలో నాటి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలలో వైకాపా నాయకులే కల్తీ మద్యాన్ని విక్రయించి దాన్ని కూటమి ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేశారు. మద్యం అక్రమ రవాణాకు సంబంధించి 2019-26 (జనవరి) వరకు 26,486 వాహనాల్ని సీజ్ చేశాం. కోర్టు ఆదేశాలతో 4,358 వాహనాల్ని విడుదల చేశాం. 18,047 వాహనాల్ని వేలం వేశాం. ఇంకా 4,441 వాహనాలున్నాయి. మద్యం అక్రమ రవాణాలో వీటి యజమానులు భాగస్వాములు కాదని తేలితే నిబంధనలకు అనుగుణంగా వాటిని విడుదల చేస్తాం' అని వివరించారు.

సరకుల నాణ్యత నిర్ధారణకు.. తిరుమలలో రాష్ట్రస్థాయి ల్యాబ్ : సత్యకుమార్



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో సరకుల నాణ్యత పరీక్షలను పక్కాగా చేసేలా తిరుమలకు రాష్ట్రస్థాయి ల్యాబ్‌ను కేంద్రం మంజూరు చేసిందని, వచ్చేనెలలో దాన్ని అందుబాటులోకి తెస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 'ఆహార పదార్థాల తనిఖీకి కేంద్రం రూ.100 కోట్లతో రాష్ట్రానికి 5 ప్రయోగశాలలు మంజూరు చేసింది. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో ల్యాబ్‌లు త్వరలో అందుబాటులోకి వస్తాయి. కర్నూలులో ల్యాబ్‌ను నోటిఫై చేయాల్సి ఉంది' అని చెప్పారు. ప్రశ్నోత్తరాల్లో సభ్యుడు పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 'సరిపడా సిబ్బంది లేక ఆహార పదార్థాల తనిఖీ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. కొత్తగా 150 మంది నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు' అని మంత్రి చెప్పారు. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రభుత్వానికి సూచన చేశారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగుల్లో ఫుడ్ టెక్నాలజీ కోర్సులు చదివిన వారు ఉన్నారని, వారితో ఆహార తనిఖీలు చేయించడంపై పరిశీలించాలని సూచించారు.

ఏప్రిల్ నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్: మంత్రి సవిత

చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు.. పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ పథకాన్ని వచ్చే ఏప్రిల్ నుంచి అమలు చేయబోతున్నామని మండలిలో చెప్పారు.

లిక్కర్ మాఫియాపై ఫిర్యాదుకు 8 నెలలైనా చర్యల్లేవ్

- పార్టీ గీత దాటను.. సమస్యలపై వాట్సప్ స్టేటస్‌లు ఆపను
- తెదేపా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



ఈనాడు, అమరావతి: 'ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ గీత దాటను. అలాగని తప్పు జరుగుతుంటే చూస్తూ ఊరుకోను. సమస్యలపై నా వాట్సప్ స్టేటస్‌లు ఆగవు' అని తిరువూరు తెదేపా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రకటించారు. 'నాకు ఎవరితోనూ విభేదాల్లేవు. పార్టీ సిద్ధాంతమే నా సిద్ధాంతం. మా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నాకు క్లాస్ పీకారనేది వాస్తవం కాదు. నా వాట్సప్ స్టేటస్‌లపై నన్నెవరూ అడగలేదు' అని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తాను ఎమ్మెల్యే కావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కూడా అండగా నిలిచారని తెలిపారు.

కూటమి ప్రభుత్వాన్ని తిట్టకూడదనే..

'నా నియోజకవర్గంలో లిక్కర్ మాఫియా, ఇసుక మాఫియా, బెల్ట్ దుకాణాలపై ఎనిమిది నెలలుగా పార్టీకి ఫిర్యాదు చేస్తూనే ఉన్నా. కానీ, ఫలితం లేదు. అందుకే వ్యక్తిగతంగా సమస్యలు ప్రస్తావిస్తున్నా. వైకాపా హయాంలో రహదారులు లేవు. అందువల్ల కూటమి అధికారంలోకి వచ్చాక మొదటి ఆరు నెలలూ వైకాపానే తిట్టారు. ఇప్పుడు కూడా గ్రామాల్లో రోడ్లు లేవు. నేను నియోజకవర్గంలో తిరుగుతున్నప్పుడు ప్రజలు చాలా సమస్యలు నా దృష్టికి తెస్తున్నారు. వైకాపా సర్కారును తిట్టినట్లే మమ్మల్ని కూడా తిట్టకూడదన్న ఆలోచనతోనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా. సీఎంను కలిసినప్పుడు వాటి గురించే చెప్పా. వాటిని నియోజకవర్గంలో చూసుకోవాలని సీఎం నాకు చెప్పారు' అని కొలికపూడి శ్రీనివాసరావు వివరించారు.



మహా శివరాత్రి పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. ఆదివారం శివాలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లలో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి విద్యుత్తు వెలుగులతో మెరిసిపోతున్న యనమలకుదురు రామలింగేశ్వరాలయం. - న్యూస్‌టుడే, యనమలకుదురు, - ఈనాడు, అమరావతి

వేయి మునుల కుదురు.. యనమలకుదురు..

కథనం..10లో

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్

నా కనులు నీవై.. నీ కలలు నావై..!

నేడు ప్రేమికుల దినోత్సవం

అకర్షణ ఒక్కటే ప్రేమ కాదు. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. పరస్పరం గౌరవించుకోవాలి. జీవితంలో స్థిరపడ్డాక పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే కలకాలం రెండు కుటుంబాలు ఆనందంగా ఉంటాయి. చీకటే ప్రపంచమైన రెండు జీవితాల్లో ప్రేమ వెలుగులు నింపితే.. శిక్షణ సమయంలో ఒకరినొకరు ఇష్టపడిన ఇద్దరు ఉన్నతోద్యోగులు పరిణితితో వ్యవహరించి తమ ప్రేమను గెలిపించుకున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ప్రేమలేఖ.. వెలుగురేఖ...

చీకటి మాత్రమే ప్రపంచమని అనుకున్న ఆ ఇద్దరి జీవితాల్లో 'ప్రేమ' వెలుగులు నింపింది. భౌతికంగా చూపు లేకపోయినా వారి మనసులు కలిశాయి. పరిచయం అనుబంధంగా.. అనుబంధం ప్రేమగా వికసించింది. ఆ ప్రేమే చివరికి వివాహబంధంగా మారింది. ప్రస్తుతం



ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులుగా సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. వీరులపాడు మండలం కొణతాలపల్లికి చెందిన **వీరంశెట్టి కృష్ణమూర్తి** జ్వరంతో చిన్నప్పుడే చూపు కోల్పోయారు. కొండపల్లి విద్యానగర్‌లో అప్పట్లో ఉన్న జీవన జ్యోతి అంధుల పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. అక్కడే తనతో పాటు గుడివాడ మండలం ఇందుపల్లికి చెందిన **వీరాబాయి** చదువుకున్నారు. నీటి కాసులతో ఆమె చిన్నప్పుడే చూపు కోల్పోయారు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు నరసారావుపేటలోని లూథరన్ అంధుల పాఠశాలలో ఇద్దరు కలిసి చదువుకున్నారు. అప్పటికే వీరిద్దరి మనసులు కలవడంతో 1997లో కులాంతర వివాహం చేసుకున్నారు. 2005లో ఆమెకు ఎస్జీటీగా ఉద్యోగం వచ్చింది. భర్త కృష్ణమూర్తి విజయవాడ తూనికలు, కొలతలశాఖలో సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. వారికి ఇద్దరు కొడుకులు. అరుణ్‌కుమార్ బీటెక్ చదువుతుండగా అరుణ్‌కిరణ్ విశాఖపట్నంలో ఏవియేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్నారు. చూపు లేకపోయినా మనసును అర్థం చేసుకుని జీవితంలో సంతోషంగా ముందుకు సాగుతున్నామని ఆ దంపతులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం, వీరులపాడు

పెద్దల అంగీకారంతో ఫలప్రదం...



శిక్షణ సమయంలో ప్రేమ చిగురించి పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు **అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యాశ్రీ, గురజాల డీఎస్పీ బి.జగదీష్** లు. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నాక జీవితంలో స్థిరపడ్డాక పెళ్లి గురించి ఆలోచించాలని వారు చెబుతున్నారు. తమ ప్రేమ ఎలా మొదలైందో న్యూస్‌టుడేతో పంచుకున్నారు. 'గ్రూప్-1లో ఇద్దరం డీఎస్పీ క్యాడర్‌కు ఎంపికయ్యాం. ఒంగోలులో శిక్షణ సమయంలో ఇద్దరివీ పక్కపక్క రోల్ నంబర్లు. అలా స్నేహితులమయ్యాం. ప్రపోజ్ చేసుకోవడం అనేది మా ప్రేమలో లేదు. రెండు సంవత్సరాలు స్నేహితులుగానే ఉన్నాం. తనంటే నాకిష్టమని.. నేనంటే తనకిష్టమని ఇద్దరికీ తెలుసు. పైకి వ్యక్తం చేయలేదు. శిక్షణ తర్వాత విధుల్లోకి చేరాక పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. వేర్వేరు కులాలు. వేర్వేరు ప్రాంతాలు మావి. ఇంట్లో అప్పటికే మేమిద్దరం బెస్ట్ ఫ్రెండ్స్ అని తెలుసు. దీంతో ఇద్దరిళ్లల్లో వెంటనే పెళ్లికి అంగీకరించారు. ప్రేమ పెళ్లి చేసుకున్న జంటలు చిన్నపాటి మనస్పర్థలకే విడిపోయి మావద్దకు వస్తుంటారు. కెరీర్‌లో స్థిరపడ్డాక రెండు సంవత్సరాలు జర్నీ చేయాలి. అర్థం చేసుకోవాలి. అప్పుడే పెళ్లి చేసుకోవాలి'.

- న్యూస్‌టుడే, అవనిగడ్డ

మేమింతే.. మారమంతే..!

- శిరస్త్రాణం ధరించని కేసులే అధికం
- చలానాలకూ వెరవని వాహనదారులు



రామలింగేశ్వర్‌నగర్‌కు చెందిన ఇద్దరు మైనర్లు.. ఇటీవల పార్టీ ఉందని తాడేపల్లి వెళ్లారు. అర్ధరాత్రి దాటాక.. 1.30 గంటలకు ఇంటికి బయలుదేరారు. అతివేగంతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. నేతాజీ వంతెన వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఒకరి తలకు బలమైన గాయాలవగా ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో చనిపోయాడు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. - **ఈనాడు, అమరావతి**



నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలు భారీగా పెరుగుతున్నాయి. ఎక్కువ మందిలో పౌరస్పృహ లేమే కారణం. ప్రాణాలు పోతాయ్.. హెల్మెట్ వాడమని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా స్పందన అంతంతే. శిరస్త్రాణం ఉన్నా బండిపైనే పెట్టి నడిపే వారే ఎక్కువ. ప్రధాన రోడ్లపై సీసీ కెమెరాల్లో ఉల్లంఘనలు నమోదవుతున్నాయి. ట్రాఫిక్ నియమావళి మీరే వారిపై జారీ చేసే చలానాల చెల్లింపులోనూ ఉదాసీనతే కనిపిస్తోంది. వీటిని కడుతున్న వారూ తక్కువ మందే ఉంటున్నారు.

తలకు గాయంతోనే...

నగరంలో రహదారి ప్రమాదాలు ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాల వల్లే జరుగుతున్నాయి. మృతుల్లో ఎక్కువ మంది తలకు గాయంతోనే మరణిస్తున్నారు.

2025లో ఇదండీ లెక్క...

- ట్రాఫిక్ ఉల్లంఘనల కేసులు: 2.95 లక్షలు
- హెల్మెట్ లేని కేసులు: 1.69 లక్షలు
- వాహన నెంబర్లు సరిలేనివి: 31,106
- మొబైల్ మాట్లాడుతూ నడిపేవి: 8,254,
- డ్రైవింగ్ లైసెన్సు లేనివి: 5,266
- ప్రమాదకర ప్రయాణాలు: 3,471

ఈ కేసులే అత్యధికం..

1. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం
2. ముగ్గురితో వెళ్లడం (ట్రిపుల్ రైడింగ్)
3. చరవాణిలో మాట్లాడుతూ చోదన
4. ఎర్ర సిగ్నల్ పడినా బండి పోనీయడం
5. నెంబర్ ప్లేట్ లేకపోవడం
6. కారుచోదకులు సీటు బెల్ట్ ధరించకపోవడం
7. రవాణా వాహనాల్లో పరిమితికి మించి ప్రజలను ఎక్కించడం...
8. స్పోర్ట్స్ బైకులతో రహదారులపై వంకర టింకరగా నడపడం....
9. మద్యం తాగి మెరుపు వేగంతో రోడ్లపై దూసుకెళ్లడం...
10. పార్కింగ్‌కు అనుమతి లేని చోట వాహనాలను ఆపడం....



గత రెండేళ్లుగా ఉల్లంఘన కేసుల వివరాలు..

సంవత్సరం	కేసులు	చెల్లించిన వారు	వసూలైన మొత్తం
2024	1,57,121	71,397	3,00,58,575
2025	2,95,906	1,88,904	9,03,80,480
2026(జనవరి)	24,815	10,937	55,89,047

చెల్లించేది కొందరే...

ఉల్లంఘనలను ప్రధాన కూడళ్లలోని కెమెరాల నుంచి పరిశీలించి చిత్రీకరిస్తున్నారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్నీ పరిశీలిస్తుంటారు. ఉల్లంఘిస్తున్న వారి వాహనం నెంబరు గుర్తించి, ఈ-చలానా రూపొందించి పంపిస్తున్నారు. నిరుడు నమోదైన కేసులకు రూ.17.58 కోట్లు జరిమానాగా విధిస్తే... చెల్లించింది కేవలం రూ.9.03 కోట్లు మాత్రమే.

మలుపు మాటేసి.. మరిస్తే కాటేసి..

ప్రమాదకర మలుపుల కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుంటే రహదారిపై కనీస భద్రతా చర్యలూ తీసుకోవడం లేదు. విజయవాడ నుంచి మైలవరం వెళ్లే రహదారిలో కొత్తూరు తాడేపల్లి దగ్గర ప్రమాదకరంగా మలుపు ఉన్నా కనీసం అక్కడ వేగ నియంత్రికలు కానీ, స్టాపర్లు కానీ లేవు. కొంచెం ముందుకెళ్తే వెలగలేరు దగ్గర సైతం ప్రమాదకరంగా రెండు మలుపులు ఉంటే విరిగిపడిపోయిన స్టాపర్లకు ఇలా కర్రలు అడ్డుపెట్టి నిలబెట్టారు.



వీటికి రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో వాహనచోదకులకు రాత్రివేళ ప్రమాదం పొంచి ఉంది. - **ఈనాడు, అమరావతి**

యువతలో చైతన్యం తెచ్చేలా డ్రగ్స్‌పై దండయాత్ర



యువతలో చైతన్యం తెచ్చే విధంగా డ్రగ్స్‌పై దండయాత్ర జరుగుతోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. శుక్రవారం గాంధీజీ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె పాల్గొని డ్రగ్స్ పై దండయాత్రకు మద్దతుగా హోంమంత్రి అనిత సంతకం చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ, సీపీ రాజశేఖరబాబు తదితరులు పాల్గొన్నారు. - **విద్యాధరపురం, న్యూస్‌టుడే**

కాలువలకు నీటి విడుదల పెంపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు సాగు నీటిని విడుదలను శుక్రవారం పెంపుదల చేశారు. గుంటూరు, బాపట్ల తదితర జిల్లాలకు వెళ్లే కృష్ణా పశ్చిమ(కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు నీటి విడుదలను పెంచారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల వైపు ప్రవహించే కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు మాత్రం యథావిధిగా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి మొత్తం 3,411 క్యూసెక్కులు విడుదల చేశారు. కేడబ్ల్యూ ప్రధాన కాలువకు 2,823, కేఈ ప్రధాన కాలువకు 502, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కులు విడుదల చేశారు.

అద్దె ఖాతాల వెనుక.. ఇంటి దొంగలు!

- నిందితులకు బ్యాంకు ఉద్యోగుల సహకారం
- తాజాగా ఇండియన్ బ్యాంకు ఉద్యోగి అరెస్టు

అక్రమ లావాదేవీలకు వాడే అద్దె ఖాతాలను తెరిపించడంలో పలువురు బ్యాంకు ఉద్యోగులు నిందితులకు సహకరిస్తున్నారు. ఇంటి దొంగల సహకారంతో వీరు ఎడాపెడా తెరుస్తున్నారు. మ్యూల్ ఎకౌంట్స్ వ్యవహారంలోనూ ఇండియన్ బ్యాంక్ ఉద్యోగి తుమ్మల శివదుర్గాప్రసాద్ (ఏ4) పాత్ర తేలడంతో పోలీసులు అరెస్టు చేశారు. గత నెలలో నమోదైన కేసులోనూ ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగి మౌలాలి పాత్ర తేలింది.

వాట్సాప్ చాట్స్ పరిశీలనతో... ఈ కేసులో అరెస్టయిన నిందితుడు రవికుమార్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తుండగా దుర్గాప్రసాద్ పాత్ర తేలింది. చాట్స్‌లో పలు బ్యాంకు ఖాతాల వివరాలు, లావాదేవీలు కనిపించాయి. వీటిని లోతుగా విచారించడంతో ఏ4 పాత్రపై స్పష్టత వచ్చింది. యనమలకుదురువాసి దుర్గాప్రసాద్.. ఇండియన్ బ్యాంకులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. నిర్మలా కాన్వెంట్ పక్కన శాఖలో పనిచేస్తున్నాడు. గతంలో పటమటలో పనిచేశాడు. కొత్త ఖాతాలు తెరిపించడం ఇతని విధి. నిందితుడు రవికుమార్.. ఖాతాలు తెరిచేందుకు బ్యాంకుకు వచ్చినప్పుడు పరిచయమయ్యాడు.

కమీషన్ల కక్కుర్తి.. కమీషన్ ప్రాతిపదికన ఖాతాలు తెరిపించేందుకు దుర్గాప్రసాద్ సమ్మతించాడు. అలా ఒప్పందం కుదరగానే. రవికుమార్ అమాయకులను గుర్తించి, దుర్గాప్రసాద్ పనిచేసే బ్యాంకు శాఖకు పంపేవాడు. వచ్చిన వారితో 3 కరెంట్.. 11 పొదుపు ఖాతాలను తెరిపించాడు. తొలిగా నిరుడు మేలో శ్రీనివాస బుక్స్ అండ్ స్టేషనరీ పేరుతో ఖాతా తెరిపించాడు. సొంతంగా పటమటలోని ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు శాఖలో కరెంట్ ఖాతా, ఎస్‌బీ ఫ్రూట్స్ పేరిట కరెంట్ ఖాతా తెరిచాడు. ఈఖాతాలో ఇటీవల విడతలుగా జమైన రూ.10 లక్షలను డ్రా చేసి.. రవికుమార్ (ఏ1)కు ఇచ్చాడు. రవికుమార్ అరెస్టువేళ పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.3.40 లక్షల్లో.. రూ.2 లక్షలు ఏ4 డ్రా చేసిచ్చినట్లు గుర్తించారు. ఉత్కర్ష్ బ్యాంకులో ఇతరులతోనూ నాలుగు ఖాతాలు తెరిపించాడు. మిగిలిన వాటిని తాను పని చేసే బ్యాంకులో తెరిచాడు.

ఉత్కర్ష్ బ్యాంకుకు నోటీసులు: ఇష్టారీతిన ఖాతాలు తెరిపించిన ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుకు సైబర్ పోలీసులు నోటీసులిచ్చారు. నిబంధనలు ఏంటి? ఏ ప్రాతిపదికన ఖాతాలు తెరిచారు? ఏ4 తెచ్చిన వారితో ఎందుకు తెరిచారో? వివరణ ఇవ్వాలని కోరారు. దుర్గాప్రసాద్‌ను పోలీసులు శనివారం న్యాయస్థానంలో హాజరుపరిచే వీలుంది. ఈకేసులో ఇప్పటికే అరెస్టయిన రవికుమార్, స్టీవెన్, బాజిలను కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ వేశారు.

ఎన్‌హెచ్-16కు నూతన సొబగులు

వసతుల కల్పనకు రూ.13 కోట్లు

ఎన్‌హెచ్-16 పరిధిలో ప్రజలను ఏళ్లుగా వేధిస్తున్న సమస్యల పరిష్కారం దిశగా ఎన్‌హెచ్ఏఐ అడుగులు వేస్తోంది. ప్రమాదాల నియంత్రణ.. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ రూ.13 కోట్లతో త్వరలో అభివృద్ధి పనులు చేపట్టనుంది. టెండర్ ప్రక్రియ ఈ నెలాఖరుకు కొలిక్కి రానుంది. - ఈనాడు, అమరావతి



రామవరప్పాడులో వానొస్తే చెరువులా జాతీయ రహదారి...

కృష్ణలంకలో రూ.3 కోట్లతో సబ్‌వే...

★ కృష్ణలంక నేతాజీ కూడలి మీదుగా రోజుకు లక్షన్నర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ★ హైదరాబాద్, గుంటూరు, చెన్నై వెళ్లే వాహనాలు... గుంటూరు నుంచి విజయవాడ, ఏలూరు, విశాఖ కోల్‌కతా వెళ్లే వాహనాలతో రద్దీగా ఉంటుంది. ★ ఈ కూడలి నుంచి ఆ రద్దీలోనే వందల మంది రోడ్డు దాటాల్సి ఉంటుంది. ★ పాదచారులు ఇక్కడ రోడ్డు దాటాలంటే కత్తిమీద సామే. ★ ఇక్కడ ప్రమాదాల నివారణకు రూ.3 కోట్లతో సబ్‌వే నిర్మించనున్నారు. ★ 2.5 మీటర్ల ఎత్తు, 5 మీటర్ల వెడల్పు, 50 మీటర్ల పొడవున చేపట్టనున్నారు. ఫిబ్రవరి 25న టెండర్లు ఖరారు చేసి.. మార్చిలో పనులు పట్టాలెక్కిస్తారు.

రూ.10 కోట్లతో 7 కిమీ డ్రెయిన్లు..

ఎన్‌హెచ్16పై రామవరప్పాడు- ఎనికేపాడు పరిధిలో డ్రెయిన్లు నిర్మించి 20 ఏళ్లు దాటింది. క్రమంగా నగరం పెరగడం, ఎన్‌హెచ్‌కి 20 అనుసంధాన రహదారులు ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లోని వ్యర్థ జలాలన్నీ ఈ డ్రెయిన్‌లో కలవడంతో సామర్థ్యం చాలక సమస్య తలెత్తుతోంది. వర్షం పడితే జాతీయ రహదారి జలమయమై డ్రెయిన్‌లా మారుతోంది. ప్రయాణికులు, స్థానికులు, దుకాణదారులకు నరకం చూపిస్తూ ప్రమాదాలకు కారణమవుతోంది.

ఈ సమస్య పరిష్కారానికి...

సీఆర్‌డీఏ రూ.10 కోట్లు కేటాయించగా ఎన్‌హెచ్ అధికారులు నిర్మాణ బాధ్యతలు నిర్వహించనున్నారు. ఒక్కో వైపు 3.5 కిలోమీటర్ల చొప్పున రెండువైపులా 7 కిలోమీటర్ల డ్రెయిన్లు నిర్మిస్తారు. దీని టెండర్లు ఫిబ్రవరి 25న ఖరారు చేసి మార్చిలో పనులు మొదలు పెట్టనున్నారు.

బాధ్యత మరిచి.. బాధలకొదిలి..!

- ఎలుకల స్వైరవిహారం.. సెప్టిక్‌ట్యాంక్ నిండి దుర్వాసన
- బాలికలు వేడుకున్నా అధికారులు పెడచెవిన పెట్టడమే కారణం

ఈనాడు, అమరావతి
న్యూస్‌టుడే, ఎ.కొండూరు

ఎ.కొండూరు.. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బాలికల డార్మెటరీలో విద్యార్థినులపై ఎలుకలు దాడిచేసి కొరికిన ఘటనలో అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. చాలారోజులుగా ఎలుకల భయంతోపాటు భరించలేనంత దుర్వాసన వస్తోందని విద్యార్థినులు వాపోతున్నా.. విద్యాలయాల జిల్లా అధికారి, ప్రిన్సిపల్ పెడచెవిన పెట్టారు. దానివల్లే ఇప్పుడు 12 మంది బాలికలపై ఎలుకలు దాడిచేసి కొరికే పరిస్థితి వచ్చింది.

పాఠశాల భవనాలకు వెనక సెప్టిక్, మురుగునీటి ట్యాంక్‌ను 2024 నుంచి శుభ్రం చేయకుండా వదిలేసినట్టు తెలుస్తోంది. బాత్రూమ్‌లు, కిచెన్‌లో వాడే నీళ్లు, మరుగుదొడ్లు అన్నింటికీ ఉన్నది ఈ ఒక్క ట్యాంకే. ఇది పూర్తిగా నిండి.. దీనికి అనుసంధానించిన పైపులు పగిలి.. వాటిలో పిచ్చిమొక్కలు పెరిగి.. ట్యాంక్ నుంచి భరించలేనంత దుర్వాసన వస్తున్నా.. అధికారులు వదిలేయడం.. దారుణం.

ఈ విద్యాలయంలో 240 మంది విద్యార్థినులు చదువుతున్నారు. భవనాల కిటికీలకు మెష్‌లు, బాత్రూమ్‌లకు గడియలు లేవు. డార్మెటరీలోకి అడుగు పెడితే. దుర్వాసన. విద్యాలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. తమ స్కూల్ బ్యాగ్‌లు, ట్రంకు పెట్టెల వెనుకా నిత్యం ఎలుకలు తిరుగుతున్నాయని.. విద్యార్థినులు వాపోతున్నారు.

నిర్వహణ వ్యయం ఏమాయె... ఒక్కో కస్తూర్బాగాంధీ విద్యాలయానికి ఏటా రూ.2 లక్షలు నిర్వహణ వ్యయం ఇస్తారు. ఆ డబ్బులను ఏం చేస్తున్నారనేది ప్రశ్నార్థకం. కనీసం సెప్టిక్ ట్యాంక్‌నూ బాగుచేయలేదు. తాజా ఘటనతో జిల్లా యంత్రాంగం కదిలి.. ఎ.కొండూరులో విద్యాలయం వద్దకు శుక్రవారం చేరుకుంది. ఆర్డీవో మాధురి, అధికారులు ఇక్కడే ఉండి.. ప్రక్షాళన చర్యలు పర్యవేక్షించారు. పరిసరాలు, సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు.



గాయాలు పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి

2024లోనూ ఇలాగే.. 2024 సెప్టెంబరులోనూ ఇలాగే విద్యార్థులను ఎలుకలు కరిచాయి. జేసీ, ఆర్డీవో వచ్చి నాటి ప్రిన్సిపల్‌పై ఆగ్రహించారు. కిటికీలకు మెష్‌లు వేయాలని సూచించారు. తీరా చూస్తే నాసి.. ప్లాస్టిక్ మెష్‌లను కిటికీలకు వేయించారు. అవి ఏడాది కూడా తిరగకనే ఊడిపోయాయి.

సిబ్బందిపై చర్యలు.. తాజా ఘటనను కలెక్టర్ జి.లక్ష్మీశ తీవ్రంగా పరిగణించారు. బాధ్యులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ప్రిన్సిపల్, సిబ్బందికి షోకాజ్‌లు ఇచ్చారు. వైద్యబృందాన్ని పెట్టి.. విద్యార్థినులకు వ్యాక్సిన్లు వేయించారు. కిటికీలకు మెష్‌లు వేయాలని ఆదేశించారు.

ఏందిది.. సిగరెట్ లైటరా?!

- ★ తుపాకీ ఆకారంలో ఉన్న వస్తువుతో బెదిరింపు
- ★ ఆపై గ్యాస్ ఏజెన్సీలో నగదుతో ఉడాయింపు

ఈనాడు - అమరావతి: సిగరెట్లు వెలిగించుకునేందుకు ఉపయోగించే తుపాకీ ఆకారంలో ఉన్న లైటర్‌తో బెదిరించి కౌంటర్‌లో డబ్బులతో ఉడాయించినట్లు నిందితుడు దినేష్ వెల్లడించాడు. నగరంలోని రమ్యకృష్ణ గ్యాస్ ఏజెన్సీలో ఉద్యోగులను బెదిరించి డబ్బులు అపహరించుకెళ్లిన కేసులో ప్రధాన నిందితుడైన దినేష్‌ను పోలీసులు రాజస్థాన్‌లో అరెస్టు చేశారు. ప్రత్యేక బృందం నిందితుడిని శుక్రవారం ఉదయం విజయవాడకు తరలించింది. 'తమకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వేతనాలు ఇవ్వకపోవడంతోపాటు విధుల నుంచి తొలగించారు. ఈ కక్షతో ఏజెన్సీకి వచ్చి డబ్బులు తీసుకుని మా రాష్ట్రానికి వెళ్లిపోయినట్లు' దినేష్ విచారణలో చెప్పాడు.

ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద ద్విచక్ర వాహనం... మిగిలిన ఇద్దరు నిందితులు భజరంగి, ధీరజ్‌లు వారి ఊళ్లలోనే ఉన్నారని విచారణలో వెల్లడించాడు. నిందితుడి నుంచి రూ.40 వేలు, బొమ్మ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన డబ్బు ధీరజ్, భజరంగి వద్ద ఉందని చెప్పాడు. ఆపై సీఎంఎం కోర్టులో న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా.. రిమాండ్ విధించారు. నేరం అనంతరం ముగ్గురు నిందితులు ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. దీనిని ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద నిలిపి.. అక్కడే రైలు ఎక్కినట్లు తేలింది. ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు ఖమ్మం వెళ్లనున్నట్లు తెలిసింది. రాజస్థాన్‌లో మిగిలిన ఇద్దరు నిందితులను కూడా త్వరలో అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందం వెళ్లనుంది.

18న ప్రత్యేక ఉద్యోగ మేళా

కరెన్సీనగర్: ఈ నెల 18న రూరల్ ఇంక్యుబేషన్ స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్ సెంటర్ (రైజ్) ద్వారా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్‌రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ వికాస, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడానికి విజయవాడ గుణదల సెంటర్‌లోని 'ఏరో స్కిల్జ్' కంపెనీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి.. అంతకంటే తక్కువ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన 18-40 ఏళ్ల వారు అర్హులని తెలిపారు. ఏడాదికి రూ.2,80,000 నుంచి రూ.8,00,000 వేతనం, ఇతర సౌకర్యాలు ఉంటాయని, వివరాలకు 90636-61107, 99857-59304 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జగన్‌రెడ్డి కొత్త డ్రామాలు: ఎంపీ చిన్ని


క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తున్న ఎంపీ శివనాథ్, విప్ సౌమ్య

నందిగామ: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు మాజీ సీఎం జగన్ కొత్త డ్రామాలు ప్రారంభించారని ఎంపీ కేశినేని శివనాథ్ విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఆర్థిక వర్గి సహకారంతో దాబిషెట్టి స్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన కేశినేని క్రికెట్ అకాడమీని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ.. 'అంబటి రాంబాబు లాంటి వారితో జగన్ రెచ్చగొట్టి విద్వేషాలు రెచ్చగొట్టాలని గొడవలు సృష్టిస్తున్నారు. ఆరే విధంగా వ్యవహరిస్తే జగన్‌రెడ్డి పులివెందులలోనూ గెలవరు. సత్యసాయిబాబా శతజయంతోత్సవాల్లో సీఎం చంద్రబాబును వైకాపా నేత రాంబాబు దూషించారు. ఇటీవల జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు తనను దూషించిన తరే ఆవేశ పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఏసీఏ ఆధ్వర్యంలో 88 నియోజకవర్గాల్లో టాలెంట్ సెర్చ్ కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నాం. ఏప్రిల్ నెల మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభించనున్నాం. ఏసీఏ ద్వారా ఎన్టీఆర్ జిల్లా మూలపాడు క్రికెట్ స్టేడియంలో ఒక అకాడమీ ప్రారంభించబోతున్నాం. ఈనాటి ఏపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు విజయవాడ, మంగళగిరి, కడప, అనంతపురం, విశాఖపట్నం, కాకినాడ స్టేడియాలను సిద్ధం చేస్తున్నాం' అని తెలిపారు. ప్రభుత్వ విప్ సౌమ్య, మున్సిపల్ ఛైర్మన్ మండవ కృష్ణకుమారి, యార్డు ఛైర్మన్ కొగంటి బాబు, కోచ్ క్రికెట్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

బ్రాయిలర్ ధరలు (కేజీ రూ.లలో)

విజయవాడ: బ్రాయిలర్ ఫాం లిఫ్టింగ్ ధర -130 లెక్కర్ ధర 147 బర్డ్ విత్ స్కిన్ -213 విత్ అవుట్ స్కిన్ - 243. అమలాపురం ఫార్మ్ వర్కర్స్ & ఫ్రెష్ ఫీల్డ్ - ... - 138, 142, 153 విత్ అవుట్ స్కిన్ - 250 ...

వంకాయలు-20/16, టమాటా-13, బెండ-26, పచ్చిమిర్చి-36, కాకర-32, బీర-26/28, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజీ-14, క్యారెట్-26, దొండ-42, బంగాళాదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుడు-26, దోస-16/26, సొర-12/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-32, ముల్లంగి-10/8, కంద-36, బీట్‌రూట్-23, కీరదోస-44, బీన్స్-52/56, క్యాప్సికం-60, చింతకాయలు-65, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, మునక్కాయ-8, (నిన్న ధర). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు(కేజీ రూ.ల్లో) వర్తిస్తాయి.

- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

రాష్ట్ర పన్నుల శాఖలో ఇంటి దొంగలు

** ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయ యజమానులకు, సిబ్బందికి బెదిరింపులు

** కేసు నమోదు చేసిన గవర్నర్‌పేట పోలీసులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

రాష్ట్ర పన్నుల శాఖలో ఇద్దరు కింది స్థాయి ఉద్యోగులుగా పనిచేశారు. అధికారుల పేరుతో ఒకసారి పట్టుబడి సస్పెండ్ అయ్యారు. అయినా తాము పన్నుల శాఖ ఉద్యోగులమే అంటూ తిరిగారు. ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల తనిఖీలు చేసి వెళ్లి యజమానులను, సిబ్బందిని బెదిరించారు. డబ్బులు ఇవ్వకపోతే దాడులు చేయిస్తామని, కేసులు పెట్టి పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తామని బెదిరించారు. వీరిపై వరుస ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర పన్నుల శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. వారి దురాగతాలు ఒక్కొక్కటిగా బయటకు రావడంతో వాణిజ్య పన్నుల శాఖ సహాయ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సోమరౌతు బాల వాలేశ్వరరావు గవర్నర్‌పేట పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు.

వన్‌టౌన్ పల్లి వీధికి చెందిన కొండపల్లి శ్రీనివాసరావు రాష్ట్ర పన్నుల శాఖలో అటెండర్‌గా.. అరండల్‌పేటకు చెందిన మాకాల ప్రసాద్ డ్రైవర్‌గా పనిచేశారు. విధుల్లో ఉన్న రోజుల్లో వీరు పెద్దయెత్తున అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఒకసారి లంచం తీసుకున్న కేసులో సస్పెండ్ అయ్యారు. ఆ తరువాత వీరిద్దరూ తాము రాష్ట్ర పన్నుల శాఖలో పనిచేస్తున్నామని అందర్నీ నమ్మించారు. ఆ తరువాత హనుమాన్‌పేటలోని పలు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలలో తనిఖీలు పేరుతో వెళ్లి అక్కడి ఉద్యోగులను డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. వీరితో పాటు వెండి, బంగారు ఆభరణాల వర్తకులను సైతం డబ్బుల కోసం వేధించారు. హనుమాన్‌పేటలోని శ్రీమారుతి లారీ

ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ యజమాని ఎ.శ్రీనివాసరావును కూడా ఇదే తరహాలో బెదిరించారు. వీరిద్దరూ.. అధికారుల దాడుల సమాచారాన్ని ముందుగానే లీకేజీ చేసి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో నష్టం రావడంతో రాష్ట్ర పన్నుల శాఖ ఉన్నతాధికారులకు వీరిపై వరుస ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేపట్టిన అధికారులు వీరిద్దరూ ఉద్యోగుల మంటూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేల్చారు. దీంతో గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఫిర్యాదు చేయగా వారు మాకాల ప్రసాద్, కొండపల్లి శ్రీనివాసరావులపై బీఎన్ఎస్ 319(2), 318(2), 351(2) రెడ్ విత్ 3 (5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
ఆర్యవైశ్య కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు ఆర్యవైశ్య కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, ఆర్యవైశ్య కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు, రేపు (14 & 15 ఫిబ్రవరి 2026)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు

95501 28306 & 92475 20500

ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

మార్చి 2 నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కనే అధికారులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీ ఓఎస్ఎస్) ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను మార్చి నెల రెండో తేదీ నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో మొత్తం 1,854 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఐందుకోసం 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నగరంలోని కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో 603 మంది, నందిగామ డివిజన్‌లో 882, తిరువూరులో 369 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వివరించారు. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 144వ సెక్షన్ అమలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘా విధుల్లో పోలీసు శాఖతో సమన్వయం అవసరమన్నారు. ఎక్కడా చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా చూడాలన్నారు. 'నో సెల్ ఫోన్ జోన్' నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం తదితరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఈవో ఎల్.చంద్రకళ, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి డిమాండ్


లెనిన్ కూడలిలో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం లెనిన్ సెంటర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్‌లు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తానని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయకపోగా ప్రైవేట్ కార్పొరేట్ విశ్వవిద్యాలయాలకు కారు చౌకగా భూములను కట్టబెడుతున్నారని విమర్శించారు. దీంతో పేద, బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు ఉచిత విద్య దూరమవుతోందన్నారు. ఉన్నత విద్యలో పీజు రీయింబర్స్‌మెంట్ అందరికీ ఇస్తామన్న మంత్రి నేటికీ దాన్ని అమలు చేయలేదన్నారు. విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకం కూడా జరగలేదని దుయ్యబట్టారు. వైకాపా ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేస్తోందని విమర్శించారు. ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వ విద్య గురించి చర్చించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు దిగుతామని హెచ్చరించారు. షణ్ముఖ ప్రియ, మనోహర్, అభి, రాజు, యశ్వంత్, ఆదిత్య కార్తిక్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

17న నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 17న జాతీయ నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. జాతీయ నులి పురుగుల కార్యక్రమంపై నగరంలోని కలెక్టరేట్ నుంచి శుక్రవారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఒకటి సంవత్సరం నుంచి 19 ఏళ్ల వయసు గల వారు మొత్తం 5 లక్షల మంది ఉన్నట్లు వెల్లడించారు. వీరికి మాత్రలను వేయనున్నట్లు చెప్పారు. ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులకు 200 ఎంజీ ఇవ్వనున్నట్లు వివరించారు. మిగతా వారికి 400 ఎంజీ సింగిల్ డోస్ ఇవ్వనున్నట్లు వివరించారు. 17న మాత్రలు తీసుకోని చిన్నారులకు 24న వేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, ఆర్బీఎస్‌కే కార్యక్రమ సమన్వయకర్త జి.మాధవి, డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

కోర్టు విచారణకు హాజరైన మాజీ మంత్రి దేవినేని



గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో నమోదైన రెండు కేసుల విచారణ నిమిత్తం మాజీ మంత్రి, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు శుక్రవారం విజయవాడ న్యాయస్థానానికి విచ్చేశారు. విజయవాడ రూరల్ మండలం జీకొండూరు‌ఎం కాలనీలో అనుమతి లేకుండా ప్రదర్శన నిర్వహించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. అదే విధంగా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరు మార్పు సందర్భంగా నిరసన వ్యక్తం చేయడంతో మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులు శుక్రవారం ఉదయం వీఆర్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (సీఎంఎం) న్యాయస్థానంలో విచారణకు రాగా దేవినేని ఉమ హాజరయ్యారు.

అధికారుల నిర్లక్ష్యం.. బాలికలకు శాపం


బాలికలను పరామర్శిస్తున్న బాలకోటయ్య

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక కేజీబీవీలో చదువుతున్న బాలికలను ఎలుకలు కరిచిన సంఘటన దురదృష్టకరమని, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కేజీబీవీని సందర్శించి బాధిత బాలికలను పరామర్శించారు. వసతిగృహం, డార్మిటరీ, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. విద్యాలయంలో ఎదుర్కొంటున్న అసౌకర్యాలపై బాలికలు ఎంతో కాలంగా మొర పెట్టుకుంటున్నా పరిష్కార చర్యలు తీసుకోకపోవడం కేజీబీవీ పర్యవేక్షక అధికారుల నిర్లక్ష్యమేనని స్పష్టమవుతోందన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి తాను సిఫారసు చేస్తున్నానని తెలిపారు. ఇప్పటికే సంఘటనపై సీఎం, విద్యా శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానని చెప్పారు. రాష్ట్ర సంక్షేమ ఉత్పత్తుల ప్రదర్శన సంస్థ ఛైర్మన్ శావల దేవదత్, అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

'లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్-2026' ఏర్పాట్ల పరిశీలన


విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: 'లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్-2026' నిర్వహణలో భాగంగా శుక్రవారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని క్రీడా మైదానాలు, వసతులను శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, వీసీఎండీ, శాప్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఛైర్మన్ మాట్లాడుతూ.. శాసన సభ్యులు, శాసన మండలి సభ్యుల పాల్గొనే క్రీడా పోటీలకు ఏటువంటి లోపాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు అత్యున్నత ప్రమాణాలతో చేయాలని సూచించారు. క్రీడా మైదానాల స్థితి, డ్రెస్సింగ్ రూమ్‌లు, గ్యాలరీలు, లైటింగ్, భద్రతా ఏర్పాట్లు పరిశీలించి.. వసతులు మెరుగు పరచాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధి, పౌరుల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ క్రీడా వేడుక ఒక నిదర్శనమని అన్నారు. నిర్ణీత కాల పరిమితిలో పనులు పూర్తి చేసి స్పోర్ట్స్ మీట్ విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోల మార్ఫింగ్

దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి అందరిలోకెళ్లి పై దుష్ప్రచారం చేస్తున్న చింతా రాజశేఖరరావు అనే వ్యక్తిపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పాయకరావుపేటకి చెందిన జనసేన నాయకుడు పోతిరెడ్డి రాధాకృష్ణ గురువారం ఉదయం సామాజిక మాధ్యమాలను పరిశీలిస్తుండగా చింతా రాజశేఖరరావు అనే వ్యక్తి ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విటర్‌లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలను మార్ఫింగ్ చేసి రెచ్చగొట్టేలా కామెంట్లు పెట్టారు. సీఎం, డిప్యూటీ సీఎం అభిమానులు, ప్రజల మధ్య అభిప్రాయ భేదాలు కలిగించి శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా కామెంట్లు ఉన్నాయని రాధాకృష్ణ గుర్తించారు. దీనికి కారకులైన చింతా రాజశేఖరరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

ముగ్గురి ప్రాణాలు కాపాడారు..


పోలీసులకు తన బాధను చెబుతున్న బాధితురాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మూడు ప్రాణాలు నిలిచాయి. ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన మహిళను గుర్తించి కాపాడి అధికారులు అందుకున్నారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. చిలకలపూడికి చెందిన ఓ మహిళ తన భర్తతో తలెత్తిన వివాదం కారణంగా తన ఇద్దరు కుమారులతో కలిసి శుక్రవారం ప్రకాశం బ్యారేజీ నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవాలని వచ్చింది. ఆ విషయాన్ని మహిళ భర్త చిలకలపూడి పోలీసులకు తెలియజేయడంతో వారు విజయవాడ పోలీసు కంట్రోల్ రూంకు తెలియజేశారు. ఆ క్రమంలో ప్రకాశం బ్యారేజీపై ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ఎస్ఐ శ్రీధర్, నాగమల్లేశ్వరరావు వెంటనే స్పందించి అక్కడ తచ్చాడుతున్న మహిళను ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా ఆమె బోరున ఏడ్చి తనకు కలిగిన కష్టాన్ని వారికి వివరించింది. ట్రాఫిక్ పోలీసులు ముగ్గురిని వన్‌టౌన్ శాంతిభద్రతల విభాగం పోలీసులకు అప్పగించారు. అనంతరం మహిళ కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ చేసిన అనంతరం అప్పగించారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

జి.కొండూరు, న్యూస్‌టుడే : జి.కొండూరు విద్యుత్తు ఉపకేంద్రంలోని 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ సహాయక ఇంజినీర్ షఫీ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని టౌన్ ఏఈ.కృష్ణారెడ్డి తెలిపారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడి, సూరాయిపాలెం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 10.30 వరకు సరఫరా ఉండదని ఈఈ పి.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుద్ధ్య పనులు చేయాలని విజ్ఞప్తి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : పురపాలిక సంఘ కో-ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన మహబూబ్ సుభానీని పశ్చిమ ఇబ్రహీంపట్నం ముస్లిం పెద్దలు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో పురపాలికలోని అన్ని మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

గుంటుపల్లి 'రైజ్'లో కార్యశాల నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం నేతృత్వంలో ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని 'రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సెంటర్(రైజ్)లో ఈనెల 14వ తేదీన ప్రత్యేక కార్యశాల(వర్క్‌షాప్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అవగాహన, శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. శీతలీకరణ, కిచెన్ అండ్ ఫుడ్ ఎక్విప్‌మెంట్ తయారీలో సుదీర్ఘ అనుభవం గల 'కూలెక్స్' ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్(విజయవాడ) భాగస్వామ్యంతో కార్యశాలను నిర్వహించనున్నట్లు వివరించారు. సూక్ష్మ, చిన్న తరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో పాటు, విలువ ఆధారిత ఉత్పత్తులు, చిన్న స్థాయి వ్యాపార అభివృద్ధికి ప్రయోజనం కల్పించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు, ఔత్సాహిక మహిళలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా సుందర్‌లాల్

ఎ.కొండూరు : స్థానిక సంస్థలు, నాయకత్వ లక్షణాలపై విశాఖపట్నంలో శనివారం నుంచి అయిదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా డిప్యూటీ ఎంపీడీవో పాలపర్తి సుందర్‌లాల్‌ను నియమిస్తూ జిల్లా అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విస్సన్నపేట ఎంపీడీవో చినరాట్నాలు కూడా శిక్షణ నిమిత్తం వెళ్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? యాష్ బురద వల్ల వీటీపీఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో కొంత భాగం పాడైంది. దీంతో వాకింగ్ చేసే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **- షరీఫ్, ఇబ్రహీంపట్నం**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- గ్రౌండ్ నిర్వహణ ఏడీఈ - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

స్పందన: ◆ గుంటుపల్లిలో దోమల బెడద అధికంగా ఉందని గ్రామస్థులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను గ్రామ కార్యదర్శి కరుణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె దోమల నివారణకు మందు పిచికారీ చేయించి సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే(గుంటుపల్లి), ఇబ్రహీంపట్నం గ్రామీణం**

◆ విస్సన్నపేట చింతల బజారులో చెత్త పేరుకుని దుర్వాసన వస్తోందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు. సమస్యను పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



అంబులెన్స్ ముందు ప్లకార్డులతో 108 సిబ్బంది

మైలవరం : దీర్ఘకాలంగా 108 సర్వీసుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల జీతభత్యాలు, సౌకర్యాల మెరుగునకు చర్యలు తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, భవ్య సంస్థకు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక యార్డులోని అంబులెన్స్ ఎదుట 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ ప్లకార్డులను ప్రదర్శించామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాఘవులు చెప్పారు.

ఆదాయం పెంచేలా.. ప్రత్యేక దృష్టి

గొల్లపూడి, న్యూస్‌టుడే

గ్రామ పంచాయతీల ఆదాయం పెంచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీల్లో ఇంటి, నీటి పన్ను వసూళ్లపై చర్యలు చేపట్టారు. ఏపీ పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్.కృష్ణతేజ ఆదేశాల మేరకు పన్ను వసూలు చేసేందుకు అధికారులు పరుగులు పెడుతున్నారు. పన్ను చెల్లింపుదారుల ఇంటికెళ్లి నోటీసులు ఇస్తున్నారు. గ్రామ పంచాయతీలోని ప్రతి అసెస్‌మెంట్‌ను ఇటీవల ఆన్‌లైన్ చేశారు. దీంతో పన్ను చెల్లింపుదారులు ఆన్‌లైన్‌లోనే చెల్లించే వెసులుబాటు ఉంది. నేరుగా నగదు కట్టించుకునే విధానానికి స్వస్తి పలికారు. ఈ క్రమంలో ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు చెల్లించాల్సిన ఉంటోంది. ముఖ్యంగా రూ.లక్ష పైన పన్ను చెల్లింపుదారులకు డీపీవో కార్యాలయం నుంచే ఫోన్లు చేయించి చెల్లించేలా చర్యలు చేపడుతున్నారు. అలాగే గ్రామ పంచాయతీల ఆధారంగా ప్రతి రోజు ఎంత పన్ను వసూలు చేశారనే విషయమై ప్రత్యేకంగా కమిషనర్ కార్యాలయం నుంచి సమీక్షిస్తున్నారు. దీంతో అధికారులు పంచాయతీల వారీగా పన్ను చెల్లింపు శాతాన్ని ప్రతి రోజు నివేదిక రూపంలో పంపుతున్నారు. తక్కువ శాతం వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శులు, బిల్లు కలెక్టర్లకు షోకాజు నోటీసులు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా విజయవాడ గ్రామీణ మండలం పరిధిలోని గొల్లపూడిలో అత్యధిక అసెస్‌మెంట్లు ఉన్నాయి. పాత బకాయిలతో పాటు ప్రస్తుతానివి వసూలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.



గొల్లపూడిలో పన్ను కట్టించుకుంటున్న అధికారులు

విజయవాడ గ్రామీణ మండలంలోని గ్రామాల్లో పన్నుల వసూళ్లిలా...

గ్రామం పేరు	అసెస్‌మెంట్లు	బకాయిలు (రూ. లక్షల్లో)	వసూలు (12 నాటికి)
గొల్లపూడి	15,562	9.37	3.38
రాయనపాడు	1092	60	34.94
కొత్తూరు తాడేపల్లి	1332	24	13
జక్కంపూడి	1077	24	16
పైడూరుపాడు	660	7.66	4.14

పేద కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు దోహదం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఎనిమిది వేల మంది ఎస్సీ, ఎస్టీలు నిర్వహిస్తున్న మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌లకు(ఎంఎస్ఎంఈ) సంబంధించిన రూ.700 కోట్లు రాయితీ బకాయిలను వీలైనంత త్వరగా విడుదల చేసి సీఎం చంద్రబాబు వారిని ఆదుకోవాలని తిరువూరు శాసన సభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జరిగిన శాసనసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే ఉద్దేశంతో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. తద్వారా రాష్ట్రంలో అనేక పేద కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. వైకాపా ప్రభుత్వం ఎంఎంఎస్ఈలను నిర్లక్ష్యం చేయడంతో వారంతా అప్పులు చేసి వడ్డీలు చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

అధికారులతో సమీక్ష

తిరువూరు, న్యూస్‌టుడే : ఏ.కొండూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన సంఘటనపై పాఠశాలలోని ఇతర సమస్యలపై ఎమ్మెల్యే శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎలుకల దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బడిలోని సమస్యలను త్వరగా పరిష్కరించి నివేదిక సమర్పించాలని డీఈవో చంద్రకళ, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు సమన్వయకర్త రజనిలకు చెప్పారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



కార్యక్రమంలో దేవదత్, పక్కన కూటమి నాయకులు

తిరువూరు: తిరువూరు పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఆథారిటీ ఛైర్మన్ శావల.దేవదత్ భూమి పూజ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి.రాజేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లెల.శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు దుబ్బాకు.వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

జి.కొండూరు, న్యూస్‌టుడే : ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని గుర్రాజుపాలెం ప్రాథమిక పాఠశాలకు లైబ్రరీ బుక్స్, క్రీడా పరికరాలు వితరణ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధి మూర్తి పాఠశాల హెచ్‌ఎం పజ్జూరు శ్రీనివాసరావుకు విద్యార్థుల సమక్షంలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కోన సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహం.. అంతా ఆనందం



కోడూరు పాఠశాలలో బాలికల నృత్యం

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి వృద్ధిలోకి రావాలని, బడికి, గ్రామానికి గుర్తింపు తీసుకురావాలని గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు సూచించారు. బాలబాలికలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సర్పంచి టి.సురేష్, పాఠశాల సముదాయ క్లస్టర్ ఛైర్మన్ జి.ఆదిశేషు, హెచ్ఎం ఎం.రామ్‌ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



విస్సన్నపేట: విద్యార్థినికి బహుమతి ఇస్తున్న నర్సిరెడ్డి

ఘనంగా వీడ్కోలు వేడుకలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక వికాస్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వీడ్కోలు వేడుకలు జరిగాయి. గతేడాది జరిగిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వికాస్ విద్యాసంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి బహుమతులు అందించారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక వికాస్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో వికాస్ సంస్థల అధినేత ఎన్.నర్సిరెడ్డి, ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాశాలకు నిఘా నేత్రాల ఉపకరణాల వితరణ

మైలవరం : స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమ్ నిర్వహణకు అవసరమైన పలు ఉపకరణాలను సరస్వతీ ఫౌండేషన్, చిన్నారి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రవాస భారతీయ వైద్యుడు కుడుముల అనిల్ కుమార్ రెడ్డి వితరణ చేశారు. ఈ మేరకు ఎల్ఈడీ మానిటర్, హార్డ్ డిస్క్‌లను శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్, ఇన్‌ఛార్జి డీఐఈవో ఎస్.సరళకుమారికి అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గోపాల్, లయన్స్ క్లబ్ నాయకుడు నాగభూషణం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్‌కు మానిటర్ అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

బకాయిలు విడుదల చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం మండల పరిధిలో భూముల తదితర విక్రయాల సందర్భంగా మండల పరిషత్తు, గ్రామ పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులకు సంబంధించిన బకాయిలను విడుదల చేయాల్సిందిగా ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, తుమ్మలపాలెం సర్పంచి బొమ్ము వెంకటరమణ, ఎంపీడీవో శకుంతల శుక్రవారం జిల్లా రిజిస్ట్రారుకు వినతి పత్రం సమర్పించారు.



జిల్లా రిజిస్ట్రారుకు వినతిపత్రం ఇస్తున్న జ్యోత్స్న, వెంకట రమణ, శకుంతల

నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కార్యదర్శిపై వేటు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని చీమలపాడు గ్రామ పంచాయతీ గ్రేడ్- 1 కార్యదర్శి ఇస్లావతు శివనాగమణిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.వి.ఆర్.కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరాయని ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.సుందర్‌లాల్ తెలిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరులో 2021-24 మధ్య గ్రేడ్- 3 కార్యదర్శిగా చేస్తున్నప్పుడు ఆమె నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు గ్రామస్థుల నుంచి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. రెండేళ్ల కిందట డీఎల్పీవో విచారణ చేసి కార్యదర్శిపై ఆరోపణలు నిజమని గుర్తించి అధికారులకు నివేదిక పంపించారు. తదుపరి శివనాగమణిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డీపీవో కూడా రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్‌కు సిఫారసు చేశారు. దీంతో ఆమెను సస్పెండ్ ఏపీ పీఆర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

జోగిని పరామర్శించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నంలోని తన నివాసంలో జోగి రమేష్‌ను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.వేల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి తెచ్చామని చెబుతున్న కూటమి ప్రభుత్వ మాటల్లో వాస్తవం ఎంతో దేవుడికే తెలియాలన్నారు.

సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు



కేజీబీవీలో బాలికలకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ఎ.కొండూరు: స్థానిక కేజీబీవీలో చదువుతున్న బాలికలకు అవసరమైన సదుపాయాలు కల్పించి సమస్యలు పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. 12 మంది బాలికలను ఎలుకలు కరవడంతో అధికార, ప్రతిపక్షాల నాయకులు, అధికారులు కేజీబీవీ బాటపట్టారు. విద్యాలయంలో సిబ్బంది, విద్యార్థినులతో సమావేశమై పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అపరిశుభ్రత, కిటికీల వద్ద సరైన తలుపులు, మెస్ లేకపోవడమే ఎలుకలు రావడానికి కారణమని గుర్తించారు. గతేడాది ఎలుకల సమస్య వచ్చినప్పుడు జేసీ, ఆర్డీవో సందర్శించి వాటి పరిష్కారానికి నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. సమగ్ర శిక్షా నుంచి మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు రూ.2 లక్షలు మంజూరు చేశారు. వాటితో పనులు చేపట్టక పోవడంతో ఎలుకల కరిచిన సంఘటన పునరావృతమైంది. ఈ మేరకు శుక్రవారం డీఈవో చంద్రకళ, ఆర్డీవో మాధురి, డీవైఈవో శ్యామ్‌సుందరరావు, ఎంఈవో కేశవరావు, తహసీల్దార్ అరవింద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో సుందర్‌లాల్ కేజీబీవీని సందర్శించి బాలికలతో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రం సిబ్బందితో వైద్య శిబిరం పెట్టించారు. సంఘటనపై వివరణ కోరుతూ ఆర్డీవో కార్యాలయం నుంచి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ విజయసుందరికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

అద్భుతం.. అన్నదాతకు అభయం

తిరువూరు, న్యూస్‌టుడే

తిరువూరు మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయం క్రమంగా విస్తరిస్తోంది. మండలంలోని 12 గ్రామాల్లో రైతులు సేంద్రియ పద్ధతులను అవలంబిస్తూ పంటలను సాగు చేస్తున్నారు. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులతో వరి, కూరగాయల పంటలను కూడా పండిస్తున్నారు. సేంద్రియ ఎరువులు జీవామృతం, ఘన జీవామృతం వంటి ప్రకృతి ఆధారిత పద్ధతులను వినియోగిస్తూ ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేస్తున్నారు. తిరువూరు డివిజన్ పరిధిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల సంఖ్య సుమారు నాలుగు వేల మంది అని, సేంద్రియ పద్ధతులు పాటిస్తూ 2982.58 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారని సేంద్రియ వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

తగ్గనున్న వ్యయం

ప్రధానంగా రామన్నపాలెం, కాకర్ల, లక్ష్మీపురం, మల్లెల, ఆంజనేయపురం, కోకిలంపాడు, చౌటపల్లి, గానుగపాడు, చింతలపాడు, వావిలాల, ముష్టికుంట్ల, మునుకుళ్ల గ్రామాల్లోని రైతులు సేంద్రియ ఎరువులతో వరిని సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు పంటల నాణ్యత మెరుగు పడుతుందని అన్నదాతలు చెబుతున్నారు. రసాయన అవశేషాలు లేకుండా పండే వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ కూడా ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. మండలంలోని మరిన్ని గ్రామాలకు దీన్ని విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నారు. దీంతో రైతుల ఆదాయం పెరగడంతో పాటు పర్యావరణం పరిరక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం వినియోగదారులకు అందించడమే లక్ష్యమంటున్నారు.



రామన్నపాలెంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొలంలో రైతు ప్రసాద్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివారిద్దామని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ వింగ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని స్థానికంగా శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, తహసీల్దారు వెంకటేశ్వర్లు, సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం : ద్విచక్ర వాహన చోదకులు ప్రయాణ సమయంలో కుటుంబ సభ్యుల సంక్షేమం, సౌభాగ్యం కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మూలపాడు సెక్టరు ఎస్సై రాజు సూచించారు. కిలేశపురం శివారులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎత్తిపోతల పథకం పనులు చేపట్టండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పథకం పనులను తక్షణం చేపట్టి ప్రజలకు సాగు, తాగు నీరందించాలని విస్సన్నపేట తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు విజయవాడ వెళ్లి ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కి వినతిపత్రం అందజేశారు. నాయకులు కోలేటి రంగారావు, దమ్మాలపాటి సాంబశివరావు, బాణావత్ రాంబాబు, మేడ రాజశేఖర్, వడ్లమూడి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించడంలో ముందు



మాట్లాడుతున్న మల్లయ్య, వేదికపై లక్ష్మీకల్యాణి, చినరాట్నాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గద్దల మల్లయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు సేవలందించడంలో ప్రజాప్రతినిధులు ముందు ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల పురోగతి గురించి తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి, ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు వివరించారు. సభ్యులతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండపర్వ గట్టు తిరునాళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ తదితరులు



పవిత్ర సంగమం వద్ద చైతన్య, చిట్టిబాబు



గొల్లపూడి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వలోని శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, గట్టు తిరునాళ్ల ఏర్పాట్లను విజయవాడ రూరల్ డీసీపీ బి.లక్ష్మీ నారాయణ, స్థానిక ఎస్సై యం.అర్జున్ రాజుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మెట్ల దారి, గట్టుపైన ఆలయాన్ని, ఘాట్ రోడ్డును పరిశీలించి తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి, ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలుకు కొన్ని సూచనలు చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా..

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : శివరాత్రి స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని సబ్ కలెక్టర్ చైతన్య అన్నారు. పవిత్ర సంగమం, ఫెర్రీ ఘాట్లను ఆయన శుక్రవారం రాత్రి పరిశీలించారు. కార్యక్రమంలో పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు, తహసీల్దారు వెంకటేశ్వర్లు, సీఐ చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గొల్లపూడి: శివరాత్రిని పురస్కరించుకుని గొల్లపూడి, సూరాయిపాలెం స్నానఘాట్ల వద్ద గొల్లపూడి గ్రామ పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేలా గదులను ఏర్పాటు చేశారు.

అష్టోత్తర శత దీపాలంకరణ సేవ

గంపలగూడెం, న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాలస్వామి గుడిలో శుక్రవారం రాత్రి అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ నిర్వహించారు. అద్దాల మండపం వద్ద ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. భక్తులు పాల్గొని రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు.



వైభవంగా శ్రీనివాస స్వామి శాంతి కల్యాణం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, సభ్యులు ఆర్.వెంకట సుబ్బారావు, వై.విజయ్ కుమార్, జి.వెంకటేశ్వరరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సరోజిని నాయుడుకు ఘన నివాళి



పెనుగొలనులో నివాళులర్పిస్తున్న చిన్నారులు, గ్రామస్థులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : పెనుగొలనులో శుక్రవారం జాతీయ మహిళా దినోత్సవం, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడు జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి చిన్నారులు, గ్రామస్థులు నివాళులర్పించారు.

కొండపల్లి: స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలతను భాజపా మహిళలు సన్మానించారు. పలువురు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. మాధురి, భవాని, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : కాచవరం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితులకు రిమాండు

గంపలగూడెం: మండలంలోని దుందిరాలపాడులో పాత వివాదాల నేపథ్యంలో ఇటీవల ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వర్గానికి చెందిన నలుగురు నిందితులను గంపలగూడెం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మొగిలి శేషగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో నిందితులుగా ఉన్న మొగిలి హనుమంతు, ఉయ్యాల కిశోర్, చిట్టిపోతుల సురేష్, చలపతిని అరెస్టు చేసి తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో నలుగురిని నూజివీడు ఉప కారాగారానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ

తిరువూరు: మహిళ మెడలోని బంగారు నానుతాడును ఓ గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం అపహరించాడు. పోలీసులు, సెక్టార్-1 ఎస్సై శాతకర్ణి తెలిపిన వివరాల ప్రకారం. . తిరువూరు మండలం చిక్కుళ్లగూడెం గ్రామానికి చెందిన ఉప్పూరు.అనసూయ ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఆమె వద్దకు వచ్చిన నిందితుడు మాయ మాటలు చెప్పి, కత్తి చూపి బెదిరించి అనసూయ మెడలోని నాలుగు తులాల బంగారు నానుతాడును లాక్కొని ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. ఈ సంఘటనతో బాధితురాలు ఆందోళనకు గురై చుట్టుపక్కల వారికి సమాచారం అందించింది. వెంటనే స్థానికులు నిందితుడి కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో బాధితురాలు తిరువూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

500 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ఎంఎన్ఆర్ ఫౌండేషన్, కంచికామ కోటిపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులతో రెడ్డిగూడెంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కంటి వైద్య నిపుణురాలు డాక్టర్. రమ్య, ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు జె.వేణుగోపాల రెడ్డి, నాయకులు జి.వెంకటేశ్వరరావు, వి.సుబ్బారెడ్డి, సీహెచ్.చందా, ఎస్‌కే.గాలిబ్ పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న నాగేశ్వరరెడ్డి, పక్కన తెదేపా నాయకులు

వేయి మునుల కుదురు.. యనమలకుదురు..



యనమలకుదురు శివాలయం డ్రోన్ చిత్రం

కానూరు, యనమలకుదురు, న్యూస్‌టుడే

వేయి మునుల కుదురు.. మన యనమలకుదురుగా వేల ఏళ్ల నుంచి ప్రసిద్ధి చెందింది. విజయవాడ నగర సమీపాన కృష్ణాతీరాన యనమలకుదురులో స్వయంభువుగా వెలసిన పార్వతీ రామలింగేశ్వరులను పరమశివుని ప్రియశిష్యులైన పరశురాముడు దర్శించుకుని పూజించి పునఃప్రతిష్ఠించిన లింగమైన పరమశివుడు. ఇక్కడ కొలువైన పార్వతీ రామలింగేశ్వరులను పూజిస్తే తమ కష్టాలు గోడలతో కూల్చినట్లుగా నమూలంగా పోతాయని భక్తుల విశ్వాసం. వేయిమంది మునులు ఇక్కడ తపస్సు చేయడం వల్ల వేయిమునుల కుదురు అని పిలిచారు. కాలక్రమేణా యనమలకుదురుగా వ్యవహారంలోకి వచ్చింది. ఈ క్షేత్రంలో పరమశివుడు వాయులింగంగా పూజలు అందుకోవడం విశేషం. పూర్వం ఈ ప్రాంతం తపోవనంగా ప్రకాశించింది. ఈ ఆలయ పరిసర ప్రాంతాల్లోని గాలిలో ఇప్ప టికీ ఓంకారం వినిపిస్తుందని భక్తుల నమ్మకం. రావణసంహారం తర్వాత రాముడు ఇక్కడ లింగాన్ని దర్శించి పూజలు చేశారని భక్తులు నమ్ముతారు. ఆలయ ప్రాంగణంలో వెలసిన వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, దాసాంజనేయస్వామి, నాగేంద్రస్వామిపుట్ట, మహాశివరాత్రికి భక్తులు పూజలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయానికి శ్రీకృష్ణదేవరాయలు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర ప్రభువులు దర్శించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.



పూజలందుకుంటున్న శివలింగం..

కనులపండువగా ప్రభల ఉత్సవం

ఈ నెల 15న మహాశివరాత్రి సందర్భంగా అంగరంగవైభవంగా ప్రభల ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ప్రభలను మహాశివుని ప్రతిరూపంగా భక్తులు భావిస్తారు. విద్యుద్దీపాలంకరణ, మేళతాళాలు, మేలుజాతి వృషభాలతో బండ్లు కట్టి వాటిపై ప్రభలను ఉంచి గిరిప్రదక్షిణ చేస్తారు. శివరాత్రి తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణం, స్వామివార్ల పంచహారతులు, అనంతరం గ్రామోత్సవం నయనానందకరంగా జరుగుతాయి. ఈ సందర్భంగా భక్తులు తమ కష్టాలు తీర్చమని వేడుకుంటూ గండదీపాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

500 కార్లకు.. 2 వేల బైకులకు పార్కింగ్ సౌకర్యం



సంగా నరసింహారావు

యనమలకుదురు వెంచిన సంగా నరసింహారావు ఈ ఆలయ అభివృద్ధికి గత రెండు దశాబ్దాలుగా కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ఈ శివరాత్రికి ఆయన వాహనాల పార్కింగ్ నిమిత్తం ఆధునాతన మూడంతస్తుల సముదాయం నిర్మించారు. రూ.30 కోట్లతో నిర్మించిన ఈ పార్కింగ్ సముదాయంలో ఒకేసారి 500 కార్లు, 2 వేల ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయవచ్చు. వీటితో పాటు రూ.12 కోట్లతో అన్నదాన భవనం, 50 గదుల కాటేజీల నిర్మాణం జరుగుతుంది. భవిష్యత్తులో పెరిగే భక్తుల రద్దీకి అనుగుణంగా వీటిని ఏర్పాటు చేస్తున్నామని ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై శివరాత్రి మహోత్సవాలు ప్రారంభం



ఈవో శీనానాయక్, పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణతో గణపతి పూజ చేయిస్తున్న స్థానాచార్య శివప్రసాదశర్మ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మల్లేశ్వరాలయ ప్రాంగణంలో ఈవో శీనానాయక్, పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణతో స్థానాచార్య శివప్రసాదశర్మ గణపతి పూజ చేయించారు. గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులకు మంగళస్నానాలు చేయించారు. ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించారు. మండపారాధన, కలశస్థాపన, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమాలను రుత్విక్కులు నిర్వహించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు శంకరబాబు, ధర్మారావు, పద్మావతి ఠాకూర్, సరిత పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ: ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరుడికి దుర్గగుడి తరఫున పట్టు వస్త్రాలను సంప్రదాయంగా పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ శుక్రవారం అందజేశారు. ఈనెల 15న శ్రీకాళహస్తిలో స్వామివారి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని కల్యాణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీదుర్గామల్లేశ్వర వార్ల దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు, సారెను సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు, వేదపండితులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బార్ కౌన్సిల్ ఎన్నికలు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం విజయవాడలో ప్రశాంతంగా ముగిశాయి. బెజవాడ బార్ అసోసియేషన్ నుంచి 18 మంది న్యాయవాదులు బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. బీబీఏ గ్రంథాలయం, ఏఎస్ రామారావు హాలు, డాక్టర్ కేఎల్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటు వేసిన 2,523 మంది న్యాయవాదులు

బెజవాడ బార్ అసోసియేషన్ నుంచి మొత్తం 2,925 మంది న్యాయవాదులు ఓటు వేయాల్సి ఉంది. సాయంత్రం 5 గంటల వరకు 2,524 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారి డి.పి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. బీబీఏ మాజీ అధ్యక్షుడు చంద్రమౌళి, సీనియర్ న్యాయవాదులు కందుల శ్రీనివాస్, బుచ్చిరావు, అబ్దుల్ మతీన్, కె.బి.సుందర్, మహిళా తదితరులు 40 మంది వరకు న్యాయవాదులు పోలింగ్ ఏజెంట్లుగా సేవలు అందించారు. సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్ మళ్లీ పోటీలో ఉన్నారు. తెదేపా ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలీసులు బార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాల రద్దీని పర్యవేక్షించి సిటీ బస్సులను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో సహకరించిన అందరికీ బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా, ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ హైకోర్టు ప్రాంగణంలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో ఈ నెల 16 నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది.



వరుసలో నిల్చున్న లాయర్లు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్

మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ పొడిగించింది. వీరికి విధించిన రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియనుండడంతో సిట్ అధికారులు విజయవాడ, గుంటూరు కారాగారాల్లో ఉన్న నిందితులను బుధవారం మధ్యాహ్నం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. గత నెల 30 నుంచి ఇప్పటి వరకు 15 మంది సాక్షులను పోలీసులు విచారించారని, ఇప్పటి 164 స్టేట్‌మెంట్లను రికార్డు చేయించామని సిట్ న్యాయస్థానానికి తెలిపారు. ... (తదితర నిందితుల వివరాలు) ... వీరి తరఫున న్యాయవాదులు రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రిమాండ్ పొడిగింపు తర్వాత నిందితులను విజయవాడ, గుంటూరు కారాగారాలకు తరలించారు.

నేడు, రేపు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట: రెండో శనివారం, మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం వరుస సెలవు దినాలైనప్పటికీ జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచే ఉంటాయని ఆ సంస్థ ఎస్ఈ ఎ.మహబూబ్ తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ కన్జూమర్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే విద్యుత్తు సర్వీసు నంబరును యాప్‌లో రిజిస్టర్ చేసుకుని కూడా విద్యుత్తు బిల్లులను చెల్లించవచ్చన్నారు. అదే విధంగా గూగుల్‌పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్‌డెస్క్ యాప్‌ల ద్వారా కూడా చెల్లించవచ్చని ఎస్ఈ తెలిపారు.

సందడిగా పిల్లల సంత..



విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్

గుణదల(పటమట), న్యూస్‌టుడే: గుణదలలోని ఆల్ఫ్రా విద్యాలయంలో శుక్రవారం పిల్లల సంత సందడిగా సాగింది. 5వ తరగతి విద్యార్థులు వ్యాపారుల్లా మారి స్టాళ్లు నిర్వహించడం ఆకట్టుకుంది. కూరగాయలు, ఫ్యాన్సీ వస్తువులు, జ్యూస్, స్టేషనరీ, ఫుడ్ కోర్టులో ఆహార పదార్థాలు విక్రయించారు. వినియోగదారులుగా వచ్చిన ఇతర తరగతుల పిల్లలతో మాట్లాడి వస్తువుల అమ్మకం, బిల్లుల రాయడం, డబ్బులు తీసుకొని చిల్లర ఇవ్వడం వంటి లావాదేవీలను చాకచక్యంగా నిర్వహించారు. పుస్తకాలకే పరిమితం కాకుండా అనుభవాత్మక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాల్లో భాగంగానే సంత ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గణితాన్ని ప్రాక్టికల్‌గా అర్థం చేసుకోవడం.. ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించడం సంత ప్రధాన ఉద్దేశమని ప్రిన్సిపల్ వై.వి.కృష్ణ పేర్కొన్నారు.

వారసత్వ సంపద పరిరక్షణలో భాగస్వాములుకండి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: వారసత్వ సంపద పరిరక్షణను మరింత బలోపేతం చేసే దిశగా ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) విజయవాడ చాప్టర్.. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా-విజయవాడ) విద్యార్థులను అధికారికంగా తమ సంస్థలోకి ఆహ్వానించింది. స్థానిక స్పా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు సభ్యత్వ పత్రాలు అందజేశారు. ఇంటాక్ విజయవాడ ఛాప్టర్ కన్వీనర్ సాయి పాపినేని మాట్లాడుతూ.. దేశంలోని విభిన్న సాంస్కృతిక, వాస్తు శిల్ప వారసత్వాన్ని కాపాడడంలో కాబోయే ఆర్కిటెక్ట్‌లు, ప్లానర్లు పోషించాల్సిన పాత్రను వివరించారు. ఛాప్టర్ కో-కన్వీనర్ ప్రసూన బాలంత్రాపు మాట్లాడుతూ.. ప్లానింగ్, ఆర్కిటెక్చర్‌లో.. వారసత్వ సంపద స్థిరమైన పరిరక్షణకు యువతను భాగస్వాములను చేయడం ఎంతో కీలకమని అన్నారు. స్పా-విజయవాడ డైరెక్టర్ రమేష్ శ్రీకొండ విద్యార్థులకు సభ్యత్వ పత్రాలను అందజేశారు.



విద్యార్థులతో స్పా డైరెక్టర్ రమేష్ శ్రీకొండ, ఇంటాక్ కన్వీనర్ సాయి పాపినేని తదితరులు

మత్తును తరిమికొట్టడమే డ్రగ్స్‌పై దండయాత్ర లక్ష్యం



ర్యాలీలో ఎమ్మెల్యే సుజనాచౌదరి, సీపీ రాజశేఖరబాబు, ఈగల్ చీఫ్ రవికృష్ణ తదితరులు



హాజరైన విద్యార్థులు

విద్యాధరపురం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండటమే డ్రగ్స్‌పై దండయాత్ర లక్ష్యం అని హోంమంత్రి అనిత అన్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు నేతృత్వంలో 18వ రోజు కాళేశ్వరరావు మార్కెట్ సెంటరు నుంచి గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ వరకు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన బహిరంగ సభలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ..సీపీ రాజశేఖరబాబు నేతృత్వంలో ఈగల్ టీమ్ డ్రగ్స్ రహిత, విజయవాడగా అవతరించేందుకు చేపట్టిన సైకిల్ యాత్ర 227 కి.మీ పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లా పోలీస్, సుజనా ఫౌండేషన్ డ్రగ్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఐదుగురు మహిళలు సైకిల్ యాత్ర ద్వారా సెంట్రలిటీలో మారారన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. డ్రగ్స్ బారిన పడిన యువత జీవితం దుర్భరంగా ఉంటుందని..వారి కుటుంబాల్లో వేదన వర్ణనాతీతం అన్నారు. తల్లిదండ్రులు తమ సంతానం ఏ విధంగా ఉన్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ జనవరి 27న హోంమంత్రి ప్రారంభించిన ఈ యాత్ర పట్ల ప్రజలు ఆదరాభిమానాలతో స్వాగతం పలుకుతున్నారన్నారు. 10 వేలకు పైగా సీసీ కెమెరాలు, డ్రోన్ల సహకారంతో నేరస్తులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటున్న పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. సుజనా ఫౌండేషన్ ద్వారా రూ.30లక్షలతో వెయ్యి సీసీ కెమెరాలు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు షిరీన్‌బేగం, సరిత, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గుణరామ్ పాల్గొన్నారు.

మాటలతోనే సరా.. పనులపై దృష్టి పెట్టరా?

గడువు ముగుస్తున్నా కొలిక్కిరాని ఫిషింగ్ హార్బర్

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

పొడిగించిన గడువులు ముగిసిపోతున్నా మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కొలిక్కిరాలేదు. ఏడాదిగా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. ఈ మార్చితో అదనంగా రెండు సార్లు పొడిగించిన గడువు పూర్తవుతున్నా హార్బర్‌లో ఎక్కడా గుత్తేదారు ఇంజినీర్లు.. పనిచేసేవారు కనిపించట్లేదు. వైకాపా హయాంలో బిల్లులు పడక పనులు ఎక్కడికక్కడ నిలిచాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగంగా పూర్తిచేసి ఎప్పటికప్పుడు బిల్లులు పెట్టుకుంటే తక్షణమే మంజూరు చేస్తామని మారిటైమ్ బోర్డు సీఈవో ఆదిత్య హామీ ఇచ్చినా గుత్తేదారు సంస్థలో మాత్రం చలనం లేదు.

● 2021లో పనులు ప్రారంభం కాగా 2023 మార్చికి పూర్తి చేయాలి.



అసంపూర్తి భవనాలతో ఇలా..

2024 సెప్టెంబరులో రెండోసారి గడువు పెంచారు. అప్పటి నుంచి రోజూ 300 మందితో పనిచేసినా ఈ ఏడాది మార్చినాటికి పనులు కొలిక్కి వచ్చేవని అధికారులు చెబుతున్నారు. ఇంజినీర్లు.. పనిచేసే వారిని పెంచకపోగా ఉన్నవారిని సైతం తగ్గించేశారు. దీంతో అతి ముఖ్యమైన మొగ, బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ తదితర పనులు ఆగిపోయాయి. వేటకు వెళ్లే పడవలు పాత మొగ వద్ద తరచూ ఇరుక్కుని ధ్వంసమవుతున్నాయి.


నిర్మాణ సంస్థ: ఎమ్ఆర్‌కేఆర్
వ్యయం: రూ.421కోట్లు
విస్తీర్ణం: 56 ఎకరాలు
జరిగిన పనులు: 71శాతం
550 పడవలు తిరిగే వీలుంది..

నెలనెలా పర్యవేక్షణ ఉత్తిదేనా..?

గత ఏడాది ఏప్రిల్‌లో మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, వాసంశెట్టి సుభాష్, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య హార్బర్ పనులు పరిశీలించారు. పురోగతి లేకపోవడంతో గుత్తేదారు సంస్థ, పర్యవేక్షణాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత జూన్ నాటికి అంతర్గత రోడ్లు, ప్యాకింగ్, నిల్వలు ఇతర సముదాయాలు పూర్తి చేసి మత్స్యకార పడవలకు అడ్డంకులు తొలగించాలని నిర్దేశించారు. సెప్టెంబరులో పనులు పరిశీలించిన ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు నెలాఖరులోగా పురోగతి కనిపించకుంటే ఒప్పందం రద్దు చేస్తామని హెచ్చరించినా తీరు మారలేదు. నెలనెలా పర్యవేక్షిస్తామన్న మంత్రులు, జిల్లా అధికారులు మాటలకే పరిమితం కావడంతో అదనపు గడువులు ముగుస్తున్నా పనులు కొలిక్కిరాలేదు.

ఇంకో రెండేళ్లకైనా అవుతుందా..?

వైకాపా హయాంలో అనుభవంలేని సంస్థకు పనులు కట్టబెట్టారు. ఇది మరో సంస్థకు సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. జెట్టీలు మినహా ఏ పనులు కొలిక్కిరాలేదు. బ్రేక్‌వాటర్ నిర్మాణాలు, మొగ, డ్రెడ్జింగ్, భవన సముదాయాలు, రోడ్లు తదితర అన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఇదే తీరు కొనసాగితే మరో రెండేళ్లయినా హార్బర్ పూర్తికాదని అధికారులే చెబుతున్నారు. ● పనులు వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.



మోడైన చెట్టు.. పక్షులే ఆకట్టు..

విజయవాడ దూరదర్శన్ కేంద్రంలో ఆకులన్నీ రాలిపోయిన చెట్టు ఇది. సాయంత్రం అయ్యే సరికి నీటి కొంగలు, ఇతర పక్షులు వాలి ఆకులున్నట్లు దర్శనమిస్తోంది. - ఈనాడు, అమరావతి

27న ఏఆర్‌డీవో 3కే రన్

చుట్టుగుంట, న్యూస్‌టుడే: ప్రపంచ రేర్ డిసీజ్ డే సందర్భంగా ఈ నెల 27వ తేదీన బీఆర్‌టీఎస్ రోడ్డులో 'ఏఆర్‌డీవో 3కే రన్-ఫైట్ అగెనెస్ట్ కండర క్షీణత' కార్యక్రమాన్ని చేపట్టామని ఏఆర్‌డీవో (అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్) వ్యవస్థాపకురాలు సుంకర శోభారాణి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం చుట్టుగుంట అనిల్ న్యూరో ట్రామా సెంటర్‌లో న్యూరాలజిస్ట్ డాక్టర్ దేవనబోయిన అనిల్‌కుమార్, ఫిజియోథెరపిస్ట్‌లు కలపాల ప్రవీణ్, ఎంవీ పవన్ కల్యాణ్, ఏఆర్‌డీవో బృంద ప్రతినిధులు తోట ఫణీంద్రవర్మ, సౌజన్య, చంద్రశేఖర్‌లతో కలిసి శోభారాణి గోడపత్రిక ఆవిష్కరించారు. 'కండర క్షీణత' వంటి వ్యాధులపై ప్రజలకు సరైన సమాచారం, అవగాహన కల్పించడమే ఈ 3కే రన్ ప్రధాన లక్ష్యమన్నారు.

విద్యార్థి వీసాల్లో 50 శాతం తగ్గుదల

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : అమెరికా వీసా నిబంధనల్లో మార్పుల వల్ల ఈ సంవత్సరం భారతీయ విద్యార్థులకు జారీ చేసిన ఎఫ్-1 వీసాల్లో 50 శాతం తగ్గుదల నమోదైందని అంతర్జాతీయ ఇమ్మిగ్రేషన్ అటార్నీ నడదూర్ ఎస్.కుమార్ అన్నారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హెచ్-1బీ వీసా నిబంధనల్లో వచ్చిన మార్పులు, పెరిగిన ఫీజులు, కఠినమైన కాన్సులర్ తనిఖీలు, గ్రీన్‌కార్డు కోసం సుదీర్ఘ కాలం వేచి ఉండాల్సి రావడం అందుకు కారణాలని వివరించారు. ఇలాంటి సమయంలో ఈబీ-5 ఇన్వెస్టర్ ప్రోగ్రాం సురక్షితమైన, వేగవంతమైన ప్రత్యామ్నాయమని అన్నారు. విద్యార్థులు కేవలం గుర్తింపు పొందిన విద్యాసంస్థలకే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడపడం, చిన్నపాటి దొంగతనాలు చేయడం, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం వంటి కారణాల వల్ల వీసా నిరాకరణకు గురవుతుందని అన్నారు. అమెరికాలో ఉండి ఈబీ-5కి దరఖాస్తు చేసుకునే వారు కాన్సులేట్ సందర్శన అవసరం లేకుండానే ఐదు నెలల్లోపు వర్క్ ఆథరైజేషన్ పొందవచ్చని తెలిపారు.

ఆరోగ్య రంగానికి కేటాయింపులు పెంచితే మేలు



పోస్టర్లు విడుదల చేస్తున్న సాయిప్రసాద్, రమణయ్య, కామేశ్వరరావు, విజయ ప్రకాష్ తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: 2026-27 బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయింపులు భారీగా పెంచాల్సిన అవసరం ఉందని ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. యువతలో సహా గుండెపోట్లు పెరుగుతున్న నేపథ్యంలో 'గుండె జబ్బులు-కారణాలు-నివారణా మార్గాలు'.. అంశంపై ఈ నెల 22వ తేదీన ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్యవేదిక ఆధ్వర్యంలో ఆరోగ్య సదస్సు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఎంబీ విజ్ఞాన కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. వేదిక గౌరవ, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కేవీ సాయి ప్రసాద్, డాక్టర్ ఎంబీ రమణయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి కేటాయింపులు చాలా తక్కువగా ఉంటున్నట్లు చెప్పారు. 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి రూ.19,264 కోట్లు కేటాయించారని.. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఇది కేవలం 1.05 శాతం మాత్రమేనని చెప్పారు. గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక ఆరోగ్య ప్యాకేజీగా రూ.2 వేల కోట్లు కేటాయించి మౌలిక సదుపాయాలు, రవాణా సమస్యలను పరిష్కరించాలన్నారు. పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపాలను తగ్గించేందుకు పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్(పీడీఎస్)లో ఫోర్టిఫైడ్ ఆహారాలు, రాగులు, పప్పులు అందించాలన్నారు. వైద్య సిబ్బంది, వైద్యుల ఖాళీలను భర్తీ చేసి మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిని బలోపేతం చేయాలని డాక్టర్ సాయిప్రసాద్, రమణయ్యలు కోరారు. ఫిబ్రవరి 14న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో అధికార, ప్రతిపక్షాలు ఈ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి బలంగా చర్చించాలని ఎమ్మెల్యేలను కోరారు. సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలి



ఎస్టీయూ నాయకుల నిరసన

గాంధీనగర్, న్యూస్‌టుడే: 12వ వేతన సవరణ తక్షణమే అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ ఏపీ) జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, 11వ పీఆర్సీ కాలం ముగిసి 30 నెలలు గడిచినా ఇంకా 12వ పీఆర్సీ ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 30 శాతం తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.34 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు మంజూరు చేయాలని, 2004 ముందు నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగంలో చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర ఉద్యోగులకు, కేంద్రం ఇచ్చిన మెమో నంబర్ 57 ప్రకారం పాత పింఛను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి అనుగ్రహ ప్రసాద్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ సర్వీస్‌లో ఉన్న టీచర్స్‌కు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర నాయకులు అరుణ కిషోర్, బసవయ్యలు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో ఈ నెల 25న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర నాయకులు కొడాలి కిషోర్, కొదటి వెంకటేశ్వరరావు, శ్రీహరి, వేల్పుల వెంకటేశ్వర్లు, జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

అంతర్ వర్సిటీ నెట్‌బాల్ పోటీలకు సర్వం సిద్ధం



క్రీడాధికారులకు సూచనలిస్తున్న రాంజీ తదితరులు

విజయవాడ క్రీడలు, మచిలీపట్నం గ్రామీణం: కృష్ణా విశ్వవిద్యాలయం (కేఆర్‌యూ) ఆధ్వర్యంలో స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు జరిగే అఖిల భారత అంతర్ వర్సిటీ నెట్‌బాల్ (మహిళలు) పోటీలకు సర్వం సిద్ధం చేశామని వర్సిటీ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టోర్నీలో 88 జట్లు తలపడతాయని చెప్పారు. పోటీల ప్రారంభోత్సవానికి మంత్రులు లోకేశ్, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపీ శివనాథ్ తదితర ప్రజాప్రతినిధులు, శాప్ ఎండీ ఎస్.భరణి, ఉన్నత విద్యాశాఖ అధికారులు హాజరవుతారని తెలిపారు. రెక్టార్ ఆచార్య మండవ వెంకట బసవేశ్వరరావు మాట్లాడుతూ... నాలుగు మ్యాచ్ నిర్వహణ కోర్టులు, మరో రెండు ప్రాక్టీసు కోర్టులు సిద్ధం చేశామని తెలిపారు. ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్నాసమ్మ మాట్లాడుతూ.. క్రీడాకారిణులకు భద్రతతో కూడిన వసతి సదుపాయం కల్పించినట్లు తెలిపారు. వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు పూర్వ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ... పోటీలు నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. జాతీయ నెట్‌బాల్ సమాఖ్య అర్హత కలిగిన 30 మంది సాంకేతికాధికారులు పోటీల నిర్వహణలో భాగస్వాములవుతారని అన్నారు. ఏఐయూ పరిశీలకుడిగా విష్ణు చౌదరి నియమితులైనట్లు వెల్లడించారు. వర్సిటీ వ్యాయామ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, కార్యదర్శి బీసీహెచ్ సంగీతరావు, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జె.నవీన లావణ్యలత పాల్గొన్నారు. అనంతరం వీసీ నెట్‌బాల్ పోటీల ప్రాంగణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ కమిటీల బాధ్యులతో సమీక్షించారు. ఆతిథ్య కృష్ణా వర్సిటీ జట్టుకు స్పోర్ట్స్ కిట్ అందజేశారు. పోటీలు శనివారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

దరఖాస్తు చేశారా?

☛ ఐసీఎల్‌లో 88 అప్రెంటిస్ ఖాళీలు
చివరి తేదీ: 20.02.2026

☛ పంజాబ్ నేషనల్ బ్యాంకులో 5,138 ఖాళీలు
చివరి తేదీ: 24.02.2026

కరెంట్ అఫైర్స్



మాదిరి ప్రశ్నలు

◆ భారత తీర రక్షక దళం రూపొందించిన మొదటి కాలుష్య నియంత్రణ నౌక ఏది? (గోవా షిప్‌యార్డు లిమిటెడ్‌లో ఈ నౌకను నిర్మించారు.) జ: సముద్ర ప్రతాప్

◆ నియంత్రిత జంతు మార్పిడి కార్యక్రమం కింద ఇటీవల ఏ దేశం నుంచి ఎనిమిది బ్లాక్-క్యాప్డ్ కాపుచిన్ కోతులను బెంగళూరు సమీపంలోని బన్నేర్‌ఘట్ట బయోలాజికల్ పార్కు (బీబీపీ)నకు తరలించారు? జ: దక్షిణాఫ్రికా

◆ 'సెంటర్ ఫర్ రిసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ)' రిపోర్టు ప్రకారం 2025, నవంబరులో భారతదేశంలో అత్యంత కాలుష్య నగరం? జ: ఘజియాబాద్

◆ ఆస్ట్రేలియా విక్టోరియా యూనివర్సిటీ తన మొదటి భారత క్యాంపస్‌కు ఎక్కడ పునాది రాయి వేసింది? జ: గురుగ్రామ్

◆ భారతదేశంలోనే అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ ఇన్‌ల్యాండ్ రెయిన్‌బో ట్రౌట్ ఫామ్‌ను ఇటీవల ఏ రాష్ట్రంలో ప్రారంభించారు? (దేశంలో ట్రౌట్ చేపల పెంపకం ఎక్కువగా ఎత్తయిన హిమాలయ రాష్ట్రాలకే పరిమితమైంది. దక్కన్ పీఠభూమి వెచ్చటి వాతావరణంలో చల్లటి నీటి జాతి అయిన రెయిన్‌బో ట్రౌట్‌ను పెంచడానికి ఈ ప్రాజెక్టును రూపొందించారు.) జ: తెలంగాణ

మరింత సమాచారం

జూనియర్ ఇంటర్ — గణితం

త్రికోణమితీయ ప్రమేయాలు



ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

ఒక మార్కు

1. $\cos 5\pi$ యొక్క విలువ- ( )
   1) 0 2) 1 3) –1 4) ఏదీకాదు
2. $\cos 1^\circ \cos 2^\circ \cos 3^\circ .... \cos 179^\circ$ యొక్క విలువ.. ( )
   1) $\frac{1}{\sqrt{2}}$ 2) 0 3) 1 4) –1
3. $\sin\theta + \mathrm{cosec}\theta = 2$ అయితే $\sin^2\theta + \mathrm{cosec}^2\theta = ...$ ( )
   1) 1 2) 4 3) 2 4) ఏదీకాదు
4. $\tan\theta = \frac{1}{2}$, $\tan\phi = \frac{1}{3}$ అయితే $\theta + \phi$ యొక్క విలువ ( )
   1) $\frac{\pi}{6}$ 2) π 3) 0 4) $\frac{\pi}{4}$
5. $\frac{1-\tan^2 15^\circ}{1+\tan^2 15^\circ}$ యొక్క విలువ... ( )
   1) 1 2) $\sqrt{3}$ 3) $\frac{\sqrt{3}}{2}$ 4) 2
6. $\sin(45^\circ + \theta) - \cos(45^\circ - \theta)$ యొక్క విలువ ( )
   1) $2\cos\theta$ 2) $2\sin\theta$ 3) 1 4) 0
7. $\sin 50^\circ - \sin 70^\circ + \sin 10^\circ$ యొక్క విలువ ( )
   1) 1 2) 0 3) $\frac{1}{2}$ 4) 2
8. $\sin 2\theta + \cos\theta = 1$ అయితే $\sin 2\theta$ యొక్క విలువ ( )
   1) 1 2) $\frac{1}{2}$ 3) 0 4) –1
9. $40^\circ 20'$ లను రేడియన్ కొలతలోకి మార్చండి.

సాధన: $40^\circ 20' = 40\frac{1}{3} = \frac{121^\circ}{3} = \frac{121}{3} \times \frac{\pi}{180}$ రేడియన్
$= \frac{121\pi}{540}$ రేడియన్లు

10. 25° డిగ్రీల్లోని కొలతలకు అనుగుణమయ్యే రేడియన్ల కొలతలను కనుక్కోండి.

సాధన: $25^\circ = 25 \times \frac{\pi}{180} = \frac{5\pi}{36}$

2 మార్కులు

1. ఒక చక్రం నిమిషానికి 360° భ్రమణాలు చేస్తుంది. అది ఒక సెకనులో ఎన్ని రేడియన్లు తిరుగుతుంది?

సాధన: ఒక నిమిషంలో భ్రమణాల సంఖ్య = 360°
ఒక సెకనులో భ్రమణాల సంఖ్య = $\frac{360^\circ}{60} = 6^\circ$
6 భ్రమణాలు = $6 \times 2\pi = 12\pi$ రేడియన్లు
ఒక సెకనులో తిరిగే రేడియన్లు $= 12\pi$.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: యు. ప్రసన్న కుమార్

భాగిస్తే వచ్చే శేషం విషమం!

పండగలు, సెలవులు, పుట్టిన రోజులు ఏ తేదీల్లో, ఏయే వారాల్లో, ఎప్పుడు వచ్చాయా అని అందరూ తరచూ క్యాలెండర్లు వెతుకుతుంటారు. ఆ తేదీల పట్టిక లేకపోతే ఎవరికీ రోజు గడవదు. భూత, భవిష్యత్తు, వర్తమానాలను ఏడు వారాల్లో బంధించి ప్రదర్శిస్తూ, ప్రతి ఒక్కరి జీవితాల్లో భాగమైన క్యాలెండర్‌పై పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతుంటారు. అభ్యర్థుల తార్కిక ఆలోచన సామర్థ్యాన్ని పరీక్షిస్తూ, తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టే ఈ అధ్యాయంపై పట్టు పెంచుకోవాలంటే సాధారణ, లీపు సంవత్సరాలను గుర్తించడం నేర్చుకోవాలి. ముఖ్యంగా విషమ రోజులను గణించడంపై అవగాహన పెంపొందించుకోవాలి. రోజు, నెల, శతాబ్దపు కోడ్‌లను గుర్తుంచుకోవాలి.



జనరల్ స్టడీస్ — రీజనింగ్

క్యాలెండర్

వారానికి ఉన్న రోజులు 7.

విషమ దినాలు: ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చే శేషాన్ని 'విషమ దినాలు' లేదా 'అదనపు రోజులు' అంటారు.

ఉదా: 366 రోజులకు ఉన్న విషమ దినాలు ఎన్ని?



7) 366 (52
35
16
14
2

∴ లీపు సంవత్సరం (366 రోజులు)లో 52 వారాలు + 2 విషమ దినాలు ఉంటాయి. ★ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వాడుకలో ఉన్న క్యాలెండర్ గ్రెగోరియన్ క్యాలెండర్. దీని ప్రకారం 01-01-01 నాడు సోమవారం. ★ ప్రతీ సంవత్సరంలో 12 నెలలు ఉంటాయి. వీటిలో 7 నెలలు 31 రోజులను, 4 నెలలు 30 రోజులను, ఒక నెల 28 లేదా 29 రోజులను కలిగి ఉంటుంది.

శతాబ్ది సంవత్సరాలు: 100తో నిశ్శేషంగా భాగించే సంవత్సరాలను 'శతాబ్ది సంవత్సరాలు' అంటారు.

ఉదా: 100, 400, 900, 1900, 2000, 2100.

సాధారణ సంవత్సరం:

★ సాధారణ సంవత్సరంలో 365 రోజులు ఉంటాయి. వీటిలో 52 వారాలు, ఒక అదనపు రోజు ఉంటుంది.

★ సాధారణ సంవత్సరం ఏ రోజుతో అయితే ప్రారంభమవుతుందో అదే రోజుతో ముగుస్తుంది.

ఉదా: 01-01-2026 నాడు గురువారం కాబట్టి 31-12-2026 కూడా గురువారం అవుతుంది.

★ సాధారణ సంవత్సరంలో జనవరి, అక్టోబరు నెలలు ఒకే క్యాలెండర్‌ను పోలి ఉంటాయి.

★ సాధారణ సంవత్సరాలను 4తో నిశ్శేషంగా భాగించవచ్చు. ★ సాధారణ సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి, నవంబరు నెలలు ఒకే రోజుతో ప్రారంభమవుతాయి.

నెల	రోజులు	అదనపు రోజులు	కోడ్
జనవరి	31	3	1
ఫిబ్రవరి	28/29	0/1	4
మార్చి	31	3	4
ఏప్రిల్	30	2	0
మే	31	3	2
జూన్	30	2	5
జులై	31	3	0
ఆగస్టు	31	3	3
సెప్టెంబరు	30	2	6
అక్టోబరు	31	3	1
నవంబరు	30	2	4
డిసెంబరు	31	3	6

లీపు సంవత్సరం:



★ లీపు సంవత్సరంలో 366 రోజులు ఉంటాయి. వీటిలో 52 వారాలు, రెండు అదనపు రోజులు ఉంటాయి. ★ సాధారణంగా లీపు సంవత్సరం ఏ రోజుతో ప్రారంభమవుతుందో ఆ తర్వాత రోజుతో ముగుస్తుంది.

ఉదా: 01-01-2028 నాడు శనివారం కాబట్టి, 31-12-2028 నాడు ఆదివారం అవుతుంది.

★ లీపు సంవత్సరాలను 400 తో నిశ్శేషంగా భాగించవచ్చు.

ఉదా: 400, 800, 1200, 1600, 2000, 2400

గమనిక: ఏ సంవత్సరంలో అయినా ఏప్రిల్, జులై; మార్చి, నవంబరు; సెప్టెంబరు, డిసెంబరు నెలల క్యాలెండర్లు ఒకేలా ఉంటాయి.

రోజులు	కోడ్
శనివారం	0
ఆదివారం	1
సోమవారం	2
మంగళవారం	3
బుధవారం	4
గురువారం	5
శుక్రవారం	6

శతాబ్దాలు	కోడ్
1400 - 1499	2
1500 - 1599	0
1600 - 1699	6
1700 - 1799	4
1800 - 1899	2
1900 - 1999	0
2000 - 2099	6
2100 - 2199	4

రోజును కనిపెట్టే సూత్రం:

$$\frac{\text{తేదీ} + \text{సంవత్సరాలు} + \text{లీపు సంవత్సరాలు} + \text{నెల కోడ్} + \text{శతాబ్దం కోడ్}}{7}$$

పై సూత్రంలో విలువలను ప్రతిక్షేపించి 7తో భాగిస్తే వచ్చే శేషాన్ని మాత్రమే పరిగణించాలి.



మాదిరి ప్రశ్నలు

టైపు - I

1. 02–10–2026 నాడు ఏ వారం?
   1) ఆదివారం 2) శుక్రవారం 3) శనివారం 4) సోమవారం

వివరణ: తేదీ = 2
సంవత్సరాలు = 26
లీపు సంవత్సరాలు = 6
అక్టోబరు కోడ్ = 1
శతాబ్దం కోడ్ = 6
$= \frac{2+26+6+1+6}{7} = \frac{41}{7}$
శేషం = 6
∴ శుక్రవారం జ: 2

2. 15–01–2024 నాడు ఏ వారం?
   1) శనివారం 2) సోమవారం 3) ఆదివారం 4) మంగళవారం

వివరణ:
తేదీ = 15, సంవత్సరాలు = 24,
లీపు సంవత్సరాలు = 6,
జనవరి కోడ్ = 1,
శతాబ్దం కోడ్ = 6
$= \frac{15+24+6+1+6}{7} = \frac{52}{7}$
శేషం = 3 = 3 – 1 = 2
∴ సోమవారం జ: 2

గమనిక: ఇచ్చిన సంవత్సరం లీపు సంవత్సరమై, అడిగిన తేదీ జనవరి లేదా ఫిబ్రవరి నెలలో ఉంటే శేషాన్ని '1' తగ్గించాలి.

టైపు - 2

సంవత్సరాన్ని పోలిన సంవత్సరాన్ని కనుక్కోవడానికి కింది విధానం పాటించాలి. ★ లీపు సంవత్సరం తర్వాత సంవత్సరాన్ని పోలిన సంవత్సరాన్ని కనుక్కోవడానికి 6 కలపాలి. ★ లీపు సంవత్సరం తర్వాత 2వ, 3వ సంవత్సరాలను పోలిన సంవత్సరాలను కనుక్కోవడానికి 11 కలపాలి. ★ లీపు సంవత్సరాన్ని పోలిన సంవత్సరాన్ని కనుక్కోవడానికి దానికి 28 కలపాలి.

3. 2026వ సంవత్సరాన్ని పోలిన సంవత్సరం వెంటనే మళ్లీ ఎప్పుడు వస్తుంది?
   1) 2036 2) 2037 3) 2035 4) 2030



వివరణ: 2026 అనేది లీపు సంవత్సరం తర్వాత వచ్చే 2వ సంవత్సరం (2024 + 2) ∴ 2026 + 11 = 2037
∴ 2026వ సంవత్సరాన్ని పోలిన సంవత్సరం 2037. జ: 2

4. 2021వ సంవత్సరాన్ని పోలిన సంవత్సరం మళ్లీ ఎప్పుడు వస్తుంది?
   1) 2026 2) 2024 3) 2028 4) 2027

వివరణ: 2021 అనేది లీపు సంవత్సరం తర్వాత వచ్చే మొదటి సంవత్సరం (2020 + 1)
∴ 2021 + 6 = 2027 జ: 4



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

బోర్‌జాన్‌లో బొగ్గు.. మంగంపేటలో సున్నపురాయి!

సహజ వనరుల్లో ఆర్థికంగా విలువైనవి ఖనిజాలు. అలాంటి ఖనిజ నిక్షేపాలు భారతదేశంలో పుష్కలంగా ఉన్నాయి. బొగ్గు, ఇనుము, బాక్సైట్, మాంగనీస్, మైకా, రాగి, సున్నపురాయి, పెట్రోలియం, సహజవాయువు, థోరియం మొదలైన ఖనిజాలెన్నో ఇక్కడ లభిస్తున్నాయి. పారిశ్రామిక ప్రగతికి కీలకమైన ఆ సహజ వనరులు దేశవ్యాప్తంగా ఏయే ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో ఎక్కువగా దొరుకుతున్నాయి, వాటి నాణ్యత, ఉపయోగాలు, ఖనిజ ఆధారిత పరిశ్రమలు తదితరాలపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని పోటీ పరీక్షార్థులు పెంపొందించుకోవాలి. రాష్ట్రాల వారీగా ప్రధాన గనులతో పాటు పెట్రోలియం శుద్ధి, థర్మల్ కేంద్రాలు, అణు ఇంధన కేంద్రాలు ఉన్న ప్రాంతాల వివరాలను తెలుసుకోవాలి.



బోర్‌జాన్‌లోని బొగ్గు గనులు




మంగంపేటలోని సున్నపురాయి గనులు

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

ఖనిజాలు

1. కింది వాటిలో ఇనుము లేదా ఇనుప ఖనిజానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.



మాగ్నటైట్

ఎ) ఇనుము రకాల్లో మాగ్నటైట్ అత్యంత నాణ్యమైంది గా ఉంటూ అధికంగా ధార్వాడ్ శిలల్లో లభిస్తుంది.
బి) ఇనుము రకాల్లో లిమోనైట్‌ను 'ద్రవీకృత ఐరన్ ఆక్సైడ్' అని పిలుస్తారు. ఇది అవక్షేప శిలల్లో లభిస్తుంది.
సి) ఇనుము రకాల్లో హెమటైట్ రకాన్నే 'ఐరన్ ఆక్సైడ్' అని పిలుస్తారు. ఇది పూర్తిగా ఎరుపు రంగులో ఉంటుంది.
డి) సిడరైట్ రకం ఇనుమును 'కర్బన ఇనుము' అని పిలుస్తారు. దీనిలో మలిన పదార్థాలు అధికంగా ఉంటాయి.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

2. కింది వాటిని జతపరచండి.

రాగి గని	రాష్ట్రం
ఎ) బిల్వారా	1) కర్ణాటక
బి) మలజ్‌ఖండ్	2) ఝార్ఖండ్
సి) హజారీబాగ్	3) మధ్యప్రదేశ్
డి) హసన్	4) రాజస్థాన్

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-4, బి-1, సి-3, డి-2

3. కింది వాక్యాలను సరిచూడండి.



ఎ) క్రోమియాన్ని అధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం ఒడిశా. ఇది క్రోమైట్ ధాతువు నుంచి లభిస్తుంది.
బి) క్రోమియాన్ని వైద్య పరికరాలు, వంటపాత్రల తయారీకి ఉపయోగిస్తారు.
సి) రాగికి అత్యధిక ఉష్ణ, విద్యుత్తు వాహకత ఉంటుంది. దీనికి మెత్తటి సాగే గుణం ఉంటుంది.
డి) రాగి ఖనిజాన్ని రైల్వేలు, పవర్ కేబుళ్లు, రక్షణ, అంతరిక్ష కార్యక్రమాలకు ఉపయోగిస్తారు.
1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

4. కింది వాటిని జతపరచండి.

బొగ్గు గని	రాష్ట్రం
ఎ) ఉమారియా	1) పశ్చిమ బెంగాల్
బి) బిరంపుర్	2) ఝార్ఖండ్
సి) రాయ్‌గఢ్	3) మధ్యప్రదేశ్
డి) జల్పాయ్‌గురి	4) ఛత్తీస్‌గఢ్

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-3, బి-4, సి-2, డి-1

5. కింది వాక్యాలను సరిచూడండి.



ఆంత్రసైట్

ఎ) బొగ్గురకాల్లో ఆంత్రసైట్ రకం అత్యుత్తమమైంది. వాణిజ్యపరంగా అత్యంత విలువైంది.
బి) లిగ్నైట్ రకం బొగ్గులో దాదాపుగా 40% - 55% కార్బన్ ఉంటుంది.
సి) బిట్యుమినస్ రకం బొగ్గులో దాదాపుగా 15% - 40% తేమ ఉంటుంది.
డి) మన దేశంలో బొగ్గు ప్రధానంగా రెండు యుగాలకు సంబంధించిందిగా ఉంది. అందులో ఒకటి గోండ్వానా యుగం బొగ్గు, రెండు టెర్షియరీ యుగం బొగ్గు.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

6. కింది వాటిలో టెర్షియరీ కాలం నాటి బొగ్గు గనులను, వాటి రాష్ట్రాలతో జతపరచండి.

బొగ్గు గని	రాష్ట్రం
ఎ) బల్‌పక్రం	1) హిమాచల్‌ప్రదేశ్
బి) పలనా	2) నాగాలాండ్
సి) బోర్‌జాన్	3) రాజస్థాన్
డి) చంబ	4) మేఘాలయ

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-1, బి-4, సి-3, డి-2
3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-4, బి-3, సి-2, డి-1

7. కింది వాక్యాలను సరిచూడండి.



ముగ్గురాయి

ఎ) ముగ్గురాయి ప్రధానంగా బేరియానికి ముడి సరకు. ఇది సాధారణంగా తెలుపు రంగులో ఉంటుంది.
బి) బేరియం మూలకాన్ని వైద్య పరీక్షల్లో వినియోగిస్తారు. దీన్ని ఇనుము, మాంగనీస్ తయారీలో ఉపయోగిస్తారు.
సి) సాధారణంగా జిప్సంను ఊసర (చవుడు) మృత్తికల పునరుజ్జీవనానికి ఉపయోగిస్తారు. సిమెంట్, ఎరువుల పరిశ్రమల్లో ఉపయోగిస్తారు.
డి) టంగ్‌స్టన్ ద్రవీభవన ఉష్ణోగ్రత ఇతర లోహాల కంటే ఎక్కువ.
1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

8. కింది వాటిని జతపరచండి.

సున్నపురాయి గని	రాష్ట్రం
ఎ) తుమకూరు	1) ఆంధ్రప్రదేశ్
బి) ఆల్వార్	2) గుజరాత్
సి) అమ్రేలి	3) కర్ణాటక
డి) మంగంపేట	4) రాజస్థాన్

1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-2, సి-3, డి-4

9. కింది వాటిలో సహజ వాయువుకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.



ఎ) సహజ వాయువులో దాదాపుగా 95% మీథేన్ ఉంటుంది. దీన్ని పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించవచ్చు.
బి) సహజ వాయువును ఒక చోటు నుంచి మరొక చోటుకు రవాణా చేయడానికి 'గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్)'ను 1984లో ఏర్పాటు చేశారు.
సి) సహజ వాయువును ప్రధానంగా రసాయనిక ఎరువుల తయారీ, విద్యుత్తు ఉత్పత్తి, వంటగ్యాస్ లాంటి వాటి కోసం వినియోగిస్తారు.
డి) సహజ వాయువును మనదేశంలో మొదటగా హిమాచల్‌ప్రదేశ్‌లోని జ్వాలాముఖి అనే ప్రాంతంలో కనుక్కున్నారు.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

10. కింది వాటిని జతపరచండి.

సహజవాయువు లభించే ప్రాంతం	రాష్ట్రం
ఎ) మోర	1) మహారాష్ట్ర
బి) బర్మార్	2) అరుణాచల్‌ప్రదేశ్
సి) నామ్‌చిక్	3) రాజస్థాన్
డి) బాంబే హై	4) అస్సాం

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-4, సి-3, డి-2
3) ఎ-1, బి-2, సి-4, డి-3 4) ఎ-1, బి-2, సి-3, డి-4

11. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) మనదేశంలో మొదటి అల్యూమినియం పరిశ్రమ పశ్చిమ బెంగాల్‌లో జయక్ నగర్‌లో 1937లో ఏర్పాటు చేశారు.
బి) అల్యూమినియాన్ని వాహన విడిభాగాల తయారీ, రేకులు, వంట పాత్రల తయారీలో ఉపయోగిస్తారు.
సి) తగరాన్ని ప్రధానంగా కాస్సిటరైట్ ధాతువు నుంచి సంగ్రహిస్తారు.
డి) ఔషధాలు, రసాయనాల నిల్వకు కూడా తగరాన్ని వినియోగిస్తారు.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

12. కింది వాటిని జతపరచండి.

బాక్సైట్ గనులు	రాష్ట్రాలు
ఎ) బోలంగీర్	1) మహారాష్ట్ర
బి) ముంగీర్	2) మధ్యప్రదేశ్
సి) కట్నీ	3) ఝార్ఖండ్
డి) కొలాబ	4) ఒడిశా

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-3 సి-2, డి-4 4) ఎ-4, బి-3, సి-2, డి-1

13. కింది వాక్యాలను సరిచూడండి.



ఎ) కహల్‌గాన్ థర్మల్ పవర్ స్టేషన్ బిహార్‌లో ఉంది.
బి) సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లు అంటే వీటి విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 1000 మెగావాట్ల కంటే ఎక్కువ.
సి) మన దేశంలో వెండిని అధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం రాజస్థాన్. ఈ రాష్ట్రంలో జవార్ మైన్స్ ముఖ్యమైనవి.
డి) వజ్రాలకు ప్రసిద్ధి చెందిన రాష్ట్రం మధ్యప్రదేశ్. ఇక్కడ ప్రధాన గనులు పన్నా మైన్స్.
1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

14. కింది వాటిని జతపరచండి.

భారజల కేంద్రం	రాష్ట్రాలు
ఎ) థాల్	1) పంజాబ్
బి) మణుగూరు	2) గుజరాత్
సి) హజీరా	3) తెలంగాణ
డి) నంగల్	4) మహారాష్ట్ర


1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-4, బి-2, సి-1, డి-3
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2

15. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) ఇల్మనైట్ అనే అణుఇంధన ఖనిజం అధికంగా ద్వీపకల్ప పీఠభూమిలో కేరళ, తమిళనాడు తీర ప్రాంతంలో లభిస్తుంది.
బి) థోరియం అనే అణుఇంధన ఖనిజం మోనోజైట్ ఇసుక నుంచి లభిస్తుంది. ప్రపంచంలో అధిక నిల్వలు ఇండియాలో ఉన్నాయి.
సి) సాధారణంగా ద్రవరూపంలోని పెట్రోలియాన్ని 'క్రూడ్ ఆయిల్' అంటారు. అర్ధ ఘనస్థితి నుంచి ఘనస్థితి వరకు ఉన్న పెట్రోలియాన్ని తార్, పిచ్‌లేక్, బిట్యుమినస్ పేర్లతో పిలుస్తారు.
డి) గుజరాత్‌లోని జామ్‌నగర్ సెజ్ అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారం.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.

16. కింది వాటిని జతపరచండి.

సంస్థ	ప్రదేశం
ఎ) కోల్ ఇండియా లిమిటెడ్	1) సింగ్రౌలి
బి అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్	2) ధన్‌బాద్
సి) భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్	3) హైదరాబాద్
డి) నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్	4) కోల్‌కతా

1) ఎ-3, బి-4, సి-2, డి-1
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2
4) ఎ-1, బి-3, సి-4, డి-2



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-2; 2-1; 3-3; 4-4; 5-1; 6-4; 7-3; 8-1; 9-1; 10-1; 11-2; 12-4; 13-3; 14-1; 15-1; 16-2.



చాంపియన్

ఇంగ్లాండ్‌ను నేపాల్, దక్షిణాఫ్రికాను అఫ్గానిస్థాన్ వణికించాయి. భారత్‌ను అమెరికా, పాకిస్థాన్‌ను నెదర్లాండ్స్ భయపెట్టాయి. మిగతా చిన్న జట్లు సత్తా చాటాయి. కానీ వాటిలో ఏ జట్టూ గెలుపు తీరాన్ని మాత్రం చేరలేకపోయింది. అయితే టీ20 ప్రపంచకప్‌లో ఏదో రోజు మాత్రం కథ మారింది. జింబాబ్వే పెను సంచలనం సృష్టించింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఆస్ట్రేలియాకు ఆ జట్టు షాకిచ్చి ప్రకంపనలు రేపింది. ఏదో త్రుటిలో గెలిచేయడం కాదు.. అన్ని రంగాల్లో ఆధిపత్యం చలాయిస్తూ కంగారూలను కోలుకోలేని దెబ్బ కొట్టింది ఆఫ్రికా జట్టు.

జింబాబ్వోయ్

- టీ20 ప్రపంచకప్‌లో పెను సంచలనం
- ఆస్ట్రేలియాపై ఆఫ్రికా జట్టు అద్భుత విజయం


ముజరబాని 4/17


డ్వార్షుయిస్ క్యాచ్ పడుతున్న మున్యోంగా

కొలంబో

ఐసీసీ టోర్నీలనగానే చెలరేగిపోయే ఆస్ట్రేలియాకు.. ఈసారి టీ20 ప్రపంచకప్ ఆరంభ దశలోనే భారీ షాక్ తగిలింది. శుక్రవారం గ్రూప్-బి మ్యాచ్‌లో జింబాబ్వే 23 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను మట్టికరిపించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లోనూ జింబాబ్వే.. కంగారూలపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం విశేషం. మొదట ఓపెనర్లు బ్రయాన్ బెనెట్ (64 నాటౌట్; 56 బంతుల్లో 7×4), మరుమాని (35; 21 బంతుల్లో 7×4)లతో పాటు ర్యాన్ బర్ల్ (35; 30 బంతుల్లో 4×4), సికందర్ రజా (25 నాటౌట్; 13 బంతుల్లో 2×4, 1×6) మెరుపులు మెరిపించడంతో జింబాబ్వే 2 వికెట్లకు 169 పరుగులు సాధించింది. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ముజరబాని (4/17), ఎవాన్స్ (3/23) విజృంభించడంతో ఆసీస్ 19.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. మ్యాట్ రెన్‌షా (65; 44 బంతుల్లో 5×4, 1×6) ఒంటరి పోరాటం చేశాడు.

దంచేసి.. కట్టేసి..: టోర్నీలో తన తొలి మ్యాచ్‌లో ఒమన్‌ను సునాయాసంగా ఓడించిన జింబాబ్వే.. రెండో మ్యాచ్‌లో ప్రత్యర్థి ఆస్ట్రేలియా అనేమీ బెదరలేదు. ఇటు బ్యాటర్లు, అటు బౌలర్లు ఎంతో ఆత్మవిశ్వాసంతో ఆడి జట్టును గెలిపించారు. మొదట ఓపెనర్లు బ్రయాన్ బెనెట్, మరుమానిల బెదురులేని బ్యాటింగ్ చూస్తేనే ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు సవాలు తప్పదని అర్థమైంది. తొలి రెండు ఓవర్లు ఆచితూచి ఆడిన ఈ జోడీ.. తర్వాత దూకుడు పెంచడంతో 7 ఓవర్లకు జింబాబ్వే 57/0తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. తర్వాతి ఓవర్లో మరుమాని ఔటైనా.. బర్ల్‌తో కలిసి బెనెట్ మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పడంతో ఆ జట్టు 15 ఓవర్లకు 125/1తో భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. బర్ల్ వెనుదిరిగినా బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ సికందర్ రజా చెలరేగడంతో, బెనెట్ కూడా ఆఖరిలో భారీ షాట్లు ఆడడంతో జింబాబ్వే.. ఆసీస్ ముందు సవాలు విసిరే లక్ష్యాన్ని నిలిపింది. అనంతరం కంగారూల ఛేదన ఏ దశలోనూ సాఫీగా సాగలేదు. పేసర్లు ముజరబాని, ఎవాన్స్.. అద్భుతమైన ఆరంభ స్పెల్స్‌తో ఆస్ట్రేలియాను కోలుకోలేని దెబ్బ తీశారు. ఒక సిక్సర్ బాది ఊపుమీద కనిపించిన ఇంగ్లిస్ (8).. ముజరబాని బౌలింగ్‌లో ఇంకో భారీ షాట్‌కు ప్రయత్నించి, డీప్ స్క్వేర్ లెగ్‌లో ముసికెవాకు దొరికిపోయాడు. ఎవాన్స్ వేసిన తర్వాతి ఓవర్లో గ్రీన్ (0) వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ వెంటనే డేవిడ్ కూడా డకౌటవడంతో ఆస్ట్రేలియాకు ఇంకో ఎదురుదెబ్బ తగిలింది. అయిదో ఓవర్లో (ముజరబాని) హెడ్ (17) ఔట్ కావడంతో ఆస్ట్రేలియాకు అతి పెద్ద షాక్. ఎడ్జ్ తీసుకున్న బంతి హెడ్ కాలికి తగిలి వికెట్లకు తాకడంతో అతను వెనుదిరగాల్సి వచ్చింది. 5 ఓవర్లకు 34/4కు చేరుకున్న ఆసీస్‌లో ఓటమి భయం మొదలైంది. మ్యాక్స్‌వెల్ (31), రెన్‌షా పోరాడడంతో కంగారూ జట్టు పుంజుకుంది. 12 ఓవర్లకు 105/4తో గెలుపు దిశగా సాగింది. రెండుసార్లు బౌండరీ వద్ద క్యాచ్‌ల ప్రమాదం తప్పించుకున్న మ్యాక్సీ.. బర్ల్ బౌలింగ్‌లో ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో బౌల్డవడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. తర్వాత వికెట్ల పతనం ఆగలేదు. బౌలింగ్ చేస్తూ గాయపడ్డ స్టాయినిస్ (6).. ఆ ఇబ్బంది లోనే ఒక పేలవ షాట్ ఆడి ఔటయ్యాడు. డ్వార్షుయిస్ (6).. మున్యోంగా పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరిగాడు. అయితే రెన్‌షా మాత్రం ఒక ఎండ్‌లో పోరాటం కొనసాగించాడు. చివరి 2 ఓవర్లలో 34 పరుగులు అవసరమైన స్థితిలో ఆసీస్ ఆశలన్నీ అతడి మీదే నిలిచాయి. అయితే 19వ ఓవర్లో గొప్పగా బౌలింగ్ చేసిన ముజరబాని.. రెన్‌షాతో పాటు జంపా (2)ను కూడా ఔట్ చేసి కంగారూల ఆశలకు తెరదించాడు. ఈ ఓవర్లో కేవలం 5 పరుగులే వచ్చాయి. చివరి ఓవర్ మూడో బంతికి కునెమన్ (0) రనౌటవడంతో ఆసీస్ కథ ముగిసింది.

జింబాబ్వే ఇన్నింగ్స్: బెనెట్ నాటౌట్ 64; మరుమాని (సి) ఇంగ్లిస్ (బి) స్టాయినిస్ 35; బర్ల్ (సి) బార్ట్‌లెట్ (బి) గ్రీన్ 35; రజా నాటౌట్ 25; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (20 ఓవర్లలో 2 వికెట్లకు) **169**
వికెట్ల పతనం: 1-61, 2-131
బౌలింగ్: డ్వార్షుయిస్ 4-0-40-0; స్టాయినిస్ 2.5-0-17-1; మ్యాక్స్‌వెల్ 1-0-14-0; కునెమన్ 3-0-24-0; ఎలిస్ 4-0-34-0; జంపా 4-0-31-0; గ్రీన్ 1.1-0-6-1
ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: ఇంగ్లిస్ (సి) ముసెకివా (బి) ముజరబాని 8; హెడ్ (బి) ఎవాన్స్ 17; గ్రీన్ (సి) మరుమాని (బి) ఎవాన్స్ 0; డేవిడ్ (సి) క్రీమర్ (బి) ముజరబాని 0; మ్యాక్స్‌వెల్ (బి) బర్ల్ 31; రెన్‌షా (సి) బర్ల్ (బి) ముజరబాని 65; స్టాయినిస్ (సి) ముసికెవా (బి) మసకద్జా 6; డ్వార్షుయిస్ (సి) మున్యోంగా (బి) ఎవాన్స్ 6; ఎలిస్ నాటౌట్ 7; జంపా (బి) ముజరబాని 2; కునెమన్ రనౌట్ 0; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (19.3 ఓవర్లలో ఆలౌట్) **146**
వికెట్ల పతనం: 1-13, 2-24, 3-25, 4-29, 5-106, 6-117, 7-131, 8-139, 9-141
బౌలింగ్: సికందర్ రజా 2-0-17-0; ముజరబాని 4-0-17-4; ఎవాన్స్ 3.3-0-23-3; మైయర్స్ 1-0-9-0; క్రీమర్ 4-0-33-0; మసకద్జా 4-0-36-1; బర్ల్ 1-0-9-1

అప్పుడు అలా..

టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాకు జింబాబ్వే షాకివ్వడం ఇదే తొలిసారి కాదు. 2007లో జరిగిన తొలి పొట్టి కప్పులోనూ కంగారూలను మట్టికరిపించిందా జట్టు. పాంటింగ్, గిల్‌క్రిస్ట్, హేడెన్, మైక్ హసి, బ్రెట్ లీ, మిచెల్ జాన్సన్ లాంటి దిగ్గజ ఆటగాళ్లతో కూడిన ఆసీస్.. అప్పుడు 5 వికెట్ల తేడాతో ఓడింది. మొదట ఆసీస్ 138/9 పరిమితం కాగా.. లక్ష్యాన్ని మరో బంతి మిగిలుండగా జింబాబ్వే 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆ రోజు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన బ్రెండన్ టేలర్.. ఈసారి కూడా ప్రపంచకప్‌నకు వచ్చాడు. ఒమన్‌తో తొలి మ్యాచ్ ఆడాడు. అయితే గాయం కారణంగా అతను మిగతా టోర్నీకి దూరమయ్యాడు.

మనోడు దంచేశాడు

- అర్ధసెంచరీతో మెరిసిన సాయితేజ
- విజృంభించిన హర్మీత్
- నెదర్లాండ్స్‌పై అమెరికా గెలుపు


సాయితేజ 79

చెన్నై: తెలుగు కుర్రాడు సాయితేజ ముక్కమల్ల (79; 51 బంతుల్లో 5×4, 4×6) సత్తా చాటాడు. అమెరికాకు ప్రాతినిధ్యం వహిస్తున్న అతడు.. మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో ఆ జట్టు టీ20 ప్రపంచకప్‌లో ఘనంగా బోణీ కొట్టింది. శుక్రవారం గ్రూప్-ఎ మ్యాచ్‌లో అమెరికా 93 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను చిత్తు చేసింది. సాయితేజ మెరుపులతో మొదట అమెరికా 6 వికెట్లకు 196 పరుగులు చేసింది. శుభమ్ రంజానే (48 నాటౌట్), మోనాంక్ పటేల్ (36) కూడా రాణించారు. బాస్ డెలీడ్ (3/37) ఆకట్టుకున్నాడు. ఛేదనలో హర్మీత్ సింగ్ (4/21), స్కాల్‌వాక్ (3/21), మహ్మద్ మోసిన్ (2/19) విజృంభించడంతో నెదర్లాండ్స్ 15.5 ఓవర్లలో 103 పరుగులకే ఆలౌటైంది. బాస్ డెలీడ్ (23), స్కాట్ ఎడ్వర్డ్స్ (20) మాత్రమే పోరాడారు. మూడు మ్యాచ్‌లు ఆడిన అమెరికాకు ఇదే తొలి విజయం కాగా.. అన్నే మ్యాచ్‌లు ఆడిన నెదర్లాండ్స్ ఒక మ్యాచ్ నెగ్గి.. రెండింట్లో ఓడింది.

విజృంభించిన హర్మీత్: ఛేదనలో 4.5 ఓవర్లకు 41/1తో నెదర్లాండ్స్ మెరుగ్గానే కనిపించింది. ఈ స్థితిలో అమెరికా బౌలర్లు విజృంభించడంతో ఆ జట్టు బ్యాటర్లు క్యూకట్టారు. స్వల్ప వ్యవధిలో ఒడౌడ్ (13), ఆకర్‌మ్యాన్ (0)తో పాటు గత మ్యాచ్‌లో అర్ధసెంచరీతో మెరిసిన బాస్ డెలీడ్ వికెట్లు పడిపోయాయి. 6.3 ఓవర్లకు 53/4తో నెదర్లాండ్స్ కష్టాల్లో చిక్కుకుంది. ఆ తర్వాత ఆ జట్టు కష్టాలు పెరిగాయే తప్పా తగ్గలేదు. హర్మీత్ సింగ్, స్కాల్‌వాక్, మోసిన్ ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకున్న అమెరికా.. చిత్తుగా ఓడింది. అంతకుముందు అమెరికా ఆరంభం నుంచి దూకుడుగా ఆడింది. 2 ఓవర్లకు 23/0తో నిలిచింది. జహంగీర్ (20) ఔటైనా.. సాయితేజ, కెప్టెన్ మోనాంక్ పటేల్ జోరును కొనసాగించారు. చక్కని షాట్లు ఆడిన సాయితేజ.. క్లాసెన్ వేసిన ఆరో ఓవర్లో సిక్స్, ఫోర్ బాదాడు. ఆర్యన్ బౌలింగ్‌లో మోనాంక్ కూడా ఓ బంతిని స్టాండ్స్‌లోకి కొట్టాడు. మోనాంక్‌ను ఔట్ చేయడం ద్వారా డెలీడ్.. నెదర్లాండ్స్‌కు బ్రేక్ ఇచ్చాడు. వికెట్‌పడినా.. సాయితేజ షాట్లు ఆపలేదు. క్లెయిన్ బౌలింగ్‌లో ఓ మెరుపు సిక్స్‌తో 30 బంతుల్లో అర్ధసెంచరీ చేశాడు. శతకం చేసేలా కనిపించిన సాయి.. డెలీడ్ బౌలింగ్‌లో ఓ భారీ షాట్ ఆడే ప్రయత్నంలో ఔటయ్యాడు. శుభమ్ రంజానే ధాటిగా ఆడడంతో అమెరికా 200కు చేరువగా స్కోరు చేసింది.

అమెరికా: 196/6 (సాయితేజ 79, శుభమ్ రంజానే 48 నాటౌట్, మోనాంక్ 36, షాయన్ జహంగీర్ 20; బాస్ డెలీడ్ 3/37) **నెదర్లాండ్స్:** 15.5 ఓవర్లలో 103 ఆలౌట్ (బాస్ డెలీడ్ 23, స్కాట్ ఎడ్వర్డ్స్ 20; హర్మీత్ సింగ్ 4/21, స్కాల్‌వాక్ 3/21, మోసిన్ 2/19)

అమెరికా క్రికెట్లో తెలుగుతేజం

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేసే తెలుగు వాళ్లు లక్షల్లో ఉంటారు. ఇంకా అక్కడ డాక్టర్లు, వ్యాపారవేత్తల్లోనూ ఎంతోమంది తెలుగువాళ్లున్నారు. ఇలా అగ్రరాజ్యంలో అనేక రంగాల్లో తెలుగువాళ్లు సత్తా చాటుతున్నారు. ఇప్పుడు అమెరికా క్రికెట్లోనూ ఓ తెలుగు కుర్రాడు తనదైన ముద్ర వేస్తున్నాడు. తన పేరు సాయితేజ ముక్కమల్ల.

ఈసారి టీ20 ప్రపంచకప్‌లో పేరుకు చిన్న జట్టే కానీ.. ఆటతో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది అమెరికా. భారత్, పాకిస్థాన్‌లకు గట్టి పోటీ ఇచ్చిన యుఎస్.. మూడో మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై సాధికార విజయం సాధించింది. ఆ జట్టులో దాదాపుగా అందరూ వలస ఆటగాళ్లే. అందులో భారత మూలాలున్న ఆటగాళ్లే ఏడుగురు. వారితో తెలుగువాడైన సాయితేజ.. శుక్రవారం 51 బంతుల్లో 79 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతను నాలుగేళ్లుగా అమెరికాకు ప్రాతినిధ్యం వహిస్తుండడం విశేషం. ఇప్పటికే 37 వన్డేలు, 19 టీ20లు ఆడిన సాయితేజ.. టాప్‌ఆర్డర్లో కీలక బ్యాటర్‌గా ఎదిగాడు. వన్డేల్లో అతను 3 శతకాలు, 7 అర్ధశతకాలు సహా 39.21 సగటుతో 1255 పరుగులు చేశాడు. టీ20ల్లో 40.06 సగటుతో 641 పరుగులు రాబట్టాడు. అందులో ఒక శతకం, 5 అర్ధశతకాలున్నాయి. అయితే ఇప్పటిదాకా ఎలా ఆడినా.. టీ20 ప్రపంచకప్‌లో, అది కూడా భారత్‌లో జరుగుతున్న టోర్నీలో సత్తా చాటడం సాయితేజకు ఎంతో ప్రత్యేకం.

సాయితేజ పుట్టింది, పెరిగింది అమెరికాలోనే. అతడి తల్లిదండ్రులు నాగేశ్వరరెడ్డి, లక్ష్మి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన నాగేశ్వర్ ఉద్యోగరీత్యా మూడు దశాబ్దాల కిందటే అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడ్డారు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా, సంజామల మండలంలోని కమలపురి. నాగేశ్వర్‌కు క్రికెట్ అంటే పిచ్చి. అమెరికాకు వెళ్లినా భారత జట్టు ఆడే ప్రతి క్రికెట్ మ్యాచ్ చూసేవారు. సాయితేజకు ఏడేళ్ల వయసుండగా.. తండ్రితో పాటు 2011 వన్డే ప్రపంచకప్ చూశాడు. భారత జట్టు విజేతగా నిలిచిన ఆ టోర్నీలో మ్యాచ్‌లు చూస్తూ తండ్రి తీవ్ర భావోద్వేగానికి గురి కావడం చూసి అతడికీ క్రికెట్ మీద ప్రేమ పుట్టింది. కొడుకు ఆసక్తిని గమనించి న్యూజెర్సీలోని డ్రీమ్ క్రికెట్ అకాడమీలో చేర్పించారు నాగేశ్వర్. అక్కడే అర్ల్ డైలీ అనే కోచ్ దగ్గర ఆటలో ఓనమాలు నేర్చుకున్న సాయితేజ.. తర్వాత భారత మాజీ ఆటగాడు, అమెరికాలో కోచ్‌గా మారిన అశోక్ పటేల్ చేతుల్లో పడ్డాడు. పదేళ్ల పాటు ఆయన శిక్షణలోనే రాటుదేలాడు. ఈ క్రమంలో భారత్, ఇంగ్లాండ్, గయానా, కెనడా లాంటి దేశాలు తిరిగి టోర్నీలు ఆడడంతో పాటు సాధన చేశాడు. అంతర్జాతీయ క్రికెటర్ కావాలన్న కొడుకు తపనను గుర్తించిన నాగేశ్వర్.. ఉద్యోగంలో ఉన్నత స్థాయిని వదులుకుని, జీతం తగ్గించుకుని.. 2018లో అంతర్గత బదిలీతో హైదరాబాద్‌కు వచ్చి ఏడాది పాటు అక్కడే ఉన్నారు. భార్య, ఇద్దరు అమ్మాయిలను న్యూజెర్సీలోనే ఉండనిచ్చి తాను మాత్రం కొడుకుతో పాటు భాగ్యనగరంలో ఉన్నారు. అక్కడ వీవీఎస్ లక్ష్మణ్ అకాడమీలో కొడుక్కి శిక్షణ ఇప్పించారు. ఇక్కడ ఆటకు మరింత మెరుగులు దిద్దుకున్న సాయితేజ.. అమెరికాకు వెళ్లి స్థానిక లీగ్స్‌లో రాణించడంతో 2022లో జాతీయ జట్టులో చోటు దక్కింది. తర్వాతి ఏడాది మొదలైన మేజర్ క్రికెట్ (ఎంఎల్‌సీ)లో అదరగొట్టడం, అంతర్జాతీయ క్రికెట్లోనూ రాణించడంతో అమెరికా జట్టులో రెగ్యులర్ ఆటగాడిగా మారాడు. ఎంఎల్‌సీలో టెక్సాస్ సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అతను.. ప్రపంచకప్ ఆరంభం కావడానికి ముందు చెన్నైకి వచ్చి చెన్నై సూపర్‌కింగ్స్ శిబిరంలో రెండు వారాలు గడపడం అతడికి కలిసొచ్చింది. ఆ అనుభవమే ఇప్పుడు ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌పై మెరుపు ఇన్నింగ్స్ ఆడేందుకు తోడ్పడింది.

"సాయితేజ ఈ స్థాయికి వచ్చాడంటే అందులో అతడి కష్టమే ఎక్కువ. తల్లిదండ్రులుగా తన తపనకు మా ప్రోత్సాహం తోడైంది అంతే. క్రికెట్ అంటే నాకున్న పిచ్చి వల్లే మా అబ్బాయికీ ఆ ఆట మీద ఇష్టం ఏర్పడింది. తన ఆసక్తిని గుర్తించి అండగా నిలిచాం. మధ్యతరగతి వాళ్లకు పిల్లల కెరీర్ కంటే ముఖ్యమైంది ఏదీ ఉండదు. అందుకే సాయి కోసం నా జీతంలో నాలుగింట మూడొంతులు తగ్గించుకుని, ఉన్నత స్థాయిని వదులుకుని హైదరాబాద్‌కు వచ్చి ఏడాది పాటు ఇక్కడే ఉన్నా. అశోక్ పటేల్, అర్ల్, దయానంద్, మూర్తి లాంటి కోచ్‌లు వివిధ స్థాయిల్లో సాయికి అండగా నిలిచారు. సీఎస్‌కే శిబిరంలో అశ్విన్ సైతం తనకు సాయం చేశాడు. సాయి ఆట మెరుగవడంలో లక్ష్మణ్ అకాడమీ పాత్ర ఎంతో కీలకం"
– నాగేశ్వరరెడ్డి

– ఈనాడు క్రీడా విభాగం, ఈనాడు డిజిటల్ – హైదరాబాద్

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

మ్యాచ్	వేదిక
ఐర్లాండ్ × ఒమన్	వేదిక: కొలంబో, ఉ॥ 11.00
ఇంగ్లాండ్ × స్కాట్లాండ్	వేదిక: కోల్‌కతా, మ॥ 3.00
న్యూజిలాండ్ × దక్షిణాఫ్రికా	వేదిక: అహ్మదాబాద్, రా॥ 7.00

లోటు డబ్బుకే.. ఆటకు కాదు

అంతర్జాతీయ క్రికెట్ ఆడి పేరు సంపాదిస్తే.. కోట్లల్లో డబ్బొస్తుంది. కోట్లాది అభిమానుల ఆదరణా దక్కుతుంది. జీవితానికి ఏ లోటూ ఉండదు. భారత్ సహా చాలా క్రికెట్ దేశాల ఆటగాళ్ల విషయంలో ఇది నిజమే. కానీ జింబాబ్వేలో మాత్రం కాదు! అక్కడ ఏడాదంతా ఆడినా.. వచ్చే ఆదాయం అంతంతమాత్రం. సరైన బ్యాట్లు, షూలు కూడా కొనుక్కోలేని దుస్థితి! ఇలాంటి పరిస్థితుల్లోనూ ఆటలో కొనసాగడానికి ఎంత తపన ఉండాలి? మేటి క్రికెట్ జట్లను దీటుగా ఎదుర్కోవాలంటే ఎంత సామర్థ్యముండాలి? ఆ తపన, సామర్థ్యం ఉండబట్టే.. శుక్రవారం ఆస్ట్రేలియా లాంటి మేటి జట్టును ఓడించింది జింబాబ్వే.


ర్యాన్ బర్ల్

ఆస్ట్రేలియాపై సంచలన విజయంలో కీలక పాత్ర పోషించిన జింబాబ్వే ఆల్‌రౌండర్ ర్యాన్ బర్ల్.. కొన్నేళ్ల ముందు సామాజిక మాధ్యమంలో ఒక ఫొటోను పంచుకున్నాడు. అది చిరిగిపోయిన తన బూట్లకు సంబంధించిన చిత్రం. తనకు ఎవరైనా షూలను స్పాన్సర్ చేయాలంటూ అతను విజ్ఞప్తి చేశాడు. ఒక అంతర్జాతీయ క్రికెటర్ ఇంతటి దుస్థితిలో ఉంటాడని ఎవ్వరైనా ఊహించగలరా? వెంటనే ప్యూమా సంస్థ బర్ల్‌తో పాటు జింబాబ్వే ఆటగాళ్లందరికీ షూలను స్పాన్సర్ చేసింది. భారత జట్టు ఓసారి జింబాబ్వే పర్యటనకు వెళ్తే.. మన ఆటగాళ్లు తమ బ్యాట్లు, కిట్లను ఆ దేశ క్రికెటర్లకు బహుమతిగా ఇచ్చారు. రెండు దశాబ్దాల ముందు వరకు ప్రపంచ క్రికెట్లో పేరున్న జట్లలో జింబాబ్వే ఒకటి. ఫ్లవర్ సోదరులకు తోడు హీత్ స్ట్రీక్, హెన్రీ ఒలాంగా లాంటి మేటి క్రికెటర్లతో ప్రమాదకరంగా కనిపించేది జింబాబ్వే. అప్పట్లో ఆ జట్టుకు టెస్టు హోదా ఉండేది. భారత జట్టును సైతం అప్పట్లో దీటుగా ఎదుర్కొనేది. కానీ ముగాబే నియంత పాలనలో దేశం ఆర్థికంగా దివాళా తీయడంతో క్రికెట్లోనూ జింబాబ్వే పతనం చవిచూసింది. ఐసీసీలో శాశ్వత సభ్యత్వం, టెస్టు హోదా కోల్పోయి అసోసియేట్ జట్లలో ఒకటిగా మారింది. అంతర్జాతీయ క్రికెట్ ఆడినా పెద్దగా ఆదాయం రాని పరిస్థితుల్లో జింబాబ్వేలో ఈ ఆటను కెరీర్‌గా ఎంచుకునే వారి సంఖ్య తగ్గింది. ఎంతోమంది ప్రతిభావంతులు ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా లాంటి దేశాలకు వలస వెళ్లిపోయారు. మిగతా వాళ్లు దేశం మీద ప్రేమతోనో, వేరే మార్గం లేకో జింబాబ్వే క్రికెట్లోనే కొనసాగుతున్నారు. మళ్లీ శాశ్వత సభ్యత్వం, టెస్టు హోదా సంపాదించినా ఆర్థిక ఇబ్బందుల వల్ల మునుపటి స్థాయిని అందుకోలేకపోయింది. భారత్ సహా పెద్ద జట్లు ఎప్పుడో ఒకసారి జింబాబ్వేతో సిరీస్ ఆడితే.. ఆ దేశ క్రికెట్ బోర్డుకు ఆదాయం సమకూరుతోంది. గత కొన్నేళ్లలో పరిస్థితులు కొంత మెరుగైనప్పటికీ.. వేరే క్రికెట్ దేశాలతో పోలిస్తే వెనుకంజే. కానీ జింబాబ్వే క్రికెటర్లలో ప్రతిభకు, తపనకు లోటు లేదనడానికి తాజా విజయమే ఉదాహరణ.

ఆ కసి చూశారా?: ఆస్ట్రేలియాపై జింబాబ్వే విజయాన్ని గాలివాటంగా ఎంతమాత్రం చెప్పలేం. ఈ మ్యాచ్ చూసిన వాళ్లకు అర్థమై ఉంటుంది ఆ జట్టు ఎంత కసిగా ఆడిందో? ప్రత్యర్థి ఆస్ట్రేలియా అని, తమది చిన్న జట్టు అని ఎంతమాత్రం భయపడలేదు ఆ జట్టు ఆటగాళ్లు. ఆరంభం నుంచి చివరి వరకు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఆడారు. ముందుగా బ్యాటర్లు ఎంతో దూకుడుగా ఆడి మిగతా జట్టులోనూ జోష్ నింపారు. తర్వాత బౌలింగ్ సందర్భంగా జింబాబ్వే చూపించిన సమష్టి తత్వం గురించి ఎంత చెప్పినా తక్కువే. తొలి బంతి నుంచే మనం గెలవగలం అనే ధీమా వారిలో కనిపించింది. ముజరబాని, ఎవాన్స్ సహా బౌలర్లందరూ కట్టుదిట్టంగా బంతులేశారు. ఆ జట్టు నాలుగే ఎక్స్‌ట్రాలు వేయడం విశేషం. ఇక ఫీల్డర్ల కష్టం గురించి ఎంత చెప్పినా తక్కువే. మ్యాక్స్‌వెల్ కొట్టిన బంతిని బౌండరీ వద్ద క్యాచ్ అందుకోవడానికి మైయర్స్ చేసిన పోరాటం అసామాన్యం. అది చివరికి సిక్సరే అయినా.. మ్యాక్సీ కొట్టిన అలాంటి మరో షాట్‌ను మున్యోంగా బౌండరీ వద్ద ఇంకా గొప్పగా అడ్డుకున్నాడు. సిక్సర్ వెళ్లాల్సిన బంతికి సింగిలే వచ్చింది. మున్యోంగా ఆపై డ్వార్షుయిస్ క్యాచ్‌ను పరుగెడుతూ డైవ్ చేసి అందుకున్న వైనం అద్భుతం. ఇలా ఫీల్డింగ్ ఆద్యంతం గొప్పగా సాగడం వల్లే ఆసీస్‌కు బ్రేకులు పడ్డాయి. బౌలింగ్ చేస్తూ గాయపడ్డ కెప్టెన్ సికందర్ రజా మైదానాన్ని వీడడం జట్టుకు గట్టి ఎదురు దెబ్బే. ఒక బౌలరే కాక కెప్టెన్‌నూ దూరం చేసుకున్నప్పటికీ ఆ జట్టు వెనుకంజ వేయలేదు. ఏం జరిగినా గెలవాల్సిందే అన్నట్లు జట్టంతా ప్రాణం పెట్టి ఆడి ఈ చారిత్రక విజయాన్ని లిఖించింది.

– ఈనాడు క్రీడా విభాగం

భారత్‌కు రజతం

ప్రపంచ పారా బ్యాడ్మింటన్

మనామా (బహ్రెయిన్): ప్రపంచ పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ వీల్‌చైర్ విభాగంలో భారత్ తొలిసారి రజతం నెగ్గింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో అల్ఫియా జేమ్స్, ప్రేమ్ కుమార్ జోడీ 6-21, 4-21తో క్యుజిమొ, యుటాంగ్ (చైనా) జంట చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్ ప్రమోద్ భగత్ ఫైనల్లో ప్రవేశించాడు. సెమీఫైనల్లో ప్రమోద్ 21-19, 21-17తో బున్‌సున్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించాడు. అతడు పురుషుల డబుల్స్‌లోనూ ఫైనల్‌కు చేరడం విశేషం. సెమీస్‌లో ప్రమోద్, సుకాంత్ కదం జోడీ 21-13, 21-15తో చో నడన్, లీ సియుంగు ద్వయం (కొరియా)పై గెలిచింది.

ముకేశ్‌కు రజతం

- ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్
- ఎనిమిది పతకాలతో మెరిసిన తెలుగు కుర్రాడు


ముకేశ్

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాడు ముకేశ్ నేలవల్లి సత్తాచాటాడు. టోర్నీ చివరి రోజు శుక్రవారం 25 మీటర్ల పిస్టల్ జూనియర్ల విభాగంలో 582 పాయింట్లతో రజతం సాధించాడు. సూరజ్ శర్మ, అభినవ్ దేశ్వాల్‌లతో కలిసి టీమ్ విభాగంలో స్వర్ణం గెలిచాడు. గుంటూరుకు చెందిన ముకేశ్ ఈ టోర్నీలో మొత్తం తొమ్మిది పతకాలకు పోటీపడి ఎనిమిది గెలవడం విశేషం. అందులో అయిదు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యం ఉన్నాయి. తెలంగాణ అమ్మాయి ధవళిక దేవి 50 మీటర్ల రైఫిల్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం, టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది. పిస్టల్ సీనియర్ల విభాగం (25 మీటర్లు)లో 38 ఏళ్ల అమన్‌ప్రీత్ (589 పాయింట్లు) స్వర్ణంతో మెరిశాడు. గుర్‌ప్రీత్ సింగ్ (584) రజతం, అంకుర్ గోయల్ (570) కాంస్య పతకాలు సాధించారు. ఈ టోర్నీలో భారత్ మొత్తం 76 పతకాలతో (39 స్వర్ణం, 18 రజతం, 19 కాంస్యం) అగ్రస్థానం సాధించింది.

కెనడాకు యూఏఈ పంచ్

మెరిసిన సిద్దిఖ్, ఆర్యాంశ్, సొహైబ్


ఆర్యాంశ్ శర్మ

దిల్లీ: టీ20 ప్రపంచకప్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) బోణీ కొట్టింది. ఉత్కంఠభరిత పోరులో కెనడాకు షాకిచ్చి తొలి విజయం నమోదు చేసింది. శుక్రవారం గ్రూపు-డి మ్యాచ్‌లో యూఏఈ అయిదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత కెనడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 150 పరుగులు చేసింది. హర్ష్ థాకర్ (50; 41 బంతుల్లో 2×4, 3×6) అర్ధ సెంచరీతో రాణించాడు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' జునైద్ సిద్దిఖ్ (5/35) విజృంభించి కెనడాను ఓ మోస్తరు స్కోరుకే కట్టడి చేశాడు. అనంతరం మరో 2 బంతులు మిగిలివుండగానే యూఏఈ విజయాన్ని అందుకుంది. ఓపెనర్ ఆర్యాంశ్ శర్మ (74 నాటౌట్; 53 బంతుల్లో 6×4, 3×6), సొహైబ్ ఖాన్ (51; 29 బంతుల్లో 4×4, 4×6) చెలరేగడంతో యూఏఈ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 151 పరుగులు సాధించింది. ఈ విజయంతో గ్రూపు-డి పాయింట్ల పట్టికలో యూఏఈ మూడో స్థానానికి చేరుకుంది. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన కెనడా (0) చిట్టచివరి స్థానంలో కొనసాగుతోంది.

సంక్షిప్త స్కోర్లు:
కెనడా ఇన్నింగ్స్: 150/7 (20 ఓవర్లలో) (నవ్‌నీత్ ధలివాల్ 34, హర్ష్ థాకర్ 50, శ్రేయస్ మొవ్వ 21, జునైద్ సిద్దిఖ్ 5/35)
యూఏఈ ఇన్నింగ్స్: 151/5 (19.4 ఓవర్లలో) (ఆర్యాంశ్ శర్మ 74 నాటౌట్, సొహైబ్ ఖాన్ 51, సాద్ బిన్ జాఫర్ 3/14)

నేటి నుంచి ఐఎస్‌ఎల్

పనాజీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)కు వేళైంది. ఈ లీగ్ శనివారం ఆరంభమవనుంది. ఐఎస్‌ఎల్ సీజన్-12 ఈసారి కొత్తగా ఉండబోతోంది. 14 జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీ నయా ఫార్మాట్లో జరగనుంది. గత సీజన్ మాదిరి ప్రతి జట్టు లీగ్ దశలో 24 మ్యాచ్‌లు కాకుండా.. 13 మ్యాచ్‌లు ఆడుతుంది. ఈసారి ప్లేఆఫ్స్ ఉండవు. లీగ్ దశలో టాప్‌లో నిలిచిన జట్టు ట్రోఫీ గెలుచుకుంటుంది.

రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్

దిల్లీ: రాజస్థాన్ రాయల్స్‌కు రియాన్ పరాగ్ సారథ్యం వహించనున్నాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్‌కు రియాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని శుక్రవారం ఫ్రాంఛైజీ ప్రకటించింది. 2025లో తాత్కాలిక సారథిగా, వైస్ కెప్టెన్‌గా అతను బాధ్యతలు నిర్వర్తించాడు.

నిరాశపరిచిన స్టాన్‌జిన్

మిలన్: వింటర్ ఒలింపిక్స్‌లో భారత ఆటగాడు స్టాన్‌జిన్ లాండప్ నిరాశపరిచాడు. శుక్రవారం పురుషుల క్రాస్‌కంట్రీ స్కీయింగ్ పురుషుల 10 కిలోమీటర్ల ఫ్రీస్టైల్‌లో స్టాన్‌జిన్ (28 నిమిషాల 26.7 సెకన్లు) 104వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ విభాగంలో జొనాస్ (నార్వే, 20 నిమిషాల 36.2 సె), మతియాస్ (ఫ్రాన్స్, 20 నిమిషాల 41.1 సె), హెడ్‌గార్ట్ (నార్వే, 20 నిమిషాల 50.2 సె) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఇప్పటిదాకా నార్వే 17 పతకాలతో (6 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలు) అగ్రస్థానంలో కొనసాగుతోంది.

ప్రీక్వార్టర్స్‌లో స్నేహిత్

చెన్నై: ప్రపంచ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ టోర్నీలో స్నేహిత్ సూరావజ్జుల ప్రీక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. రౌండ్ 32 పురుషుల సింగిల్స్‌లో స్నేహిత్ 3-2 (9-11, 15-17, 11-4, 11-6, 18-16)తో 13వ సీడ్ మిజుకి ఒయ్‌కావా (జపాన్)కు షాకిచ్చాడు. ఆరు మ్యాచ్ పాయింట్లు కాచుకుని స్నేహిత్ విజయం సాధించడం విశేషం. ప్రీక్వార్టర్స్‌లో అతడు జన్‌సంగ్‌తో తలపడనున్నాడు.

వసుంధర

vasundhara@eenadu.in

ప్రేమంటే... ఐ లవ్యూ చెప్పడమో రోజాపూలు ఇవ్వడమో మాత్రమే కాదు! ఇష్టపడి ఒక్కసారి చెయ్యి పట్టుకుంటే... కలకాలం కలిసుండే ఆత్మీయ బంధం! అతనికి కాఫీ కప్పు అందిస్తుందామె. ఆమె కాలుకి అయింట్‌మెంట్ రాస్తాడతను. నేర్పుగా కుటుంబాన్ని దిద్దుకోవడంలో ఆమె ప్రేమ కనిపిస్తే... ఆమెనో పసిపాపలా చూసుకోవడంలో ఉంటుంది అతని ప్రేమ! ఇలా మలిదశ వరకూ సాగే వాళ్ల జీవన ప్రయాణంలో... ఖరీదైన కానుకలూ సర్‌ప్రైజ్ పార్టీలూ ఉండకపోవచ్చేమోగానీ కాలానికి కరగని అనురాగం, కష్టాలకు తరగని మమకారం ఎన్నంటే ఉంటాయి! అదే... ప్రేమ, మరవలేని మధుర భావన. ప్రేమికులందరికీ శుభాకాంక్షలు!

ఇలా చూడు ప్రేమలోకం



ఆ బలం ఆమె మరి!



షరీబ్ హష్మి.. పేరు చెప్పగానే గుర్తుపట్టకపోవచ్చు. కానీ, ఫ్యామిలీ మ్యాన్ సిరీస్‌లో జేకే అనండి. వెంటనే గుర్తుపట్టేస్తారు. ఆ సిరీస్‌లో హీరో ఫ్రెండ్ పాత్ర కానీ... నిజజీవితంలో ఆయన అసలైన ఫ్యామిలీ మ్యాన్ అంటారు. అవును మరి... భార్య నస్రీన్ హష్మి నాలుగుసార్లు క్యాన్సర్ బారినపడినా కంటికిరెప్పలా చూసుకుంటున్నారాయన. మరి షరీబ్ ఏమంటారో తెలుసా? తనకే కాదు... తన ఇంటికీ వెన్నెముక భార్య నస్రీనే అంటారాయన. అందుకు కారణం లేకపోలేదు. పెళ్లైంది, పిల్లలు. ఆ సమయంలో ఉద్యోగం వదిలి నటనలో అదృష్టాన్ని వెతుక్కోవాలి అనుకున్నారు షరీబ్. నస్రీన్ ఆయన్ని ఆపలేదు. నచ్చింది చేయమని ప్రోత్సహించారు. అవకాశాలు రాలేదు. ఎన్నో తిరస్కరణలు. ఈ క్రమంలో ఆదాయం పోయి అప్పులు మిగిలాయి. అయినా నస్రీన్ ఆయనపై నమ్మకం ఉంచారు. తన నగలు అమ్మేశారు. ఉద్యోగం చేస్తూ ఇల్లు, పిల్లల బాధ్యత తీసుకున్నారు. ఆఖరికి ఉన్న ఇంటిని అమ్మాల్సి వచ్చినా... ఆయనపై తన నమ్మకాన్ని సడలనివ్వలేదు నస్రీన్. ఆమె నమ్మకాన్ని నిలబెడుతూ షరీబ్ అవకాశాలు దక్కించుకున్నారు. తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్న క్రమంలో నోటి క్యాన్సర్ బారిన పడ్డారు నస్రీన్. నాలుగుసార్లు తిరగబెట్టినా తన వాళ్లకోసం క్యాన్సర్‌తో పోరాడుతూనే భర్తనీ ప్రోత్సహించారు. కాబట్టే, ఓటీటీ వేదికమీద తనదైన ముద్ర వేయగలిగారు షరీబ్. అందుకే 'తనే నా బలం, ధైర్యం. క్యాన్సర్ తిరగబెడుతున్నా ధైర్యంగా నిలిచింది. తినడం, మింగడం లాంటివి కష్టమైనా, ముఖం మారిపోయినా, బరువు తగ్గిపోతున్నా అంతే దృఢంగా ఉంది. అలాంటి వ్యక్తిని నేనెప్పుడూ చూడలేదు' అంటారు షరీబ్. 'తను నా కలలకోసం నిలబడింది. ఆమె బాధలో నేను తోడుండటం నా బాధ్యత' అంటారాయన. కాబట్టే, వీళ్లని దాంపత్యానికి సరైన ఉదాహరణ, అసలైన ప్రేమకు నిదర్శనం అంటూ నెట్టింట పొగుడుతున్నారంతా.

విధి ఓడింది... ప్రేమ గెలిచింది!



శరీరం ఓడిపోయినా... మనసు గెలిచిన కథ ఇది. అఖిల్-అఖిలల జీవిత ప్రయాణమిది.

అఖిల్‌ది కేరళలోని పెరువయల్. చిన్నప్పటి నుంచీ సముద్రాన్ని చూస్తూ నేవీలో చేరాలని ఆశపడ్డాడు. నాలుగుసార్లు దరఖాస్తు చేసినా ఎంపిక కాలేదు. ఆపై ఎయిర్ ఫోర్స్‌లో చేరే అవకాశం వచ్చింది. కానీ సర్టిఫికెట్ సమస్య వల్ల అదీ చేజారిపోయింది. చివరిగా 2018లో ఆర్మీకి సెలెక్ట్ అయ్యాడు. యూనిఫామ్ వేసుకోవడమే నా గెలుపు అనుకుంటూ ఆనందంగా అందులో చేరాడు అఖిల్. పంజాబ్‌లో ట్రైనింగ్... ఓ రోజు బ్యాటిల్ అబ్‌స్టకల్ కోర్సులో భాగంగా ఎత్తైన నెట్‌పైకి ఎక్కుతుండగా తాడు తెగి కిందపడిపోయాడు. వెనక ఉన్న రైఫిల్ వెన్నెముకకి బలంగా తగిలింది. తీవ్ర గాయం. శస్త్రచికిత్స... నడుములో స్క్రూలు, రాడ్లు.... ఆ సమయంలో 'ఇక, లేచి నడవలేడు' అని నర్సు చెప్పిన మాట అఖిల్ చెవినపడింది. తండ్రి కళ్లలోని బాధని చూసి తాను ఓడిపోకూడదని నిర్ణయించుకున్నాడు. వీల్‌ఛెయిర్ సాయంతో తిరిగి కొత్త జీవితం మొదలుపెట్టాడు.

ఎందరు విమర్శించినా...

అఖిల...కూడా అదే ప్రాంతానికి చెందిన అమ్మాయి. తనూ ఆర్మీలో చేరాలని కలలు కనేది. అదే ఫేస్‌బుక్‌లో వాళ్లని కలిపింది. సైనికుల కథలు మాట్లాడుకుంటూ ఇద్దరూ స్నేహితులయ్యారు. అయితే, ఉన్నట్టుండి ఒక రోజు అఖిల 'నన్ను పెళ్లి చేసుకుంటావా' అని అఖిల్‌ని అడిగిందట. మొదట షాకయ్యాడతను... తర్వాత తన పరిస్థితి గుర్తొచ్చి వెనక్కి తగ్గాడు. అప్పుడే అఖిలకు అఖిల్ పరిస్థితి పూర్తిగా తెలిసింది. జీవితాంతం అతడు వీల్‌ఛెయిర్‌కే పరిమితమవ్వాలని తెలిసి బాధపడింది కానీ తన నిర్ణయం మాత్రం మార్చుకోలేదు. 'ప్రేమ అంటే శరీరం కాదు, మనసు. నువ్వు నా కలల సైనికుడివి' అంది. ఇంట్లో చెబితే సమస్యలు వస్తాయని భయపడి మూడేళ్లపాటు మౌనంగానే ఉండిపోయారు. చివరికి ఎర్నాకుళం ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఈ విషయం వాళ్ల ఊళ్లో తెలిశాక... 'వీల్‌ఛెయిర్‌లో ఉన్నవాడు ఎంతకాలం బతుకుతాడు? తొందరపాటు నిర్ణయం...' వంటి మాటలెన్నో వినిపించాయి. కానీ, అవేవీ అఖిల పట్టించుకోలేదు. ఆమె తల్లిదండ్రులూ వాళ్ల ప్రేమను అర్థం చేసుకున్నారు.

ఏదో సాధించాలని తపించేవాడు అఖిల్. అతని పట్టుదలను బలపరిచింది అఖిల. దాంతో నిరంతర సాధనతో పారా స్విమ్మింగ్‌లో ఆర్మీ తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. అసోం, మధ్యప్రదేశ్, గోవాల్లో జరిగిన మీట్‌లలో రెండు కాంస్య పతకాలు సాధించాడు. 'వైకల్యం నా శరీరానికే కానీ... కలలకు కాదు' అంటాడు అఖిల్. ఆ దంపతులకు ఇప్పుడో బిడ్డ కూడా. విధి ఓడించాలనుకున్నా... ధైర్యం, ఆశ, ప్రేమ వాళ్లని గెలిపించాయి.

ప్రేమా - ఆకర్షణా?

ప్రేమ ఒక అద్భుతమైన భావోద్వేగం. ఈ ఒక్క బంధంలో గౌరవం, నమ్మకం, రక్షణ, క్షమ వంటివెన్నో దాగి ఉంటాయి. ఇవన్నీ ఒకే వ్యక్తి నుంచి పొందడం అద్భుతమే కాదు, అదృష్టం కూడా. అయితే ఆకర్షణ, ప్రేమ మధ్య తేడా తెలియక ఎంతోమంది అమ్మాయిలు జీవితాన్ని కష్టాలమయం చేసుకుంటున్నారు.

ఆకర్షణ: ఒక వ్యక్తిని మొదటిసారి చూసినప్పుడు లేదా మాట్లాడినప్పుడు... వాళ్లలోని ప్రత్యేకాంశం మనలో 'వావ్' అనే భావనను కలిగిస్తుంది. అదే ఆకర్షణ. ఇదో రకమైన భావోద్వేగం. అది తాత్కాలికం.

ప్రేమ: తనను తాను తెలుసుకుంటూ, బంధాన్ని ఏర్పరచుకుంటూ మరొకరిని అందులో భాగం చేసుకుంటూ సాగించే ప్రయాణమే ప్రేమ. ఇది కేవలం ఒక భావోద్వేగం కాదు, ఎన్నో భావోద్వేగాల సమ్మిళితం. ఆకర్షణ అందులో ఒక భాగం. ఇది శాశ్వత బంధాన్ని కోరుతుంది.

ఇలా పరీక్షించుకోండి

కింది ప్రశ్నలకు అవును/కాదు అని నిజాయితీగా సమాధానాలు ఇవ్వండి.

1. తన లోపాలు నన్ను ఇబ్బంది పెడతాయి.
2. మా బంధంలో ఇబ్బంది వచ్చినప్పుడు పరిష్కరించేందుకు తనే ముందుకు రావాలని కోరుకుంటాను.
3. మాకన్నా ఇతరులు వారి ప్రేమలో కచ్చితంగా ఉన్నారనిపిస్తుంది.
4. తనతో ప్రవర్తించేటప్పుడు జాగ్రత్తగా ఉంటాను తప్పుగా మాట్లాడతానేమో అనే భయం ఉంటుంది.
5. మా బంధంలో శారీరక సుఖమే ముఖ్యం.
6. నా సహాయ సహకారాలు లేనిదే తను జీవించలేదు అనిపిస్తుంటుంది.
7. లక్ష్యసాధనలో ఒకరినొకరం ప్రోత్సహించుకుంటాం.
8. తన సంతోషానికి నేనే కేంద్రం కావాలనుకుంటా.



అయిదుకంటే ఎక్కువ ప్రశ్నలకు 'అవును' అనేది మీ సమాధానం అయితే మీ ప్రేమ ఆకర్షణ దశలోనే ఉందని అర్థం.

– శ్రీదేవి శ్రీపాద, సైకాలజిస్ట్

ప్రేమమ్... ఆర్థికం!

మనిషి బతకాలంటే లబ్ డబ్! బంధం నిలవాలంటే లవ్, డబ్బు! మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే! అందుకే ప్రేమలో ఆర్థిక కోణం చాలా ముఖ్యం. చాలా బంధాలు కాల పరీక్షలో నిలవలేకపోవడానికి కారణాలు ప్రేమ లేకపోవడం కాదు, ఆర్థిక అంశాలపైన ఇద్దరి మధ్యా సరైన చర్చ జరగకపోవడం, నమ్మకం కుదరకపోవడం.

- డబ్బు అంటే కేవలం అంకెలు కాదు. కలల్ని నిజం చేసుకునే సాధనం. ఇల్లు, పిల్లల చదువులు, పెద్దలకు మద్దతు, పర్యటనలు, రిటైర్మెంట్... వీటన్నింటికీ డబ్బు ముఖ్యం. కాబట్టి ప్రేయసీప్రియులు, భార్యాభర్తలు మిగతా అన్ని విషయాల్లానే వీటినీ చర్చించుకోవాలి.
- రెండు హృదయాలు కలిస్తేనే ప్రేమ. అలాగే ఆర్థిక విషయాల్లోనూ ఎప్పుడూ సమానత్వం కనిపించాలి. ఆర్థిక అసమతుల్యతలు... క్రమంగా భావోద్వేగాల అసమతుల్యతకు దారితీస్తాయి.
- ఒకరు ఆర్థిక విషయాల్లో చురుగ్గా, ఆత్మవిశ్వాసంతో ఉంటారు. వాళ్లే అన్ని నిర్ణయాలూ తీసుకుంటారు. దాంతో వేరొకరు నిర్లక్ష్యానికి గురవుతారు. నిజమైన ప్రేమలో ఇద్దరూ కలిసి ప్రయాణించాలి. అలాగే ఆర్థిక విషయాల్లోనూ జీవిత భాగస్వామితో కలిసి ప్రయాణించాలి. దీనివల్ల బంధం దృఢమవుతుంది.
- ఆర్థిక సమానత్వం అంటే ఇద్దరూ సమానంగా సంపాదించడం కాదు, ఇద్దరూ కలిసి నిర్ణయాలు తీసుకోవడం, ప్రణాళికలు వేసుకోవడం.
- కానుకలుగా పాలసీలనీ, పొదుపు, మదుపు పథకాలనూ ఎంచుకోండి.



ఇవి గమనించుకోండి...

- ఒకరు సంపన్న కుటుంబం నుంచి రావొచ్చు. ఇంకొకరు ఉద్యోగంలోకి వచ్చాకే సంపాదన మొదలుపెట్టొచ్చు. ఆర్థిక భిన్నత్వం ఉన్నా, భవిష్యత్తుపైన ఏకాభిప్రాయం రావాలి.
- డేటింగ్, ఈటింగ్, సినిమాలూ, షికార్లకి వెళ్లిన ప్రతిసారీ ఒకరే ఖర్చుచేస్తున్నా, అసలు చేయకపోయినా... మంచిది కాదు. ఆర్థిక క్రమశిక్షణ లేదనడానికి ఇదో నిదర్శనం. దాంతో మీపైన అవతల వ్యక్తికి సదభిప్రాయం కొనసాగదు.
- ఒకరు సరదాలకు ఖర్చు చేస్తారు... ఇంకొకరు పొదుపు మంత్రం జపిస్తారు. వివాహ బంధానికి ముందే ఇద్దరూ ఈ విషయాలపై చర్చించాలి.
- డబ్బు గురించి చర్చని రేపూ ఎల్లుండీ అంటూ వాయిదా వేస్తూ వెళ్లినా... పెళ్లి తర్వాత అదే ప్రధాన సమస్య అవుతుంది.
- రీఛార్జ్‌లూ, ఆన్‌లైన్ ఆర్డర్లు... చేయమని అడిగినవాళ్లు మర్చిపోవచ్చు. చేసిన వాళ్లకు గుర్తుంటాయి సుమా!

– శిల్పా గోలె, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

హద్దులు ఉండాలి

ఇష్టపడటం, ఒకరినొకరు అర్థం చేసుకోవడం, సమయం గడపడం మంచిదే! అయితే ఓ సరిహద్దుని ప్రతిఒక్కరూ పాటించాలి. అదే శారీరకంగా దగ్గరవడం.

- మీ వయసు మీద హార్మోన్ల ప్రభావం ఉంటుంది. దీంతో అవతలి వాళ్లమీద ఆకర్షణ మామూలే. తగ్గట్టే దాన్ని హద్దు దాటేలా పురిగొల్పే సందర్భాలూ ఎక్కువే. ఇలాంటప్పుడు ఎవరికి వారిపై పట్టు అవసరం. అదే లేకపోతే లైంగికంగా దగ్గరవుతారు. పెళ్లి చేసుకుని, కలిసి జీవిస్తే సరే! కానీ జరగకపోతే? ఏదో బలహీన క్షణాన దగ్గరై, తీరా మనస్పర్థలు వచ్చి, దూరమైతే మానసికంగా సమస్యలు ఎదుర్కోవాలి. అవి జీవితాంతమూ కొనసాగొచ్చు. ఈ వయసులో రక్షణ చర్యలు తీసుకోవాలని తెలియదు. దీంతో గర్భం దాల్చొచ్చు. అదీగాక, అవతలి వ్యక్తికి ఎక్కువమందితో లైంగిక సంబంధాలు ఉంటే సుఖ వ్యాధుల బారినపడే అవకాశాలూ ఎక్కువే.
- ఇంట్లో తెలుస్తుందన్న భయంతో కొందరు గర్భం దాల్చకుండా మందులు వేసుకుంటుంటారు. ఎప్పుడు, ఎలా వేసుకోవాలో తెలియక గర్భం దాల్చాకా వేసుకుంటుంటారు. కాస్త రక్తస్రావం అవ్వగానే అబార్షన్ అయ్యిందనుకుంటారు. అలా తెలిసీ తెలియక చేసేవాటివల్ల ఎన్ని సమస్యలో తెలుసా? కొన్నిసార్లు ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ వస్తుంది. దానికి మందులే సరిపోవు. సరైన చికిత్స కావాలి. ఇవన్నీ తెలియక చాలామంది తప్పటడుగులు వేస్తుంటారు. ఫలితంగా రక్తహీనత, కళ్లు తిరిగి పడిపోవడం, సరిగా పిండం బయటికిపోక ఎన్నెన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.
- మీ ప్రేమ జీవితాన్ని ఆస్వాదించండి. మనసు విప్పి మాట్లాడుకోండి. ఆరోగ్యకరంగా జీవితాంతం కలిసి ఉండేలా ప్లాన్ చేసుకోండి. అంతేకానీ, ఇలా అనారోగ్యాలు, సమస్యల్ని కొనితెచ్చుకోకండి. శారీరకంగా దగ్గరైతేనే ప్రేమ అనుకోవద్దు. అలాంటి ఆలోచనలతో ఉంటే... అమ్మాయిలూ, మీరే ఇబ్బందుల్లో పడతారు. కాబట్టి, ప్రేమను వ్యక్తపరచండి... అది శారీరకంగా మాత్రం కావొద్దు.

– వసుంధర, గైనకాలజిస్ట్

అది... పెళ్లే కాదు!

ప్రేమ... రెండు మనసుల కలయిక. కానీ, శారీరక సంబంధమే ప్రధానంగా ఇప్పటి ప్రేమలు సాగిపోతున్నాయి. అయితే, ఇందులో ఎక్కువగా నష్టపోతుంది మహిళలే. దీనికి అడ్డుకట్ట వేయాలంటే.. చట్టపరంగా కొన్ని విషయాలు తెలుసుకోవాలి.

గుళ్లో పెళ్లి చేసుకోవచ్చా?: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆడపిల్లలకు 18, మగ వాళ్లకి 21 వచ్చిన తర్వాత తమకు నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకునే హక్కు ఉంది. ఇది వ్యక్తిగత స్వేచ్ఛలో భాగం. అయితే ఆ వివాహానికి చట్టబద్ధ గుర్తింపు అవసరం. అలాగని గుడిలో దేవుడి ముందు నిలబడి దండలు మార్చుకుంటే అది పెళ్లి అయిపోదు. హిందూ వివాహచట్టం ప్రకారం సప్తపది, కన్యాదానం వంటి పూర్తి ఆచారాలు జరగాలి. అవి జరిగినా పెళ్లిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం మంచిది.





సహజీవనం చేస్తే... : ప్రేమ పేరుతో సహజీవనం చేయడం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. 18 ఏళ్లకు పైబడి, మరో వివాహబంధంలో లేని వారెవరైనా స్వచ్ఛందంగా కలిసి జీవించొచ్చు. దీనికి వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యత హక్కు(ఆర్టికల్ 21)కింద రక్షణ దొరుకుతుంది. ఈ బంధంలో ఉన్నప్పుడు పుట్టిన పిల్లలకు తండ్రి ఆస్తిలో హక్కు ఉంటుంది. దీర్ఘకాలం సాగిన ఈ సహజీవనంలో మహిళలు మెయింటెనెన్స్ (డీవీ యాక్ట్ లేదా సీఆర్‌పీసీ సెక్షన్ 125) కోసం క్లెయిమ్ చేసుకోవచ్చు. అయితే, సహజీవన బంధాలు స్వేచ్ఛను ఇస్తాయి కానీ పెళ్లితో వచ్చే చట్టబద్ధమైన హక్కులు మాత్రం పూర్తిగా లభించవు. ముఖ్యంగా భాగస్వామి ఆస్తి వారసత్వం, ఆటోమెటిక్ నామినేషన్ వంటివి (వీలునామా లేదా జాయింట్ ఓనర్‌షిప్ లేకపోతే)రావు.

ప్రేమలో మోసపోతే...: ప్రేమిస్తున్నానని చెప్పి... వివాహ వాగ్దానంతో శారీరక సంబంధం పెట్టుకుంటే బీఎన్ఎస్ సెక్షన్ 69 కింద కేసు పెట్టొచ్చు. దీనికి పదేళ్ల వరకూ జైలు, జరిమానా ఉంటుంది. ఇక, బీఎన్ఎస్ సెక్షన్ 318 ప్రకారం ప్రేమ పేరుతో డబ్బు తీసుకుని మోసం చేస్తే చీటింగ్ కేసు పెట్టొచ్చు. దీనికి 3-7 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

– జి. వరలక్ష్మి, న్యాయవాది

వాళ్ల ప్రేమ... సజీవ కళ!



ప్రేమకోసం అద్భుత కట్టడాలు కట్టించిన వాళ్ల గురించి విన్నాం. కానీ, కొన్ని ప్రేమ కథలు సంప్రదాయ కళలతో నేటికీ సజీవంగా ఉన్నాయి. అవే ఇవి...

మహువా చిత్రం... ప్రేమకు ప్రతిరూపం: గోండులు విప్ప(మహువా) చెట్టును ప్రేమకు చిహ్నంగా, వాటి పువ్వులను శుభసూచికంగా భావిస్తారు. దీని వెనక ఓ అందమైన ప్రేమ కథ ఉంది. జానపద కథల ప్రకారం... బ్రాహ్మణ అమ్మాయి, గోండు తెగ అబ్బాయి ప్రేమించుకున్నారట. నాటి సామాజిక పరిస్థితుల రీత్యా కులాంతర వివాహానికి పెద్దలు ఒప్పుకోలేదట. దాంతో ఆ ప్రేమికులిద్దరూ ఒకరికోసం ఒకరు ప్రాణ త్యాగం చేశారట. తరవాత వాళ్లలో ఒకరు గంజాయి మొక్కగానూ, మరొకరు విప్ప చెట్టుగానూ పునర్జన్మించారట. కానీ ఈ రూపాల్లోనూ కలిసి జీవించలేకపోయారని తెలిసేలానూ వాళ్ల ప్రేమ కథకు గుర్తుగానూ గంజాయి, విప్ప చెట్లతో గోడలమీదా కాన్వాస్‌మీదా అందమైన చిత్రాల్ని గీస్తుంటారు గోండులు. ఈ పెయింటింగ్ ద్వారా ఆ కథను తరతరాలకీ చెబుతుంటారట.



ధోక్రా బొమ్మల్లో: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో పుట్టిందీ ప్రేమ కథ. చక్కని చుక్క మిట్కి. చురుకైన కుర్రాడు జిట్కు... ఓ స్థానిక ఉత్సవంలో కలుసుకున్నారట. తొలిచూపులోనే ప్రేమ చిగురించింది. మిట్కి ఏడుగురు అన్నదమ్ములకి ముద్దుల చెల్లెలు. జిట్కుది పక్క ఊరు. అన్నలకి చెల్లిని వేరే ఊరికి పంపడం ఇష్టం లేదు. దాంతో ఆమె ప్రేమించిన అబ్బాయితో పెళ్లి చేసి, ఇల్లరికం తెచ్చుకున్నారు. సాఫీగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారిగా కల్లోలం... గ్రామంలో చెరువులు ఎండిపోయి కరవు ఏర్పడిందట. 'ప్రకృతి మనపై కోపగించింది. ఊర్లోకి కొత్తగా వచ్చిన వ్యక్తిని బలి ఇస్తేకానీ శాంతించదు' అంటూ స్థానికులు మూఢనమ్మకంతో జిట్కుని బలిచ్చారట. ఆ బాధను తట్టుకోలేని మిట్కి చెరువులో దూకి ప్రాణత్యాగం చేసిందట. వాళ్ల అమర ప్రేమను మరచిపోలేకపోయారు అక్కడి ప్రజలు. తమ సంస్కృతిలో భాగమైన ప్రాచీన ధోక్రా కళ ద్వారా వాళ్లను బతికించారు. ఆ ప్రేమజంట బొమ్మల్ని చేసి ఆరాధిస్తున్నారు. అలా వాళ్ల ప్రేమ కథ... కళ రూపంలో నేటికీ సజీవంగానే ఉంది.

ఆ గొంతు వినాలనే..!



ప్రేమించిన వాళ్లు మన నుంచి దూరం అయితే వచ్చే బాధను మాటల్లో చెప్పలేం కదూ! వాళ్లని చూడాలనీ, ఆ గొంతు వినాలనీ, మాట్లాడాలనీ ఎంతగా తపిస్తామో... లండన్‌కు చెందిన **మార్గరెట్ మెక్‌కొల్లమ్‌**దీ అదే పరిస్థితి. **ఓస్వాల్డ్ లారెన్స్‌**ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారీమె. మార్గరెట్ డాక్టర్. ఓస్వాల్డ్ థియేటర్ ఆర్టిస్ట్. ఓ పర్యటనలో కలుసుకున్నారిద్దరూ. ఒకరి అభిప్రాయాలు మరొకరికి నచ్చి పెళ్లి చేసుకున్నారు. కానీ వృత్తి రీత్యా ఓస్వాల్డ్ ఎక్కువగా ప్రయాణాలు చేయాల్సి వచ్చేది. భర్తకు దూరంగా ఉండటం ఇష్టంలేని మార్గరెట్ ఏదైనా ఉద్యోగం చూసుకోమని కోరారట. దాంతో ఇష్టపడిన వృత్తిని వదిలి, భార్య కోసం ఓ ప్రైవేట్ కంపెనీలో చేరారు ఓస్వాల్డ్. అప్పటినుంచీ ఆనందం వాళ్లింటి పేరుగా మారింది. కానీ అనారోగ్యంతో 2007లో లారెన్స్ మరణించారు. మార్గరెట్ తీవ్రంగా కుంగిపోయారు. దాన్నుంచి బయటపడటానికి ఆమె రోజూ స్థానిక ఇంబ్యాంక్‌మెంట్ రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారట. ఎండనక, వాననక ఐదేళ్లుగా ఇదే దినచర్య. ఓసారి గార్డ్ గమనించి, విషయం అడగ్గా... 'ఈ అనౌన్స్‌మెంటులో వస్తున్న గొంతు నా భర్త ఓస్వాల్డ్‌ది. ఇప్పుడు ఆయన లేరు. ఆ గొంతు వినాలనే స్టేషన్‌కు వస్తున్నా' అని చెప్పారట మార్గరెట్. ఆమె ప్రేమకు అధికారులంతా కదిలిపోయారట. ఆ రికార్డును సీడీలో భద్రపరచి ఆమెకు అందించారు. అంతేకాదు, లండన్ మెట్రో స్టేషన్లలో డిజిటల్ వాయిస్ ట్రెండ్‌లు ఎన్ని వచ్చినా... ఆ స్టేషన్‌లో మాత్రం ఆయన అనౌన్స్‌మెంట్‌ను అలాగే ఉంచేశారు వీళ్ల ప్రేమకు గుర్తుగా!

వీడని బంధం!



'లిటిల్ పీపుల్ ఆఫ్ అమెరికా' సమావేశంలో కలిశారు **కెవిన్, డానియెల్.** ఇద్దరూ మరుగుజ్జులే. అక్కడే వాళ్లకి ఒకరితో ఒకరికి పరిచయం. అయితే అప్పటికి వాళ్లకి తొమ్మిదేళ్లే. ఆ తర్వాత ఎవరి జీవితంలో వాళ్లు బిజీ... డానియెల్ పారా అథ్లెట్, హోస్ట్‌గానూ; కెవిన్ ఫొటోగ్రాఫర్, స్టోరీ టెల్లర్‌గానూ స్థిరపడ్డారు. పదిహేనేళ్లు గడిచాయి. ఈ మధ్యలో ఒక్కసారీ కలవలేదు కానీ, ఒకరి కోసం ఒకరు ఆలోచించేవారట. ఈ క్రమంలోనే 2020లో డానియెల్ కామన్వెల్త్ క్రీడల గురించి ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారట. దానికి కెవిన్ స్పందిస్తూ... ఫైర్ ఎమోజీ సెండ్ చేశారట. అది చూసి డానియెల్ ఆనందంతో... 'ఇంకా నేను గుర్తున్నానా, ఉంటే ఇంతకాలం కలవడానికి ఎందుకు ప్రయత్నించలేదు' అని కెవిన్‌ని అడిగేసింది. దాదాపు మూడుగంటలు ఫోన్ మాట్లాడుకున్నారట ఇద్దరూ. మంచి స్నేహితులయ్యారు. అడపాదడపా కలిసేవారట. ఆధ్యాత్మిక ప్రయాణాలూ చేశారట. అలవాట్లు, అభిరుచులతోపాటూ ఆశయాలూ కలవడంతో ప్రేమలో పడ్డారు. వీళ్ల వివాహం పట్ల ఇద్దరి కుటుంబాల్లో అయిష్టత ఉన్నా ఒప్పించి ఒక్కటైందీ జంట. వీళ్ల ప్రేమకు గుర్తుగా ఒక బాబు.

ఎంత గొప్పదీ ప్రేమ!

ప్రేమకథల్లో సుఖాంతమైనవీ చాలానే ఉండొచ్చు. కానీ విషాదంతో ముగిసినవే చరిత్రలో నిలిచిపోతాయి. ఇదీ అలాంటిదే!



గుజరాత్‌లోని ఓ అందమైన మెట్లబావి పేరు అడాలజ్. వందల సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఎందరో సందర్శకుల్ని ఆకర్షిస్తోంది. నిర్మాణకౌశలంతోపాటు ఆ బావి వెనకున్న ప్రేమ గాథే అందుకు కారణం. మధ్యయుగంలో ఈ ప్రాంతాన్ని దండై దేశ్ అనేవారు. దీన్ని వాఘేలా రాజవంశానికి చెందిన రాణా వీరసింగ్ పరిపాలించేవాడు. ఆయన భార్య రూదా బాయి(రూప్‌బా). అపురూప సౌందర్యవతి. భర్తంటే అపార ప్రేమ. అన్యోన్యంగా సాగిపోతున్న వాళ్ల జీవితంలో అతి పెద్ద అలజడి... పొరుగు రాజ్యాన్ని పాలించే మహమూద్ బెగడా వీళ్ల రాజ్యంపై చేసిన దండయాత్ర. యుద్ధంలో రాణా మరణించాడు. రాణి దుఃఖంలో మునిగిపోయింది. అయితే ఆమె అందానికి ముగ్ధుడైన బెగడా వివాహం చేసుకుంటానని కబురు పంపిస్తాడు. రూప్‌బా ఓ షరతుతో అంగీకరిస్తుంది. భర్త ప్రారంభించిన అడాలజ్ బావి నిర్మాణాన్ని పూర్తిచేయమని కోరగా అతను అంగీకరిస్తాడు.. నిర్మాణం పూర్తయ్యింది. బావి ప్రారంభోత్సవం రోజే రూప్‌బాతో వివాహం కూడా. కానీ రాణి జాడ లేదు. ఆమెను వెతకడానికి సైన్యాన్ని నలుదిక్కులకీ పంపిస్తాడు. అప్పటికే ఆ మెట్ల బావి చుట్టూ ప్రదక్షిణలు చేసి భర్తనే తలచుకుంటూ అందులోకి దూకేసింది రాణి. ప్రజల దాహార్తి తీర్చాలన్న తన భర్త కల నెరవేరేందుకే ఆమె వివాహానికి ఒప్పుకొందన్న విషయం అప్పటికిగానీ ప్రజలకీ బెగడాకీ అర్థం కాలేదు. రాణిని మనస్ఫూర్తిగానే ప్రేమించిన బెగడా ఆ మెట్లబావిని మూసేయమని ఆదేశించలేదు. ఆమె జ్ఞాపకార్థంగా ప్రజలకు ఉపయోగపడేలా చేశాడు. ఈ కథలో ఎవరి ప్రేమనీ తక్కువ చేయలేం. భర్తను ప్రేమించి ఆయన ఆశయాన్ని బతికించిన రాణీ రూప్‌బా, ఆమెను ఎంతో ఇష్టపడి ఆమె కోరికను మన్నించిన బెగడా... ఇద్దరూ గొప్ప ప్రేమికులే కదూ!



కాస్త ప్రేమ పంచుదాం!

లవ్ ప్రామిస్



ప్రేమికుల దినోత్సవం... అంటే, ఎర్ర గులాబీలు... రొమాంటిక్ మెసేజ్‌లు... హార్ట్ ఎమోజీలు, రోజ్, చాక్లెట్, ప్రామిస్ డేలకు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడాలూ ఇదేనా... వీటితో పాటు ఈసారి ఇదీ ప్రయత్నించండి. అదే 'లవ్ విత్ పర్పస్'. అంటే మీ ప్రేమ తరపున సమాజానికి చిన్న కానుక ఇవ్వడమే దీని ఉద్దేశం. ఒకరోజులో వాడి పోయే పూలకంటే జీవితాంతం నీడనిచ్చే మొక్కను జంటగా నాటి, 'మన ప్రేమ కూడా ఇలాగే పెరుగుతుండాలి' అని ప్రమాణం చేసుకోండి. అది వృక్షమై మీకూ మరెందరికో నీడనిస్తుంది. ప్రాణవాయువుని అందిస్తుంది. అలాగే ఈరోజు ఏ రెస్టరంట్‌కో వెళ్లాలని ప్లాన్ చేసుకునే ఉంటారు కదా! ఆ ఖర్చుతో ఒకరోజు అనాథాశ్రమంలో పిల్లలకు భోజనం పెట్టండి. వాళ్ల నవ్వుల్లో మీకు నిజమైన ప్రేమ కనిపిస్తుంది. ప్రేమంటే కేవలం అమ్మాయి, అబ్బాయి, ఒకరిపై ఒకరు చూపించుకునేదే కాదు. నలుగురికీ సాయం చేయడంలో ఉన్నదీ ప్రేమే కదా. అందుకేమరి ఈసారి 'లవ్ విత్ పర్పస్' అనుకుంటూ ప్రేమ పండుగ చేసుకుందాం!

జెన్ జీల వర్ణం... హాట్‌పింక్!





వాలెంటైన్స్ డే అంటే సాధారణంగా ఎరుపు రంగే గుర్తొస్తుంది. కానీ, జెన్ జెడ్ ఇప్పుడు హాట్ పింక్‌ని లవ్ కలర్‌గా భావిస్తున్నారు. రెడ్ క్లాసిక్ అయితే, హాట్‌పింక్ మోడర్న్. దాంతో ఈ రంగు ఈ ఏడాది ప్రేమికుల రోజు ఫ్యాషన్ కలర్‌గా పాపులారిటీ తెచ్చుకుంది. బోల్డ్ లవ్, కాన్ఫిడెన్స్, ఫన్, సెల్ఫ్ లవ్, గర్ల్ పవర్‌కి సింబాలిక్‌గా దీన్ని ఎంచుకుంటున్నారట. అలాగని దుస్తులు మాత్రమే వీరి ఎంపిక అనుకునేరు. చెప్పులు, వాచ్‌లు, బ్యాగ్‌లు... ఒకటేమిటి అన్నీ ఈ స్టైల్‌లో బాగుంటున్నారు. మీరూ ఓ లుక్కేయండి మరి.

ఆ తీర్మానం సుబ్బారెడ్డిదే!



- నిబంధనల సడలింపుపై ఏకపక్ష నిర్ణయం!
- 'నెయ్యి కొనుగోలుకు ఆమోదం తెలిపే అంశం'గా తీర్మానం రాసేశారు
- దానిపై నాటి ఛైర్మన్, డిప్యూటీ ఈవోల సంతకాలు
- ఇదే కల్తీనెయ్యి సరఫరాకు మూలం

ఈనాడు, అమరావతి: 'నెయ్యి కొనుగోళ్లకు తితిదే పిలుస్తున్న 'ఇ-టెండర్ కమ్ ఆక్షన్'లో ఎప్పుడూ కొన్ని సంస్థలే పాల్గొంటున్నాయి. భవిష్యత్తులో పిలిచే టెండర్లలో ఎక్కువ సంస్థలు పాల్గొనేలా పరిధి విస్తరించాలని మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌కు సూచిస్తున్నాం.'

- కల్తీ నెయ్యి సరఫరా కుట్రకు మూలకారణమైన తీర్మానం ఇదే!

2019 డిసెంబరు 28న తితిదే పాలకమండలి చేసిన 220వ తీర్మానంగా ఇది రికార్డుల్లో నమోదైంది. దానిపై అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఒక డిప్యూటీ ఈవో సంతకాలు మాత్రమే ఉన్నాయి. కిలో రూ.424.10 చొప్పున 35 వేల కిలోల నెయ్యి సరఫరాకు ప్రీమియర్ అగ్రిఫుడ్స్ అనే సంస్థకు తితిదే కొనుగోళ్ల కమిటీ ఇచ్చిన సప్లై ఆర్డర్‌కు ఆమోదం తెలుపుతూ.. దాని కిందే ఈ తీర్మానం కూడా రాసి, సంతకాలు పెట్టేశారు. దీన్నిబట్టి టెండర్ నిబంధనలు సడలించాలన్నది బోర్డు సమష్టి నిర్ణయమా? లేకపోతే సుబ్బారెడ్డి ఏకపక్ష నిర్ణయమా? నాటి ఉన్నతాధికారుల సహకారం, బోర్డులోని కొందరు సభ్యుల మద్దతుతో ఆయన ఈ కుట్రకు తెరతీశారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిబంధనలు మార్చాలన్న విషయాన్ని బోర్డు దృష్టికి తెచ్చారా? ఎజెండాలో చేర్చారా? సమావేశంలో చర్చించారా? సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నారా? లేక ఏకపక్షంగా తీర్మానం రాసేసి ఛైర్మన్ సంతకం పెట్టేశారా? అన్నవి సమాధానం రావాల్సిన ప్రశ్నలు.

ఒకే ఎజెండా పాయింట్‌లో రెండు వేర్వేరు అంశాలా?

టెండర్ నిబంధనలు సవరించాలని బోర్డు సూచించాలనుకుంటే.. ఎజెండాలో దాన్నొక ప్రత్యేక అంశంగా చేర్చాలి. అప్పటిదాకా ఉన్న నిబంధనల్లోని లోపాలేంటి? వాటిని సవరించాల్సిన అవసరమేంటన్నది చర్చించి, నిర్ణయం తీసుకోవాలి. కానీ ఇక్కడ ఆ అంశాన్ని ఎజెండాలో చేర్చినట్టుగానీ, బోర్డులో చర్చించి, ఆమోదించినట్టుగానీ లేదు. 2019 డిసెంబరు 28 నాటి బోర్డు సమావేశంలో ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌కు నెయ్యి సరఫరా ఆర్డర్ అంశాన్ని 220వ పాయింట్‌గా చేర్చారు. '70 వేల కిలోల నెయ్యి సరఫరాకు 2019 సెప్టెంబరు 23న మొదటిసారి ఇ-టెండర్ పిలిచాం. మొదటి రెండుసార్లు పిలిచిన టెండర్లను వివిధ కారణాలతో రద్దు చేశాం. మూడోసారి పిలిచిన టెండర్లలో బరేలీకి చెందిన ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌ను ఎంపిక చేశాం. ఆ సంస్థకు 35 వేల కిలోల నెయ్యి సరఫరాకు 2019 నవంబరు 19న కొనుగోళ్ల కమిటీ అనుమతితో సప్లై ఆర్డర్ ఇచ్చామ'ని తెలిపారు. దాన్ని పాలకమండలి ముందు సమాచారం నిమిత్తం ఉంచుతున్నట్లు మాత్రమే పేర్కొన్నారు. అదే ఎజెండా పాయింట్ కింద. . టెండర్ నిబంధనల సవరణ అంశంపై తీర్మానం కూడా రాయడం వెనుక అర్థమేంటి? నెయ్యి సరఫరా టెండర్ నిబంధనల్ని సడలించాలని బోర్డు నిర్ణయిస్తే.. దాన్ని ఎజెండాలో చేర్చి, చర్చించి నిర్ణయం తీసుకోవాలి కదా?

నాడు అంతా చేసి, నేడు ఏమీ ఎరగనట్లు మాటలా?

'తితిదే అవసరాల మేరకు నెయ్యి సరఫరా జరగకపోవడంతో అధికారులు నిపుణుల కమిటీ వేసి, ఆ కమిటీ సిఫారసుల మేరకు నిబంధనలు సడలించారు. ఎందుకు సడలించారని ఆ తర్వాత మేం అడిగితే 'ఎక్కువ మంది పాల్గొనేందుకు అవకాశమిస్తే పోటీ పెరిగి, తక్కువ ధరలకు కోట్ చేస్తార'ని చెప్పారు. నెయ్యి నాణ్యతపై రాజీ పడకుండానే, టెండర్ నిబంధనలను సడలించాం' అని సుబ్బారెడ్డి ఇప్పుడు చెబుతున్నారు. నిబంధనల సడలింపు వ్యవహారం అసలు ఎవరికీ తెలియదన్నట్లు, ఎందుకు సడలించారని తర్వాత అధికారులను అడిగి తెలుసుకున్నట్లు నమ్మబలుకుతున్నారు. నిబంధనలను నీరుగార్చేలా పావులు కదిపి, తీర్మానంపై సంతకం చేసిన వ్యక్తే... ఇలా మాట్లాడటం విస్మయగొల్పుతుంది. పైగా నాణ్యత పెంచడానికి నిబంధనలు మార్చామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉంది. అడ్డంగా దొరికిపోయిన సుబ్బారెడ్డి... అడ్డగోలుగా సమర్థించుకుంటున్నారని అర్థమవుతోంది. నెయ్యి కల్తీని 2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ నిర్ధారించినా, దాన్ని పక్కన తొక్కిపెట్టడం కూడా చర్చకు వస్తోంది.

కల్తీ కుట్ర.. పకడ్బందీగా అమలు

ఒక్క లీటరు పాలు కూడా సేకరించని భోలేబాబా, మాల్‌గంగా, వైష్ణవి వంటి ప్రైవేటు డెయిరీలకు దారి చూపేందుకే టెండర్ నిబంధనల్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చారని సిట్ నిగ్గుతేల్చింది. నిబంధనలు కట్టుదిట్టం చేసిన ఐదు నెలల్లోనే తిరిగి సడలించడానికి సహేతుక కారణాలను కొనుగోళ్ల కమిటీగానీ, పాలకమండలిగానీ చెప్పలేకపోయాయి. 'ఎక్కువ డెయిరీలు పాల్గొనేందుకు వీలుగా నిబంధనలను సడలిస్తున్నాం' అన్న ఏకైక సాకు.. కుట్ర కోణాన్ని వెల్లడిస్తోంది.

◆ తితిదే నెయ్యి కొనుగోళ్ల టెండర్లను పటిష్ఠం చేసేందుకు 2019 ఏప్రిల్‌లో తెదేపా ప్రభుత్వ హయాంలో కమిటీ వేశారు. ఆ కమిటీ సిఫార్సులను 2019 ఆగస్టు 16న నాటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆమోదం తెలిపారు. ఆ నిబంధనల ప్రకారమే 2019 అక్టోబరులో నెయ్యి కొనుగోళ్లకు టెండర్లు పిలిచారు.

◆ వైకాపా అధికారంలోకి వచ్చాక, కొత్త సభ్యులతో ఏర్పాటైన కొనుగోళ్ల కమిటీ టెండర్ నిబంధనలు సడలించాలని 2019 నవంబరు 27న సిఫార్సు చేసింది.

◆ 2019 డిసెంబరు 28న ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌కు నెయ్యి సరఫరా ఆర్డర్ ఇచ్చేలా బోర్డు ఆమోదం తెలుపుతూ, దాని కిందే టెండర్ నిబంధనల సవరణ ప్రతిపాదన తీర్మానం రాసేశారు.

◆ అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డి ఆమోదంతో 2020 జనవరి 6న టెండర్ నిబంధనల సవరణకు కొత్త కమిటీని నియమించారు. 2019లో నిబంధనల్ని కట్టుదిట్టం చేసేందుకు నియమించిన కమిటీలోని సభ్యులే.. ఈ కమిటీలోనూ ఉన్నారు.

◆ ఆ కమిటీ సరైన అధ్యయనం చేయకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించకుండా, తగినంత సమయం తీసుకోకుండా నిబంధనలు సడలించాలని సిఫార్సు చేసినట్లు సిట్ పేర్కొంది. దీన్నిబట్టి, నిబంధనలను ఎలా నీరుగార్చాలో ముందే నిర్ణయించుకుని, ఆ మేరకు కమిటీ చేతికి డ్రాఫ్ట్ సమర్పించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2019లో సూచించిన దానికి పూర్తి విరుద్ధమైన సిఫార్సుల్ని ఇప్పుడు కమిటీ చేసింది.

◆ 2020 జనవరి 23న అప్పటి జీఎం ప్రొక్యూర్‌మెంట్ కార్యాలయంలో, 2020 ఫిబ్రవరి 14న నాటి అదనపు ఈవో ధర్మారెడ్డి అధ్యక్షతన కమిటీ సభ్యులు సమావేశమై, నిబంధనల సడలింపునకు సిఫార్సు చేయాలని నిర్ణయించారు. అప్పటికే ఉన్న నిబంధనలను ఎందుకు మార్చాలనుకున్నారో ఎక్కడా చెప్పలేదని సిట్ పేర్కొంది.

◆ నిపుణుల కమిటీ సిఫార్సులను 2020 ఫిబ్రవరి 18న కొనుగోళ్ల కమిటీ, 2020 ఫిబ్రవరి 29న తితిదే బోర్డు ఆమోదించాయి. అప్పటి నుంచే కల్తీ నెయ్యి సరఫరాకు గేట్లు తెరుచుకున్నాయి.

కొండకెక్కేనే శ్రీవారి లడ్డూలు

తిరుపతిలో మూతపడ్డ విక్రయ కేంద్రాలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుపతిలో ఏర్పాటు చేసిన శ్రీవారి లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు బుధవారం మూసివేయడంతో యాత్రికులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. గతంలో గోవిందరాజస్వామి ఆలయం, కపిలతీర్థం, తిరుచానూరు, వకుళమాత ఆలయం, శ్రీనివాస మంగాపురంలో రోజుకు పది వేల వరకు లడ్డూలు విక్రయించేవారు. ఒక్కో ఆధార్ కార్డుపై రెండు చొప్పున ఇచ్చేవారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ సమీపంలోని గోవిందరాజుస్వామి ఆలయంలో మూడు వేల వరకు అందుబాటులో ఉంచడంతో ఎక్కువ మంది ఆశ్రయించేవారు. ముందస్తు బుకింగ్ లేనప్పుడు, సర్వదర్శనానికి 24 గంటలకు పైగా సమయం పడుతున్న సందర్భాల్లో.. స్వామివారి దర్శనం దుర్లభమైనపుడు తిరుపతి నుంచే తిరుగు ప్రయాణమయ్యే యాత్రికులు ఎందరో వీరు స్థానిక విక్రయ కేంద్రాల్లో లడ్డూలు కొనుక్కుని సంతృప్తి పడేవారు. ఇప్పుడు లడ్డూల కోసం వ్యయప్రయాసలకోర్చి తిరుమలకు వెళ్లాల్సి వస్తోంది. అయితే, స్థానిక విక్రయ కేంద్రాల నుంచి లాభాలు రాకపోవడం వల్ల లడ్డూలు పంపడం లేదని తితిదే సిబ్బంది చెబుతున్నారు.

తితిదే ఎఫ్ఏ అండ్ సీఏవోగా రవిప్రసాద్‌కు తాత్కాలిక బాధ్యతలు

బాలాజీ ఆకస్మిక సెలవుతో నిర్ణయం

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తితిదే ముఖ్య గణాంక, ఆర్థిక సలహాదారు (ఎఫ్ఏ అండ్ సీఏవో) ఓ.బాలాజీ సెలవుపై వెళ్లారు. ఆ స్థానంలో తాత్కాలిక బాధ్యతలను అదనపు ఎఫ్ఏ అండ్ సీఏవో రవిప్రసాద్‌కు అప్పగించారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో సిట్ దర్యాప్తు ముమ్మరం చేయడం, టెండర్ నిబంధనల సడలింపులో బాలాజీ కీలకపాత్ర పోషించారని ప్రాథమికంగా నిర్ధారించిన నేపథ్యంలో ఆయన ఆరోగ్య కారణాలతో 20 రోజుల సెలవుపై వెళ్లారు. కీలకమైన ఆర్థిక విభాగంలో రోజువారీ లావాదేవీలు, ఉద్యోగుల జీతభత్యాలు, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు ఆటంకం కలగకుండా ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. బాలాజీ సెలవు ముగిసేవరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు రవిప్రసాద్ కొనసాగనున్నారు.

'ఆత్మీయ పలకరింపు' కొనసాగించాలి

ప్రజాప్రతినిధులకు మంత్రి లోకేశ్ విందు



ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులతో మంత్రి లోకేశ్



స్పీకర్ అయ్యన్నతో మంత్రి లోకేశ్

ఈనాడు డిజిటల్, అనకాపల్లి: "ముఖ్యమంత్రిగా చంద్రబాబు తొలినాళ్లలో అందరి ఎమ్మెల్యేలతో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు మంత్రి నారా లోకేశ్ ఇదే ఒరవడి అందుకున్నారు. అందరితో కలిసి సహపంక్తి భోజనాలు కొత్త అనుభూతి ఇస్తున్నాయి" అని పలువురు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులకు మంత్రి లోకేశ్ 'ఆత్మీయ పలకరింపు' కింద ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం రాత్రి విందు ఇచ్చారు. అసెంబ్లీలో డిజిటల్ హాజరుతో సభ పూర్తయ్యేవరకూ కూర్చోవలసి వస్తోందని, ఎవరు ఎంత సమయం సభలో ఉంటున్నారో తెలిసిపోతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమక్షంలో సరదాగా చమత్కరించారు. హోంమంత్రి అనిత కుమార్తె రేష్మను ఎలా చదువుతున్నావని మంత్రి ఆరా తీశారు. అన్నయ్యలను ఎప్పుడూ ఆట పట్టిస్తుండాలన్నారు. కలిసికట్టుగా జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలతో తరచూ మమేకమై వారి సమస్యలు తెలుసుకుని వాటిని తీర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ రాజు, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్‌బాబు కుటుంబసమేతంగా హాజరయ్యారు.

నేసిన వారిదే భాగ్యం.. చూసిన కనులదే అదృష్టం!

- వందేళ్లుగా శ్రీశైలం ఆలయానికి తలపాగా అలంకరణ
- శివరాత్రి నాడు ప్రత్యేక క్రతువు



తలపాగాలంకరణ కోసం వస్త్రాన్ని తీసుకొస్తున్న భక్తులు

శ్రీశైల ఆలయం, న్యూస్‌టుడే: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం శివనామస్మరణలతో మార్మోగుతోంది. బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన పాగాలంకరణను తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. మహాశివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో ఆలయంపై నవ నందులను కలుపుతూ తెల్లని వస్త్రాన్ని చుట్టడమే పాగాలంకరణ. ఈ అలంకరణతో శివుడు తలపాగా ధరించినట్లు భక్తులు భావిస్తారు. స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరించడంలో భాగంగానే ఈ క్రతువు చేపడతారు. బాపట్ల జిల్లా చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబీకులే వందేళ్లుగా తల పాగాను నేసి, అలంకరిస్తున్నారు. వెంకటేశ్వర్లు 60 ఏళ్లు పాగాలంకరణ చేసి కాలంచేయగా.. ఆయన కుమారుడు పృథ్వీ సుబ్బారావు మూడేళ్లుగా ఈ సేవ చేస్తున్నారు. పాగా తయారీకి ఏటా కార్తీక మాసంలో అంకురార్పణ చేసి, సంక్రాంతికి నేత పూర్తి చేస్తారు. సుమారు 3 నెలల పాటు అత్యంత నియమనిష్ఠలతో సొంత మగ్గంపై 300 మూరలు వరకు నేస్తారు. నేతపని పూర్తయ్యే వరకూ మాలధారణ భక్తులు పాటించే అన్ని నియమాలు పాటిస్తారు.



మిమ్మల్ని మీరు విశ్వసించండి

మీ గురించి మీరు తెలుసుకోవలసిన వాస్తవాలు.. ✦ మీరు ఎవ్వరికన్నా తక్కువకాదు ✦ మిమ్మల్ని మీరు ఎప్పుడూ తక్కువ చేసుకోవద్దు ✦ మిమ్మల్ని, మీ సామర్థ్యాలను విశ్వసించండి ✦ మీరు పరిష్కారంలో భాగం తప్ప సమస్యలో కాదు. ఈ భావనలు మీలో వికసిస్తే జీవితంలో ఎక్కడా తలొంచనవసరంలేదు.

– ఫోలా ఎయినా, స్కాలర్

పాలకమండళ్ల నిర్లక్ష్యం వల్లే గతంలో అపచారాలు

- తిరుమల విషయంలో అదే జరిగింది
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- శ్రీకాళహస్తిలో కైలాసగిరి ప్రదక్షిణ మార్గం ప్రారంభం





వర్చువల్‌గా కైలాసగిరి రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి ఆనం, ఎమ్మెల్యేలు బొజ్జల, ఆరణి ★ శ్రీకాళహస్తీశ్వరాలయంలో శిలాఫలకం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆలయాల పర్యవేక్షణకు నియమితులయ్యే పాలకమండళ్లు బాధ్యతగా వ్యవహరిస్తే అపచారాలకు అవకాశం ఉండదని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద రూ.10 కోట్లతో ఏర్పాటు చేసిన కైలాసగిరి ప్రదక్షిణ మార్గాన్ని సచివాలయం నుంచి వర్చువల్‌గా శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'గత ప్రభుత్వ హయాంలో పాలకమండళ్లు సక్రమంగా లేకపోవడంతో ఆలయాల్లో అపచారాలు జరిగాయి. తిరుమల విషయంలో అదే జరిగింది. అలాంటి పరిస్థితి కూటమి ప్రభుత్వంలో రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆలయాలు నాగరికతకు చిహ్నాలు. కళలకు వారసత్వం. సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణ ఆలయాలతో ముడిపడి ఉన్నాయి. గత ప్రభుత్వం ఆలయాల పర్యవేక్షణ పూర్తిగా గాలికి వదిలేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో ఆలయాలు అభివృద్ధికి నోచుకున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ఆలయాల నిర్మాణానికి దేవాదాయ శాఖ అంగీకారం తెలియజేయడం ఆనందంగా ఉంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సనాతన ధర్మ ఔన్నత్యాన్ని పరిరక్షించేందుకు కృషిచేస్తూ ముందుకెళ్తోంది. రూ.40 కోట్లతో రాష్ట్రంలోని 22 ప్రధాన దేవాలయాలకు రోడ్డు వసతి కల్పిస్తున్నాం. అరుణాచలంలో గిరిప్రదక్షిణ ఎంతో ప్రాభవం పొందింది. నాకూ గిరిప్రదక్షిణ చేయాలన్న కోరిక ఉంది. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆహ్వానం మేరకు త్వరలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శిస్తా. 22 కిలోమీటర్ల పొడవు కల్గిన కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలో మొక్కలు నాటడంతో పాటు, ఆ మార్గాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం. బ్రహ్మోత్సవాల అనంతరం గిరిప్రదక్షిణ మార్గానికి రెండు వైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నాం. ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో అరుణాచలంలో లాగా ఇక్కడి కైలాసగిరి ప్రదక్షిణకు వైభవాన్ని తీసుకువచ్చేలా సూచనలు చేశాం' అని వివరించారు. సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

హెరిటేజ్ ఎప్పుడూ దేవాలయాలకు నెయ్యి సరఫరా చేయలేదు

- నేరుగా వినియోగదారులకే విక్రయిస్తుంది
- దురుద్దేశంతోనే తప్పుడు ప్రచారం
- స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు

ఈనాడు, అమరావతి: హెరిటేజ్ సంస్థ ఎప్పుడూ దేవాలయాలకు, ప్రభుత్వానికి, ఇతర ఏ కంపెనీలకూ నెయ్యి సరఫరా చేయలేదని స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ పి.కుటుంబరావు స్పష్టం చేశారు. తన బ్రాండ్‌తో బహిరంగ మార్కెట్‌లో నేరుగా వినియోగదారులకే నెయ్యి విక్రయిస్తోందని తెలిపారు. హెరిటేజ్ సంస్థపై అభూతకల్పనలు, అవాస్తవాలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'హెరిటేజ్ సంస్థకు ఇందాపూర్ డెయిరీ కేవలం కో మాన్యుఫ్యాక్చరింగ్ లొకేషన్ మాత్రమే. అక్కడ స్కిమ్డ్ మిల్క్ పౌడర్, చీజ్, పన్నీర్ వంటివి మాత్రమే తయారవుతాయి. నెయ్యి తయారు చేయరు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, హరియాణా, మహారాష్ట్ర, తమిళనాడుల్లో హెరిటేజ్‌కు 15 యూనిట్లు ఉన్నాయి. వీటి వివరాలన్నీ సంస్థ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. కానీ సాక్షి పత్రిక హెరిటేజ్‌కు 22 యూనిట్లు ఉన్నాయని అవాస్తవాలు రాసింది' అని కుటుంబరావు తెలిపారు. దేశంలోనే అతిపెద్ద డెయిరీల్లో ఇందాపూర్ ఒకటన్నారు. బ్రిటానియా, హిందుస్థాన్ యూని లీవర్, పతంజలి వంటి ప్రముఖ సంస్థలు ఈ డెయిరీ వినియోగదారులని ఆయన పేర్కొన్నారు. కావాలనే ఇలాంటి సంస్థపై దుష్ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

పదేళ్ల క్రితం ధర ఇప్పటికీ ఉంటుందా?

'2020-22 మధ్య దేశంలో కిలో నెయ్యి ధర రూ.600 నుంచి రూ.650 మధ్య ఉంది. కానీ ఏఆర్ డెయిరీ లాంటి సంస్థలు తితిదేకు రూ.360కే సరఫరా చేశాయి. దీన్ని బట్టే అది ఎంత నాణ్యత లేని నెయ్యో అర్థమవుతోంది' అని కుటుంబరావు పేర్కొన్నారు. '2014-19 మధ్య మార్కెట్‌లో కిలో నెయ్యి ధర రూ.260 నుంచి రూ.400 మధ్య ఉంది. అప్పట్లో ఇందాపూర్ సంస్థ తితిదేకు కిలో నెయ్యి రూ.300కు సరఫరా చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నెయ్యి ధర రూ.600 నుంచి రూ.750 వరకూ ఉంది. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ గణాంకాలే. అప్పట్లో రూ.300 కోట్ చేసిన ఇందాపూర్ డెయిరీ ఇప్పుడు రూ.658కి కోట్ చేయడం దోపిడీ అంటే ఎలా? పదేళ్ల క్రితం రూ.300 ఉన్న వస్తువు ధర ఇప్పటికీ అంతే ఉంటుందా' అని ప్రశ్నించారు.

సీఎంకు 108 ఉద్యోగుల కృతజ్ఞతలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 108 అంబులెన్సుల్లో పనిచేస్తున్న ఈఎంటీలు, పైలట్‌లు శుక్రవారం థాంక్యూ సీఎం సార్ అంటూ వాహనాల వద్ద ప్లకార్డులు పట్టుకుని హర్షం వ్యక్తంచేశారని ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్‌కుమార్ వెల్లడించారు. జీతానికి అదనంగా నెలకు రూ.2వేలు పెంచడంతోపాటు.. ఐదేళ్లు, పదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అప్‌గ్రేడేషన్ చేయాలని నిర్ణయించి ప్రభుత్వం మరింత ఆర్థిక వెసులుబాటు కల్పించిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉత్సాహంతో మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

సరోగసీ కేసులో డాక్టర్ నమ్రత అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: సరోగసీ పేరుతో పిల్లలు లేని దంపతులను మోసం చేసిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. దర్యాప్తునకు సహకరించకపోవడం, తప్పించుకొని తిరుగుతుండటంతోనే ఆమెను అరెస్టు చేశామని ఈడీ అధికారులు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నిందితురాలిని న్యాయస్థానంలో హాజరుపరచగా ఈ నెల 26 వరకు రిమాండ్ విధించింది. పిల్లలు లేని దంపతుల వద్ద పెద్దఎత్తున డబ్బు తీసుకొని సరోగసీ పద్ధతిలో వారికి పిల్లలు కలిగేలా చేస్తామని చెబుతూ నమ్రత రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక మందిని మోసం చేసిన విషయం తెలిసిందే.

నివాస గృహాల క్రమబద్ధీకరణ పథకం మరో ఏడాది పొడిగింపు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ భూముల్లో ఉన్న నివాస గృహాల క్రమబద్ధీకరణ పథకాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో అభ్యంతరం లేని సర్కారు భూముల్లో నిర్మించిన నివాస గృహాలకు సంబంధించిన ఆక్రమణల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. దరఖాస్తుల స్వీకరణ గడువు 2025 డిసెంబరు 31వ తేదీన ముగిసింది. దీన్ని పొడిగించాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. పరిశీలించిన ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ ఏడాది డిసెంబరు 31 వరకు పొడిగించింది.

ప్రశాంతంగా ముగిసిన బార్ కౌన్సిల్ ఎన్నికలు



సుప్రీంకోర్టు ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన జస్టిస్ చల్లా కోదండరామ్, జస్టిస్ డీవీ సోమయాజులు, ఇతర న్యాయవాదులు

ఈనాడు, అమరావతి, దిల్లీ: ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 149 పోలింగ్ కేంద్రాల్లో న్యాయవాదులు శుక్రవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. హైకోర్టు ప్రాంగణంలో సోమవారం నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. 143 మంది న్యాయవాదులు ఈ పోటీలో ఉన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి రిటర్నింగ్ అధికారిగా, జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. అలాగే దిల్లీలోని సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తి కొనసాగిస్తున్న ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుల కోసం సుప్రీంకోర్టు ప్రాంగణంలో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తి కొనసాగిస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ చల్లా కోదండరామ్, జస్టిస్ డీవీ సోమయాజులు, సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు, బి.సుయోధన్‌తో పాటు మొత్తం 40 మంది న్యాయవాదులు ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నిక అధికారులుగా రమేష్ అల్లంకి, శ్రీధర్ పోతరాజు, అనిశెట్టి చంద్రమోహన్, వి.పట్టాభిరామ్‌లు వ్యవహరించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి ప్రజ్ఞా భగేల్ ఈ పోలింగ్‌ను పర్యవేక్షించారు.

మన బొగ్గు గనుల్లో త్వరలో కార్యకలాపాలు

రిలయన్స్ సహా బిడ్లు దాఖలుచేసిన మూడేసి సంస్థలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఉన్న రెండు బొగ్గు గనుల్లో కార్యకలాపాలు మొదలయ్యేందుకు రంగం సిద్ధమవుతోంది. వీటిలో బొగ్గు తవ్వి అమ్ముకునేందుకు కేంద్ర బొగ్గు శాఖ ఎన్నిసార్లు టెండర్లు పిలిచినా చాలా కాలం నుంచి ఎవరూ ముందుకు రాలేదు. తాజాగా ఏలూరు జిల్లాలోని చింతలపూడి సెక్టార్-1, సోమవరం తూర్పు, పశ్చిమ బ్లాక్‌లకు పిలిచిన టెండర్లకు ఇటీవల బిడ్లు దాఖలు కావడంతో ఈ బొగ్గు గనుల్లో ఆపరేషన్స్ ఆరంభించేందుకు అవకాశం ఏర్పడింది. ◆ సోమవరం బ్లాక్ 38.08 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉంది. ఇందులో సగటున జి-13 రకం బొగ్గు లభిస్తుంది. ఇక్కడ 200 మిలియన్ టన్నుల మేర బొగ్గు నిల్వలు ఉంటాయని అంచనా వేశారు.

◆ చింతలపూడి బ్లాక్ 12.04 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉంది. ఇందులో సగటున జి-12 రకం బొగ్గు లభిస్తుంది. ఇక్కడ 867 మిలియన్ టన్నుల నిల్వలు ఉంటాయని అంచనా వేశారు. ◆ ఈ రెండు బ్లాక్‌లకు మూడేసి సంస్థలు బిడ్లు వేశాయి. రిలయన్స్‌తో పాటు మరో రెండేసి సంస్థలు టెండర్లు వేయగా, ఇటీవల వాటి టెక్నికల్ బిడ్లను పరిశీలించారు. త్వరలో ధరల బిడ్లు తెరిచి, టెండర్లు ఖరారు చేయనున్నారు.

బొగ్గు తవ్వకుండా గ్యాస్ ఉత్పత్తి: ఈ గనుల్లో సగటున 600 నుంచి 1,000 మీటర్ల లోతున బొగ్గు నిల్వలు ఉన్నాయి. అంత లోతున అండర్ గ్రౌండ్ మైనింగ్ చేసి బొగ్గు తవ్వి తీసినా గిట్టుబాటు కాదని గనులశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బొగ్గు తవ్వకాలకు బదులు, భూమి లోపలే ఆ బొగ్గుని గ్యాసిఫై చేసి మిథేన్ గ్యాస్ ఉత్పత్తి చేయనున్నారు. దీని కోసం విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ఈ రెండు బొగ్గు గనుల్లో మున్ముందు కార్యకలాపాలు మొదలైతే రాష్ట్ర గనులశాఖకు అదనపు రాబడి రానుంది.



కారుపై ఒరుగుతున్న కంటెయినర్



కారుపై పూర్తిగా పడిపోయి..



నుజ్జైన కారు. పక్కన పడిపోయిన కంటెయినర్

కారుపై కంటెయినర్ పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



అనుదీప్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: మరో 10 నిమిషాల్లో ఇంటికి చేరుకోవచ్చని భావిస్తుండగా కారుపై కంటెయినర్ పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణాలు కోల్పోయారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం 190-రామాపురం గ్రామానికి చెందిన దయానందం, మల్లికల మూడో కుమారుడు అనుదీప్(33) బెంగళూరులో విప్రో సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. శుక్రవారం నుంచి మూడు రోజులు సెలవులు ఉండటంతో శుక్రవారం వేకువజామున కారులో బయలుదేరారు. చిత్తూరు నగర శివారులోని ఇరువారం-యాదమరి నాలుగు రోడ్ల కూడలి వద్దకు కారు రాగానే.. ఎడమ వైపు నుంచి ఓ ద్విచక్రవాహనం దూసుకురావడంతో.. అటుగా వస్తున్న కంటెయినర్ ద్విచక్ర వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో కారుపై పడిపోయింది. దీంతో కారు పూర్తిగా నలిగిపోవడంతో అనుదీప్ అందులోనే మరణించారు. పోలీసులు, స్థానికులు కారు పైభాగాన్ని విద్యుత్తు కట్టర్, ఇనుప రాడ్ల సాయంతో తొలగించి మృతదేహాన్ని వెలికితీశారు. కంటెయినర్ లారీ డ్రైవర్ కుమార్, వేలూరుకు చెందిన ద్విచక్రవాహనం నడుపుతున్న చంద్రన్‌లపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే కాదు
న్యాయవాదులు, అకౌంటెంట్లకూ కష్టమే

- ఏఐతో వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉంది
- మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్ అంచనా



వచ్చే ఏడాది, ఏడాదిన్నర సమయంలో 'వైట్ కాలర్' ఉద్యోగాల్లో చాలా వరకు ఆటోమేషన్‌కు గురయ్యే అవకాశం ఉందని మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్ హెచ్చరిస్తున్నారు. కృత్రిమ మేధ(ఏఐ) వేగంగా వృద్ధి చెందుతుండటంతో, పలు ఐటీ కంపెనీల్లో లేఆఫ్‌ల ప్రకటనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సులేమాన్ ఒక ఆంగ్లపత్రిక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఆంత్రోపిక్ క్లాడ్ మోడల్, స్టాక్ మార్కెట్లను నష్టపరుస్తున్న తరుణంలో ముస్తఫా ఇలా పేర్కొనడం గమనార్హం.

కోడర్లకే కాదు

కేవలం కోడర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లపైనే కాకుండా కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేసే న్యాయవాదులు, అకౌంటెంట్లు, ప్రాజెక్టు మేనేజర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లపైనా ఏఐ ప్రభావం పడనుందని సులేమాన్ అంటున్నారు. రాబోయే 12-18 నెలల్లోనే ఈ పోస్టులు ఏఐతో భర్తీ అయ్యే అవకాశం ఉంద'ని పేర్కొన్నారు. 2-3 ఏళ్లలో పెద్ద పెద్ద కంపెనీల్లో ఏఐ ఏజెంట్లే సమర్థంగా సమస్వయ బాధ్యతలనూ నిర్వర్తించగలవని తెలిపారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ, ఏఐ ఏజెంట్లు మెరుగవుతాయని, స్వయం ప్రతిపత్తితో నిర్ణయాలు తీసుకుంటూ వెళతాయని అన్నారు.

మరింత సులువుగా కొత్త మోడళ్లు

ఏఐ మెరుగయ్యే కొద్దీ కొత్త మోడళ్ల సృష్టి, వాడకం మరింత సులభతరం కానుంది. పాడ్‌క్యాస్ట్ లేదా బ్లాగ్‌ను రూపొందించేందుకు కొత్త మోడల్‌ను సృష్టించే అవకాశం ఉంది. ప్రతి కంపెనీ/వ్యక్తి అవసరాలకు తగ్గట్లుగా ఏఐని డిజైన్ చేయడమూ భవిష్యత్తులో సాధ్యంకావొచ్చని ఆయన అన్నారు.

సొంత, శక్తిమంత మోడళ్ల దిశగా

ఓపెన్‌ఏఐపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు.. సొంత, శక్తిమంత ఫౌండేషన్ మోడళ్లను అభివృద్ధి చేయడంపై మైక్రోసాఫ్ట్ దృష్టి సారిస్తోందని ముస్తఫా వివరించారు. ఇప్పటికే అధునాతన ఏఐ వ్యవస్థలపై శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అసెంబ్లింగ్, డేటాసెట్ల నిర్వహణపై మైక్రోసాఫ్ట్ భారీగా ఖర్చు చేస్తోందని తెలిపారు. జూన్‌తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 140 బి.డాలర్ల (దాదాపు రూ.12.7 లక్షల కోట్లు) మూలధన వ్యయాలు చేయనుందని అంచనా.

ఆరోగ్య రంగంపైనా దృష్టి

ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత, ఎక్కువసేపు వేచిచూడడం వంటి సమస్యలకు పరిష్కారంగా 'మెడికల్ సూపర్‌ఇంటెలిజెన్స్'ను తీసుకురావాలని భావిస్తున్నట్లు సులేమాన్ తెలిపారు. మనుషుల నియంత్రణలోనే ఉండే 'హ్యూమనిస్ట్ సూపర్ ఇంటెలిజెన్స్'నూ అభివృద్ధి చేసే లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు. ఏఐ ల్యాబ్‌లు తమ సృష్టికర్తల జోక్యాన్ని అడ్డుకుంటాయన్న ఆందోళనల మధ్య, కంపెనీ ఈ లక్ష్యాన్ని పెట్టుకుంది.

అంత వేగంగా
ఏమీ పోవు



ఏఐ అనేదేమీ ఒక క్లౌడ్ కాదు. దానిని కొనుగోలు చేసి సిస్టమ్‌లో పెట్టగానే ఆటోమేటిక్‌గా పని జరిగిపోదు. తాము వినియోగిస్తున్న ఐటీ వ్యవస్థలను కాదని, ఒక్కసారిగా ఏఐని పెద్ద సంస్థలు వినియోగించబోవు. ఆంత్రోపిక్ వంటి కంపెనీలు మూలధన సమీకరణ కోసమే తెలివిగా ఏఐని వినియోగిస్తున్నాయి. ఆ కంపెనీ గురువారం 30 బి. డాలర్లు సమీకరించింది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతున్నాయని కొన్ని ఐటీ కంపెనీలు చెబుతున్నాయి. కొన్ని ఉద్యోగాలు పోయినా.. మరిన్ని ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. అయినా మార్పేమీ వారు చెబుతున్నంత వేగంగా జరిగిపోదు. మరికొంతమందేమో న్యాయవాదులు, వైద్యుల స్థానాన్ని సైతం ఏఐ భర్తీ చేయగలదని చెబుతున్నారు. ఏఐపై ఒకలాంటి హైప్‌ను వీరు సృష్టిస్తున్నారు. అయితే ఏఐ ఒక విప్లవమని ఒప్పుకోక తప్పదు. ఉత్పాదకతను కచ్చితంగా ఏఐ పెంచుతుంది.

ప్రస్తుత వ్యవస్థలు మారిపోవు: ప్రపంచంలోని పెద్ద కంపెనీలు తమ 'లెగసీ సిస్టమ్స్'పైనే నడుస్తున్నాయి. చాలా వరకు అంతర్జాతీయ బ్యాంకులు వాటిపై ఏటా 15 బి. డాలర్ల (సుమారు రూ.1.36 లక్షల కోట్లు) వరకు ఖర్చు చేస్తున్నాయి. 12-13 డేటాబేస్‌లు వాటికి ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో లెగసీ కోడ్‌పై ఏఐ ప్రభావం ఉండదు. ఈ నేపథ్యంలో క్లాడ్ వచ్చి, మొత్తం ఎంటర్‌ప్రైజ్ సిస్టమ్‌ను నిర్వహిస్తుందనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది.

–ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్

రూ.7 లక్షల కోట్ల
సంపద ఆవిరి

సెన్సెక్స్ ▼ 1048
82627

నిఫ్టీ ▼ 336
25471

- సూచీలకు 1% పైగా నష్టం
- లోహ, ఐటీ షేర్లలో అమ్మకాలు

అన్ని రంగాల షేర్లలో ముఖ్యంగా ఐటీ, లోహ రంగాల్లో అమ్మకాలు తీవ్రమై మన స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది. సెన్సెక్స్, నిఫ్టీ 1 శాతానికి పైగా క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు మన మదుపర్ల సెంటిమెంటును దెబ్బతీశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 5 పైసలు తగ్గి 90.66 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.18% తగ్గి 67.41 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7.02 లక్షల కోట్లు తగ్గి రూ.465.46 లక్షల కోట్ల (5.13 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

ఆద్యంతం నష్టాల్లోనే..: బీఎస్ఈ సెన్సెక్స్ 82,902.73 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 83,674.92) ఆరంభమైంది. అదే ఒరవడిని కొనసాగిస్తూ 82,534.55 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 1048.16 పాయింట్ల నష్టంతో 82,626.76 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 336.10 పాయింట్లు కోల్పోయి 25,471.10 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,444.30 వద్ద కనిష్ఠాన్ని, 25,630.35 వద్ద గరిష్ఠాన్ని తాకింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 953.64 పాయింట్లు, నిఫ్టీ 222.6 పాయింట్లు నష్టపోయాయి.

ఆ రెండు మినహా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్ మినహా మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో ముగిశాయి. హిందుస్థాన్ యునిలీవర్ 4.35%, ఎటర్నల్ 4.26%, టాటా స్టీల్ 2.35%, టైటన్ 2.23%, టీసీఎస్ 2.17%, పవర్‌గ్రిడ్ 2.17%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.07% చొప్పున తగ్గాయి. బజాజ్ ఫైనాన్స్ 2.43%, ఎస్‌బీఐ 0.53% పెరిగాయి.

✦ **గాడియమ్ ఐవీఎఫ్ అండ్ వుమెన్ హెల్త్ లిమిటెడ్** పబ్లిక్ ఇష్యూ ఈనెల 20న ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ఐపీఓ ద్వారా రూ.150- 200 కోట్లు సమీకరించనుంది.

✦ హిందుస్థాన్ యునిలీవర్ నుంచి విభజన అయిన నేపథ్యంలో **క్వాలిటీ వాల్స్** షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ఈనెల 16న నమోదవుతాయి.

✦ వెల్డింగ్ ఉత్పత్తులు రూపొందించే ప్రీమియర్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్, పరుపుల తయారీ సంస్థ డ్యూరోఫ్లెక్స్, ఫార్మా కంపెనీ హెగ్జాగాన్ న్యూట్రిషన్, ఓమ్ పవర్ ట్రాన్స్‌మిషన్ సంస్థల ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం లభించింది.

✦ ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ మార్కెట్లోకి అడుగుపెట్టే ప్రణాళికలో భాగంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)తో దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు **నేషనల్ కమొడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్** (ఎన్‌సీడీఈఎక్స్) ప్రకటించింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఆదాయం రూ.4,083 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.4,082.77 కోట్ల ఆదాయంపై రూ.173.96 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.2,748.22 కోట్లు, నికర లాభం రూ.202.10 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 9 నెలల కాలానికి ఆదాయం రూ.11,157.85 కోట్లు, నికర లాభం రూ.71.90 కోట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాల్లో కలిపి రూ.7,859.20 కోట్ల ఆదాయం, నికర నష్టం రూ.564.24 కోట్లుగా ఉన్నాయి. నిర్వహణ పరంగా కంపెనీ పనితీరు మెరుగుపడిందని యాజమాన్యం పేర్కొంది. దిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాలకు సంబంధించి రాబోయే టారిఫ్ ఆర్డర్ల అమలుతో, భవిష్యత్తులో ఆదాయం, మార్జిన్లు మెరుగుపడతాయని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది.

నెఫ్రోకేర్ లాభం రూ.34.4 కోట్లు

nephroplus

ఈనాడు, హైదరాబాద్: డయాలసిస్ సేవల సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ (నెఫ్రోప్లస్), ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.259.7 కోట్ల ఆదాయంపై రూ.34.4 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.197.3 కోట్లు, నికర లాభం రూ.20.1 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే ఈసారి ఆదాయం 31.7%, నికర లాభం 71.3% పెరిగాయి. ఏప్రిల్-డిసెంబరుకు ఆదాయం రూ.733.2 కోట్లు, నికర లాభం రూ.85.9 కోట్లుగా ఉన్నాయి. కిడ్నీ సంబంధిత వ్యాధుల భారాన్ని రోగులకు తగ్గించడమే తమ లక్ష్యమని సంస్థ ఛైర్మన్ విక్రమ్ వుప్పాల తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో మరింతగా విస్తరిస్తామని పేర్కొన్నారు.

విజయా డయాగ్నొస్టిక్స్ ఆదాయం రూ.205 కోట్లు

VIJAYA DIAGNOSTIC CENTRE

ఈనాడు, హైదరాబాద్: రోగ నిర్ధారణ సేవల సంస్థ విజయా డయాగ్నొస్టిక్స్, అక్టోబరు-డిసెంబరులో రూ.205.21 కోట్ల ఆదాయంపై రూ.43.17 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో ఆదాయం రూ.168.98 కోట్లు, నికర లాభం రూ.35.29 కోట్లుగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరుకు ఆదాయం రూ.894.82 కోట్లు, నికర లాభం రూ.125.04 కోట్లుగా ఉన్నాయి. కొత్తగా ప్రారంభించిన హబ్‌లను స్థిరీకరించడం, మరిన్ని చిన్న యూనిట్లు ఏర్పాటు చేయడం, అత్యాధునిక సాంకేతికతలో పెట్టుబడులు పెట్టడంపై దృష్టి సారిస్తున్నట్లు సంస్థ ఎండీ, సీఈఓ సుప్రితా రెడ్డి తెలిపారు.

రిలయన్స్ చేతికి వెనెజువెలా చమురు!

అమెరికా లైసెన్స్ పొందిన సంస్థ



వెనెజువెలా నుంచి ముడిచమురును నేరుగా కొనుగోలు చేయడానికి, అమెరికా నుంచి సాధారణ లైసెన్స్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) పొందింది. ప్రపంచంలోనే, ఒకేచోట అతి పెద్ద రిఫైనింగ్ సముదాయాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కంపెనీ నిర్వహిస్తున్న ఆర్‌ఐఎల్, ఇందుకోసం భారీఎత్తున చమురు దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో, రష్యా నుంచి చమురు దిగుమతులను సంస్థ నిలిపేసిన సంగతి విదితమే. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు ప్రారంభమైతే, రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్లూ బలోపేతం కానున్నాయి. గత నెలలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధంలోకి తీసుకున్న అమెరికా, ఆ దేశ ముడిచమురు పరిశ్రమపై ఆంక్షలను సడలించింది. ఇప్పటివరకు ట్రేడర్ల ద్వారా వెనెజువెలా చమురును విక్రయించడానికి అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఆర్‌ఐఎల్‌కు లభించిన సాధారణ లైసెన్స్ వల్ల, ఏదైనా సంస్థ వెలికితీసిన లేదా ఆధీనంలో ఉన్న చమురును నేరుగా కొనుగోలు చేసే అధికారం లభిస్తుంది.

ఆరేళ్లుగా ఆంక్షల చట్రంలో

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనపై 2019-20లో అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటివరకు వెనెజువెలా ముడిచమురును ఆర్‌ఐఎల్ కొనుగోలు చేసినా, అంతటితో ఆపేసింది. 2024లో తాత్కాలిక ఉపశమనం ఇవ్వడంతో, మళ్లీ చమురును కొనుగోలు చేసింది. ఈ ఏడాదిలో ట్రేడర్ల ద్వారా వెనెజువెలా విక్రయాలు ప్రారంభమయ్యాక.. అంతర్జాతీయ ట్రేడింగ్ సంస్థ విటోల్ నుంచి 2 మిలియన్ బ్యారెళ్ల కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ రంగ సంస్థలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కూడా 2 మిలియన్ బ్యారెళ్ల కొనుగోలు చేశాయి. ఇందులో 5 లక్షల బ్యారెళ్ల చమురును విశాఖపట్నంలోని యూనిట్‌కు హెచ్‌పీసీఎల్ కేటాయించిందని సమాచారం.

రాయితీకి లభిస్తోంది

వెనెజువెలా ముడిచమురు గ్రేడ్‌లు, ముఖ్యంగా ఒరినోకో ప్రాంతం నుంచి వచ్చేవి సంక్లిష్టంగా, భారీగా ఉంటాయి. వీటిని సమర్థంగా ప్రాసెస్ చేసే సామర్థ్యాలు జామ్‌నగర్ రిఫైనరీలో ఉన్నాయి. రవాణా ఇబ్బందుల కారణంగా వెనెజువెలా చమురు కొంత రాయితీ ధరలకే లభిస్తోంది. దీనిని డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్ (ఎల్‌పీజీ)గా మార్చొచ్చు. రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్‌లు పెరగడానికి ఇది దోహదం చేయనుంది.

పసిడి బాండులో రూ.3,449 పెట్టుబడిపై రూ.12,192 లాభం



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గతంలో జారీ చేసిన పసిడి బాండ్లలో పెట్టిన పెట్టుబడులపై మదుపర్లు భారీగా ప్రతిఫలాన్ని పొందుతున్నారు. తాజాగా 2019 ఆగస్టు 4న జారీ చేసిన 2019-20 సిరీస్-3 సార్వభౌమ పసిడి బాండ్ల (ఎస్‌జీబీ)కు తుది రిడెమ్షన్ ధరను, యూనిట్‌కు రూ.15,641గా నిర్ణయించారు. అప్పటి మేలిమి బంగారం ధర గ్రాము రూ.3,449 చొప్పున ఈ బాండ్లలో పెట్టుబడి పెడితే, ఇప్పుడు గ్రాముకు రూ.12,192 లాభాన్ని (353.49%) మదుపర్లు పొందనున్నారు. దీనికి వార్షిక వడ్డీ రేటు (2.5%) అదనం. ఈనెల 10 నుంచి 12 వరకు పసిడి ముగింపు ధరల సగటు ఆధారంగా, బాండ్‌కు తుది రిడెమ్షన్ ధరను నిర్ణయించారు.

ఇంజినీరింగ్ ఉత్పత్తుల కోసం కొత్త ప్లాంటు

రూ.240 కోట్ల పెట్టుబడి: స్టాండర్డ్ ఇంజినీరింగ్

Standard Engineering
Customer Inspired Excellence

ఈనాడు, హైదరాబాద్: సమగ్ర ఇంజినీరింగ్ సేవలు అందించేందుకు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నట్లు స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ వెల్లడించింది. ఇందుకోసం జిన్నారం దగ్గర రూ.240 కోట్లతో హెవీ ఇంజినీరింగ్ ఉత్పత్తుల విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు సంస్థ ప్రమోటర్, మేనేజింగ్ డైరెక్టర్ కందుల నాగేశ్వర రావు తెలిపారు. శుక్రవారం సంస్థకు కొత్త కార్పొరేట్ పేరును (స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ నుంచి స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ) ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చమురు, గ్యాస్, న్యూక్లియర్ ప్లాంట్లలో ఉపయోగించే ఉత్పత్తుల తయారీ చేపట్టనున్నట్లు వివరించారు. తొలి దశలో రూ.120 కోట్లు పెట్టుబడి పెడుతున్నామని, 2027 జూన్‌లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. త్వరలోనే ఐటీ సంస్థలకూ విస్తరించబోతున్నట్లు తెలిపారు. కొత్త తరం సాంకేతికతల కోసం రూ.20 కోట్లతో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విరూపాక్ష ఐపీఓకు సెబీ అనుమతి

VIRUPAKSHA

ఈనాడు, హైదరాబాద్: ఔషధ రంగంలోని హైదరాబాద్ సంస్థ విరూపాక్ష ఆర్గానిక్స్ లిమిటెడ్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనకు సెబీ అనుమతి లభించింది. పరిశోధన, అభివృద్ధి ఆధారంగా ఏపీఐలు, ఇంటర్మీడియట్ల తయారీలో నిమగ్నమైన ఈ సంస్థ.. ఐపీఓ ద్వారా రూ.740 కోట్లు సమీకరించేందుకు తాజా ఈక్విటీ షేర్లు జారీ చేయనుంది. వచ్చిన మొత్తంలో రూ.360 కోట్లను యూనిట్ల విస్తరణ, మూలధన అవసరాలకు, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామంది. 2025 మార్చి 31 నాటికి కంపెనీ పోర్ట్‌ఫోలియోలో 23 ఏపీఐలు, 31 ఇంటర్మీడియట్లు ఉన్నాయి. 100కు పైగా దేశాల్లో 550 మంది కస్టమర్లకు విరూపాక్ష ఆర్గానిక్స్ సేవలు అందిస్తోంది. గంగవరం చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మామిళ్ల బాలసుబ్బారెడ్డి తదితరులు ప్రమోటర్లుగా ఉన్న ఈ కంపెనీ.. గత ఆర్థిక సంవత్సరంలో రూ.811 కోట్ల ఆదాయంపై, రూ.78 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

రూ.10,000 కోట్ల మూలనిధితో
స్టార్టప్ ఇండియా 2.0 పథకం

రూ.10,000 కోట్ల మూలనిధితో స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ పథకం, రెండో దశకు ప్రభుత్వం శుక్రవారం ఆమోదం తెలిపింది. ప్రారంభ దశల్లో, డీప్-టెక్ పరిశోధనల్లో ఉన్న అంకుర సంస్థలకు ఇది ప్రోత్సాహం ఇస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నూతన కార్యాలయం 'సేవా తీర్థ్'లో మొదటి రోజున పేదలు, అణగారిన వర్గాలు, రైతులు, యువ శక్తి, నారీ శక్తికి సంబంధించిన దస్త్రాలపై మోదీ సంతకం చేశారు. స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ఆమోదం సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మోదీ తెలిపారు. రైసినా హిల్‌లోని రాష్ట్రపతి భవన్ సమీపంలోని సౌత్ బ్లాక్ భవనం నుంచి సరికొత్త సేవా తీర్థ్‌కు శుక్రవారం మారినట్లు మోదీ పేర్కొన్నారు. అంకుర సంస్థలకు మూలధనం అందించేందుకు 2016లో రూ.10,000 కోట్లతో ఫండ్ ఆఫ్ ఫండ్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిని విజయవంతంగా వినియోగించిన తర్వాత, 2025-26 బడ్జెట్‌లో రూ.10,000 కోట్లతో రెండో దశను మంజూరు చేశారు.

కోడి గుడ్లు

14న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	525
తూ/ప గోదావరి	505
విశాఖపట్నం	505
చిత్తూరు	583

తగ్గిన విదేశీ మారకపు నిల్వలు



భారత విదేశీ మారకపు నిల్వలు ఫిబ్రవరి 6తో ముగిసిన వారంలో 6.711 బిలియన్ డాలర్లు తగ్గి 717.064 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. విదేశీ మారకపు నిల్వల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 7.661 బిలియన్ డాలర్లు పెరిగి 570.053 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వల విలువ 14.208 బిలియన్ డాలర్లు తగ్గి 123.476 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

ట్రాయ్ డీఎన్‌డీ యాప్‌లో అప్పీల్ ఫీచర్

దిల్లీ: అవాంఛిత కాల్స్, ఎస్ఎంఎస్‌లను నివారించేందుకు అందుబాటులో ఉన్న డు నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) యాప్‌లో అప్పీల్ ఫీచర్ తీసుకురావడానికి టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సన్నాహాలు చేస్తోంది. తమ ఫిర్యాదుల పరిష్కారం అసంతృప్తికరంగా ఉంటే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడానికి ఈ ఫీచర్ వినియోగదారులకు దోహదపడుతుందని ట్రాయ్ ఛైర్మన్ అనిల్ కుమార్ లాహోటి తెలిపారు. కాల్ నాణ్యత గురించి వినియోగదారులు ఫిర్యాదులు చేయడానికి వీలుగా, నవీకరించిన మైకాల్ యాప్‌ను మార్చిలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. సరికొత్త డీఎన్‌డీ యాప్‌లో బహుభాషా సదుపాయాలు ఉంటాయన్నారు. ప్రాంతీయ భాషల్లో ఫిర్యాదు చేసేలా, మెరుగైన నిర్వహణ ఉండేలా, డ్యూయల్ సిమ్ పోర్ట్‌కు మద్దతు ఇచ్చేలా ఈ యాప్‌ను తీర్చిదిద్దుతామని వివరించారు.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
ఫోర్టిస్ హెల్త్‌కేర్	197	254	2265	1928
టీవీ టుడే	(0.14)	8.73	212	232
ఆల్కెమ్ ల్యాబ్స్1	653	641	3737	3374
ఐనాక్స్ విండ్	127	111	1238	995
క్రిసిల్2	241	--	1082	913
ఈఐడీ ప్యారీ	437	416	10375	8838
టొరెంట్ ఫార్మా3	635	503	3303	2809
ఐనాక్స్ గ్రీన్ ఎనర్జీ	25	6	112	74
సీమెన్స్ ఎనర్జీ	313	232	1911	1517

1) మధ్యంతర డివిడెండ్ రూ.43 2) డివిడెండ్ రూ.28 3)డివిడెండ్ రూ.29

లీడ్ బ్యాంక్ పథకానికి కొత్త రూపు

నిబంధనల సవరణకు ఆర్‌బీఐ ప్రతిపాదనలు



ముంబయి: జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు 1969లో ప్రవేశపెట్టిన లీడ్ బ్యాంక్ పథకం (ఎల్‌బీఎస్)లో మార్పులు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఇందుకోసం కొన్ని నిబంధనలను సవరిస్తూ, శుక్రవారం ముసాయిదాను విడుదల చేసింది. బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు, ఇతర అభివృద్ధి సంస్థలను సమన్వయం చేస్తూ, ప్రాధాన్య రంగాలకు రుణ మంజూరును పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. తాజా ప్రతిపాదనల ప్రకారం.. పథకం లక్ష్యాలు, నిర్మాణం, సభ్యత్వం, వివిధ వేదికల అజెండా, కీలక అధికారుల బాధ్యతలు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ), లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్యాలయాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ప్రతి జిల్లాలోనూ ఒక వాణిజ్య బ్యాంకును లీడ్ బ్యాంక్‌గా ఆర్‌బీఐ నియమిస్తుంది. రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల కార్యకలాపాలను ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ బ్యాంకులు సమన్వయం చేస్తాయి. రుణాల మంజూరులో ఎదురయ్యే సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చిస్తూ, బ్యాంకులకు అవసరమైన సహకారాన్ని అందిస్తాయి. ముఖ్యంగా రోడ్లు, డిజిటల్ కనెక్టివిటీ, శాంతిభద్రతలు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు నిర్వహిస్తూ, ప్రతి ప్రాంతానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలి. రుణ ప్రణాళికల రూపకల్పనలో క్షేత్రస్థాయి నుంచి పరిశీలించాలని ముసాయిదాలో పేర్కొన్నారు.

స్పెక్ట్రమ్.. ఆస్తి కాదు

ఖాతా పుస్తకాల్లో టెలికాం సంస్థలు అలా చూపించరాదు: సుప్రీం



దిల్లీ: టెలికాం కంపెనీలకు కేటాయించిన స్పెక్ట్రమ్ అనేది ఆస్తి కాదని, దివాలా స్మృతి(ఐబీసీ) ప్రక్రియలోకి అది రాదని సుప్రీం కోర్టు శుక్రవారం వెల్లడించింది. స్పెక్ట్రమ్‌కు ఓ వైపు యజమాని, ట్రస్టీగా కేంద్ర ప్రభుత్వం, మరో వైపు నియంత్రణాధికార సంస్థగా ట్రాయ్ కలిసి 'మొత్తం టెలికాం పరిపాలనా భాగాన్ని' నిర్వహిస్తున్నాయని న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'స్పెక్ట్రమ్ లైసెన్సు కేటాయింపు అనేది ఎప్పటికీ దేశ టెలికాం చట్టాలకు (టెలిగ్రాఫ్ యాక్ట్ 1885, వైర్‌లెస్ టెలిగ్రఫీ యాక్ట్ 1993, ట్రాయ్ యాక్ట్ 1997) లోబడి, ఆయా నియమ నిబంధనలను పాటించాల్సి ఉంటుంద'ని తెలిపింది. టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల (టీఎస్‌పీ)కు కేటాయించిన స్పెక్ట్రమ్‌ను కంపెనీలు తమ ఖాతాల్లో 'ఆస్తి' (అసెట్)గా చూపించజాలవని, దివాలా స్మృతి 2016 ప్రక్రియ కిందకు స్పెక్ట్రమ్‌ను తీసుకురాలేరని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

కృత్రిమ గుండెతో.. దిల్‌వాలా!

14 ఏళ్ల ఉజ్బెక్ చిన్నారికి పునర్జన్మ



గుండె మొరాయించి ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఉజ్బెకిస్థాన్ బాలుడు దిల్‌షాద్ (14)కు హరియాణా వైద్యులు ప్రాణదానం చేశారు. డైలేటెడ్ కార్డియోమయోపతి సమస్యతో బాధపడుతున్న బాలుడికి 'లెఫ్ట్ వెంట్రిక్యులర్ అసిస్ట్ డివైస్' (ఎల్‌వీఏడీ) అనే మెకానికల్ హార్ట్‌ను అమర్చి ప్రాణాలు కాపాడారు. దిల్‌షాద్ గత పదేళ్లుగా పై సమస్యతో బాధపడుతున్నాడు. ఈ సమస్య ఉన్నవారికి గుండె కండరాలు చాలా బలహీనంగా మారుతాయి. శరీరంలోని వివిధ భాగాలకు గుండె రక్తాన్ని పంపింగు చేయడం కష్టమవుతుంది. చివరకు గుండె పనిచేయడం మానేసి ప్రాణాంతకంగా మారే ప్రమాదముంది. గత ఏడాదికాలంగా దిల్‌షాద్ ఆరోగ్యం మరింత క్షీణిస్తోంది. ఉజ్బెకిస్థాన్ వైద్యుల సూచనతో తల్లిదండ్రులు బాబును భారత్‌కు తీసుకువచ్చారు. గురుగ్రామ్‌లోని ఆర్టెమిస్ ఆస్పత్రి పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ విభాగం వైద్యులు కుటుంబసభ్యుల సమ్మతితో దిల్‌షాద్‌కు సంక్లిష్టమైన సర్జరీ చేసి మెకానికల్ హార్ట్ అమర్చడం ద్వారా పునర్జన్మ ప్రసాదించారు. బాబును ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామని, దిల్‌షాద్ త్వరలో ఉజ్బెకిస్థాన్‌కు తిరిగి వెళ్తున్నట్లు ఆస్పత్రి చీఫ్ పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ అసీమ్ ఆర్.శ్రీవాస్తవ తెలిపారు.

కుక్ జలసంధిని ఈదిన పారా స్విమ్మర్ సతేంద్రసింగ్



దిల్లీ: భారత పారా స్విమ్మర్ సతేంద్ర సింగ్ లోహియా (38) ప్రపంచంలో అత్యంత సవాళ్లతో కూడిన సముద్ర మార్గాల్లో ఒకటైన న్యూజిలాండ్‌లోని కుక్ జలసంధిని 9.22 గంటల్లో ఈది చరిత్ర సృష్టించారు. 23.6 కిలోమీటర్ల ఈ జలసంధిని ఈదిన తొలి ఏషియన్ పారా స్విమ్మర్‌గా గుర్తింపు సాధించారు. మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాకు చెందిన లోహియా 2024లో భారత ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కారం అందుకొన్నారు. తన బృందంతో కలిసి కుక్ జలసంధిని విజయవంతంగా ఈదిన అనంతరం శుక్రవారం లోహియా తన ఆనందాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. జనవరి మూడో వారంలో న్యూజిలాండ్‌కు చేరుకొన్న ఆయన జలసంధిలోని అతి శీతల జలాల్లో శిక్షణ ప్రారంభించారు. బాల్యంలో సోకిన డయేరియాకు సరైన చికిత్స అందకపోవడంతో లోహియా రెండు కాళ్లు దుర్బలమై దివ్యాంగుడిగా మారారు. 11 సార్లు జాతీయ పారాలింపిక్స్ ఈత పోటీల్లో పాల్గొని 4 స్వర్ణాలు సహా 23 పతకాలు గెలుచుకున్నారు. మూడు అంతర్జాతీయ పారాలింపిక్ ఈత పోటీల్లో పాల్గొని ఒక స్వర్ణం, రెండు రజతం, ఒక కాంస్య పతకాలు సాధించారు.

పర్యవసానాలు బాధాకరంగా ఉంటాయి

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్: అణు ఒప్పందానికి అంగీకరించకుంటే ఇరాన్ అత్యంత బాధాకరమైన పర్యవసానాలు చవి చూడాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటించారు. వాళ్లు ఒప్పందానికి రాకుంటే కథ మరోలా ఉంటుంది, అని ట్రంప్ తనను కలవడానికి వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో సంప్రదింపుల అనంతరం ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో నెతన్యాహుతో తన సమాలోచనలు బాగా జరిగాయని ఆయన చెప్పుకొచ్చారు. ఓ మంచి ఒప్పందానికి అంగీకరించేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అవకాశం ఉందని ట్రంప్ విశ్వసిస్తున్నట్లు నెతన్యాహు తదనంతరం విలేకరులకు తెలిపారు. మరోవైపు ప్రపంచంలోనే అతిపెద్దదైన యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్‌ను అమెరికా పశ్చిమాసియాకు పంపనుంది. ఇప్పటికే అక్కడ ఉన్న ఇదే తరహా యుద్ధ విమాన వాహక నౌకకు ఇది తోడవుతుంది అని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి.

పార్లమెంటులో మాటల యుద్ధానికి విరామం

- ముగిసిన బడ్జెట్ సమావేశాల తొలి దశ



శుక్రవారం లోక్‌సభ కార్యకలాపాలు

దిల్లీ: అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం, మాజీ సైన్యాధ్యక్షుడు ఎం.ఎం.నరవణె పుస్తకం సహా పలు అంశాలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్ర విమర్శలు, ప్రతి విమర్శలతో వాడీవేడిగా సాగిన పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తొలి దశ శుక్రవారంతో ముగిసింది. మలి దశ సమావేశాలు వచ్చే నెల 9న ప్రారంభం కానున్నాయి. ఈలోగా- కేంద్ర బడ్జెట్‌లో వివిధ మంత్రిత్వ శాఖలకు దక్కిన కేటాయింపులను పార్లమెంటరీ స్థాయీసంఘాలు పరిశీలిస్తాయి. బడ్జెట్ సమావేశాల తొలి దశ చివరి రోజు కూడా విపక్ష సభ్యుల నినాదాలతో లోక్‌సభ దద్దరిల్లింది. శుక్రవారం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురీ పేరు ఉన్నందున ఆయన రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. గందరగోళం మధ్య సభ తొలుత గంటసేపు, అనంతరం మార్చి 9 వరకు వాయిదా పడింది. రాజ్యసభను కూడా శుక్రవారం శూన్యగంట అనంతరం అదే తేదీకి వాయిదా వేశారు. బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2న ముగుస్తాయి.

సస్పెన్షన్ వేటు.. స్పీకర్‌పై నోటీసు

గత నెల 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంతో బడ్జెట్ సమావేశాల తొలి దశ ప్రారంభమైంది. 2020 నాటి భారత్-చైనా ఘర్షణకు సంబంధించి ఎం.ఎం.నరవణె తన పుస్తకంలో చేసిన వ్యాఖ్యలను లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ సభలో ప్రస్తావించేందుకు స్పీకర్ అనుమతించకపోవడంతో.. ఈ నెల 2 నుంచి దిగువ సభలో పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సభ పదేపదే వాయిదా పడింది. అధికారుల బల్లలపై నిల్చోవడం, పేపర్లను చింపి సభాపతివైపు విసరడం వంటి అనుచిత చర్యలకు పాల్పడినందుకు ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు, ఓ సీపీఎం ఎంపీపై సస్పెన్షన్ వేటు (తొలి విడత బడ్జెట్ సమావేశాలు ముగిసేదాకా పార్లమెంటుకు రాకుండా) పడటంతో పరిస్థితులు మరింత వేడెక్కాయి. నాటి నుంచి విపక్ష నేతలు నినాదాల ఉద్ధృతిని ఇంకా పెంచారు. పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండటంతో.. లోక్‌సభకు రావొద్దని ప్రధాని మోదీకి స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. దీంతో- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా ప్రధాని రాజ్యసభలోనే ప్రసంగించారు. స్పీకర్ పదవి నుంచి ఓం బిర్లాను తొలగించాలంటూ విపక్షాలు ఈ సమావేశాల్లో నోటీసు సమర్పించాయి. బడ్జెట్ సమావేశాల రెండో విడతలో అది సభ ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. పారిశ్రామిక సంబంధాల నియమావళిని సవరించేందుకు ఉద్దేశించిన బిల్లును తొలి విడతలో పార్లమెంటు ఆమోదించింది.

రాహుల్‌పై వేరే తీర్మానం ప్రవేశపెట్టం: రిజిజు

ప్రధాని మోదీ గురించి అనుచిత పదజాలంతో మాట్లాడినందుకు రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలన్న ప్రణాళికను ప్రభుత్వం పక్కనపెట్టినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. రాహుల్ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో భాజపా ఎంపీ నిశికాంత్ దుబె ఇప్పటికే 'సబ్‌స్టాంటివ్ మోషన్' కోసం నోటీసు సమర్పించడమే ఇందుకు కారణమని విలేకర్లతో మాట్లాడుతూ తెలిపారు.

ప్రపంచ వృద్ధిలో 16 శాతం తోడ్పాటు భారత్‌దే: మోదీ



దిల్లీ: ప్రపంచ ఆర్థిక రంగాన్ని వృద్ధిపథంలో నడిపించే సత్తా కలిగిన వాహకంగా భారత దేశం అవతరిస్తోందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రపంచవృద్ధిలో 16శాతం తోడ్పాటు మన దేశానిదేనని తెలిపారు. 21వ శతాబ్దిలో భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌పై స్వారీ చేస్తోందన్నారు. ఈ పరుగును ఒత్తిడితోనే అనివార్య పరిస్థితులతోనో ప్రారంభించలేదని, దృఢమైన విశ్వాసంతో మార్పును తీసుకురావాలన్న నిబద్ధతతో చేపట్టామని తెలిపారు. 'ఈటీ నౌ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2026' కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్ వేగంగా పరుగులు తీస్తోందని తెలిపారు. కొవిడ్ విసిరిన సవాళ్లను, సరఫరా వ్యవస్థలకు కలిగిన ఆటంకాన్ని ప్రస్తావిస్తూ.. సంక్షోభం చుట్టుముట్టినప్పుడే ఒక దేశం నిజమైన సత్తా ఏమిటో తెలుస్తుందన్నారు. ప్రస్తుత దశాబ్దంలో ఎదురైన ఎన్నో అవరోధాలను అవలీలగా అధిగమిస్తూ భారత్ పురోగమిస్తోందని, ఇది తనకెంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.

న్యాయమూర్తులపై పదేళ్లలో 8,630 ఫిర్యాదులు

లోక్‌సభలో ప్రభుత్వ ప్రకటన



ఈనాడు, దిల్లీ: సిట్టింగ్ జడ్జీలకు వ్యతిరేకంగా గత పదేళ్లలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కార్యాలయానికి 8,630 ఫిర్యాదులు అందినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ప్రకటించారు. డీఎంకే సభ్యుడు వి.మాథేశ్వరన్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు శుక్రవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. "ఉన్నత న్యాయవ్యవస్థ కోసం ఏర్పాటు చేసిన అంతర్గత విధానంలో భాగంగా సుప్రీంకోర్టు జడ్జీలు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులను స్వీకరించే అధికారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కల్పించారు. అలాగే హైకోర్టుల న్యాయమూర్తులకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులను ఆ కోర్టుల ప్రధాన న్యాయమూర్తులు పరిష్కరించే వీలు కల్పించారు. ఉన్నత న్యాయవ్యవస్థలోని వారికి వ్యతిరేకంగా కేంద్రీకృత ప్రజాఫిర్యాదులు, పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను సీజేఐకి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు పంపుతాం. వాటిని స్వీకరించే అధికారం వారికి మాత్రమే ఉంటుంది" అని మంత్రి పేర్కొన్నారు.

సిట్టింగ్ జడ్జీలపై సంవత్సరాల వారీగా వచ్చిన ఫిర్యాదులు

సం	అందిన ఫిర్యాదులు
2016	729
2017	682
2018	717
2019	1,037
2020	518
2021	686
2022	1,012
2023	977
2024	1,170
2025	1,102

ఝార్ఖండ్‌లో ఏనుగుల బీభత్సం.. ఆరుగురు గ్రామస్థుల మృతి

రాంచీ: ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. చుర్చు బ్లాక్ పరిధిలోని గొండ్వార్ గ్రామంలోకి గురువారం అర్ధరాత్రి చొరబడిన ఐదు ఏనుగులు బీభత్సం సృష్టించాయి. వాటి పాదాల కింద నలిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో నలుగురు ఒకే కుటుంబానికి చెందినవారు. ఏనుగులు ఆహారం కోసం వెతుకుతూ అటవీ ప్రాంతం నుంచి గ్రామంలోకి ప్రవేశించినట్లు అధికారులు చెప్పారు.

చక్రవడ్డీ 8వ వింత.. ఎప్పుడంటే?



చక్రవడ్డీ ఎనిమిదో ప్రపంచ వింత అని పెట్టుబడులు పెట్టే చాలా మంది భావిస్తారు. అయితే మూడు నాలుగేళ్లు తిరిగేసరికి ఆ ప్రభావం ఏమీ కనపడలేదంటూ ఎక్కువ మంది తమ మదుపు అలవాటు నుంచి వెనక్కి మళ్లుతారు. ఈ చక్రవడ్డీ వింత ఎప్పుడు ఆవిష్కృతమవుతుందంటే ఆ పెట్టుబడులను కనీసం 20 ఏళ్లపాటు కొనసాగించినప్పుడే.

– లోగాన్ వీవర్, పెట్టుబడుల సలహాదారు

'డార్క్ ప్రిన్స్'కు బంగ్లా పగ్గాలు



తారిఖ్ రెహమాన్

ఢాకా: ఒకప్పుడు విమర్శకుల చేత 'డార్క్ ప్రిన్స్'గా మాటలు పడిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) నేత తారిఖ్ రెహమాన్ ఇప్పుడు బంగ్లా పగ్గాలు చేపట్టబోతున్నారు. మరి ఆయన గెలుపు భారత్‌కు లాభమేనా..? బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్, మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడే తారిఖ్. 2001-2006 మధ్య ఖాలిదా అధికారంలో ఉన్న సమయంలో రెహమాన్ కీలకంగా వ్యవహరించారు. ఆ సమయంలోనే ఆయనపై అవినీతి కేసులు నమోదయ్యాయి. దీంతో అమెరికా సహా బంగ్లా విపక్షాలు ఆయన్ను 'డార్క్‌ప్రిన్స్'గా అభివర్ణించాయి. హసీనా అధికారంలోకి వచ్చిన తర్వాత రెహమాన్ ఓ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత అనారోగ్యానికి గురై చికిత్స కోసం 2008లో లండన్ వెళ్లారు. గతేడాది డిసెంబరులో తల్లి ఖాలిదా అనారోగ్యానికి గురవడంతో 17 ఏళ్ల తర్వాత మళ్లీ సొంతగడ్డపై అడుగు పెట్టారు. తల్లి మరణానంతరం పార్టీ పగ్గాలు అందుకున్నారు. తాజా ఎన్నికల్లో ఘన విజయాన్ని దక్కించుకున్నారు.

సానుకూలమే కానీ..: ఇటీవల కాలంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. హసీనా గద్దె దిగడం, మైనార్టీలైన హిందువులపై బంగ్లాదేశ్‌లో దాడులు ఇరుదేశాల బంధాన్ని ఊగిసలాటలో పడేశాయి. రెండు దేశాల మధ్య గత 18 నెలలుగా ద్వైపాక్షిక సమావేశాలు జరగలేదు. ఈ పరిణామాల వేళ ఎన్నికల్లో రెహమాన్ విజయం కీలకంగా మారింది. గతంలో రెహమాన్ తల్లి ఖాలిదా హయాంలో భారత్‌తో సంబంధాలు అంతంతమాత్రంగానే ఉండేవి. ఇప్పుడు రెహమాన్ నేతృత్వంలో పరిస్థితి మునుపటిలా ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఉగ్రవాదంపై పోరుకు సహకరిస్తామని, తీస్తా నదీ జలాల సమస్యను పరిష్కరించుకుంటామని, హిందూ మైనార్టీలకు రక్షణ కల్పిస్తామని ఎన్నికల ముందు ఆయన హామీ ఇచ్చారు. కాబట్టి దేశ ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకుని భారత్‌తో రెహమాన్ దౌత్య సంబంధాలు నెరిపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బాలుడి ఊపిరి తీసిన ఊయల



అఫ్రోజ్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామంలో చీరతో వేసిన ఊయల మెడకు చుట్టుకొని ఊపిరాడక బాలుడు అఫ్రోజ్ (7) ప్రాణాలు కోల్పోయాడు. గ్రామానికి చెందిన అహ్మద్, హసీనా దంపతులు కూలి పనులు చేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు అఫ్రోజ్ రెండో తరగతి చదువుతున్నాడు. బాలుడికి ఆటలమ్మ రావడంతో ఇంటి వద్దే ఉన్నాడు. తల్లిదండ్రులు గురువారం మధ్యాహ్నం కుమారుడికి భోజనం తినిపించారు. తరువాత ఇంటి వరండాలోని రేకుల షెడ్డులో చీరతో వేసిన ఊయల ఊగాడు. బాలుడి గొంతుకు చీర బిగుసుకోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చిన తల్లిదండ్రులు విగతజీవిగా మారిన కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.

అతివేగం.. మృత్యుపాశం

- జాతీయ రహదారిపై బైక్‌ను ఢీకొట్టి కారు పల్టీలు
- ఏడుగురు ఇంటర్ విద్యార్థుల దుర్మరణం
- బెంగళూరు శివారులో ఘటన



నుజ్జునుజ్జయిన కారు నుంచి మృతదేహాలను బయటికితీస్తున్న సిబ్బంది

బెంగళూరు(గ్రామీణం), చింతామణి, న్యూస్‌టుడే: ఆరుగురు ఇంటర్ విద్యార్థుల అత్యుత్సాహం వారితోపాటు మరొకరిని బలిగొంది. తల్లిదండ్రులకు తెలియకుండా రాత్రివేళ సరదాగా జాతీయ రహదారిపై డ్రైవ్‌కు వెళ్లిన వారు అతివేగంతో వాహనం నడుపుతూ మృత్యువాతపడ్డారు. ఆశలన్నీ వారిపైనే పెట్టుకున్న కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిల్చారు. కర్ణాటకలోని సూలిబెలె గ్రామీణ ఠాణా పోలీసుల వివరాల ప్రకారం.. యలహంకలోని ఆర్‌వీపీయూ కళాశాల విద్యార్థి అశ్విన్ నాయర్ గురువారం రాత్రి తల్లిదండ్రులకు తెలియకుండా కారును బయటికి తీసుకొచ్చాడు. తన స్నేహితులు అర్హాన్ షరీఫ్, అయాన్ అలీ, భరత్, ఏథాన్ జార్జ్, అజిత్ బాబీలను ఎక్కించుకుని ఇటీవల ప్రారంభించిన బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ రహదారిపై వెళ్తూ హొసకోటెకు చేరుకున్నాడు. అక్కడి నుంచి మళ్లీ దేవనహళ్లి వైపు వస్తుండగా ఎం.సత్యవర గ్రామం వద్ద కారు అదుపు తప్పింది. వంద కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆ వేగానికి కారు డివైడర్ దాటి పల్టీలు కొట్టి అటువైపు వెళ్తున్న లారీని, మరో కారును ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు (వీరంతా 16, 17 సంవత్సరాల వారే), బైక్‌పై వెళ్తున్న గగన్ అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాద తీవ్రతకు కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకుని పగిలిపోగా, లారీ నుంచి రెండు చక్రాలు విడిపోయాయి. మృతదేహాలను బయటకు తీసేందుకు వైద్యసిబ్బంది తీవ్రంగా శ్రమించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హర్షిత స్కూలు కేసులో నిందితులకు బెయిల్ నిబంధనలు సడలించొద్దు

- కోర్టు ఆదేశించినట్లు వాళ్లు ఒక్కసారీ పోలీసుల ముందు హాజరుకాలేదు
- సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: హర్షిత పాఠశాల ఏర్పాటు పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడిన వ్యవహారంలో ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడిలోని శ్రీ హర్షిత ఇంగ్లిష్ మీడియం స్కూల్, జూనియర్ కళాశాల ఛైర్‌పర్సన్ నందిగం రాణి కుటుంబసభ్యులకు గతంలో జారీచేసిన బెయిల్ నిబంధనల్లో సడలింపులు ఇవ్వొద్దని సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ కేసులో ఐదుగురు నిందితులకు హైకోర్టు నవంబరు 26న బెయిల్ ఇస్తూ వారంతా ఛార్జిషీట్ దాఖలయ్యే వరకూ ప్రతి శనివారం పోలీసుస్టేషన్ ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన కేసును డిసెంబరు 17న విచారించిన సుప్రీంకోర్టు.. హైకోర్టు విధించిన షరతులను తొలగించడానికి నిరాకరిస్తూ, వారు హాజరుకావాల్సిన రోజును శనివారానికి బదులు ఆదివారానికి మార్చింది. ఇప్పుడు ఆ షరతునూ తొలగించాలని కోరుతూ నందిగం లక్ష్మీహర్షిత కుటుంబసభ్యులు తాజాగా దాఖలుచేసిన పిటిషన్ శుక్రవారం జస్టిస్ మనోజ్‌మిశ్ర, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. షరతుల సడలింపునకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది ప్రేరణాసింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు గతంలో జారీచేసిన ఉత్తర్వుల్లో నిందితులు ఈ కేసు దర్యాప్తు పూర్తయ్యేవరకూ ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలని, లేనిపక్షంలో హైకోర్టు ఇచ్చిన రక్షణ రద్దవుతుందని చెప్పినా, వాళ్లు ఇప్పటివరకూ ఒక్కసారీ పోలీసుల ముందు హాజరుకాలేదని చెప్పారు. ఈ విషయంలో మీరు అఫిడవిట్ దాఖలు చేశారా? అని న్యాయవాదిని జస్టిస్ మనోజ్‌మిశ్ర అడిగారు. అందుకు తాము సిద్ధంగా ఉన్నామని, వారం రోజులు గడువు ఇవ్వాలని న్యాయవాది కోరడంతో న్యాయమూర్తి అంగీకరిస్తూ ఈ కేసు తదుపరి విచారణను మార్చి 11కి వాయిదా వేశారు. ఆలోపు రాష్ట్రప్రభుత్వ అఫిడవిట్‌పై పిటిషనర్లు కౌంటర్ దాఖలుచేయాలని ఆదేశించారు.

తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి కన్నుమూత



తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవలో శృంగేరి పీఠానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కాశీ తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి గుండెపోటుతో శుక్రవారం కన్నుమూశారు. 20 రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో ఇబ్బంది పడుతున్న ఆయన కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది రెండు రోజుల క్రితం ఆశ్రమానికి చేరుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటు రాగా వైద్యులు సీపీఆర్ చేసి తుని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఆశ్రమానికి చేరుకుని స్వామీజీకి నివాళులర్పించారు. తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్వామీజీ అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. సచ్చిదానంద సరస్వతి స్వామి స్వస్థలం విజయనగరం. తన 16వ ఏట సన్యాసం స్వీకరించారు. శృంగేరి పీఠం జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి వద్ద శిష్యరికం చేశారు. ఆ పీఠానికి అనుబంధంగా తెలంగాణలోని ధర్మపురిలో ఆశ్రమం ఏర్పాటుచేశారు. 2003లో కుమ్మరిలోవలో కాశీ తపోవనం నిర్మించారు.

చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు

- నిమ్మగడ్డ తీరుపై సుప్రీం అసహనం

దిల్లీ: పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్‌కు వ్యతిరేకంగా యూఏఈ కోర్టు వెలువరించిన తీర్పును సవాలు చేయాలంటే గణనీయ మొత్తాన్ని సెక్యూరిటీగా చెల్లించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. నిమ్మగడ్డ ప్రసాద్ రూ.543 కోట్ల అసలుపై వడ్డీతో కలిపి రూ 643 కోట్లు రస్‌అల్ ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (రాకియా)కి చెల్లించాలని యూఏఈకి చెందిన ఒక కోర్టు వెలువరించిన తీర్పుపై సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. ఈ కేసులో మ్యాట్రిక్స్ ఫార్మా కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్, నిమ్మగడ్డ ప్రసాద్‌ల తరఫున వాదనల్ని పాక్షికంగా విన్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. కక్షిదారులు ఒక పద్ధతి ప్రకారం ఆస్తుల్ని అమ్ముకోవడం, ఉద్దేశపూర్వకంగా కేసులో జాప్యం జరిగేలా చేయడం చట్టాన్ని అపహాస్యం చేస్తోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. రాకియా తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. యూఏఈ న్యాయ వ్యవస్థలో రాకియా విజయం సాధించినా ఒక్క రూపాయీ వసూలు చేసుకోలేకపోయిందన్నారు.

2020-25 మధ్య ఆయుష్మాన్‌భారత్‌లో అక్రమాలు

- ఏపీలో 360 ఆసుపత్రులపై జరిమానా
- కేంద్ర మంత్రి జేపీనడ్డా వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆయుష్మాన్‌భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన అమలులో ఆంధ్రప్రదేశ్‌లో అవకతవకలకు పాల్పడిన 360 ఆసుపత్రులపై 2020-25 మధ్య అయిదేళ్లలో రూ.39.23 కోట్ల జరిమానా విధించినట్లు కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి జేపీనడ్డా తెలిపారు. 3 ఆసుపత్రులను ఎంప్యానల్ నుంచి తొలగించామని, మరో 59 ఆసుపత్రులను సస్పెండ్ చేశామని చెప్పారు. శుక్రవారం లోక్‌సభలో తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు. అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 52 ఆసుపత్రులపై రూ.11.39 కోట్లు, గుంటూరు జిల్లాలో 30 ఆసుపత్రులపై రూ.11.90 కోట్లు, కర్నూలు జిల్లాలో 27 ఆసుపత్రులపై రూ. 6.58 కోట్ల జరిమానా విధించినట్లు చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లాలో అత్యధికంగా 20 ఆసుపత్రులను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.



అజలియా అందాలు!

పుష్పగుచ్ఛంలా భలే చూడముచ్చటగా కనిపిస్తున్న ఈ మొక్కలు చైనాకు చెందినవి. అజలియా మొక్కలుగా పిలిచే ఇవి.. గులాబీ, ఎరుపు, గోధుమ రంగు పూలు పూస్తాయి. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకకు చెందిన ఓ నర్సరీ రైతు వీటిని దిగుమతి చేసుకున్నారు. మొక్క దశ నుంచే జాగ్రత్తగా ఆకర్షణీయ ఆకృతిలో తీర్చిదిద్ది.. విక్రయిస్తుంటారు. కావాల్సిన ఆకృతిలో పెరిగేందుకు ఐదేళ్లు పడుతుందని రైతు తెలిపారు. – న్యూస్‌టుడే, కడియం

తమిళనాడులో మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.5వేలు జమ

- వివరణ ఇచ్చిన సీఎం స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులోని 1.31 కోట్ల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం రూ.5 వేలు చొప్పున ప్రభుత్వం జమ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి స్టాలిన్ సామాజిక మాధ్యమాల వేదికగా వీడియో సందేశం ద్వారా వివరణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ వంచనలను అధిగమించి ఎన్నికల హామీ మేరకు 2023 సెప్టెంబరు నుంచి ప్రతినెలా మహిళలకు రూ. వెయ్యి అందించే 'కలైజ్ఞర్ మగళిర్ ఉరిమై' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. మొదట 1.13 కోట్ల మంది మహిళలు లబ్ధిపొందగా ప్రస్తుతం ఈ పథకాన్ని 1.31 కోట్ల మందికి విస్తరించినట్లు పేర్కొన్నారు. త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 3 నెలలకు ఈ నగదు వేయకుండా నిలిపివేసేందుకు కొందరు కుట్ర చేస్తూ కోర్టులో పిటిషన్ వేయడానికి ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలలకు రూ. 3వేలు, అదనంగా వేసవి ఖర్చుల దృష్ట్యా ప్రత్యేక ప్యాకేజీగా రూ.2 వేలతో కలిపి మొత్తం రూ.5 వేలను 1.31 కోట్ల మంది మహిళల బ్యాంకు ఖాతాలో వేయాలని ఆదేశించినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తర్వాత ద్రవిడ మోడల్ 2.0 ప్రభుత్వ హయాంలో ఈ పథకం కింద ప్రతినెలా అందించే మొత్తాన్ని రూ.2 వేలకు పెంచుతామని తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు.

టీవీకేను తక్కువ అంచనా వేయకండి

- పార్టీ అధ్యక్షుడు విజయ్



పార్టీ కార్యకర్తల సదస్సులో విజయ్

చెన్నై(టీనగర్), న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం(టీవీకే)ను తక్కువ అంచనా వేయొద్దని ఆ పార్టీ అధినేత విజయ్ అన్నారు. తమిళనాడులోని సేలంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సదస్సులో ఆయన అధికార పార్టీపై విమర్శలు గుప్పించారు. డీఎంకే ప్రభుత్వం అవినీతి సొమ్ముతో అధికారం నిలబెట్టుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఈ అవినీతి పాలనకు ప్రజలు త్వరలోనే అంతం పలుకుతారని అన్నారు. విక్రవాండి సభలో తాను పేల్చిన 'కూటమి ప్రభుత్వం' అనే బాంబు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోందన్నారు. ఎవరైనా ఓటుకు డబ్బులిస్తే తీసుకోవాలని, ఆ తర్వాత వారి చెవిలో విజిల్ వేసి వెళ్లిపోవాలని సూచించారు. ఓటుతో వారికి ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలన్నారు. విజయ్‌ను చూసేందుకు వచ్చిన మహారాష్ట్రకు చెందిన స్వరాజ్(37) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందారు.

పుష్ప శ్రీవాణి కులధ్రువీకరణ పత్రంపై మళ్లీ సవాల్ చేయొచ్చు

ఈనాడు, దిల్లీ: 2019 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కురుపాం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైకాపా తరఫున పోటీచేసి గెలిచిన పాముల పుష్ప శ్రీవాణి ఎన్నికను సవాల్‌చేస్తూ తెదేపా నాయకుడు నిమ్మక జయరాజ్ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణను ముగించింది. ఇప్పటికే ఆమె ఐదేళ్ల పదవీకాలం ముగిసిపోయినందున ప్రస్తుతం ఈ పిటిషన్ నిరర్థకమని ప్రకటించింది. ఇప్పుడు ఆమె ఎమ్మెల్యేగా ఉంటే పిటిషన్‌ను పరిశీలించినా ప్రయోజనం ఉండేదని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అయితే భవిష్యత్తులో ఆమె ఇదే కులధ్రువీకరణ పత్రంపై పోటీచేస్తే దాన్ని మరోసారి సవాల్ చేసే అవకాశాన్ని పిటిషనర్‌కు కల్పిస్తూ ప్రస్తుత పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు జస్టిస్ బీవీ నాగరత్న ఉత్తర్వులు జారీచేశారు. ఆమె కులధ్రువీకరణ పత్రాన్ని హైకోర్టులో నిరూపించడంలో ప్రస్తుతానికి పిటిషనర్ నిమ్మకజయరాజ్ విఫలమైనప్పటికీ, మరోసారి దానిపై సవాల్‌చేసి నిరూపించే అవకాశాన్ని ఇస్తున్నామని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

EENADU Vol: 52, Issue: 185 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా


దుల్కర్ సల్మాన్

నాగ చైతన్య

ప్రేమని ఎన్నో సిని మాల్లో ఎన్నో రకాలుగా వర్ణిం చారు. ఆ మాటకొస్తే ప్రేమలేని సినిమానే అరుదు. అయినా సరే... ఎప్పటి కప్పుడు కొత్తగా మరో ప్రేమకథ తెరకెక్కేందుకు సిద్ధమవుతూ ఉంటుంది. అదే ప్రేమలోని మహత్తు! 'అద్యంతమూ లేని అమరానందమే ప్రేమ...' అన్నారు ప్రసిద్ధ కవి ఆచార్య ఆత్రేయ. అలాంటి ప్రేమని వర్ణించడానికి ఎన్ని సినిమాలైనా ఏం సరిపోతాయి మరీ! తెలుగులో ప్రస్తుతం కొన్ని ప్రేమకథలు సెట్స్‌పై ఉన్నాయి, మరికొంతమంది కథానాయకులు నయా ప్రేమికులుగా కెమెరా ముందుకు వెళ్లేందుకు సిద్ధమవు తున్నారు.

ప్రేమికులొస్తున్నారు...


సాయి దుర్గా తేజ్


కిరణ్ అబ్బవరం

'ప్రేమ అనేది ఎంపికా లేక అవసరమా అంటే తెలియదు. తలరాత అని మాత్రం తెలుసు. అది రావాలనుకుంటే వద్దు అని చెప్పే అవకాశమే ఉండదు' అంటున్నాడు సంతోశ్ శోభన్... 'ఫ్రెండ్లీ కపుల్' సినిమాతో! ప్రతి ప్రేమదీ ఓ అనుభవం మరీ! 'ప్యార్ అనేది ఒక కిరాక్ నషా...' అంటాడు కొత్త హీరో హర్షిత్ రెడ్డి... ఇటీవల విడుదలైన 'దీవానా' ప్రచార చిత్రంతో! ప్రతి ప్రేమికుడిదీ ఓ కొత్త నిర్వచనం మరీ! రెండక్షరాల ప్రేమ ఇలా ఎన్ని భావాల్ని దాచుకుందో! ఎన్నెన్ని భావోద్వేగాలకు నెలవైందో! అందుకే ప్రతి ప్రేమకథ తెరపైన ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ ఎప్పటికప్పుడు సరికొత్తగా గిలిగింతలు పెడుతుంటుంది ప్రేమ. మన కథానాయకులు ప్రేమకథలపై మనసు పడటానికి కారణం అదే.

కథలు సిద్ధం

ప్రేమకథలకి పెట్టింది పేరు నాగచైతన్య. ఆయన విజయాల్లో ఎక్కువ వాటా ప్రేమకథలదే! ఆ మాటకొస్తే అక్కినేని కుటుంబ కథానాయకులందరూ తెరపై ప్రేమికులుగా కనిపించి అలరించినవాళ్లే. 'ఏ మాయ చేసావె' మొదలుకొని, గతేడాది వచ్చిన 'తండేల్' వరకూ నాగచైతన్య ప్రేమకథల్లో ఒదిగిపోయారు. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా చేస్తున్న ఆయన, తదుపరి మరో ప్రణయగాథకి పచ్చజెండా ఊపారు. క్లాక్స్ అనే దర్శకుడు ఆ కథని సిద్ధం చేశారు. గీతా ఆర్ట్స్ సంస్థలో రూపొందనున్న ఆ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. మరో కథానాయకుడు సాయి దుర్గా తేజ్ కూడా తదుపరి రెండు ప్రేమకథలు చేస్తున్నట్టు సమాచారం. అందులో ఓ చిత్రం 'క'తో విజయాన్ని అందుకున్న సుజీత్, సందీప్ దర్శకద్వయం తెరకెక్కించనున్నారు. 'ఛాంపియన్'గా ఇటీవల ప్రేక్షకుల్ని మెప్పించిన శ్రీకాంత్ తనయుడు రోషన్ తదుపరి చిత్రం ప్రేమకథతోనే తెరకెక్కబోతోంది. శైలేశ్ కొలను దర్శకత్వం వహించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇన్నాళ్లుగా థ్రిల్లర్ సినిమాలతోనే ప్రయాణం చేస్తూ వచ్చిన శైలేశ్ కొలను తెరకెక్కిస్తున్న తొలి ప్రేమకథ ఇదే.

సెట్స్‌పై చాలానే...

'మొదటి ప్రేమకు మరణం లేదు, అది మనసు పొరల్లో శాశ్వతంగా సమాధి అవుతుంది' అంటూ 'బేబి' సినిమాతో తొలిప్రేమ ప్రత్యేకతని హృద్యంగా ఆవిష్కరించారు దర్శకుడు సాయిరాజేశ్. ఆయనే ఈసారి... 'మొదటి ప్రేమ ఒక్కటే నిజమైతే అందరి కథలూ తల్లి ప్రేమ దగ్గరే ఆగిపోవాలి కదా...' అంటూ మరో కొత్త కోణంలో కథని రాశారు. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా రవి నంబూరి దర్శకత్వంలో రూపొందుతున్న 'చెన్నై లవ్ స్టోరి' అదే. 'చరిత్రలో ఎన్నో గొప్ప ప్రేమకథలు ఉన్నాయి, వాళ్లందరికీ ఇవి మొదటి ప్రేమకథలే కావు కదా, ఫస్ట్‌లవ్ ఫెయిల్ అయ్యిందంటే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలవుతుందని అర్థం' అంటూ విడుదలైన ఆ సినిమా ప్రచార చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ప్రస్తుతం చిత్రీకరణని చేసుకుంటోంది ఆ చిత్రం. ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న 'డ్యూయెట్', 'ఎపిక్' సినిమాలూ ప్రేమని ఆవిష్కరించేవే. స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రం 'సీతారామం'తో దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించారు దుల్కర్ సల్మాన్. ఆయన కథానాయకుడిగా ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై రూపొందుతున్న భారీ చిత్రం కూడా ప్రేమకథతోనే తెరకెక్కుతున్నట్టు సమాచారం. రవి నేలకుడితి దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. భారీ బడ్జెట్ సినిమాలు, పాన్ ఇండియా హంగుల కారణంగా గతంతో పోలిస్తే తెలుగులో ప్రేమకథలు తక్కువే అయినా, యువ కథానాయకులు మంచి ప్రేమకథ వచ్చిన ప్రతిసారీ వాటిపై ప్రత్యేకమైన ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు.


ఆనంద్ దేవరకొండ

ప్రేమికుల రోజుకి తగ్గ సినిమా


మానస, సంతోశ్ శోభన్

"ప్రేమికుల రోజు సమయానికి.. దానికి తగ్గ జానర్‌లో వస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'" అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ట్రైలర్ చూసినప్పుడే ఇది కచ్చితంగా హిట్ అవుతుందనే నమ్మకం కలిగిందని తెలిపారు. సంతోశ్ శోభన్ - మానస వారణాసి జంటగా నటించిన ఈ చిత్రాన్ని అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో పి.అజయ్ కుమార్ రాజు నిర్మించారు. ఇది ఈరోజు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. హీరో శ్రీవిష్ణు, దర్శకులు అనిల్ రావిపూడి, మేర్లపాక గాంధీ, నందిని రెడ్డి, అభిలాశ్ రెడ్డి, నిర్మాత స్వప్న దత్ అతిథులుగా పాల్గొన్నారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ.. "ట్రైలర్ చూశా. విజువల్స్, సంగీతం.. అన్నీ బాగున్నాయి" అన్నారు. "ఈ సినిమా భావోద్వేగాలతో నిండిన ప్రయాణంలా కనిపిస్తోంది" అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. సంతోశ్ శోభన్ మాట్లాడుతూ.. "ఇది లోతైన భావోద్వేగాలతో నిండిన సినిమా" అన్నారు.

కవలల పేర్లు.. శివరామ్-అన్వీరా దేవి


కుటుంబ సభ్యుల మధ్య బారసాల వేడుక

కథానాయకుడు రామ్‌చరణ్ - ఉపాసన దంపతులు తమ కవలల పేర్లను ప్రకటించారు. వారికి గత నెల 31న ఓ బాబు, పాప జన్మించగా.. ఇటీవల ఆ చిన్నారుల బారసాల వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారుడికి శివరామ్, కూతురికి అన్వీరా దేవి అని నామకరణం చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోని రామ్‌చరణ్‌తో పాటు చిరంజీవి శుక్రవారం సామాజిక మాధ్యమాల వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా తమ పిల్లల పేర్లకున్న అర్థాన్ని వివరించారు. "శివరామ్ అనే పేరు.. శివుడు, రాముడుల శాశ్వత ఆదర్శాల కలయిక. అలాగే మా నాన్న పేరు (శివ శంకర వరప్రసాద్)ను, నా పేరును సూచిస్తుంది. అన్వీరా దేవి.. దివ్యమైన స్త్రీ శక్తికి ప్రతిరూపం. కనకదుర్గ ఆశీస్సులతో ప్రేరణ పొందిన పేరిది. నిర్భయత్వం, పట్టుదల, దైవ రక్షణ, సౌందర్యం, ధైర్యం, అచంచలమైన శక్తిని ప్రతిబింబిస్తుంది" అని చరణ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన బుచ్చిబాబు సాన దర్శకత్వంలో 'పెద్ది' అనే సినిమా చేస్తున్నారు. ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ చిత్రం ఏప్రిల్ 30న థియేటర్లలోకి రానుంది.

విన్యాసం మొదలే...

శ్రీవిష్ణు కథానాయకుడిగా యదునాథ్ మారుతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'విష్ణు విన్యాసం'. నయన్ సారిక కథానాయిక. సుమంత్ నాయుడు.జి నిర్మాత. హేమ, షాలిని సమర్పకులు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. 'మొదలే మొదలే...' అంటూ సాగే ఇందులోని రెండో గీతాన్ని ప్రేమికుల రోజుని పురస్కరించుకుని శుక్రవారం విడుదల చేశారు. రధన్ స్వరకల్పనలోని ఈ ప్రేమగీతాన్ని రామజోగయ్యశాస్త్రి రచించగా, మధుశ్రీ, నరేశ్ అయ్యర్ ఆలపించారు. ఈ పాటలో నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ కూడా అందరినీ ఆకట్టుకుంటుందని సినీ వర్గాలు చెప్పాయి.


శ్రీవిష్ణు, నయన్ సారిక

పండిట్ రవిశంకర్ పాత్రలో ఫర్హాన్


ఫర్హాన్ అక్తర్

గతేడాది '120 బహాదుర్' సినిమాతో తెరపై సందడి చేశారు బాలీవుడ్ నటుడు ఫర్హాన్ అక్తర్. పలు చిత్రాలతో దర్శకుడిగా కూడా నిరూపించుకున్న ఆయన... ఇప్పుడు హాలీవుడ్‌లోకి అడుగుపెట్టడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. సామ్ మెండిస్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది బీటిల్స్'. నాలుగు భాగాలుగా తీర్చిదిద్దుతున్న ఈ బయోపిక్‌లో ప్రముఖ భారతీయ సంగీతకారుడు పండిట్ రవిశంకర్ పాత్రలో కనిపించనున్నారు ఫర్హాన్ అక్తర్. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడిస్తూ నటీనటుల వివరాల్ని ప్రకటించింది నిర్మాణ సంస్థ సోనీ పిక్చర్స్. ఈ చిత్రంలో పాల్ మెస్కల్, హారిస్ డికిన్సన్, జోసెఫ్ క్విన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ చిత్రాలు 2028 ఏప్రిల్‌లో థియేటర్లలోకి రానున్నట్లు తెలిపాయి చిత్రవర్గాలు.

ఊహలకు అందని స్క్రీన్‌ప్లే!


నరేంద్ర

"ప్రేక్షకుల ఊహలకు అందని రీతిలో సాగే సినిమా 'హే భగవాన్'" అన్నారు నిర్మాత బి నరేంద్ర రెడ్డి. ఇది వినోదంతో పాటు బలమైన భావోద్వేగాలతో నిండిన కథతో ముస్తాబైందని తెలిపారు. సుహాస్ - శివానీ నాగారం జంటగా నటించిన ఈ చిత్రాన్ని గోపీ అచ్చర తెరకెక్కించారు. నరేశ్ వీకే, స్రవంతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇది ఈనెల 20న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే నరేంద్ర రెడ్డి ఇటీవల విలేకర్లతో మాట్లాడుతూ.. "తండ్రీ - కొడుకు అనుబంధాలతో నిండిన వినోదాత్మక కథతో రూపొందిన చిత్రమిది. ఈ కథ విన్నప్పుడు నేనెంత థ్రిల్ ఫీలయ్యానో.. రేపు సినిమా చూశాక ప్రేక్షకులు అంతే థ్రిల్ అవుతారు. దీంట్లో స్క్రీన్‌ప్లే ఊహలకు అందని విధంగా ఉంటుంది. ఓ కథ ప్రేక్షకుల్ని రెండు గంటల పాటు థియేటర్లలో కూర్చోబెట్టగలిగిందంటే ఆ సినిమా సూపర్ హిట్టే. నేను ఏ కథ విన్నా దీన్నే దృష్టిలో పెట్టుకుంటా. మా తదుపరి చిత్రం స్నేహం నేపథ్యంలో ఉంటుంది. సత్యదేవ్ - ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తారు" అని చెప్పారు.

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా...

డగర్ కుటుంబానికి గుర్తింపు దక్కాలి

● వీరా రాజ వీరా పాట వివాదంపై సుప్రీం కోర్టు వ్యాఖ్యలు


రెహమాన్

'పొన్నియిన్ సెల్వన్ 2'లో ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన 'వీరా రాజ వీర' పాటపై సుప్రీం కోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. పాటకు సంబంధించి డగర్ కుటుంబానికి గుర్తింపు దక్కాలని న్యాయస్థానం రెహమాన్‌కు సూచన చేసింది. తమ పూర్వీకులు సంగీతం అందించిన శివస్తుతి పాట నుంచి కాపీ చేశారంటూ గాయకుడు ఉస్తాద్ ఫయాజ్ వసిఫుద్దీన్ డగర్ వేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. ఇప్పటికే పలుమార్లు విచారణ జరిగిన అనంతరం దిల్లీ హైకోర్టు గత ఏడాది ఏప్రిల్‌లో ఈ పాటను వినియోగించుకున్నందుకు రూ.2 కోట్లను, చిత్రంలో క్రెడిట్‌ను పిటిషన్‌దారుడికి అందించాలని రెహమాన్, చిత్రనిర్మాణ సంస్థ మద్రాస్ టాకీస్‌ను ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ రెహమాన్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే రెహమాన్ వాదనలతో కోర్టు పూర్తిగా ఏకీభవించలేదు. భాగస్వామ్య హక్కులు, కాపీరైట్ ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలు విచారణలో తేలుతాయని స్పష్టం చేసింది. మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ఉస్తాద్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

ఆర్థిక మోసం కేసులో దర్శకుడు విక్రమ్ భట్ భార్యకు బెయిల్

బాలీవుడ్ దర్శకుడు విక్రమ్ భట్, ఆయన భార్య శ్వేతాంబరి భట్‌ను రూ.30కోట్ల మోసం కేసులో రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం శ్వేతాంబరి భట్‌కు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది. ఉదయ్‌పూర్‌లోని ఐవీఎఫ్ హాస్పిటల్ వ్యవస్థాపకుడు, డాక్టర్ అజయ్ ముర్దియా.. ఆయన దివంగత భార్య జీవిత చరిత్ర ఆధారంగా ఓ బయోపిక్ తీస్తామని, ఆ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని నమ్మించి విక్రమ్ భట్ దంపతులు తన వద్ద నుంచి రూ.30కోట్లు తీసుకున్నారని అజయ్ తెలిపారు. అయితే ఈ సినిమా నిర్మాణం అనుకున్న విధంగా సాగకపోవడం.. లాభాల విషయంలో క్లారిటీ లేకపోవడంతో మోసపోయానని భావించిన డాక్టర్ అజయ్.. దర్శకుడు విక్రమ్ భట్ దంపతులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

ఆమిర్ ఖాన్ కుమారుడికి జోడీగా?


తమన్నా


జునైద్ ఖాన్

అదిరిపోయే స్టెప్పులు, తనదైన నటనతో అలరిస్తుంటుంది అందాల తార తమన్నా. ప్రస్తుతం కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తున్న ఈమె ఖాతాలోకి మరో ప్రాజెక్ట్ చేరినట్లు తెలుస్తోంది. 'రాగిణి3' అనే చిత్రం రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ సినిమాలో బాలీవుడ్ హీరో ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్, తమన్నా జంటగా నటిస్తున్నట్లు సమాచారం. "హారర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. దీనికి శశాంక్ ఘోష్ దర్శకత్వం వహించనున్నారు. ఇందులో తమన్నా, జునైద్‌ల కలయికతో ప్రేక్షకులకు కొత్త జంట పరిచయం కాబోతుంద"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏక్తా కపూర్ నిర్మించనున్న ఈ సినిమాకు సంబంధించిన వివరాల్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నాయని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

అపార్థాలతో తల్లిదండ్రులకు దూరమైనా టీచర్ యున్. కేవలం మేనల్లుడి బాధ్యతతోనే టీనేజ్ నుంచి కష్టపడుతూ స్థిరపడిన వ్యక్తి సన్ జే. ఇలాంటి వాళ్ల మధ్య భావోద్వేగ బంధాన్ని ఏర్పరచి ప్రేమ పయనాన్ని కొనసాగిస్తుంది విధి. ఎలాంటి కుటుంబ నేపథ్యంలేని సన్ జే మనసులో ప్రేమ చిగురించి యున్ మదిని ఎలా దోచుకున్నాడు? జీవితంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఒకరినినొకరు అర్థంచేసుకుని ఎలా నిలబడిందీ జంట అనేదే ఈ సిరీస్.

అర్థం చేసుకోవడమే అసలైన ప్రేమ

● భావోద్వేగాలతో సాగే కొరియన్ సిరీస్ 'స్ప్రింగ్ ఫీవర్'

సిరీస్: 'స్ప్రింగ్ ఫీవర్'

జానర్: రొమాంటిక్ కామెడీ డ్రామా

ప్లాట్‌ఫామ్: అమెజాన్ ప్రైమ్ (తెలుగు, హిందీ, ఇంగ్లిషు)



కథాంశం: దక్షిణ కొరియా సియోల్‌లోని ఓ ప్రముఖ నటి కుమార్తె యున్ బోమ్(లీ జూ బిన్). అక్కడే ఓ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తుంది. వ్యక్తిగతంగా ఓ సమస్య ఎదురైనప్పుడు తల్లిదండ్రులే తనని తప్పుగా అర్థంచేసుకున్నారనే కారణంతో యూన్ సియోల్‌ని వదిలేసి ఓ చిన్న పల్లెటూరులోని పాఠశాలకి వెళ్లిపోతుంది. ఎప్పుడూ నల్ల బట్టలే ధరిస్తుంటుంది. ఎవ్వరితోనూ మాట్లాడకూడదు, నవ్వకూడదనుకుంటూనే కొత్త స్కూల్ జీవితాన్ని ప్రారంభిస్తుంది. ఏదైనా ప్రశ్న ఎదురైనా అవును, సరే, కాదు అనేవే తన సమాధానాలు. అలాంటి అమ్మాయికి సన్ జే గ్యు(అహ్న్ బో హ్యూన్)తో అయిన పరిచయం మౌనాన్ని వీడేలా చేస్తుంది. చిన్నవయసులోనే సన్‌జేకి తన సోదరి ఇచ్చిన బాధ్యత హాన్ గ్యుల్(చో జున్ యంగ్) పెంపకం. దాంతో చిన్నప్పటి నుంచి మేనల్లుడే తన ప్రపంచమనుకుంటూ వయసుకి మించి కష్టపడి అతణ్ని పెంచుతాడు. హాన్ గ్యు టీచర్ యున్. దాంతో సన్ జే యున్‌ని తరచూ కలవాల్సి వచ్చేది. బాధ్యతలు, క్రమశిక్షణ అంటూ కఠినంగా ఉండే సన్ జే మనసులో యున్ పుట్టించిన ప్రేమ తరంగాల కథాంశమే ఈ సిరీస్. గతంలోని చేదు అనుభవాల వల్ల తామని తాము మర్చిపోయిన ఈ జంట.. పరిస్థితులను జయించి తిరిగి తమ ప్రేమని ఎలా గెలిపించుకున్నారో తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే.

❑ సిరీస్ ప్రారంభ ఎపిసోడ్‌లో హీరో పెద్ద గ్యాంగ్‌స్టర్‌గా కనిపించినప్పటికీ అందరికంటే సెన్సిటివ్ పాత్ర తనదే. మేనల్లుడికి తానే తల్లి, తండ్రై పెంచే సన్నివేశాలు కంటతడి పెట్టించేలా ఉంటాయి. ఇతరుల విషయంలో ఎంతో కఠినంగా వ్యవహరించే సన్ జేని ఏ అమ్మాయి అయినా ప్రేమించగలదా? అనే ప్రేక్షకుడి సందేహాన్ని అధిగమించేలా ఉంటుంది హీరోయిన్ పరిచయం. కానీ, ఓ సాధారణ అమ్మాయిగా కాకుండా భావోద్వేగంగా ఎంతో కుమిలిపోతున్న వ్యక్తిగా యున్‌పాత్రని చూపించినప్పటికీ.. ఆమె తనను తాను శక్తిమంతంగా మలచుకునేందుకు చేసే ప్రయత్నాలు మెప్పిస్తాయి. ఎప్పుడూ మేనల్లుడి ఆనందం కోసం పరితపించే సన్ జే పాత్రలోని ట్విస్ట్‌లు, ప్రవర్తన నవ్వులు పూయిస్తుంది. హీరోహీరోయిన్లు ప్రేమంటే ముందు ఒకరినొకరు అర్థం చేసుకోవడం అనేలా తమ పాత్రల్లో ఒదిగిపోతారు. 12 ఎపిసోడ్‌ల నిడివి ఉన్నప్పటికీ ఈ సిరీస్.. మధ్యలో కొంచెం సాగదీతగా అనిపించినా ప్రేక్షకుడికి మంచి ఫీల్‌గుడ్ అనుభూతినిస్తుంది.

ఓ.. ఓ లుక్కేయండి!

రాహుల్ ప్రవర్తన అరాచకం: భాజపా

దిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రవర్తన అరాచకంగా, అప్రజాస్వామికంగా, రాజ్యాంగవిరుద్ధంగా ఉందని భాజపా విమర్శించింది. దిల్లీలోని భాజపా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఈ మేరకు మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ నేతల ప్రవర్తన.. ప్రజాస్వామ్య విధానం, నైతికత, రాజ్యాంగ విధానాలు, నియమాల పట్ల రాహుల్ గాంధీకి నమ్మకం లేదనే విషయాన్ని తెలియజేసిందన్నారు.

దేశ విభజనకు కుట్రా?: దూబె

అధికారం కోసం దేశ విభజనకు రాహుల్‌గాంధీ కుట్ర పన్నుతున్నారా అని భాజపా ఎంపీ నిశికాంత్ దూబె ప్రశ్నించారు. "సోరోస్, ఫోర్డ్ ఫౌండేషన్, తుక్డే-తుక్డే గ్యాంగ్ నాయకత్వంలో రాహుల్‌గాంధీపై నా ఆరోపణలు ఇవి. వాటిపై చర్చించడానికి లోక్‌సభ స్పీకర్ అనుమతి కోరాను. అధికారం కోసం రాహుల్‌గాంధీ దేశ విభజనకు ప్రణాళికలు రచిస్తున్నారా" అని.. రాహుల్‌పై లోక్‌సభ స్పీకర్‌కు తాను రాసిన లేఖను జత చేస్తూ దూబె 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు. రాహుల్ అనైతిక ప్రవర్తనపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

పార్లమెంటును స్తంభింపజేసేందుకు కొత్త సాకులు కనిపెడుతుంటారు

రాహుల్‌పై ధర్మేంద్ర ప్రధాన్ మండిపాటు

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తాజాగా తీవ్ర విమర్శలతో విరుచుకుపడ్డారు. పార్లమెంటు కార్యకలాపాలను స్తంభింపజేసేందుకు రాహుల్ ఎప్పటికప్పుడు కొత్త సాకులు కనిపెడుతుంటారని మండిపడ్డారు. ఆయన్ని స్టేట్‌మెంట్లు యోధుడిగా అభివర్ణిస్తూ 'ఎక్స్'లో శుక్రవారం ఏడేళ్ల వీడియో.. అబద్ధాలు చెప్పడం, వాటిని పునరావృతం చేయడం రాహుల్ రాజకీయ గుర్తింపుగా మారాయంటూ విమర్శించారు.

విదేశీ వ్యవహారాలు, వాణిజ్య శాఖలపై రాజ్యసభలో చర్చిద్దాం

- విపక్ష పార్టీల డిమాండ్

దిల్లీ: విదేశీ వ్యవహారాలు, వాణిజ్యం, గ్రామీణాభివృద్ధి శాఖల పనితీరుపై రాజ్యసభలో చర్చించాలని కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. బడ్జెట్ సమావేశాల రెండో విడతలో చర్చించాల్సిన అంశాలపై రాజ్యసభ సభా వ్యవహారాల సలహా కమిటీ గురువారం సమావేశం నిర్వహించింది. గ్రామీణాభివృద్ధి, పర్యావరణ మంత్రిత్వ శాఖలపై చర్చిద్దామని ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే విదేశీ వ్యవహారాలు, వాణిజ్య శాఖలపైనా చర్చకు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే తదితర పార్టీలతో పాటు బిజూ జనతాదళ్, వైకాపా డిమాండ్ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

జడ్జీలు పరిపూర్ణులు అనుకుంటేనే ఎక్కువ సమస్యలు: సీజేఐ



దిల్లీ: న్యాయమూర్తుల్లో వృత్తిపరమైన పరిపూర్ణత లోపిస్తే న్యాయవ్యవస్థకు కలిగే నష్టం కన్నా.. తమలో లోపాలే లేవన్నట్టుగా వారు నటిస్తేనే ఎక్కువ సమస్యలు తలెత్తుతాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శుక్రవారం పేర్కొన్నారు. న్యాయ విద్యార్థులు, న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య సమన్వయం సాధించి న్యాయ వ్యవస్థ పట్ల ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా మార్చేసేందుకు కామన్‌వెల్త్ దేశాల వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. కామన్‌వెల్త్ దేశాల న్యాయశాస్త్ర ఉపాధ్యాయుల 11వ ద్వైవార్షిక సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. న్యాయమూర్తులు న్యాయ సంప్రదాయాలపై పూర్తి పట్టు సాధించడంతోపాటు ప్రస్తుత కాలానికి అనుగుణంగా చట్టాన్ని నిర్వచించే సామర్థ్యం కలిగి ఉండాలని అన్నారు. న్యాయ వ్యవస్థలో నేతృత్వ స్థాయికి ఎదిగి గౌరవం పొందినవారు తాము లోపాలే లేని పరిపూర్ణులమన్నట్టుగా ప్రవర్తించలేదని పేర్కొన్నారు. తమ పరిజ్ఞానానికున్న పరిమితుల్ని గుర్తెరిగి, తప్పిదాలు చేయకుండా అప్రమత్తంగా ఉండి శాస్త్ర అధ్యయనం చేస్తూ నిరంతరం విద్యార్థులుగా ఉన్నవారే విజయం సాధించారని సీజేఐ అన్నారు. వినయం వ్యక్తిగతమైన విలువ మాత్రమే కాదని.. అది వృత్తిగతమైన భద్రత కూడా అని ఆయన వ్యాఖ్యానించారు.

17న 'అగ్నివలయ' సూర్యగ్రహణం

న్యూయార్క్: ఈ ఏడాదికి సంబంధించిన తొలి సౌర గ్రహణం ఈ నెల 17న చోటుచేసుకోనుంది. అయితే అది అంటార్కిటికా ప్రాంతంలోనే దర్శనమివ్వనుంది. ఈ దఫా 'అగ్నివలయ' గ్రహణం చోటుచేసుకోనుంది. ఇందులో చందమామ.. సూర్యుడిని పూర్తిగా కమ్మేయదు. సూర్యుడి అంచు.. అగ్నివలయంలా కనిపిస్తుంది. మరోవైపు చిలీ, అర్జెంటీనా, ఆగ్నేయ ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో పాక్షిక సూర్య గ్రహణం కనిపిస్తుంది.

పార్లమెంట్‌కు, దిల్లీలోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. పార్లమెంటు భవనంతో పాటు, ఏడు పాఠశాలలను పేల్చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు మెయిల్ పంపించారు. 'దిల్లీ మరో ఖలిస్థాన్‌గా మారుతుంది. మధ్యాహ్నం 1.11గంటలకు బాంబు పేలుతుంది' అంటూ సందేశంలో పేర్కొన్నారు. అంతేకాకుండా పార్లమెంటులోనూ మధ్యాహ్నం 2.11 గంటలకు పేలుడు సంభవిస్తుందని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. విస్తృతంగా తనిఖీలు చేపట్టి.. అవన్నీ నకిలీ బెదిరింపులేనని తేల్చారు. పుస రోడ్‌లోని దిల్లీ తమిళ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్, గోల్ మార్కెట్‌లోని కేంద్రీయ విద్యాలయ, దరియాగంజ్‌లోని హ్యాపీ పబ్లిక్ స్కూల్, బల్లీమారన్‌లోని రబియా పబ్లిక్ స్కూల్, ఝండేవాలాలోని సీఎల్ భల్లా డీఏవీ స్కూల్, లోధి ఎస్టేట్‌లోని సర్దార్ పటేల్ విద్యాలయ, చాణక్యపురిలోని బ్రిటిష్ స్కూళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు దిల్లీ ఫైర్ సర్వీస్ పేర్కొంది.

భారత్-చైనా పరస్పర సహకారానికే పంచశీల

- నాటి ఒప్పందంపై త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ విశ్లేషణ



ఇంటర్నెట్ డెస్క్: స్వాతంత్ర్యానంతరం భారత్-చైనాల మధ్య నెలకొన్న సంబంధాల గురించి త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య శాంతి సుస్థిరతలు సాధించడంతో పాటు పరస్పర సహకారం పెంపొందించేందుకే 1954లో నాటి ప్రధాని నెహ్రూ హయాంలో భారత్ పంచశీల ఒప్పందాన్ని ఆమోదించిందని తెలిపారు. జనరల్ అనిల్ చౌహాన్ శుక్రవారం దేహ్రాదూన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'ఆంగ్లేయులు దేశం వదిలి వెళ్లాక తన సరిహద్దులేవో భారత్ నిర్ణయించుకోవాల్సి వచ్చింది. తూర్పున మెక్ మోహన్ రేఖ వెంబడి, లద్దాఖ్‌లో మనకు కొంత హక్కు ఉందని నెహ్రూకు బహుశా తెలిసి ఉండవచ్చు. అందుకే ఆయన చైనాతో పంచశీల ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సరిహద్దులకు తుదిరూపు ఇచ్చేందుకు ప్రయత్నించారని భావిస్తున్నాన'ని జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. దీని ప్రకారమే టిబెట్‌ను చైనా అంతర్భాగంగా భారత్ గుర్తించిందన్నారు. పొరుగు దేశాలు ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదని, శాంతియుతంగా ముందుకు సాగాలని భారత్-చైనాల మధ్య కుదిరిన పంచశీల ఒప్పందం పేర్కొంది. అయితే, ఈ ఒప్పందాన్ని బేఖాతరు చేస్తూ చైనా 1962లో భారత్‌పై దాడికి పాల్పడింది.

అసాధారణ వ్యక్తిత్వం నెహ్రూ సొంతం: జైరాం



దేశంలో వ్యవస్థల నిర్మాణానికి కృషి చేసిన మహనీయుడు జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తన సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. 1959లో అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వివియన్ బోస్‌కు నెహ్రూ రాసిన వ్యక్తిగత క్షమాపణ లేఖను ఆయన ప్రస్తావించారు. అప్పట్లో దిల్లీలో జరిగిన ఒక విలేకరుల సమావేశంలో నెహ్రూ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో అందుకు చింతిస్తూ ఆయన న్యాయమూర్తికి లేఖ రాశారని జైరాం రమేశ్ తెలిపారు. ఇది వ్యవస్థల పట్ల ఆయనకున్న గౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు.


'అరేబియా' ఈదిన రేయాంశ్‌కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ఠాణె: మహారాష్ట్రలోని ఠాణె నగరానికి చెందిన రేయాంశ్ ఖామ్కర్ (7) అరేబియా సముద్రంలో 30 కిలోమీటర్ల మేర ఒంటరిగా ఈతకొట్టిన అతిపిన్న వయస్కుడైన భారతీయుడిగా 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' (లండన్)లో చోటు సాధించాడు. ఠాణె నగర మేయర్ కార్యాలయం శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర సరిహద్దులోని తీరప్రాంతం మాల్వే జెట్టి నుంచి ఈత ప్రారంభించిన రేయాంశ్ సింధుదుర్గ్ జిల్లా విజయ్‌దుర్గ్‌కు 7.30 గంటల 11 సెకండ్ల కాలంలో చేరుకొన్నట్లు తెలిపారు. గతేడాది నవంబరు నెలాఖరులో ఈ విన్యాసం పూర్తిచేయగా, తాజాగా ప్రపంచ రికార్డు ధ్రువపత్రం రేయాంశ్‌కు అందింది. ఠాణె వాసులకు ఈ విజయం గర్వకారణమని మేయర్ షర్మిలా పింప్లోల్కర్ రేయాంశ్‌ను అభినందించారు.

భోజనానంతరం రక్తంలో చక్కెర నియంత్రణకు మడమల వ్యాయామం

- మంచి ఫలితమిస్తోందని అధ్యయనంలో వెల్లడి



దిల్లీ: భోజనం చేసిన తర్వాత రక్తంలో పెరిగే చక్కెర స్థాయులను ఎక్కువ కసరత్తులు లేకుండానే అదుపులోకి తెస్తే? కష్టపడకుండానే ఇన్సులిన్‌ను నియంత్రిస్తే?.. ఆ ఊహను నిజం చేయడం కాలి మడమల వ్యాయామం (సోలియస్ పుషప్స్)తో సాధ్యమే అంటోంది నిపుణుల అధ్యయనం. భోజనం చేశాక ఈ సులభమైన విధానాన్ని అనుసరిస్తే రక్తంలో పెరిగే చక్కెర స్థాయిని 52శాతం మేర తగ్గించుకోవచ్చని దిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్స్ అండ్, ఫోర్టిస్-సీ-డీవోసీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ డయాబెటిస్ పరిశోధకులు తెలిపారు. వివిధ అధ్యయనాలను సమీక్షించిన అనంతరం ఈ విషయాన్ని నిర్ధారించారు. కుర్చీలో నిశ్చలంగా కూర్చుని కాలి మడమలను పైకి, కిందకు అంటూ 40 నిమిషాలపాటు వ్యాయామం (సోలియస్ పుషప్స్) చేయడం వల్ల రక్తంలోని గ్లూకోజ్ డెసిలీటర్‌కు 28 మిల్లీగ్రాముల వరకు తగ్గుతుందని, తొడ భాగానికి రక్త ప్రసరణ మెరుగుపడుతుందని 'డయాబెటిస్ అండ్ మెటబాలిక్ సిండ్రోమ్: క్లినికల్ రిసెర్చ్ అండ్ రివ్యూస్' జర్నల్ పేర్కొంది. అధిక సమయం కూర్చొని పనులు చేసే వ్యక్తులు, వృద్ధులు, తక్కువగా శ్రమించే వారిలో మధుమేహాన్ని నివారించడానికి కాలి మడమల వ్యాయామం అనుకూలమని తేల్చారు.

2024-25 ఎన్నికల విరాళాల్లో 82శాతానికి పైగా భాజపా ఖాతాకే

- కమలం పార్టీకి చేరిన సొమ్ము రూ.3,157.66 కోట్లు: ఏడీఆర్

దిల్లీ: ఎన్నికల ట్రస్టులకు 2024-25లో వివిధ కంపెనీలు, వ్యక్తులు అందించిన ఎన్నికల విరాళాల్లో 82 శాతానికి పైగా నిధులు కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపాకే దక్కాయని ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) శుక్రవారం వెల్లడించింది. ఈ ట్రస్టులు పంపిణీ చేసిన రూ.3,826.35 కోట్లలో దాదాపు రూ.3,157.66 కోట్లు భాజపాకే అందాయి. కాంగ్రెస్ పార్టీకి రూ.298 కోట్లు(7.81 శాతం), తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.102 కోట్లు (2.67 శాతం) వెళ్లాయి. మిగిలిన విరాళాల సొమ్ము 19 పార్టీలకు చేరింది.

మొత్తం విరాళాల్లో రూ.3,636 కోట్లకు పైగా మొత్తాన్ని 228 కంపెనీలు అందించాయి. 99 మంది వ్యక్తులు రూ.187 కోట్లకు పైగా విరాళాలిచ్చారు. దాతల్లో అగ్రస్థానాన్ని రూ.500 కోట్లతో ఎలెవేటెడ్ ఎవెన్యూ రియాల్టీ ఎల్.ఎల్.పి సంస్థ దక్కించుకుంది. తదుపరి స్థానాల్లో టాటా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రూ.308.14 కోట్లు), టీసీఎస్ (రూ.217.63 కోట్లు), మేఘా ఇంజినీరింగ్ (రూ.175 కోట్లు) నిలిచాయి. విరాళాలలో అత్యధికంగా రూ.1,225.5 కోట్లు మహారాష్ట్ర నుంచి, రూ.358.25 కోట్లు తెలంగాణ నుంచి వచ్చాయి. హరియాణా(రూ.212.9 కోట్లు), పశ్చిమ బెంగాల్ (దాదాపు రూ.204 కోట్లు), గుజరాత్ (రూ.200.5 కోట్లు) తదుపరి స్థానాల్లో నిలిచాయి. విరాళాలను స్వీకరించే ట్రస్టులు ఎన్నికల సంఘం వద్ద రిజిస్టరై, తమకు ఎంత మొత్తంలో విరాళాలు అందాయో, వాటిని ఏయే పార్టీలకు పంపిణీ చేశాయో తెలుపుతాయి.

ఐఎస్ఎస్‌కు పయనమైన నలుగురు వ్యోమగాములు



కేప్ కెనావెరాల్: వైద్యపరమైన అత్యవసర కారణాల వల్ల నలుగురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి అర్ధాంతరంగా భూమికి తిరిగొచ్చిన నేపథ్యంలో వారి స్థానాన్ని భర్తీ చేయడానికి తాజాగా మరో బృందం నింగిలోకి పయనమైంది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన రాకెట్ ద్వారా వారు రోదసిలోకి బయల్దేరారు. వీరిలో అమెరికాకు చెందిన జెస్సికా మెయిర్, జాక్ హాథవే, ఫ్రాన్స్ వ్యోమగామి సోఫీ ఆడెనాట్, రష్యాకు చెందిన ఆండ్రెయ్ ఫెద్యయేవ్‌లు ఉన్నారు. వీరు శనివారం ఐఎస్ఎస్ చేరుకుంటారు. 8-9 నెలల పాటు అక్కడే విధులు నిర్వర్తిస్తారు. వ్యోమగాములు కక్ష్యలోకి చేరగానే.. "ఈ రోజు శుక్రవారం.. 13వ తేదీ. చాలా మంచి రోజు" అని స్పేస్‌ఎక్స్‌కు చెందిన లాంచ్ కంట్రోల్ సందేశం పంపింది. దీనికి కమాండర్ జెస్సికా స్పందిస్తూ.. "ఇది అద్భుత ప్రయాణం" అని బదులిచ్చారు. ఐఎస్ఎస్‌లో ఇప్పటికే ముగ్గురు వ్యోమగాములు ఉన్నారు. గత నెలలో ఒక వ్యోమగామికి అనారోగ్య సమస్య తలెత్తిన సంగతి తెలిసిందే. దీంతో ఆ ఆస్ట్రోనాట్‌తోపాటు మరో ముగ్గురు సహచరులను అత్యవసరంగా భూమికి రప్పించారు. అనారోగ్యంపాలైన వ్యోమగామి ఎవరన్నది అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా వెల్లడించలేదు. పుడమికి చేరాక నలుగురు ఆస్ట్రోనాట్‌లను నేరుగా ఆసుపత్రికి తరలించారు. 65 ఏళ్ల నాసా మానవసహిత అంతరిక్ష యాత్రల చరిత్రలో వైద్య కారణాలతో మిషన్‌ను కుదించాల్సి రావడం అదే మొదటిసారి. తాజా యాత్ర నేపథ్యంలో వ్యోమగాములకు సంబంధించిన వైద్య ప్రక్రియలను సంస్థ సమీక్షించింది. ఇప్పటికే అమల్లో ఉన్న విధానాలతో సంతృప్తి చెందింది. వ్యోమగాములు బయల్దేరడానికి ముందు ఎలాంటి అదనపు వైద్యపరీక్షలు నిర్వహించలేదు. అలాగే కొత్త వ్యాధి నిర్ధారణ పరికరాలనూ పంపలేదు. ఐఎస్ఎస్‌లో ఇప్పటికే ఒక అల్ట్రాసౌండ్ యంత్రం ఉంది. గత నెలలో అనారోగ్యంపాలైన వ్యోమగామిని దాని సాయంతోనే పరీక్షించారు.



అస్సాంలోని గువాహటి, ఉత్తర గువాహటిని అనుసంధానిస్తూ బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతు. ఈ వంతెనను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించనున్నారు.

ట్రంప్ గాజా శాంతిమండలిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు: భారత్

ఇంటర్నెట్‌డెస్క్: గాజా పునర్నిర్మాణం కోసం అమెరికా అధ్యక్షుడు ఏర్పాటు చేసిన శాంతి మండలిలో భాగం కావాలని భారత్‌కు ఇప్పటికే ఆహ్వానం అందింది. అయితే ఈ ప్రతిపాదనపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ బోర్డుకు సంబంధించి ఫిబ్రవరి 19న జరిగే తొలి సమావేశానికి భారత్ హాజరవుతుందా, లేదా అన్నదానిపై స్పష్టత లేదన్నారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం కోసం చేసే ప్రయత్నాలకు తాము నిరంతరం మద్దతు ఇస్తున్నామని పునరుద్ఘాటించారు. గాజాతో సహా మొత్తం ప్రాంతంలో శాశ్వత శాంతికి మార్గం సుగమం చేసే అన్ని కార్యక్రమాలను ప్రధాని మోదీ స్వాగతించారన్నారు.

గాజా శాంతి బోర్డుపై ఇండోనేసియాలో వ్యతిరేకత

జకార్తా: గాజా కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన శాంతి సంస్థాపన బోర్డులో చేరిన ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో, అక్కడ నియోగించే అంతర్జాతీయ భద్రతా దళం (ఐఎస్ఎఫ్) కోసం 8 వేల మంది సైనికులకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఐక్యరాజ్యసమితి శాంతి రక్షణ సేన ఉండగా కొత్తగా ట్రంప్ ఐఎస్ఎఫ్‌ను ఏర్పాటు చేయడమేమిటి, అందులో తమ దేశం చేరడమేమిటని ఇండోనేసియా ప్రతిపక్షాలు, మేధావులు, ప్రజా ప్రముఖులు ప్రశ్నిస్తున్నారు. ఐరాస శాంతి రక్షణ సేనకు పెద్ద సంఖ్యలో సైనికులను అందించే 10 దేశాలలో ఇండోనేసియా కూడా ఒకటి. ఐరాస ఆధ్వర్యంలో ఇండోనేసియా ఇంతకుముందు లెబనాన్, గాజాలలో భద్రతా విధులు నిర్వర్తించి, మానవతా సహాయం అందించింది కూడా. తాజాగా ట్రంప్ ఐఎస్ఎఫ్ ఛత్రంలో పనిచేసే ఇండోనేసియా సైనికులు చివరకు ఇజ్రాయెల్ దళాలకు మద్దతు ఇచ్చేవారిగా మిగిలిపోతారా అని ప్రశ్నలు తలెత్తాయి. ముస్లిం దేశమైన ఇండోనేసియాకు ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేకపోయినా తుర్కియే, ఇరాన్‌ల మాదిరిగా శత్రు వైఖరీ లేదు. ఐరాస పరిధికి వెలుపల పనిచేసే ఐఎస్ఎఫ్‌కు, అందులోని ఇండోనేసియా సేనలకు అయ్యే ఖర్చును ఎవరు భరిస్తారనేది తేలలేదు. ఐరాస తరఫున బాధ్యతలు నిర్వహించే శాంతి రక్షక సేనకు సమితే డబ్బు చెల్లిస్తుంది. కాగా ట్రంప్ గాజా కోసం ఏర్పాటుచేసే శాంతి సంస్థాపన బోర్డులో శాశ్వత సభ్యత్వం పొందాలంటే 100 కోట్ల డాలర్ల రుసుము చెల్లించాలి. దీనికి ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంతో ఒప్పుకున్నారు.

కృత్రిమ మేధ ప్రభావం, ముప్పుపై ఐరాస నిపుణుల కమిటీ ఏర్పాటు

- ఐరాస సర్వ ప్రతినిధుల సభ ఆమోదం

ఐరాస: అగ్రరాజ్యం అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో...కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం, దాని ముప్పును అంచనా వేయడానికి ప్రపంచ స్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటయ్యింది. 40 మంది ప్రపంచ స్థాయి నిపుణులతో రూపొందించిన ఈ కమిటీకి ఐరాస సర్వ ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. అత్యధికంగా 117 సభ్యదేశాలు అనుకూలంగా, వ్యతిరేకిస్తూ అమెరికా, పరాగ్వే దేశాలు ఓటేశాయి. రష్యా, చైనాతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలు, అమెరికా మిత్ర దేశాలు కమిటీ ఏర్పాటును సమర్థించడం గమనార్హం. ట్యునీషియా, ఉక్రెయిన్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఈ సందర్భంగా ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ మాట్లాడుతూ.. ఏఐ వల్ల ప్రపంచ వ్యాప్తంగా పడే ఆర్థిక, సామాజిక ప్రభావాన్ని అంచనా వేయడానికి కమిటీ స్వతంత్ర సంస్థగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కమిటీలో అమెరికా, చైనా, రష్యా, భారత్ తదితర దేశాలకు చెందిన ఏఐ నిపుణులతో పాటు ఇతర రంగాలకు చెందిన నోబెల్ గ్రహీతలూ ఉన్నట్లు గుటెరస్ వెల్లడించారు.

హృద్రోగ నిపుణుడు ఉపేంద్ర కౌల్‌కు ఐఎస్‌సీఆర్ జీవితకాల సాఫల్య పురస్కారం



దిల్లీ: కార్డియాలజిస్ట్ ప్రొఫెసర్ ఉపేంద్ర కౌల్‌కు జీవితకాల సాఫల్య పురస్కారం-2026 ప్రదానం చేసినట్లు ఇండియన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ రీసెర్చ్ (ఐఎస్‌సీఆర్) తెలిపింది. దిల్లీలో నిర్వహించిన ఐఎస్‌సీఆర్ 20వ వార్షిక సమావేశంలో ఈ అవార్డు అందజేశారు. హృద్రోగ నిపుణుడిగా 40 ఏళ్ల అనుభవం ఉన్న కౌల్ 400పైగా పరిశోధన పత్రాలను రచించారు. అంతర్జాతీయ గుర్తింపుతో పాటు ఐసీఎంఆర్ శకుంతల అమీర్‌చంద్ అవార్డు, డాక్టర్ బీసీ రాయ్ అవార్డు, పద్మశ్రీ తదితర జాతీయ స్థాయి పురస్కారాలు ఆయనను వరించాయి. వైద్యుడు, పరిశోధకుడు, బోధకుడు అయిన ప్రొఫెసర్ కౌల్ జమ్మూకశ్మీర్‌లో 2020 నుంచి స్వచ్ఛంద సంస్థ గౌరీ కౌల్ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు అందిస్తున్నారు. రోగులకు వైద్య సంరక్షణ అందించడం, క్లినికల్ పరిశోధనలకు గాను ఉపేంద్ర కౌల్‌కు జీవితకాల సాఫల్య పురస్కారం అందజేసినట్లు ఐఎస్‌సీఆర్ పేర్కొంది.



చైనాలో నూతన సంవత్సర ముందస్తు వేడుకలు పురస్కరించుకొని బీజింగ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నృత్యం చేస్తున్న రోబోలు

సంస్కరించాల్సిన బాధ్యతను వీడి పాఠశాల నుంచి బహిష్కరిస్తారా?

- ఇండోర్ విద్యార్థికి పదో తరగతి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తూ సుప్రీం వ్యాఖ్య

దిల్లీ: ఉపాధ్యాయులపై అభ్యంతరకర మీమ్స్‌ను సామాజిక మాధ్యమం ద్వారా వ్యాప్తిలోకి తెచ్చాడనే కారణంతో పాఠశాల నుంచి బహిష్కృతుడైన విద్యార్థికి పదో తరగతి పరీక్ష రాసే అవకాశాన్ని సుప్రీంకోర్టు కల్పించింది. ఆ విద్యార్థికి హాల్‌టికెట్ జారీ చేయాల్సిందిగా 'కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్' (సీఐఎస్‌సీఈ)ని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది. పరీక్ష రాసేందుకు అనుమతించకపోతే ఆ విద్యార్థి ఒక విద్యాసంవత్సరాన్ని కోల్పోవాల్సి వస్తుందని పేర్కొంది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. తప్పిదానికి పాల్పడిన బాలుడిని సంస్కరించేందుకు ప్రయత్నించాల్సిన ఇండోర్‌లోని ఆ పాఠశాల తన బాధ్యతను విస్మరించి 'చెడ్డవాడు' అనే ముద్రవేసి బహిష్కరించడం తగదని అభిప్రాయపడింది. ఆ బాలుడు చుట్టూ ఉంటే సమాజం, పరిసరాల ప్రభావానికి గురై ఉంటాడని, దానిని నుంచి బయటపడేలా ఉపాధ్యాయులు ప్రయత్నించాల్సిందని పేర్కొంది. ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలను ఇతర విద్యార్థులతో కాకుండా విడిగా మరో గదిలో కూర్చుని రాసేందుకు అతనికి అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది.

మణిపుర్ అల్లర్ల కేసులపై రెండు వారాల్లో స్థాయీ నివేదిక

- సీబీఐని ఆదేశించిన సుప్రీంకోర్టు

దిల్లీ: జాతుల మధ్య ఘర్షణతో అట్టుడికిన మణిపుర్‌లో దాఖలైన 11 ఎఫ్ఐఆర్‌లపై స్థాయీ నివేదికను రెండు వారాల్లోగా సమర్పించాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)ని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. హింసాత్మక ఘటనలకు సంబంధించిన ఇతరత్రా పరిణామాలను, బాధితుల వాంగ్మూలాల నమోదు, కేసుల విచారణను పర్యవేక్షించే బాధ్యతను సుప్రీంకోర్టు కాకుండా...మణిపుర్ హైకోర్టు, గువాహటీ హైకోర్టు సంయుక్తంగా పర్యవేక్షించాలని ఆ రెండు కోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు సూచిస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం పేర్కొంది. కేసుల విచారణలో, సమాచారం తెలియజేయడంలో బాధితులకు సీబీఐ సహకరించడంలేదని ఇటీవల మృతి చెందిన బాధితురాలి తరఫు న్యాయవాది తెలుపుగా సుప్రీం ధర్మాసనం తాజా ఆదేశాలిచ్చింది. బాధితుల సంక్షేమం, పునరావాసంపై జస్టిస్ గీతా మిత్తల్ కమిటీ చేసిన సిఫార్సులను కేంద్రం, మణిపుర్ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాలని పేర్కొంది. తదుపరి విచారణ ఈ నెల 26వ తేదీకి వాయిదాపడింది.

మైనారిటీ విద్యా సంస్థల కమిషన్ పదవులు భర్తీ చేయండి

- ఉన్నత విద్యాశాఖకు దిల్లీ హైకోర్టు ఆదేశం

దిల్లీ: జాతీయ మైనారిటీ విద్యా సంస్థల కమిషన్‌లో అధ్యక్షుడు, ఇద్దరు సభ్యుల పదవులు 2023 నుంచి ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీచేయకపోవడాన్ని దిల్లీ హైకోర్టు తప్పుపట్టింది. ముగ్గురు సభ్యులు ఉండాల్సిన కమిషన్ ప్రస్తుతం ఒకే ఒక సభ్యునితో పనిచేస్తోంది. మైనారిటీ విద్యా సంస్థ ఏర్పాటుకు అనుమతివ్వడం, ఏదైనా సంస్థకు అలాంటి అనుమతి ఇవ్వాలా లేదా, ఇచ్చిన అనుమతిని రద్దుచేయాలా లేదా అనే అంశాలపై ఈ కమిషందే తుది నిర్ణయం. ఇంతటి ముఖ్యమైన కమిషన్‌కు బాధ్యుల నియామకాలు ఎప్పుడు చేపడతారో తదుపరి విచారణ తేదీ మే 4కల్లా తెలపాలని ఉన్నత విద్యా శాఖను హైకోర్టు ఆదేశించింది.

డిజిటల్ మూల్యాంకనానికి సీబీఎస్ఈ శ్రీకారం

- ఇకపై 12వ తరగతి మార్కులకు వెరిఫికేషన్ ఉండదు

దిల్లీ: ఈ ఏడాది నుంచి 12వ తరగతి బోర్డు పరీక్షల మూల్యాంకనాన్ని పూర్తిగా డిజిటల్ పద్ధతిలో చేపట్టాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. దీంతో ఇకపై ఫలితాల వెల్లడి తర్వాత మార్కుల పునఃపరిశీలన అవసరం ఉండదని సీబీఎస్ఈ అధికారులు తెలిపారు. డిజిటల్ విధానంలో ఆన్ స్క్రీన్ మార్కింగ్(ఓఎస్ఎం)తో మూల్యాంకనాన్ని చేపడుతుండటం వల్ల మొత్తం మార్కుల లెక్కింపులో మానవ తప్పిదాలకు ఆస్కారం ఉండకపోవడమే అందుకు కారణం. ఓఎస్ఎంపై పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. డిజిటల్ విధానం వల్ల మూల్యాంకన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగుతుందని అధికారులు పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థులు మాత్రం పాత పద్ధతిలో తమ మార్కులను వెరిఫికేషన్ చేసుకోవచ్చు.

సోవియట్ యుగ అసమ్మతివాది రాయ్ మెద్వెదేవ్ కన్నుమూత


మాస్కో: సోవియట్ రష్యాలో స్టాలిన్ విధానాలను, క్రుశ్చేవ్, బ్రెజ్నెవ్‌ల హయాంలో రష్యా కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన మార్క్సిజాన్నీ ప్రశ్నించిన విమర్శకుడు రాయ్ మెద్వెదేవ్ శుక్రవారం నూరేళ్ల వయసులో కన్నుమూశారు. ఆయన మృతికి కారణాలను అధికారులు తెలపలేదు. రాయ్ రాసిన 'లెట్ హిస్టరీ జడ్జ్' పుస్తకం పాశ్చాత్య దేశాల్లో ప్రచురితం కావడంతో 1969లో ఆయన్ను కమ్యూనిస్టు పార్టీ నుంచి బహిష్కరించారు. గోర్బచెవ్ హయాం (1989)లో ఆయన మళ్లీ పార్టీలో చేరి పార్లమెంటు సభ్యుడు కూడా అయ్యారు. 1991లో సోవియట్ పతనం తరవాత రాయ్, మరికొందరు పార్లమెంటు సభ్యులు కలిసి 'సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వర్కింగ్ పీపుల్ పార్టీ'ని స్థాపించారు. 2008లో ప్రస్తుత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ జీవిత కథను రాశారు. క్రిమియాను కలుపుకోవడాన్నీ, ఉక్రెయిన్‌తో పోరునూ సమర్థించారు. 21వ శతాబ్ది ఆరంభం నుంచి రాజకీయాలకు వీడ్కోలు చెప్పిన రాయ్ 50కి పైగా పుస్తకాలు రచించారు. వాటిలో క్రుశ్చేవ్, బ్రెజ్నెవ్, యూరీ ఆండ్రోపోవ్‌ల జీవిత కథలూ ఉన్నాయి.

హైతీలో సాయుధ ముఠాల గుప్పిట్లో చిన్నారులు!

శాన్ జువాన్: హైతీలో సాయుధ ముఠాల్లో బాలల నియామకం గత ఏడాదిలో మూడింతలు పెరిగిందని యూనిసెఫ్(యూఎన్‌ఐసీఈఎఫ్) నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా ముఠా ఘర్షణల వల్ల సుమారు 14 లక్షల మంది నిరాశ్రయులవ్వగా, అందులో సగానికి పైగా పిల్లలే ఉండటం గమనార్హం. యూనిసెఫ్ హైతీ ప్రతినిధి గీతా నారాయణ్ ఈ పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం హైతీలోని సాయుధ ముఠాల సభ్యుల్లో 30 నుంచి 50 శాతం వరకు పిల్లలే ఉన్నారు. కొందరిని 9 ఏళ్ల వయసులోనే నియమిస్తున్నట్లు సమాచారం' అని ఆమె పేర్కొన్నారు. రాజధాని పోర్ట్ ఓ ప్రిన్స్‌లో 90 శాతం ప్రాంతాలను ముఠాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. బాలురు గూఢచారులుగా, ఆయుధాలు మోయడం, నిఘా పెట్టడం వంటి పనులు చేస్తుండగా, బాలికలు లైంగిక హింసకు గురవడంతో పాటు వంట, ఇతర పనులకు పరిమితమవుతున్నట్లు నివేదిక పేర్కొంది. కొన్ని సందర్భాల్లో కుటుంబాలకు డబ్బులు చెల్లించి పిల్లలను తీసుకెళ్తున్నారని తెలిపింది. ముఠాల్లో చేరిన పిల్లలకు మత్తు పదార్థాలు ఇచ్చి, వారిని వ్యసనపరులుగా మారుస్తున్నట్లు నివేదికలూ ఉన్నాయని పేర్కొంది.

బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు - ఉద్యమాలు

ఆంగ్లేయుల నిరంకుశ పాలన, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా 19, 20వ శతాబ్దాల్లో అనేక ఉద్యమాలు, తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాట్లలో కొన్ని బ్రిటిష్ పాలనను అంతం చేయడానికి విఫలయత్నం చేశాయి. ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప తిరుగుబాట్లలో 1857 సిపాయిల తిరుగుబాటు ఒకటి. సరైన నాయకత్వం లేకపోవడం, వ్యూహ రచనలో వైఫల్యం వల్ల ఈ తిరుగుబాటును ఆంగ్లేయులు అణచివేశారు. దీన్ని ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం, విప్లవోద్యమం, సిపాయిల పితూరీ అని చరిత్రకారులు అభివర్ణించారు.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

పెల్లుబికిన ఆగ్రహం.. ఫలితమే ఆ తిరుగుబాటు!

సిపాయిల తిరుగుబాటు - 1857

రెండు శతాబ్దాల ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో జరిగిన అత్యంత ప్రధాన సంఘటన 1857లోని సిపాయిల తిరుగుబాటు. బ్రిటిష్ పాలన వ్యవస్థలో సమూల మార్పులు రావడానికి కారణమైంది. తిరుగుబాటులో అనేక వర్గాలవారు పాల్గొన్నప్పటికీ దీన్ని ప్రారంభించి, కీలకపాత్ర పోషించిన ఘనత సిపాయిలకే దక్కుతుంది. కారణాలు వేరైనా అన్ని వర్గాల ప్రయోజనాలను దెబ్బతీసిన ఆంగ్లేయులు ఉమ్మడి శత్రువు కావడంతో వారంతా ఏకమై పోరాటం కొనసాగించారు.

- ఈ తిరుగుబాటుకు కారణాలను రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత, సైనిక, తక్షణ అంశాలుగా విభజించవచ్చు.

తక్షణ కారణం

సిపాయిల తిరుగుబాటుకు తక్షణ కారణం రాయల్ ఎన్‌ఫీల్డ్ తుపాకులకు సంబంధించిన వివాదం. వీటిలో ఉపయోగించే తూటాలను నోటితో కొరికి ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే ఈ తూటాల్లో ఆవు, పందికొవ్వు వినియోగించారనే వదంతి సిపాయిల్లో ఆగ్రహాన్ని కలిగించి, తిరుగుబాటుకు కారణమైంది.

☛ ఆవు హిందువులకు పవిత్రమైంది. పంది ముస్లింలకు నిషేధం. దీంతో వారు ఈ తూటాలను కొరకడాన్ని నిరాకరించారు. ఇది హిందూ, ముస్లింలను క్రైస్తవంలోకి మార్చడానికి పన్నిన కుట్రగా సిపాయిలు భావించారు.

సైనిక కారణాలు

సైన్యంలో ఆంగ్లేయులను సోల్జర్‌గా, భారతీయులను సిపాయిలుగా పేర్కొనేవారు. రెండు లక్షల మందికిపైగా భారతీయులు సిపాయిలుగా ఉండగా, కేవలం 45 వేల మంది మాత్రమే బ్రిటిష్ సైనికులు ఉండేవారు. భారతీయ సిపాయిలే అనేక యుద్ధాల్లో పాల్గొని ఆంగ్లేయుల రాజ్య విస్తరణకు పాటుపడ్డారు. అయినా వీరికి తగిన గుర్తింపు దక్కలేదు.

❖ సిపాయిల జీతభత్యాలు, పదోన్నతి విషయాల్లో ఆంగ్లేయ సైనికులతో పోలిస్తే విపరీతమైన వివక్షకు గురయ్యారు. భారతీయ సిపాయిలకు సుబేదార్‌కు మించిన పదవి దక్కేది కాదు. ఆదేశాలు జారీ చేసే అధికారం కేవలం ఆంగ్లేయుల సొంతం.

❖ ఆంగ్లేయులు సిపాయిల మనోభావాలను గౌరవించలేదు.

1856లో లార్డ్ కానింగ్ చేసిన నిరంకుశ చట్టం 'General Service Enlistment Act' ప్రకారం సిపాయిలు ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలకు సైతం వెళ్లి ఆంగ్లేయులకు సేవలందించాలి. ఈ విషయంలో ఉన్నతాధికారుల ఉత్తర్వులను ధిక్కరిస్తే ఉద్యోగాల నుంచి తొలగించేవారు.

ముఖ్య సంఘటనలు

కలకత్తా సమీపంలోని బరక్‌పూర్‌లో 34వ పదాతి దళంలో పనిచేస్తున్న మంగళ్ పాండే అనే సిపాయి కల్నల్ బాగ్, జనరల్ హర్సే అనే ఆంగ్లేయ అధికారులపై 1857 మార్చి 29న కాల్పులు జరిపి తీవ్రంగా గాయపర్చాడు. దీంతో ఆంగ్లేయులు 1857 ఏప్రిల్ 8న ఉరితీశారు.

❖ 1857 మే 10న సిపాయిలు మీరట్‌లో సమావేశమై ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. దీని ప్రకారం బ్రిటిష్ పాలనను అంతంచేసి మొగల్ పాలనను పునరుద్ధరించాలని నిర్ణయించారు. కాబట్టి ఈ రోజునే తిరుగుబాటు ప్రారంభ దినంగా పరిగణిస్తారు.

❖ 1857 మే 11న మీరట్ నుంచి బయలుదేరిన సిపాయిలు ఢిల్లీ చేరుకుని మొగల్ చక్రవర్తి బహదూర్ షా-IIను భారత చక్రవర్తిగా ప్రకటించారు.

రాజకీయ కారణాలు

బ్రిటిష్ సామ్రాజ్యవాదం ముఖ్యంగా డల్హౌసీ రాజ్య విస్తరణ విధానాలు భారత రాజులను తీవ్రంగా కలవరపెట్టాయి. రాజ్య సంక్రమణ సిద్ధాంతం ద్వారా డల్హౌసీ అనేక భారత రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. దీన్ని స్వదేశీ రాజులు, ప్రజలు వ్యతిరేకించారు.

◆ ఈ సిద్ధాంతం ప్రకారం, సతారా, జైపూర్, సంబల్‌పూర్, ఉదయ్‌పూర్, ఝాన్సీ, నాగ్‌పూర్ సంస్థానాలను బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకున్నారు. దుష్పరిపాలన అనే నెపంతో అవధ్‌ను, సిక్కులను యుద్ధంలో ఓడించి పంజాబ్‌ను ఆక్రమించుకున్నాడు.

◆ చివరి చక్రవర్తి రెండో బహదూర్ షా బిరుదైన జిల్లె - ఇల్లాహి అతడి తర్వాత రద్దవుతుందని, పాదుషా హోదాను తీసివేస్తామని చెప్పడం భారతీయ ముస్లిం వర్గాల్లో చర్చనీయాంశమైంది.

◆ రెండో బాజీరావు దత్తపుత్రుడు నానాసాహెబ్ దత్తత చెల్లదని ప్రకటించారు. అతడి భరణాన్ని రద్దు చేశారు. దీంతో భారత రాజులు సిపాయిలతో చేతులు కలిపి ఈ తిరుగుబాటులో పాల్గొన్నారు.

◆ 1857 తిరుగుబాటులో జమీందారులు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంగ్లేయులు వివిధ ప్రాంతాల్లోని జమీందార్ల భూములను ఆక్రమించుకున్నారు. 1856లో అవధ్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత అక్కడి తాలుఖ్ దార్ల (జమీందార్లు) భూములను స్వాధీనం చేసుకోవడంతో వారు తిరుగుబాటులో భాగస్వాములయ్యారు.

సాంఘిక, మత విధానాలు

ఆంగ్లేయుల సామాజిక చట్టాలు హిందూ సంప్రదాయవాదుల మనోభావాలను దెబ్బతీశాయి. ముఖ్యంగా సతిని నిషేధించడం, వితంతు పునర్వివాహాలకు అనుమతివ్వడం లాంటివి వివాదాస్పదమయ్యాయి. చార్టర్ చట్టాల ద్వారా క్రైస్తవ మిషనరీలు భారతదేశంలోకి ప్రవేశించాయి. ఇవి మత మార్పిడులకు పూనుకోవడంతో భారతీయులు వ్యతిరేకించారు. మేజర్ ఎడ్వర్డ్ భారతీయులను క్రైస్తవంలోకి మార్చడమే తమ లక్ష్యమని ప్రకటించాడు. రైళ్లలో జాతి, మత, కుల, లింగ భేదం లేకుండా అందరూ ఒకే దగ్గర ప్రయాణించడం వర్ణాశ్రమ ధర్మాలకు ఆటంకమని హిందువులు భావించారు. దీంతో ఈ వర్గం కూడా సిపాయిల తిరుగుబాటుకు మద్దతునిచ్చింది.

ఆర్థిక విధానాలు

ఆంగ్లేయులు వ్యవసాయ రంగానికి సరైన ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడంతో ఆ రంగం కుంటుపడింది. అధిక భూమిశిస్తు వసూలు చేశారు. కట్టని వారి భూములు స్వాధీనం చేసుకోవడంతో రైతులు కూలి పనులకు వెళ్లాల్సి వచ్చేది. ఇంగ్లండ్‌లోని పారిశ్రామిక విప్లవం వల్ల అక్కడి నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులు ఇక్కడి కుటీర పరిశ్రమలను దెబ్బతీశాయి. అధిక పన్నులు విధించిన ఆంగ్లేయులు తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకున్నారు. ఆంగ్లేయుల ఆర్థిక, భూమిశిస్తు విధానాలతో భారత రైతాంగం, చేతివృత్తుల వారు జీవనోపాధి కోల్పోయారు. సరైన ఆదాయం లేక పేదరికంలో మగ్గిపోయారు. ఫలితంగా వీరు సిపాయిల తిరుగుబాటులో చేరి తమవంతు పాత్ర పోషించారు.

భారతీయ సిపాయిల నేతృత్వంలో 1857 మే 10న ప్రారంభమైన బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటు 1858 అక్టోబరు నాటికి అణచివేతకు గురైంది.

❖ బ్రిటిష్ పాలకుల పక్షపాత వైఖరి, స్వార్థపూరిత విధానాలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తెలియజేయడంలో 1857 తిరుగుబాటుదారులు విజయం సాధించారు. అయితే ఇది కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది, దేశం మొత్తం వ్యాపించలేదు.

❖ నాయకత్వ లేమి తిరుగుబాటును నీరుగార్చిందని చెప్పవచ్చు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

Word of the Day

921

Pertinent

Telugu meaning: సంబంధించిన, తగిన

English meaning: The word pertinent (పర్టినెంట్) is an adjective that describes something that is relevant, appropriate, or directly related to the matter being discussed.

Synonyms: Relevant, Appropriate

Antonyms: Inappropriate, Unrelated

Usage: **1.** The teacher asked only pertinent questions that helped students understand the core concept clearly.

2. During the interview, she gave concise and pertinent answers that impressed the selection panel.

కరెంట్ అఫైర్స్



శతాబ్దాల చరిత్ర ఉన్న బ్రిటిష్ పార్లమెంట్ ఎగువ సభ 'హౌస్ ఆఫ్ లార్డ్స్'లో తెలంగాణకు చెందిన ఉదయ్ నాగరాజు 2026, ఫిబ్రవరి 11న జీవితకాల సభ్యుడి (లైఫ్ పీర్)గా ప్రమాణం చేశారు. బ్రిటిష్ సంప్రదాయాల మేరకు జరిగిన వేడుకలో ముదురు ఎరుపు రంగు గౌను ధరించి, భగవద్గీతపై ఆయన ప్రమాణం చేశారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ నాగరాజు.. దాదాపు 25 ఏళ్ల క్రితం బ్రిటన్ వెళ్లారు. మహాత్మాగాంధీ ఫ్యూచర్ లీడర్స్ ప్రోగామ్ వ్యవస్థాపకుడిగా యువతలో నైతిక నాయకత్వం, సామాజిక న్యాయం, గాంధేయ విలువలను పెంపొందించడంలో కృషి చేస్తున్నారు.



భారత్‌లో తొలి మ్యూజికల్ రోడ్డును ప్రారంభించి ముంబయి తీరప్రాంత రహదారుల అధికారులు రికార్డు సృష్టించారు. హంగేరియన్ టెక్నాలజీ సాయంతో నారిమన్ ప్రాంతం నుంచి వర్లి వైపు వెళ్లే రహదారిపై పలు సంగీత స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుపై దాదాపు 500 మీటర్ల మేర వాహనదారులకు 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాలోని 'జయ హో' పాట వినిపించనుంది. వాహనాలు 70 - 80 కి.మీ.ల వేగంతో ప్రయాణించినప్పుడు రోడ్డుపై ఉన్న ప్రత్యేక పట్టీల రాపిడికి 'జయహో' అని ధ్వని తరంగాలు ఉత్పత్తి అవుతాయి.



డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్‌ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ప్రభుత్వం నియమించింది. ఆ పదవిలో పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న డి. కృష్ణభాస్కర్‌ను రిలీవ్ చేసింది. బుద్ధప్రకాశ్ ప్రస్తుతం ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈయన్ను సీఎండీగా నియమిస్తూ 2026, ఫిబ్రవరి 11న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

గుజరాత్‌లోని భావనగర్‌కు చెందిన జ్ఞానమంజరి ఇన్నోవేటివ్ యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నీటి అడుగున పనిచేసే డ్రోన్‌కు రూపకల్పన చేశారు. జాతీయ రక్షణ అవసరాలకు, పరిశ్రమల్లోనూ దీన్ని ఉపయోగించవచ్చు. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు దీన్ని ప్రదర్శించారు. రసాయన పరిశ్రమలను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించినట్లు వెల్లడించారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక స్వపరిపాలన — స్టడీ జోన్


రాష్ట్ర స్థాయి కంటే దిగువన ఉన్న ప్రభుత్వ అధికార పరిధిని స్థానిక స్వపరిపాలనగా వ్యవహరిస్తారు. స్థానికులకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం లేదా స్థానికుల్లో రాజకీయ చైతన్యం కలిగించడం దీనిలో భాగం. స్థానిక అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలంటే అధికార వికేంద్రీకరణ అవసరం. ఇందుకోసం ఏర్పాటైందే పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం ఆర్థికంగా బలపడుతుంది. ఇంతటి ప్రాధాన్యమున్న గ్రామీణాభివృద్ధి గురించి పోటీ పరీక్షల కోణంలో ముఖ్యాంశాలు తెలుసుకుందాం..!

ముఖ్యాంశాలు:

☛ ఆధునిక భారతదేశంలో లార్డ్ రిప్పన్‌ను స్థానిక స్వపరిపాలనా పితామహుడు అంటారు.

☛ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 40 స్థానిక స్వపరిపాలనను సూచిస్తుంది.

☛ ప్రజాస్వామ్యానికి ప్రత్యక్ష వేదికలుగా గ్రామాలను పేర్కొంటారు. పాలనలో ప్రజలను భాగస్వాములను చేసి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు స్థానిక సంస్థలు అత్యంత కీలకం.



గ్రామపంచాయతీ

మూడంచెల పంచాయతీరాజ్ విధానంలో మొదటిది 'గ్రామ పంచాయతీ'. సర్పంచ్, వార్డు సభ్యులతో గ్రామ పంచాయతీ ఏర్పడుతుంది. దీనికి అధ్యక్షత వహించేది సర్పంచ్. గ్రామ పంచాయతీని ఎన్నికల ద్వారా ఏర్పాటు చేస్తారు. సర్పంచ్‌కు పరిపాలనలో సహకరించేందుకు 'పంచాయతీ కార్యదర్శి'ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. వీరిద్దరి సమన్వయంతో గ్రామ పంచాయతీ తన అధికారాలు, విధులు నిర్వహిస్తుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీరహితంగా జరుగుతాయి.

స్పరంచ్, ఉపసర్పంచ్ అధికారాలు, విధులు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

ఎండోప్లాస్మిక్ రెటిక్యులం

ఎండోప్లాస్మిక్ రెటిక్యులంను తొలిసారిగా ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ సహకారంతో 1940లో గమనించారు. లైట్ మైక్రోస్కోప్‌తో సాధ్యమయ్యే దానికంటే వివరంగా కణసంబంధ నిర్మాణాలను అధ్యయనం చేసేందుకు ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ శాస్త్రవేత్తలకు ఉపకరిస్తుంది. ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌తో పనిచేస్తున్నప్పుడు 1945లో కీత్ ఆర్.పోర్టర్, ఆల్బర్ట్ క్లాడ్, ఎర్నెస్ట్ ఎఫ్.ఫుల్లమ్ అనే శాస్త్రవేత్తలు కణాంగాన్ని కనుకున్నారు.

☛ ఎండోప్లాస్మిక్ రెటిక్యులం అనే పదాన్ని కీత్ పోర్టర్ 1953లో ఉపయోగించారు. ఈ పదం గ్రీకు పదాలైన ఎండో (లోపల), ప్లాస్మా (సైటోప్లాజం), రెటిక్యులం (నెట్‌వర్క్) అనే లాటిన్ పదాల నుంచి వచ్చింది.

☛ ఎండోప్లాస్మిక్ రెటిక్యులం అనే పదాన్ని కీత్ పోర్టర్ 1953లో ఉపయోగించారు. ఈ పదం గ్రీకు పదాలైన ఎండో (లోపల), ప్లాస్మా (సైటోప్లాజం), రెటిక్యులం (నెట్‌వర్క్) అనే లాటిన్ పదాల నుంచి వచ్చింది.

ఎండోప్లాస్మిక్ రెటిక్యులం విధులు

☛ ప్రోటీన్ సింథసిస్ (RER)

☛ ప్రోటీన్ ఫోల్డింగ్, సవరణ


☛ నాణ్యత నియంత్రణ

☛ లిపిడ్ సింథసిస్

☛ నిర్విషీకరణ

☛ కాల్షియం నిల్వ

☛ కార్బోహైడ్రేట్ జీవక్రియ



ఎండోప్లాస్మిక్ రెటిక్యులం నిర్మాణం, ER పనితీరుకు సంబంధించిన వ్యాధులు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టులు సంఖ్య 18. ఇంటర్వ్యూ తేదీ 20 ఫిబ్రవరి 2026.

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్‌లో ఉద్యోగాలు

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 120. దరఖాస్తు ఫీజు రూ.2,500. అర్హులైన అభ్యర్థులు 2026 మార్చి 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఏపీ ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని 28 ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ ప్రకటన వెలువడింది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, విద్య అందిస్తారు. ఆంగ్ల బోధనా మాధ్యమంలో సీబీఎస్ఈ సిలబస్‌ను బోధిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 28 ఫిబ్రవరి 2026.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 14) చివరి తేదీ

■ చెన్నై హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీలో 220 జూనియర్ టెక్నీషియన్ పోస్టులు. పదో తరగతిలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Mensuration 2D

1. The length of a rectangular plot is four times its breadth. If the area of the rectangular plot is 1600 m^2, then what is the breadth (in metres) of the plot?
A) 10 B) 15 C) 20 D) 25

2. The perimeter of a square is half the perimeter of a rectangle. The perimeter of the square is 40 m. If the breadth of the rectangle is two-thirds of its length, then what is the area (in m^2) of the rectangle?
A) 300 B) 384 C) 400 D) 480

3. When a rectangle is divided into four equal parts, each part is a square of area 25 cm^2. What is the perimeter (in cm) of the rectangle?
A) 50 B) 90 C) 100 D) 120

4. The length of a rectangle is two-fifths of the radius of a circle. The radius of the circle is equal to the side of a square whose area is 3600 m^2. If the breadth of the rectangle is 18 m, find the area (in m^2) of the rectangle.
A) 540 B) 648 C) 720 D) 432

5. One diagonal of a rhombus is 10 cm and its area is 60 cm^2. Find the length (in cm) of each side of the rhombus.
A) $\sqrt{79}$ B) $\sqrt{89}$
C) $\sqrt{59}$ D) $\sqrt{61}$

6. The diagonal of a rectangle is 20 cm long and it is twice the length of one side of the rectangle. Find the area (in cm^2) of the rectangle. (Approx)
A) 273 B) 215 C) 173 D) 195

7. The length of a side of an equilateral triangle is 88 cm less than its perimeter. Find the area (in cm^2) of the equilateral triangle.
A) $486\sqrt{3}$ B) $586\sqrt{3}$
C) $385\sqrt{3}$ D) $484\sqrt{3}$

8. Find the area (in cm^2) of a trapezium whose parallel sides are 16 cm and 24 cm, respectively, and the distance between the parallel sides is 10 cm.
A) 160 B) 180 C) 200 D) 220

9. If the length of one side of a rectangle is three times the other side, and the perimeter of the rectangle is 64 cm, then what is the length (in cm) of the longer side?
A) 18 B) 21 C) 24 D) 27

10. Find the area (in cm^2) of a trapezium whose parallel sides are 18 cm and 26 cm, respectively, and the distance between the parallel sides is 10 cm.
A) 180 B) 200 C) 220 D) 240

11. The differences between the semi-perimeter and the sides of a triangle are 9 cm, 16 cm and 25 cm, respectively. Find the area (in cm^2) of the triangle.

Railway Exams

Mathematics

A) $375\sqrt{2}\ cm^2$ B) $380\sqrt{2}\ cm^2$
C) $300\sqrt{2}\ cm^2$ D) $360\sqrt{2}\ cm^2$

12. The diagonal of a square is $6\sqrt{2}$ cm. Find the diagonal (in cm) of another square whose area is four times that of the first square.
A) 12 B) $12\sqrt{2}$ C) 18 D) 24

13. The area of a sector of a circle is 9702 cm^2 and the angle of the sector is 70°. Find the radius (in cm) of the circle.
$\left(\text{Take } \pi = \frac{22}{7}\right)$
A) 112 B) 126 C) 140 D) 154

14. The difference between the lengths of the two parallel sides of a trapezium is 10 cm. The perpendicular distance between them is 48 cm. If the area of the trapezium is 1248 cm^2, find the lengths (in cm) of the two parallel sides.
A) 21 cm, 31 cm B) 22 cm, 32 cm
C) 23 cm, 33 cm D) 24 cm, 34 cm

15. The area of a square is 1600 cm^2. Find the ratio of the length to the breadth of a rectangle whose: Length is twice the side of the square, and Breadth is 12 cm less than the side of the square.
A) 8 : 3 B) 10 : 3
C) 12 : 5 D) 20 : 7

16. The three sides of a triangle are 6 cm, 8 cm and 10 cm. Find the area (in cm^2) of the triangle.
A) 12 B) 18 C) 24 D) 30

17. The perimeter of the top of a rectangular table is 60 m and its area is 216 m^2. What is the length (in m) of the diagonal of the table?
A) $\sqrt{275}$ B) $\sqrt{548}$
C) $\sqrt{468}$ D) $\sqrt{475}$

18. Find the area (in cm^2) of a triangle whose base is 9 cm and the corresponding height is 14 cm.
A) 54 B) 63
C) 72 D) 81

19. The difference between the circumferences of two circles is 6.28 cm. If the radius of the smaller circle is 3 cm, then find the radius (in cm) of the larger circle. (Take π = 3.14)
A) 4 B) 4.5
C) 5 D) 6

Scan the QR code for Key

These model questions were prepared by subject experts



మండలిలో వైకాపా రచ్చ

- పోడియంలోకి చొచ్చుకుపోయిన సభ్యులు
- నిరసనల మధ్యే తీర్మానానికి ఛైర్మన్ ఆమోదం

ఈనాడు, అమరావతి: గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైనా వైకాపా రాజకీయ చర్యలకే పాల్పడిందని కూటమి ఎమ్మెల్సీలు ధ్వజమెత్తారు. దీనిపై జరిగిన చర్చలో అవాస్తవాలు చెబుతూ సభను, ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఈ వ్యవహారం అధికార కూటమి, ప్రతిపక్ష వైకాపా ఎమ్మెల్సీల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. తీర్మానంపై మండలిలో జరిగిన చర్చకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇచ్చే సమయంలో వైకాపా ఎమ్మెల్సీలు అడుగడుగునా అడ్డుతగిలారు. నినాదాలు చేస్తూ.. ఛైర్మన్ పోడియంలోకి చొచ్చుకువచ్చి బల్లలు చరుస్తూ గందరగోళం సృష్టించారు. కొద్దిసేపటికి పోడియం పైకి ఎక్కి ఛైర్మన్ కుర్చీని చుట్టుముట్టి, సభ నిర్వహణకు అడ్డు తగిలారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రెండోరోజు శుక్రవారం పలువురు సభ్యులు మాట్లాడారు. గందరగోళ పరిస్థితుల నడుమ ప్రభుత్వం తరఫున మంత్రి రామానాయుడు సమాధానాన్ని పూర్తి చేశారు. ఆ వెంటనే శనివారానికి సభ వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ మోషేనురాజు ప్రకటించారు.

సంక్షేమమే మా ప్రభుత్వ ప్రాధాన్యం

–రామానాయుడు, మంత్రి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు అనేక సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసింది. పరిపాలనదక్షత ఉన్న చంద్రబాబు వల్లే అభివృద్ధి జరుగుతోంది. రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాన్ని ప్రజలకు ఇస్తున్నాం. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి, ప్రజల ఆస్తులు కాపాడాం. దీపం పథకం కింద ఏడాదికి 3 సిలిండర్లు ఇస్తున్నాం. ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం కింద లబ్ధి అందిస్తున్నాం. అన్నదాతా సుఖీభవ కింద పెట్టుబడి సాయంగా రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధికీ ప్రాధాన్యమిస్తున్నాం.

ప్రభుత్వమే పంటల బీమా చెల్లించాలి

–శివరామిరెడ్డి, వైకాపా ఎమ్మెల్సీ

గవర్నర్ ప్రసంగంలో అన్నీ అవాస్తవాలే. రైతులను ఆదుకునేందుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి. మిర్చి పంటకు ధర లేక రైతులు తక్కువకు అమ్ముకోవాల్సి వస్తోంది. పంట బీమా మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలి.

స్వర్ణాంధ్ర ప్రణాళికకు మార్గదర్శనం

–కె.నాగబాబు, జనసేన ఎమ్మెల్సీ

రాష్ట్ర పునర్నిర్మాణంలో కూటమి ప్రభుత్వానికి గవర్నర్ మార్గదర్శక ప్రసంగాన్ని చేశారు. 2047 స్వర్ణాంధ్ర ప్రణాళికలతో ఆయన చేసిన ప్రసంగం స్ఫూర్తిదాయకం. మన ఆలోచనలు బాగుంటే చేతలు బాగుంటాయి. మంచి ఫలితాలు వస్తాయి. వైకాపా ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి మధ్య ఆలోచనా విధానంలో తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

ఐదుసార్లు కూటమిదే అధికారం

–సోము వీర్రాజు, భాజపా ఎమ్మెల్సీ

గుజరాత్ తరహాలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఐదుసార్లు అధికారంలోకి వస్తుంది. మధ్యప్రదేశ్‌లో మాదిరే మళ్లీ అధికారంలోకి వస్తాం. 'హా కాదు.. హీ కాదు' జరిగేది ఇదే.

గవర్నర్ ప్రసంగంలో అన్నీ అవాస్తవాలే

–ఇజ్రాయిల్, వైకాపా ఎమ్మెల్సీ

గవర్నర్ ప్రసంగంలో అన్నీ అవాస్తవాలే చెప్పారు. వివిధ ప్రాంతాల్లో వైకాపా కార్యకర్తలు, నేతలు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. మాజీ మంత్రుల ఇళ్లపైనా దాడులు చేశారు. అయినా పోలీసులు పట్టించుకోలేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరవయ్యాయి.

రప్పా రప్పా.. వైకాపా విధానం

–గొట్టిపాటి రవికుమార్, మంత్రి

కత్తులు పట్టుకుని రోడ్డుపై తిరుగుతూ 'రప్పా.. రప్పా' అని ప్రజలను రెచ్చగొట్టడం మా పార్టీ సిద్ధాంతం కాదు. అలాంటి సంప్రదాయాలు వైకాపా విధానం. అద్దంకిలో వ్యక్తిగత కారణాలతో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో వ్యక్తి చనిపోయారు. ఎవరు చనిపోతారా అని వైకాపా నేతలు ఎదురుచూస్తున్నారు. ఎవరైనా చనిపోతే బెంగళూరు నుంచి పరిగెత్తుకు వచ్చి.. చనిపోయినవారిని తమ పార్టీ కార్యకర్తలని చెప్పుకోవడం, ప్రతి అంశాన్ని కూటమి ప్రభుత్వానికి ఆపాదించడం తప్ప వైకాపాకు రెండో పనే లేదు.

రూ.1,851 కోట్లు చెల్లించాం

–డీబీవీఎస్ స్వామి, మంత్రి

'2024 తర్వాత నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కింద రూ.1851 కోట్లు చెల్లించాం. వైకాపా హయాంలో ఫీజుల కోసం విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కేవలం రెండు త్రైమాసికాల బకాయిలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని బొత్స అవాస్తవాలు చెబుతున్నారు' అని చెప్పారు.

గిరిజన విద్యార్థుల సదుపాయాలకు రూ.1,285 కోట్లు

గిరిజన వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సదుపాయాలూ కల్పిస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. డైట్ ఛార్జీలు, బెడ్డింగ్ మెటీరియల్, ఇతర సదుపాయాల కోసం రూ.1,285 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం

రాష్ట్రంలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి జిల్లా కేంద్రంలో సైబర్ క్రైం పోలీసుస్టేషన్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు. 'సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. 26 జిల్లాల్లో.. ఇప్పటికి 1,597 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం' అని మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానంగా చెప్పారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు ఐటీ శాఖ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు మంత్రి లోకేశ్ ఈ చర్చలో భాగంగా తెలిపారు.



ఏపీలో 4.78 లక్షల సికిల్‌సెల్ స్టేటస్ కార్డుల పంపిణీ

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పలు గిరిజన ప్రాబల్య ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధి పరీక్షలు నిర్వహించి 4,78,188 మందికి జెనెటిక్ స్టేటస్‌కార్డులు పంపిణీ చేసినట్లు కేంద్ర వైద్యారోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో తెదేపా ఎంపీలు కేశినేని శివనాథ్, బీకే పార్థసారథిలు అడిగిన ప్రశ్నకు ఆమె ఈమేరకు సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని పాత 26 జిల్లాల్లోని గిరిజన ప్రాబల్య ప్రాంతాల్లో 14.79 లక్షల మందిని పరీక్షించి అందులో 4.78 లక్షల మందికి కార్డులు అందించినట్లు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1.70 లక్షల స్టేటస్ కార్డులు పంపిణీచేసినట్లు చెప్పారు. సికిల్‌సెల్ డిసీజ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల కోసం విశాఖ కేజీహెచ్, మంగళగిరి ఎయిమ్స్‌లకు రూ.7.64 కోట్లు కేటాయించి, ఇప్పటివరకూ రూ.7.55 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

ఏపీలో 108 మహిళా సంఘాలకు డ్రోన్ల పంపిణీ... మూడో స్థానం

నమో డ్రోన్ దీదీ కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌లోని 108 మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు అందజేసినట్లు కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. అత్యధిక డ్రోన్లు పొందిన రాష్ట్రాల్లో మూడో స్థానంలో ఏపీ నిలిచినట్లు చెప్పారు. శుక్రవారం లోక్‌సభలో ఈ అంశంపై వివిధ పార్టీల సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 1,094 ఎస్‌హెచ్‌జీలకు డ్రోన్లు పంపిణీచేయగా అందులో కర్ణాటక (145), ఉత్తర్‌ప్రదేశ్ (128), ఆంధ్రప్రదేశ్ (108) తొలి మూడు స్థానాలను ఆక్రమించినట్లు చెప్పారు.

మచిలీపట్నం 51.20%, రామాయపట్నం 76.40% పూర్తి

జనవరి నాటికున్న పరిస్థితుల ప్రకారం రామాయపట్నం పోర్టు మొదటి దశ 76.40%, మచిలీపట్నం పోర్టు మొదటి దశ 51.20% పూర్తయినట్లు కేంద్ర నౌకాయానశాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. ఆయన శుక్రవారం రాజ్యసభలో భారాస సభ్యుడు పార్థసారథిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఈమేరకు సమాధానం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం రామాయపట్నం పోర్టు మొదటిదశను 2026 నవంబరు నాటికి పూర్తిచేసి 2027 మార్చినాటికి ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ పోర్టు మొదటిదశ పనులకు తొలుత రూ.4,929.39 కోట్లతో పరిపాలనా అనుమతులు ఇవ్వగా ఇప్పుడు దాన్ని రూ.5,115 కోట్లకు పెంచినట్లు చెప్పారు. అటవీ భూసేకరణ అనుమతులు, సహాయ, పునరావాసం కోసం అవసరమైన భూసేకరణ చేపట్టడం, తుపాన్లులాంటి కారణాలవల్ల రామాయపట్నం పోర్టు నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురైనట్లు ఏపీ ప్రభుత్వం తెలిపిందన్నారు. ఈ పోర్టు మొదటిదశ పూర్తయితే 34 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర సరకు రవాణాకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మచిలీపట్నం పోర్టులో అయితే 35.12 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర రవాణా చేయొచ్చని చెప్పారు. ఈ రెండు పోర్టులతో ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున ఉపాధి కల్పించడానికి, రాష్ట్రవ్యాప్తంగా సరఫరా గొలుసును బలోపేతంచేయడానికి వీలవుతుందన్నారు.

ఏపీ హైకోర్టులో పెండింగ్ కేసులు 0.47% పెరుగుదల

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పెండింగ్ కేసులు 0.47% పెరిగినట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. ఆయన శుక్రవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈమేరకు సమాధానం ఇచ్చారు. రాష్ట్ర హైకోర్టులో 2023 డిసెంబరు 31 నాటికి 2.47 లక్షల మేర ఉన్న పెండింగ్ కేసులు 2025 డిసెంబరు 31 నాటికి 2.49 లక్షలకు పెరిగినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 4.75%మేర నమోదైన పెండింగ్ కేసులతో పోలిస్తే ఏపీలో తక్కువే ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కిందిస్థాయి కోర్టుల్లో 2.25%మేర పెండింగ్ కేసులు పెరిగాయి. ఇదికూడా దేశవ్యాప్త సగటు 5.84% కంటే తక్కువేనని వెల్లడించారు. ప్రస్తుతానికి ఏపీ హైకోర్టులో 5 జడ్జి, కింది కోర్టుల్లో 71 న్యాయాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రమంత్రి తెలిపారు.

కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఎంపీ ఆర్.కృష్ణయ్య వినతి


కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఇతర ప్రతినిధులు

ఈనాడు, దిల్లీ: ఓబీసీల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖను ఏర్పాటు చేయాలని భాజపా ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం ఇక్కడ కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల స్వయం ఉపాధికి 80% సబ్సిడీతో రూ.20 లక్షల వరకు రుణాలు ఇప్పించాలని కోరారు. 'కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లు 27% నుంచి 56%కి పెంచాలి. పదోన్నతుల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి. ఓబీసీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలి. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు వర్తింపజేయాలి' అని కోరారు. బీసీలకు భద్రత కల్పించేందుకు ఎస్సీ, ఎస్టీల తరహాలోనే వేధింపుల నిరోధక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించడంతో పాటు విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ అమలు చేయాలని విన్నవించారు. తమ డిమాండ్లపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

గృహగణన ప్రశ్నావళిలో ఓబీసీలను చేర్చండి

- కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ మంత్రికి ఏపీ బీసీ సంక్షేమ సంఘం వినతి


కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తదితరులు

ఈనాడు, దిల్లీ: జనగణన మొదటి దశలో భాగంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు దేశవ్యాప్తంగా నిర్వహించబోయే గృహగణన వివరాల సేకరణ కోసం కేంద్రహోంశాఖ జారీచేసిన 33 ప్రశ్నల జాబితాలో ఓబీసీలను చేర్చాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన శుక్రవారం ఇక్కడ పార్లమెంటు భవనంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ మంత్రి వీరేంద్రకుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. హోంశాఖ విడుదల చేసిన ప్రశ్నావళిలోని 12వ ప్రశ్నలో ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు సంబంధించిన వివరాలు సేకరించడానికి అనుమతిచ్చారు తప్పితే ప్రత్యేకంగా ఓబీసీల గురించి చెప్పలేదని, దీనివల్ల ఓబీసీలకు సంబంధించిన వివరాలు సేకరించే అవకాశం ఉండదని ఆయన కేంద్రమంత్రికి వివరించారు. ఓబీసీ జన సంఖ్యతో పాటు, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవాలంటే గృహగణన జాబితాలోనూ ఓబీసీల వివరాలు ప్రత్యేకంగా సేకరించేలా నిర్దేశించాలని కోరారు. జనగణనతో పాటు కులగణన కూడా చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీలు స్వాగతిస్తున్నారని కేంద్రమంత్రికి చెప్పారు. అయితే ప్రస్తుత ప్రశ్నావళిలో ఆ సామాజికవర్గం పేరు చేర్చకపోవడం కొంత అయోమయాన్ని సృష్టిస్తోందని పేర్కొన్నారు. ఆ అంశాన్ని చేర్చకపోతే దేశవ్యాప్తంగా ఉన్న 3,796 ఓబీసీ కులాల లెక్కలు తెలుసుకోవడం సాధ్యంకాదన్నారు. అందువల్ల ఆ లోపాన్ని తీర్చిదిద్దుతూ ప్రశ్నావళిని సవరించి కొత్త గెజిట్ నోటిఫికేషన్ జారీచేయించాలని కోరారు.

అసెంబ్లీ మీడియా పాయింట్

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి: బొత్స సత్యనారాయణ


అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, వైకాపా ఎమ్మెల్సీలు

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. మహిళలకు రక్షణ లేదు. ప్రభుత్వం, పోలీసు వ్యవస్థపై భయం, భక్తి లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి' అని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మండలి సమావేశం అనంతరం శుక్రవారం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేయడం న్యాయమేనా..? పోలీసు వ్యవస్థ ఇలా ఉందని సభలో అడిగితే.. సీఎం తల్లిని తిట్టారని అంటున్నారు. అంబటి రాంబాబు తల్లిని దూషించిన నిందితుల మీద ఎందుకు చర్యలు తీసుకోలేదు. రాంబాబు స్లిప్ అయ్యాడు. నా వయసుకు తగదని పశ్చాత్తాపపడ్డాడు. మహిళలను ఎవరైనా గౌరవించాల్సిందే. తిట్టిన రాంబాబుకు సెంట్రల్ జైలా.. పెట్రోలు బాంబులు విసిరిన వారికి స్టేషన్ బెయిలా..?' అని బొత్స ప్రశ్నించారు.

100 సార్లు లేఖలు రాసినా భూమి ఇవ్వలేదు..

'మా కుటుంబ సభ్యులు పరిశ్రమ పెడతాం భూమి ఇవ్వమని 100 సార్లు లేఖలు రాశారు. కానీ ప్రభుత్వం భూమి ఇవ్వలేదు. చంద్రబాబు కుటుంబ సభ్యులకు చెందిన గీతం కళాశాలకు రూ.5వేల కోట్ల విలువైన భూమి అప్పనంగా కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించానని నాపై బురద జల్లుతున్నారు' అని బొత్స ఆరోపించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- వైకాపా ఎమ్మెల్సీల డిమాండ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని వైకాపా ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పట్నుంచి బకాయిలు ఎంత ఉన్నాయని మండలిలో ప్రశ్నిస్తే వైకాపా ప్రభుత్వమే రూ.4వేల కోట్లు బకాయిలు పెట్టిందని తప్పుడు సమాధానాలు చెబుతున్నారని మండిపడ్డారు. మండలి సమావేశం వాయిదా అనంతరం మీడియా పాయింట్‌లో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు.

- ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు టీసీలు, సరిఫికెట్లు ఇవ్వడంలేదని, విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేకపోతున్నారని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ ఆరోపించారు.
- ప్రత్యేక విమానాలకు రూ.కోట్లు ఖర్చుచేస్తున్న నాయకులు విద్యార్థుల ఫీజు బకాయిలు ఎందుకు చెల్లించరని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు.
- గత ప్రభుత్వంలో 80% పూర్తిచేసిన నాడు-నేడు పనులను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు.
- ఉత్తరాంధ్రలోని గురజాడ విశ్వవిద్యాలయం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే సానుకూలంగా స్పందించిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తెలిపారు. ఆర్థిక స్థిరత్వం కోసం కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రావడం హర్షణీయమన్నారు. కురుపాం గిరిజన ఇంజినీరింగ్ కళాశాలనూ ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి తేవాలని కోరారు.
- గవర్నర్ ప్రసంగానికి భిన్నంగా పరిస్థితి ఉందని, ప్రభుత్వ ప్రచారానికి.. వాస్తవానికి పొంతన లేదని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి విమర్శించారు.
- గ్రేటర్ తిరుపతి 18 మండలాలతో చేయాలని కౌన్సిల్ ప్రతిపాదిస్తే.. 12 మండలాలతోనే ఎందుకు చేయాల్సి వచ్చిందని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు.
- అసభ్యకరంగా మాట్లాడినవారిని అరెస్టుచేస్తే హర్షిస్తారే తప్ప.. ఇళ్లపై దాడులు చేయించడం సరికాదని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు అన్నారు.
- రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాల్లేవు, నిరుద్యోగ భృతి రూ.5,100 కోట్లు బకాయిలు పడ్డారని ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి ఆరోపించారు.

పారిశ్రామికవేత్తలకు జగన్ బెదిరింపులు తగదు

- నాటి అరాచకాలకు అడ్డుకట్ట వేశాం
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై మాట్లాడిన ఎమ్మెల్యేలు

ఈనాడు, అమరావతి: గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా పలువురు కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో అరాచకాలు, దౌర్జన్యాలు, అస్తవ్యస్త పాలనను ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెట్టి భవిష్యత్తుకు బాటలు వేస్తోందని వివరించారు.

వైఎస్ ప్రభుత్వంలో ఫ్రీగా భూములిచ్చారుగా!

–సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి

మద్యం కుంభకోణంపై సుప్రీంకోర్టు ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో గత ప్రభుత్వంలో బాధ్యులైన వైకాపా నేతలు తక్షణమే రాజకీయాల నుంచి వైదొలగాలి. గత ప్రభుత్వంలో గవర్నర్ పేరుతోనూ అప్పులు చేసిన వారు.. ఇప్పుడు గవర్నర్‌ను గౌరవించకపోవడం దుర్మార్గం. రాష్ట్రంలో పెట్టుబడులు పెడతామనే వారిని, పారిశ్రామికవేత్తలను జగన్ బెదిరించడం తగదు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక సంస్థలకు ఉచితంగా, రూపాయికి భూములు లీజుకు ఇచ్చారు. విధ్వంసం, శవ రాజకీయాలు చేయడం జగన్‌కు ఇష్టం. ఇతరుల తల్లిదండ్రులను కించపరిచే వారిని నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద అరెస్టు చేసేలా కొత్త చట్టం తీసుకురావాలి. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయడం గొప్ప విషయం. గత ప్రభుత్వంలో భూకబ్జాలకు పాల్పడిన వారిపై నేడు చర్యలకు సిద్ధమైతే వారు కోర్టుల్లో స్టేలు తెచ్చుకుంటున్నారు. అందుకు వీల్లేకుండా న్యాయ శాఖ చర్యలు తీసుకోవాలి.

గవర్నర్‌ను వైకాపా సభ్యులు అవమానించారు

–పి.విష్ణుకుమార్‌రాజు, భాజపా శాసనసభాపక్ష నేత

గవర్నర్ ప్రసంగం సందర్భంగా వైకాపా సభ్యులు వ్యవహరించిన తీరు అత్యంత అభ్యంతరకరం. తద్వారా రాష్ట్ర ప్రజలను కూడా వారు అవమానించినట్లే. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చింది. గత పాలకుల అరాచకాల కారణంగా అనేక పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయి. ప్రోత్సాహకాలు నిలిపివేయడంతో ఐటీ పరిశ్రమలు మూతపడ్డాయి. 'నో ఇండస్ట్రీ.. నో ఎంప్లాయిమెంట్' అన్నట్లుగా గత ప్రభుత్వం వ్యవహరించింది. విశాఖలో రుషికొండను తొలగించి రూ.500 కోట్ల ప్రజాధనంతో ప్యాలెస్ నిర్మించుకున్నారు. అసెంబ్లీలో బూతులు మాట్లాడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. భూకబ్జాలతో పాటు మద్యం, తిరుమల లడ్డూను కల్తీ చేశారు.

భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రభుత్వం

–గళ్లా మాధవి, గుంటూరు పశ్చిమ

వైకాపా పాలనలో కూలిపోయిన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం పునర్నిర్మిస్తూ, భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అరాచకాలు, అవినీతి, దౌర్జన్యాలతో భ్రష్టు పట్టించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తోంది.

- స్పీకర్ స్థానంలో ఉన్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు.. మాధవికి మాట్లాడే అవకాశం ఇచ్చేముందు. 'ఇటీవల అందరి దృష్టి గుంటూరు వైపునకు మళ్లించిన ఆ ప్రాంత ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడతారు' అని చెప్పడంతో సభలో నవ్వులు విరిశాయి. ఆమె ప్రసంగం ముగించి స్పీకర్ స్థానానికి ధన్యవాదాలు తెలపగా, 'ఐదు నిమిషాలు కేటాయిస్తే.. 4 నిమిషాల్లోనే ముగించినందుకు మీకూ ధన్యవాదాలు' అని రఘురామ బదులిచ్చారు.

తప్పుడు వార్తలు రాసిన సాక్షిపై చర్యలు తీసుకోవాలి

–సుందరపు విజయకుమార్, యలమంచిలి

నాపై తప్పుడు వార్తలు ప్రచురించి, నా ప్రతిష్ఠను దెబ్బతీసిన సాక్షి పత్రికపై చర్యలు తీసుకోవాలి. సభా హక్కుల కమిటీకి ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి న్యాయం చేయాలి. పత్రికపై తగిన చర్యలు తీసుకోవడం ద్వారా మరో సభ్యుడిపై ఇలాంటి తప్పుడు వార్తలు రాయకుండా నివారించవచ్చు.

ముఖ్యమంత్రితో బాలకృష్ణ భేటీ

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఉదయం సీఎం చంద్రబాబును ప్రత్యేకంగా కలిశారు. పక్కకు వెళ్లి కూర్చొని తన నియోజకవర్గానికి సంబంధించిన అంశాలను వివరించారు. కొన్ని వినతిపత్రాలు అందించారు.

విపక్షం విమర్శలపై ఆత్మరక్షణ ధోరణి వద్దు.. ఎదురుదాడే

- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు లోకేశ్ సూచన



ఈనాడు, అమరావతి: విపక్ష వైకాపా చేస్తున్న అడ్డగోలు విమర్శలపై ఇక ఆత్మరక్షణ ధోరణి వద్దని ఎదురు దాడి చేద్దామని మంత్రి నారా లోకేశ్ సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీకు సూచించారు. శాసనసభలోని తెదేపా శాసనసభాపక్ష కార్యాలయంలో వారితో లోకేశ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. శాసనమండలిలో వైకాపా సభ్యుల వ్యవహారశైలి, వారికి మంత్రులు దీటుగా బదులివ్వడాన్ని ప్రస్తావిస్తూ... 'ఈసారి మంత్రుల టీమ్‌వర్క్ బాగుంది. ఇప్పటి వరకు విపక్షం మనపై విమర్శలు చేస్తుంటే డిఫెన్స్ ఆడుతూ. . వాటికి సమాధానమిస్తున్నాం. ఇకపై గేరుమార్చి మనమే అఫెన్స్ ఆడదాం' అని సూచించారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని వైకాపా ఎంత సర్వనాశనం చేసిందన్నది ఎప్పటికప్పుడు ప్రజలకు చెప్పాలన్నారు. ఇందులో మంత్రులు కీలకంగా వ్యవహరించాలన్నారు. 'ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల్లో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. జిల్లాల్లో ఎక్కువ సమయం వెచ్చిస్తూ ఎమ్మెల్యేలు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచాలి' అని పేర్కొన్నారు. 'ఈసారి పార్టీకి ఎక్కువ సమయం కేటాయిస్తున్నాను. ఎన్ని ముఖ్యమైన పనులున్నా ఆ విషయంలో రాజీ పడటం లేదు. మంత్రులూ అదే రీతిలో పనిచేయాలి' అని సూచించారు.

ఒక ఉద్యోగి పంపిన సందేశంతో కంపెనీని రప్పించాం

యలమంచిలి నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ బ్లూజెట్‌కు ఈ నెల 28న శంకుస్థాపన చేస్తున్నట్టు లోకేశ్ చెప్పారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ఒక వ్యక్తి ఆ సంస్థలో పనిచేస్తున్నారని, బ్లూజెట్ విస్తరణ ఆలోచనలో ఉందని ఆయన తనకు సందేశం పంపితే... వెంటనే ఆ కంపెనీతో మాట్లాడి రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటు చేసేలా ఒప్పించామని తెలిపారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన తెదేపా మద్దతుదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెలాఖరులోపు సమావేశమవుతారని తెలిపారు.

బుచ్చయ్యా మొత్తం గోల్డే..!

పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ఉద్దేశించి లోకేశ్ సరదా వ్యాఖ్యలు చేశారు. ఆయన ధరించిన చొక్కా, పెన్ను, వాచీ, కళ్లజోడు అన్నీ గోల్డ్ కలర్‌లో ఉన్నాయని.. మనిషే గోల్డ్ అని వ్యాఖ్యానించారు. తన మనసు కూడా గోల్డేనని బుచ్చయ్య బదులిచ్చారు. కుర్రాళ్లతో పోటీ పడాలంటే.. ఆ మాత్రం మెయింటెనెన్స్ అవసరమని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రజాదర్బార్‌లో కొత్త పింఛన్లపైనే ఎక్కువ ఫిర్యాదులు

- వితంతు, దివ్యాంగ పింఛన్లు త్వరగా మంజూరు చేయాలి
- ప్రభుత్వానికి పలువురు కూటమి ఎమ్మెల్యేల వినతి

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద వితంతువులకు త్వరగా కొత్త పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కూటమి ఎమ్మెల్యేలు కోరారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు కొత్త పింఛన్ల మంజూరుపై మాట్లాడారు. పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే అతని భార్యకు ఆ మరుసటి నెల నుంచే స్పౌజ్ కేటగిరీ కింద కొత్తగా పింఛను ఇస్తున్నారని, కానీ ఇంట్లో పింఛను తీసుకోని వ్యక్తి(భర్త) చనిపోయినప్పుడు వితంతువులుగా మారిన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని తెదేపా ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. పింఛను ఇచ్చేందుకు 1వ తేదీ గ్రామాలకు వెళ్తే మిగతా వితంతువులు తమ వద్ద వాపోతున్నారని తెలిపారు. ప్రజాదర్బార్‌లో కూడా వీటిపైనే వినతులు ఎక్కువగా వస్తున్నాయని, అర్హత కలిగిన వితంతువులకు పింఛను త్వరగా మంజూరు చేయాలని కోరారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు అభినందనల కంటే వితంతు పింఛన్ల వినతులే ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ.. ఉంగుటూరు నియోజకవర్గంలో 4,200 మంది పింఛనుకు అర్హులున్నారని, ఇందులో 1,100 మందికి వితంతు పింఛన్లు ఇవ్వాల్సి ఉందని వెల్లడించారు. వితంతు పింఛన్లతోపాటు మంచానికే పరిమితమైన వారికి కూడా త్వరగా మంజూరు చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విన్నవించారు. దీనికి సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానమిస్తూ 'ఏ రాష్ట్రంలో లేని విధంగా కూటమి ప్రభుత్వం పింఛన్లకు ఏటా రూ.33 వేల కోట్లు వెచ్చిస్తోంది. 20 నెలల్లోనే రూ.55 వేల కోట్లు ఖర్చు చేసింది. సగటున నెలకు రూ.2,740 కోట్లు చెల్లిస్తోంది. అదే వైకాపా ప్రభుత్వంలో ఖర్చు చేసింది రూ.1,550 కోట్లే. అధికారంలోకి రాగానే పింఛను మొత్తాన్ని రూ.వెయ్యి పెంచాం. దివ్యాంగులకు రూ.6 వేలు చేశాం. వితంతువులకు కొత్త పింఛన్ల మంజూరు విషయం ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉంది. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

వైకాపా ప్రభుత్వంలో హైందవ సంప్రదాయంపై దాడి

- భాజపా ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం హైందవ సంప్రదాయాన్ని దెబ్బతీసిందని భాజపా ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో శుక్రవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో హైందవ సంప్రదాయాన్ని దెబ్బతీశారు. సుమారు 140 ఆలయాలపై దాడులు చేశారు" అని చెప్పారు.

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానం ఆమోదం

ఈనాడు, అమరావతి: గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానాన్ని శాసనసభ శుక్రవారం ఆమోదించింది. ధన్యవాద తీర్మానాన్ని గురువారం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు ప్రతిపాదించగా.. మరో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మద్దతు తెలిపారు.

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు.. క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆసక్తి ఉన్న సభ్యులు చీఫ్ విప్‌నకు పేర్లు ఇవ్వాలని సూచించారు.

వైకాపా హయాంలో అక్రమంగా మ్యుటేషన్లు

–గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే

"వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమార్కులతో రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కై మ్యుటేషన్లు చేశారు. రీసర్వేలోనూ లోపాలున్నాయి. రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి" అని శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా గోరంట్ల బుచ్చయ్యచౌదరి కోరారు.

సరిపడా సిబ్బందిని నియమించాలి

–ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే

వైకాపా ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో చాలా తప్పులు దొర్లాయి. వాటి గురించి రెవెన్యూ కార్యాలయాల్లో అడిగితే.. సిబ్బంది సరిపడా లేరని చెబుతున్నారు. ప్రభుత్వం రెవెన్యూ శాఖలో సరిపడా సిబ్బందిని నియమించాలి.

- సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిచ్చారు. 'రెవెన్యూ సదస్సుల్లో 2.34 లక్షల ఫిర్యాదులొస్తే, 2.33 లక్షలు పరిష్కరించాం. ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 14.42 లక్షల ఫిర్యాదులొస్తే, వాటిలో 8.89 లక్షలు రెవెన్యూకు సంబంధించినవే. వాటిలో సివిల్ వివాదాలు, న్యాయపరమైన చిక్కుల్లో ఉన్నవే ఎక్కువ' అని తెలిపారు.

ప్రజారోగ్యానికి అండగా కృత్రిమ మేధ

కేంద్ర ప్రభుత్వ ప్రకటన



దిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ)ను ప్రజారోగ్య రంగంలో వివిధ వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఉన్నత శ్రేణి వైద్య నైపుణ్యం అందరికీ చేరువయ్యేలా ఈ సాధనాలు ఉపయోగపడుతున్నాయని శుక్రవారం విడుదల చేసిన అధికారిక ప్రకటన తెలియజేసింది. జాతీయ టీబీ నిర్మూలన, జాతీయ డయాబెటిక్ రెటినోపతి పరీక్షా కార్యక్రమాలతో పాటు సమగ్ర వ్యాధి వైద్యశాల పథకాల్లో ఏఐని ఉపయోగిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. దీని కారణంగా టీబీ నివారణలో 27 శాతం మెరుగైన ఫలితాలు సాధించామని, మహమ్మారి ముప్పుపై 4,500 ఆరోగ్య తత్వ సందేశాలు పంపినట్లు వివరించింది. కృత్రిమ మేధ ఈ-సంజీవని పథకం కింద 28.2 కోట్ల మంది నిర్ధారణ పరీక్షలకు సాధనంగా ఉపయోగపడిందని, పోషకాహార లేమి పర్యవేక్షణ ఉద్యోగ్ యంత్ర కృత్రిమ మేధ వ్యవస్థ ఎంతో తోడ్పాటు అందించిందని స్పష్టం చేసింది. సాంక్రమిక వ్యాధుల సమగ్ర నిర్వహణ మొదలు, క్యాన్సర్ చికిత్స వరకూ, ఆయుర్వేద వైద్యాన్ని ఆధునీకరించడం మొదలు, జాతీయ ఏక ఆరోగ్య పథకం అమలు వరకూ కృత్రిమ మేధ ఎన్నో విధాలుగా సహాయకారిగా నిలిచిందని ప్రకటన తెలియజేసింది.




దిల్లీలోని విజయ్‌చౌక్‌లో పరస్పరం ఢీకొన్న అనంతరం ధ్వంసమైన కార్లను పరిశీలిస్తున్న పోలీసులు

ఎప్‌స్టీన్‌తో బంధంపై కలకలం..
గోల్డ్‌మాన్ సాక్స్ న్యాయవాది రాజీనామా

న్యూయార్క్: అంతర్జాతీయ లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ ప్రపంచ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు, ఆర్థిక సేవల సంస్థ అయిన గోల్డ్‌మాన్ సాక్స్‌కు న్యాయవాదిగా ఉన్న కేథీ రుయెమ్లర్ తన పదవికి రాజీనామా చేశారు. ఎప్‌స్టీన్‌కు తాను రాసిన ఈమెయిల్‌లు బయటపడటంతో నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎప్‌స్టీన్, రుయెమ్లర్‌ల గాఢానుబంధం ఉన్నట్లు వారి మధ్య సాగిన ఈమెయిల్ ద్వారా అవగతం అవుతోంది. తన ఈమెయిల్స్‌లో ఆమె ఎప్‌స్టీన్‌ను పెద్దన్నగా అభివర్ణించారు. పదవిని వదిలేది లేదని, తన ప్రస్తావన ఉన్న ఈమెయిళ్లతో తనకు సంబంధం లేదని చెబుతూ వచ్చిన రుయెమ్లర్ చివరకు తన నిర్ణయాన్ని మార్చుకోక తప్పలేదు. బరాక్ ఒబామా హయాంలో ఆమె శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుని వ్యక్తిగత న్యాయవాదిగా పనిచేశారు. తదనంతర కాలంలో ఎప్‌స్టీన్ నుంచి ఆమె అనేక ఖరీదైన బహుమతులు అందుకున్నారు. ఆర్థిక సేవల సంస్థల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి బహుమతులు పొందడాన్ని నియమాన్ని అమెరికా ఆర్థిక సేవల రంగంలో తప్పనిసరిగా పాటిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే రుయెమ్లర్ తన పదవికి రాజీనామా చేయక తప్పని పరిస్థితి తలెత్తింది. 2008లోనే లైంగిక నేరగాడిగా కోర్టు నిర్ధారించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ఎందరో బాలికలను, మహిళలను లొంగదీసుకొని వారిని పలువురు ప్రపంచ నేతలకు ఎరగా వేసిన సంగతి తెలిసిందే. ఎప్‌స్టీన్ ఫైళ్ల వ్యవహారం పలు దేశాల్లో రాజకీయ సంక్షోభానికి దారి తీసింది.



రుయెమ్లర్




ఎప్‌స్టీన్

ఏఐ సంస్థ ఆంథ్రోపిక్‌పై ఎలాన్ మస్క్ అక్కసు

ఇంటర్నెట్ డెస్క్: 'క్లాడ్ చాట్‌బాట్' సృష్టికర్త, అమెరికా కంపెనీ ఆంథ్రోపిక్‌పై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ విమర్శలు గుప్పించారు. ఆంథ్రోపిక్ ఏఐ శ్వేత జాతీయులు, ఆసియన్లు, హిస్పానిక్‌లు, పురుషులను ద్వేషిస్తుందంటూ పోస్ట్ చేశారు. ఈ దుష్ప్రవర్తనను ముందు సరిదిద్దుకోవాలని సూచించారు. ఆంత్రోపిక్.. మిసాంత్రోపిక్‌గా (జాతులను ద్వేషించేదిగా) మారకుండా తప్పించేందుకు మీరు ఏమీ చేయలేరని దాని యాజమాన్యాన్ని విమర్శించారు. ఆంథ్రోపిక్ సంస్థ తీసుకువచ్చిన 'క్లాడ్ కోవర్క్' వల్ల మస్క్ నేతృత్వంలోని కృత్రిమ మేధ స్టార్టప్ ఎక్స్ఏఐ కూడా పలు మార్పులకు గురవుతోన్న నేపథ్యంలో మస్క్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆంత్రోపిక్ తన కొత్త ఏఐ టూల్ 'క్లాడ్ కోవర్క్' ఏజెంట్‌ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. లీగల్, సేల్స్ మార్కెటింగ్, డేటా అనాలిసిస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ కోసం ఈ ప్లగిన్లు ఉపయోగపడనున్నాయి. ఈ నేపథ్యంలో తమ పరిశోధనలు, ఆవిష్కరణలు మరింత పెంచడానికి 30 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఈ క్రమంలో కంపెనీ మొత్తం విలువ 380 బిలియన్ డాలర్ల (సుమారు రూ.34 లక్షల కోట్లు)గా లెక్కగట్టినట్లు తెలిపింది. ఈ ప్రకటనపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు.

నరవణె పుస్తకం లీక్..

పెంగ్విన్ ఇండియా సిబ్బందిని ప్రశ్నించిన దిల్లీ పోలీసులు



ఇంటర్నెట్‌డెస్క్: భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం. నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తక ప్రచురణ వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రచురణకు ముందే పుస్తకం లీక్ అవడంపై పబ్లిషర్ 'పెంగ్విన్ ఇండియా' సిబ్బందిని దిల్లీ స్పెషల్ సెల్ అధికారులు విచారించినట్లు తెలుస్తోంది. రెండు రోజులపాటు ఈ విచారణ జరిగిందని అధికార వర్గాలు తెలిపినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. వారి ప్రకారం.. ఆ పుస్తకం, దాని డిజిటల్ ఫైళ్లను ఎలా భద్రపరిచారనే దానిపై సంస్థ నుంచి దర్యాప్తు అధికారులు పూర్తి వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. పుస్తకం విడుదలకు ముందే దానికి సంబంధించి బయటకు వచ్చిన పీడీఎఫ్ వెర్షన్ గురించి ప్రశ్నించారు. విచారణ సమయంలో అందుబాటులో ఉన్న పీడీఎఫ్ ఫైళ్లను పరిశీలించగా.. ప్రింట్ చేసిన వారి పేరు ఖాళీగా ఉండటాన్ని కనుగొన్నారు. దీంతో పుస్తకం ముద్రణకు పంపడానికి ముందే లీక్ అయి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానం వ్యక్తంచేశారు. పీడీఎఫ్ ఫైల్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని సంస్థను అధికారులు అడిగినట్లు సమాచారం. ముద్రణకు పంపడానికి ముందు ఆ ఫైళ్ల యాక్సెస్ ఎంతమంది వద్ద ఉంది.. దాన్ని ఈ-మెయిల్ లేదా ఆన్‌లైన్‌లో ఏమైనా షేర్ చేశారా అనే దానిపై వివరాలు అడిగారు. దాదాపు మూడేళ్లుగా ఈ పుస్తక ప్రచురణ ప్రక్రియ కొనసాగుతోంది. సంబంధిత డేటా మొత్తం ఇవ్వడానికి సమయం కావాలని ఆ సంస్థ, దర్యాప్తు అధికారులను కోరినట్లు తెలుస్తోంది. ఇక, ఈ పుస్తకం విదేశాల్లో, ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఈ హార్డ్‌కాపీ అసలు ఎక్కడినుంచి వచ్చిందనే విషయం తెలుసుకోవడంపై అధికారులు దృష్టిసారించారు. ఈ లీక్ నిర్లక్ష్యం వల్ల జరిగిందా.. లేక కుట్రలో భాగంగానే చేశారా అనే కోణంలో విశ్లేషిస్తున్నారు.

రైతు సంఘాల నాయకులతో రాహుల్ భేటీ

దిల్లీ: లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం రైతు సంఘాల నాయకులతో భేటీ అయ్యారు. పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లో ఈ భేటీ జరిగింది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా, రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని కాపాడటం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాల్సిన ఆవశ్యకతపై చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని రైతు సంఘాల నాయకులు వ్యతిరేకించారని, మొక్కజొన్న, సోయా, పత్తి సహా పండ్ల రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తంచేశారని తెలిపింది. ఈ సమావేశానికి అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుఖ్‌పాల్ సింగ్ ఖైరా, భారతీయ కిసాన్ మజ్దూర్ నేత అశోక్ బల్హారా, బీకేయూ క్రాంతికారి నాయకుడు బల్దేవ్ ఎస్.జీరా, కిసాన్ మజ్దూర్ మోర్చా నేత గుర్మీత్ సహా దేశంలోని పలువురు రైతు సంఘాల నేతలు హాజరయ్యారు.



పార్లమెంటు హౌస్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి వినతి పత్రం సమర్పిస్తున్న రైతు సంఘాల నేతలు

రేడియో ఓ విశ్వసనీయ స్వరం: మోదీ

దిల్లీ: మారుమూల గ్రామాల్లోనైనా, రద్దీగా ఉండే నగరాల్లోనైనా రేడియో ఓ విశ్వసనీయ స్వరమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అది సకాలంలో సమాచారాన్ని అందించి, ప్రతిభను పెంపొందించి, సృజనాత్మకతను ప్రోత్సహిస్తుందని కొనియాడారు. ఏటా ఫిబ్రవరి 13న జరుపుకొనే ప్రపంచ రేడియో దినోత్సవం.. ఈ మాధ్యమంతో సంబంధం ఉన్న వారందరి కృషిని గుర్తించే సందర్భమన్నారు. దేశ ప్రజల సామాజిక బలాన్ని వెలికితీయడంలో రేడియో పాత్రను తాను స్వయంగా తెలుసుకున్నానని మన్ కీ బాత్ ప్రసంగంలో పేర్కొన్నారు. మోదీ తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని నెలల తర్వాత, 2014 అక్టోబరులో మన్ కీ బాత్ ప్రారంభమైంది. ఇది ప్రతి నెల చివరి ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

వచ్చేవారం మళ్లీ రష్యా-ఉక్రెయిన్ చర్చలు

జెనీవా: యుద్ధం ముగింపు దిశగా రష్యా, ఉక్రెయిన్ మధ్య వచ్చేవారం జెనీవాలో మరో దఫా చర్చలు జరగనున్నాయి. 17, 18 తేదీల్లో ఈ చర్చలు జరుగుతాయని రష్యా అధ్యక్ష కార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ శుక్రవారం వెల్లడించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సలహాదారు (కమ్యూనికేషన్లు) దిమిత్రో లిత్విన్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అమెరికా మధ్యవర్తిత్వంతో రష్యా, ఉక్రెయిన్ మధ్య ఇటీవల యూఏఈ రాజధాని అబుదాబీ వేదికగా రెండు దఫాల చర్చలు జరిగాయి. మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా తన విధ్వంసకర దాడుల్ని కొనసాగిస్తోంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ రష్యా చేసిన దాడుల్లో 8-19 ఏళ్ల మధ్య వయసున్న ముగ్గురు సోదరులు మరణించారని దొనెట్స్క్ ప్రాంతీయ ప్రాసిక్యూటర్ తెలిపారు. మాస్కో సేనల దాడుల్లో ఒడెస్సా ప్రాంతంలో ఒక వ్యక్తి మరణించగా, ఆరుగురు గాయపడ్డారు.

చికిత్స పేరుతో మోసం.. చిన్నారిని అమ్మేసిన వైద్యుడు



మహారాష్ట్రలోని జిల్లా కేంద్రం గోండియాలో ఓ ప్రయివేటు ఆసుపత్రి వైద్యుడు చికిత్స పేరుతో తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి మూణ్నెల్ల చిన్నారిని మరో మహిళకు రూ.2.5 లక్షలకు అమ్మేశాడు. పాప పుట్టినప్పుడు అధిక బరువు ఉండటంతో తల్లిదండ్రులు గోండియాలోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. చికిత్సకు చాలా ఖర్చు అవుతుందని, నాగ్‌పుర్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఆర్థికసహాయంతో వైద్యం చేస్తామని నమ్మబలికిన వైద్యుడు పాప బాధ్యత తీసుకున్నారు. ఆ తర్వాత జరిగిన 'విక్రయ' పరిణామాలతో పాప భండారా జిల్లాకు చెందిన మహిళ ఇంటికి చేరింది. ఈ విషయాన్ని ఓ గుర్తుతెలియని వ్యక్తి మహిళాశిశు సంక్షేమ శాఖ హెల్ప్‌లైనుకు ఫిర్యాదు చేశాడు. అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మొత్తం అయిదుగురిపై కేసు నమోదుచేసి, పాపను కొన్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడైన డాక్టర్ నితేశ్ బాజ్‌పేయీ పరారీలో ఉండగా.. అతడి కోసం గాలిస్తున్నారు.


రాకేశ్ ఇల్లు రేడియోల మ్యూజియం



స్మార్ట్‌ఫోన్లు, పాడ్‌కాస్ట్‌లు, మ్యూజిక్ యాప్‌లు రాజ్యమేలుతున్న నేటి డిజిటల్ యుగంలోనూ అలనాటి రేడియోలతో భావోద్వేగ భరితమైన అనుబంధం పెనవేసుకున్నవారు ఇప్పటికీ ఉన్నారు. రాజస్థాన్ రాజధాని నగరమైన జైపుర్‌కు చెందిన రాకేశ్ సారస్వత్ అలాంటి వ్యక్తుల కోవలోకే వస్తారు. ఆయన తన ఇంటినే రేడియో మ్యూజియంలా మార్చేశారు. పాతకాలం నాటి వింటేజ్, క్లాసిక్ రేడియో మోడళ్లను భావితరాలకు చూపేందుకు పదిలంగా దాచిపెట్టారు. ఎన్నో ఏళ్ల శ్రమించి 500కు పైగా రేడియోలు సేకరించారు. వీటిలో 80 ఏళ్ల కిందటి మోడళ్లూ ఉన్నాయి. అన్ని రేడియోలకు క్రమం తప్పకుండా సర్వీసింగు చేస్తుంటారు. 'నాన్న తీరిక సమయాల్లో రేడియో వినేవారు. ఆయన ఆఫీసుకు వెళ్లగానే.. నేను మెల్లగా వెళ్లి రేడియో ఆన్ చేసి వినేవాణ్ని. ఈ విధంగా రేడియోతో నాకు తొలి పరిచయం ఏర్పడింది. చదువు పూర్తిచేసి ఉద్యోగం సంపాదించాక తొలి సంపాదనతో రేడియోనే కొన్నా. కాలక్రమంలో విభిన్న మోడళ్ల రేడియోలను సేకరించాలనే ఆలోచన వచ్చింది. రేడియోను ఒక సాధనంగా కాకుండా తరాలను కలిపే సజీవ వారసత్వంగా నేను చూస్తాను'' అని రాకేశ్ వివరించారు.

పరారీలో ఉన్న నిందితునికి ముందస్తు బెయిలు తగదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ



దిల్లీ: ఆరేళ్లుగా పరారీలో ఉన్న ఒక హత్య కేసు నిందితునికి మధ్యప్రదేశ్ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిలును సుప్రీంకోర్టు శుక్రవారం రద్దు చేసింది. నాలుగు వారాల్లోగా కింది కోర్టులో లొంగిపోవాలని ఆదేశించింది. అక్కడ సాధారణ బెయిలు పొందవచ్చని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. సహనిందితులు నిర్దోషులుగా తేలారు కాబట్టి పరారీలో ఉన్న వ్యక్తికి కూడా ప్రయోజనం కల్పించడం సరైన పద్ధతి కాదని ధర్మాసనం పేర్కొంది. 'పరారీలో ఉన్న వ్యక్తికి ముందస్తు బెయిలు మంజూరు చేయరాదన్నది సాధారణ నియమం. అయితే ఎఫ్ఐఆర్, కేస్ డైరీ, రికార్డుల్లోని ఇతర వివరాలను పరిశీలించి కేసులో పసలేదన్న ప్రాథమిక నిర్ణయానికి కోర్టు వచ్చినప్పుడు నిందితునికి అనుకూలంగా కోర్టు నిర్ణయం తీసుకోవచ్చు'' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు ఏమాత్రం హేతుబద్ధంగా లేవని తేల్చి చెప్పింది. పరారీలో ఉన్నవారికి అరెస్టుకు ముందే బెయిలు మంజూరు చేయడం సరైన ఉదాహరణగా నిలవబోదని పేర్కొంది.

గవర్నర్‌ను కలిసిన పవన్‌కల్యాణ్



ఈనాడు,అమరావతి: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ఉప ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు.

రెండు లేబర్ కోడ్‌ల అమలుకు నోటిఫికేషన్ జారీ

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లలో వేతనాలు, పరిశ్రమల సంబంధాలకు సంబంధించిన రెండు కోడ్‌ల అమలుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కనీస వేతనాలు, రాత్రి షిఫ్టులు, భత్యాలు, వారాంతపు సెలవులు, యూనియన్ ఏర్పాటు తదితర అంశాలను ఈ కోడ్‌లలో పేర్కొంది.

కుప్పం ఆదర్శ ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి రూ.27కోట్లు

ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లా కుప్పం మండలంలోని మల్లనూర్‌లో ఆదర్శ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాల సహా వసతి గృహాన్ని ఏర్పాటు చేయనున్నారు. కుప్పం అథారిటీస్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ద్వారా ఈ నిర్మాణాలు చేపట్టనున్నారు.

ఆర్ఐఎంసీలో 8వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కళాశాలలో ఎనిమిదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీపీఎస్సీ తెలిపింది. జూన్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాలలో ఏడో తరగతి చదువుతూ ఉండాలని లేదా ఉత్తీర్ణులై ఉండాలంది. రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి మౌఖిక పరీక్ష నిర్వహిస్తారని వెల్లడించింది.

తిరుగులేని శక్తిగా భాజపా

- జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్

ఈనాడు, అమరావతి: కార్యకర్తల సామర్థ్యం మరింత పెంచి, సిద్ధాంతాలపై అవగాహన కల్పించి భాజపాను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలని ఆ పార్టీ జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ అన్నారు. విజయవాడలోని భవానీపురంలో 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్' పేరుతో శుక్రవారం రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శివప్రకాశ్ మాట్లాడుతూ.. భాజపాకు దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది సభ్యులు, 11 లక్షల బూత్ కమిటీలు, 17,700 మండల కమిటీలు ఉన్నాయని గుర్తుచేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, స్థానిక ప్రతినిధుల సంఖ్యాపరంగా ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా ఉన్నా.. పటిష్ఠమైన కార్యకర్తల వ్యవస్థ లేకపోతే పార్టీ ఆశించిన రీతిలో నడవదని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. జోన్ల వారీగా కార్యకర్తలకు భవిష్యత్తు కార్యాచరణపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దిశానిర్దేశం చేశారు. కార్యశాలలో దక్షిణాది రాష్ట్రాల ప్రశిక్షణ మహాభియాన్ ఇన్‌ఛార్జి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, కామినేని శ్రీనివాస్, పార్థసారథి, ఈశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నాగోతు రమేష్‌నాయుడు, మట్టా ప్రసాద్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



భాజపా రాష్ట్రస్థాయి కార్యశాలకు హాజరైన ముఖ్య కార్యకర్తలు



శిక్షణ శిబిరంలో జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్. చిత్రంలో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ప్రతినిధులు మధుకర్, వెంకటేశ్వర్లు, దయాకర్‌రెడ్డి

ఐదేళ్లలో మరో 50 విమానాశ్రయాల ఏర్పాటే లక్ష్యం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

దిల్లీ: రాబోయే ఐదేళ్లలో దేశంలో మరో 50 విమానాశ్రయాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనివల్ల రియల్ ఎస్టేట్ రంగానికి అపార అవకాశాలు లభిస్తాయని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం వ్యాఖ్యానించారు. దిల్లీలో నిర్వహించిన నేషనల్ అర్బన్ అండ్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కాంక్లేవ్- 2026లో ఆయన పాల్గొన్నారు. "రియల్ ఎస్టేట్ రంగానికి విమానాశ్రయాలు పరంజా వంటివి. విమానయాన భద్రత విషయంలో రాజీ పడకుండా విమానాశ్రయాల సమీపంలోని భవనాల ఎత్తు, పరిమితులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి చురుకుగా పనిచేస్తున్నాం. దీనికోసం అంతర్జాతీయ విమానయాన సంస్థ సహాయంతో ఓ బృందం అధ్యయనం చేపట్టింది. ఈ బృందం బెంగళూరు, హైదరాబాద్ వంటి పలు నగరాలను పరిశీలించి నివేదిక తయారు చేస్తుంది. దేశంలో సగటున ప్రతి 33 రోజులకో కొత్త విమానాశ్రయం లేదా టెర్మినల్‌లను నిర్మిస్తున్నారు. 2030 నాటికి రియల్‌ఎస్టేట్ రంగం విలువ 1 ట్రిలియన్ అమెరికా డాలర్లుగా అంచనా వేసినప్పటికీ, 2047కు అది 5-7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది'' అని రామ్మోహన్ వ్యాఖ్యానించారు.

వక్కలిగ, లింగాయత్, సాదరి కులాల్ని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సహకరించండి

సీఎం చంద్రబాబుకు ఎంఎస్ రాజు వినతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని వక్కలిగ, లింగాయత్, సాదరి కులాల్ని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదించాలని సీఎం చంద్రబాబును మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ఈ మేరకు సీఎంకు శుక్రవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జాతీయ బీసీ కమిషన్‌తో సంప్రదింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రెండో శనివారం సెలవు ఇవ్వాలి: ఉపాధ్యాయ సంఘాలు

ఈనాడు, అమరావతి: రెండో శనివారం సైతం పాఠశాలలను నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు ఒత్తిడి చేయడం సరికాదని పలు ఉపాధ్యాయ సంఘాలు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశాయి. "పాఠశాలలు గరిష్ఠంగా 220 రోజులు పని చేయాలి. ఇంత కంటే ఎక్కువ ఉన్నప్పటికీ రెండో శనివారం తప్పనిసరిగా పని చేయాలని డీఈవోలపై డైరెక్టర్ ఒత్తిడి తీసుకొస్తున్నారు. సరిపడా పని దినాలు ఉన్నప్పుడు పని చేయాల్సిన అవసరం లేదని తెలియజేసినా పట్టించుకోకుండా తప్పనిసరిగా పని చేయాలని డీఈవోలకు ఆదేశాలు ఇచ్చారు'' అని ఆరోపించాయి.

వైకాపా బంజారాల్ని ఓటు బ్యాంకుగానే చూసింది

తెదేపా ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వం బంజారాల్ని కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని తెదేపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని వైభవంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

జూనియర్ లెక్చరర్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల

ఈనాడు, అమరావతి: జూనియర్ లెక్చరర్ పోస్టులకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఆంగ్లం, సంస్కృతం, గణితం, జంతుశాస్త్రం, చరిత్ర సబ్జెక్టులకు 17 మంది అభ్యర్థుల ఎంపిక జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచింది. మొత్తం 47 పోస్టులకు 2023 డిసెంబరు 28న ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్హతలు, కంప్యూటర్ నైపుణ్య పరీక్షలో అనుత్తీర్ణులు కావడం, ఉర్దూ పోస్టులకు అభ్యర్థులు లేకపోవడంతో ఆరు సబ్జెక్టుల ఫలితాలను పెండింగ్‌లో పెట్టింది. పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. 10 సబ్జెక్టులకు సంబంధించి 25 మంది అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచింది.

ఏపీఎస్ఆర్టీసీ ఎండీగా బాలసుబ్రమణ్యం

ఈనాడు, అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ ఎండీ, ప్రజా రవాణాశాఖ (పీటీడీ) కమిషనర్‌గా ఎన్.బాలసుబ్రమణ్యం నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన ఆర్గనైజేషన్స్ విభాగం డీజీపీగా ఉన్నారు. మొన్నటి వరకు ఆర్టీసీ ఎండీగా ఉన్న ద్వారకాతిరుమలరావు పదవీకాలం ఫిబ్రవరితో ముగిసింది. దీంతో ఆయన స్థానంలో రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబును ఇన్‌ఛార్జ్ ఆర్టీసీ ఎండీగా ప్రభుత్వం నియమించింది. తాజాగా ఆయన స్థానంలో ఆర్టీసీ ఎండీగా బాలసుబ్రమణ్యంను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.500 కోట్ల రుణం సమీకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్ల అప్పులు సమీకరించనుంది. వచ్చే మంగళవారం రిజర్వు బ్యాంకు నిర్వహించే సెక్యూరిటీల వేలంలో పాల్గొని ఈ మొత్తం తీసుకోనుంది. 11 ఏళ్ల కాలపరిమితితో ఈ మొత్తం తీర్చేలా రుణం తీసుకుంటుంది.

జీనోమిక్స్, ఏఐ సాయంతో క్యాన్సర్ నిర్ధారణ

- సీసీఎన్ఎస్‌బీలో నూతన పరిశోధనలు



ఈనాడు, హైదరాబాద్: జీనోమిక్స్, కృత్రిమ మేధ సాయంతో క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి.. చికిత్సను అందించేందుకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సీసీఎన్ఎస్‌బీ ప్రయోగశాలలో పరిశోధనలు కొనసాగుతున్నాయి. బయో ఇన్ఫర్మాటిక్స్ విభాగం ఆచార్యులు నీతాపరేఖ్ వీటిని నిర్వహిస్తున్నారు. జీనోమ్ కోడ్‌ను విశ్లేషించడం, క్యాన్సర్ కణతుల్లోని జన్యు వైవిధ్యాలను గుర్తించడం ఇందులో కీలకాంశమని నీతాపరేఖ్ తెలిపారు. క్యాన్సర్ జీనోమ్‌ను ఏఐ సాయంతో క్షుణ్ణంగా విశ్లేషించడం ద్వారా వాటి ఉత్పరివర్తనాలు, రూపాంతరాలపై స్పష్టత వచ్చిందని వివరించారు.

లింఫోమా(రక్త క్యాన్సర్)పై అధ్యయనం

క్యాన్సర్ల జీనోమ్ విశ్లేషణలో భాగంగా తీవ్రమైన లింఫోమాపై పరిశోధకులు దృష్టి కేంద్రీకరించారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్, బయో ఇన్ఫర్మాటిక్స్(సీసీఎన్ఎస్‌బీ) ప్రయోగశాలలో ఈ క్యాన్సర్ కణాల జన్యు వైవిధ్యాలను ప్రొఫైలింగ్ చేయడం ద్వారా రోగ నిర్ధారణ సులువుగా మారింది. ఈ విశ్లేషణలో... బాధితుల శరీరంలోని క్యాన్సర్ కణాల్లో ఉత్పరివర్తనాలను బట్టి ఒక్కో బాధితుడికి ఒక్కోలా చికిత్స అందించేందుకు శాస్త్రీయ రుజువులు లభించాయి. ● ప్రాథమిక దశలో రొమ్ము క్యాన్సర్‌ను నిర్ధారించేందుకు ఏఐ సాయంతో డీఎన్ఏకు ప్రొటీన్లు/అణువులను జోడించడం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుదలతోపాటు కణజాలాల మరమ్మతు జరుగుతుంది. ఫలితంగా రొమ్ము క్యాన్సర్ లక్షణాలున్న వారు ప్రాణాంతక పరిస్థితుల నుంచి వేగంగా బయటపడేందుకు అవకాశాలున్నాయని ప్రొఫెసర్ నీతాపరేఖ్ తెలిపారు.

రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద సదుపాయాలు కల్పించాలి

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు అబ్దుల్ అజీజ్ లేఖ

ఈనాడు, అమరావతి: రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మసీదుల వద్ద సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు లేఖ రాశారు. మసీదుల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, తశుబ్రత, భద్రత, నిరంతర విద్యుత్తు సరఫరాలో ఎలాంటి లోపం లేకుండా మునిసిపల్, పంచాయితీరాజ్, విద్యుత్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసేలా ఆదేశాలు జారీ చేయాలని విన్నవించారు. రాత్రివేళల్లో మార్కెట్లు, కూరగాయల దుకాణాలు, హోటళ్లకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేసేలా పోలీస్‌శాఖకు మార్గదర్శకాలు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు.

ఆర్థిక మోసం కేసు కొట్టివేత.. సుప్రీంలో అప్పీల్‌కు ప్రభుత్వం నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఓ మహిళపై నమోదైన ఆర్థిక మోసం కేసును కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వంగపల్లి శశిబావని అనే మహిళ.. వ్యాపార లావాదేవీలలో ఆర్థిక మోసానికి పాల్పడ్డారంటూ దాసరి నాగభూషణమ్మ అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మొదటి పట్టణ పోలీసులు గతేడాది మార్చి 6న కేసు నమోదు చేశారు. దాన్ని అదే ఏడాది మార్చి 17న కొట్టేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్ వేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఈ మేరకు అప్పీల్ దాఖలుకు తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టులోని ఏపీ తరపు ప్రత్యేక అధికారిని కోరుతూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ శుక్రవారం జీవో జారీ చేశారు. కాగా, సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా మార్చారంటూ బావని చేసిన వాదనతో ఏకీభవించిన హైకోర్టు ఆమెపై పోలీసులు నమోదు చేసిన కేసును గతంలో కొట్టేసింది.

సీఆర్‌డీఏ అభివృద్ధి పనుల ప్రతిపాదనల పరిశీలనకు కమిటీ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతికి సంబంధించిన వివిధ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం ఆమోదం కోసం పెట్టే ముందు వాటిపై తుది పరిశీలన (స్క్రూటినీ) కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ ఉత్తర్వులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ శుక్రవారం జారీ చేశారు. అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ఇప్పటివరకు సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం ఆమోదం కోసం నేరుగా పెడుతున్నారు. ఇందులో సవరణలు సూచించినపుడు తదుపరి సమావేశంలో వాటిని మళ్లీ పెడుతున్నారు. దీని వల్ల జాప్యమవుతోంది. దీన్ని అధిగమించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్ సభ్య కన్వీనర్‌గా స్క్రూటినీ కమిటీని ఏర్పాటు చేశారు. న్యాయ, ఆర్థిక, మున్సిపల్, ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు కమిటీలో సభ్యులుగా ఉంటారు.